# చరిత్ర మరియు పౌరశాస్త్రం

## ఎనిమిదవ తరగతి









# భారత సంవిధానము

## పార్ట్ – IV A

# ప్రాథమిక బాధ్యతలు

**51 ఎ) ప్రాథమిక బాధ్యతలు**

**ప్రతి పౌరుడు ఈ క్రింది బాధ్యతలను మనసారా స్వీకరించి బాధ్యతాయుతంగా ప్రవర్తించవలెను.**

ఎ) రాజ్యాంగ శాసనబద్ధుడై యుండుట. శాసనమందలి ఆశయములనూ, శాసనం స్థాపించే సంస్థలనూ, జాతీయ పతకాన్ని, జాతీయ గీతాన్ని అంకితభావంతో గౌరవించుట.

బి) స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అన్ని రంగాలలో వ్యవహరించుట.

సి) దేశ సార్వభౌమత్వాన్ని, సమన్వయతనూ, సమగ్రతను రక్షించుట.

డి) దేశరక్షణలో అనుక్షణం సంసిద్ధుడై ఉండుట.

ఇ) ప్రజాజీవనంలో అన్యోన్యతనూ, భ్రాతృభావాన్ని పోషించుట, మత, భాష ప్రాంతీయతత్త్వాలకు వర్గవైరుధ్యములకు అతీతముగా ఉండుట. స్త్రీలను అగౌరవపరచే ఆచారములను విడనాడుట.

ఎఫ్) అమూల్యమైన భారతీయ చారిత్రక సంపదనూ, సుసంపన్న సంస్కృతినీ పరిరక్షించుట.

జి) పర్యావరణాన్ని అడవులను, కొలనులనూ, నదులనూ రక్షించుట, అభివృద్ధి పరచుట, మృగరక్షణ జలజంతు జీవరాసులపై కరుణార్తత.
హెచ్) శాస్త్రీయ మరియు మానవతా దృక్పథాలను అలవరచుకొనుట, జిజ్ఞాసను పెంపొందించు కొనుట, సంస్కరణ తత్వమును పెంపొందించుట.

ఐ) హింసను విడనాడుట, ప్రజల ఆస్తుల విధ్వంసం చర్యలను నిరోధించుట.

జె) వ్యక్తిత్వ శక్తి సామర్థ్యాల ఔన్నత్యాన్ని పెంపొందించుకొనుట ద్వారా మరియూ సమిష్టి కృషి ద్వారా అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిని చేరుటకొరకు, శిఖరాగ్ర సాధనకొరకు నిరంతరం కృషి సల్పుట.

కె) రక్షకులు లేదా సంరక్షకులుగా ఉన్నవారందరూ ఆరు నుంచి 14 సంవత్సరముల లోపల పసివారికి విద్యాభ్యాసము చేయు అవకాశమును కల్పించవలెను.

ప్రభుత్వ తీర్మానం క్రమ సంఖ్య : అభ్యాస్ - 2116/(ప్ర.క్ర. 43/16) ఎస్ డి-4 తేదీ 25.4.2016 ప్రకారం స్థాపించబడిన సమన్వయ సమితి యొక్క తేదీ 29.12.2017 రోజు సమావేశంలో ఈ పాఠ్య పుస్తకమును 2018-19 విద్యాసంవత్సరం నుంచి నిర్దేశించుటకుగాను అనుమతి ఇవ్వబడినది.

# చరిత్ర మరియు పౌరశాస్త్రం

## ఎనిమిదవ తరగతి

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె

BCV6GQ

మీ స్మార్ట్‌ఫోన్‌తో DIKSHA APP నుపయోగించి పాఠ్యపుస్తకం మొదటి పుటలోని QR CODE ను స్కాన్ చేసిన డిజిటల్ పాఠ్యపుస్తకం మరియు ప్రతి పాఠంలోని QR CODE ను స్కాన్ చేసిన ఆ పాఠానికి సంబంధించిన అధ్యయన-అధ్యాపనలకు ఉపయుక్తమగు దృశ్య-శ్రవణ సాహిత్యం లభిస్తుంది.

ప్రథమ ప్రచురణ : 2018
పునర్ముద్రణ : సెప్టెంబర్ 2021

© మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె - 411004.

ఈ పుస్తకమునకు సంబంధించిన సర్వహక్కులు మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థవి. మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ సంచాలకుల లిఖితపూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమునందలి ఏ భాగమును గాని ఉటంకించుట లేదా పునర్ముద్రించుట చేయరాదు.

**చరిత్ర విషయ సమితి**

డా. సదానంద్ మోరె, అధ్యక్షులు
శ్రీ. మోహన్ శెటె, సభ్యులు
శ్రీ. పాండురంగ బలక్‌వడె, సభ్యులు
డా. శుభాంగనా అత్రే, సభ్యులు
డా. సోమనాథ్ రోడే, సభ్యులు
శ్రీ. బాపూసాహెబ్ శిందే, సభ్యులు
శ్రీ. బాలకృష్ణ చోపడె, సభ్యులు
శ్రీ. ప్రశాంత్ సరుడ్‌కర్, సభ్యులు
శ్రీ. మొగల్ జాధవ్, సభ్యులు సచివ్

**పౌర శాస్త్ర విషయ సమితి**

డా. శ్రీకాంత్ పరాంజపే, అధ్యక్షులు
ప్రొ. సాధన కులకర్ణి, సభ్యులు
డా. ప్రకాశ్ పవార్, సభ్యులు
డా. అజింక్యా గాయక్వాడ్, సభ్యులు
ప్రొ. సంగీత ఆహేర్, సభ్యులు
డా. మోహన్ కాశీకర్, సభ్యులు
శ్రీ. వైజనాథ్ కాళె, సభ్యులు
శ్రీ. మొగల్ జాధవ్, సభ్యులు సచివ్

**చరిత్ర మరియు పౌర శాస్త్ర అధ్యయన మండలి**

శ్రీ. రాహుల్ ప్రభు
శ్రీ. సంజయ్ వజ్రేకర్
శ్రీ. సుభాష్ రాఠోడ్
సౌ. సునితా దళవీ
ప్రొ. శివానీ లిమయే
శ్రీ. భాహుసాహెబ్ ఉమాటె
డా. నాగనాథ్ యెవలే
శ్రీ. సదానంద్ డోంగరే
శ్రీ. రవీంద్ర పాటిల్
సౌ. రూపాలీ గిర్‌కర్
డా. మీనాక్షీ ఉపాధ్యాయ్
డా. రావ్‌సాహెబ్ శెళ్‌కే
డా. సతీష్ చాపలే
శ్రీ. విశాల్ కులకర్ణీ
ప్రొ. శేఖర్ పాటిల్
శ్రీ. రామ్‌దాస్ ఠాకర్
డా. అజీత్ ఆపటే
డా. మోహన్ ఖడ్సే
సౌ. శివకన్యా కదేర్కర్
శ్రీ. గౌతమ్ డాంగే
డా. వెంకటేశ్ ఖరాత్
శ్రీ. రవీంద్ర జిందే
డా. ప్రభాకర్ లోండే
డా. మంజిరీ భాలేరావు
ప్రొ. శశి నిఘోజ్కర్

**రచయితలు**

శ్రీ. రాహుల్ ప్రభు
శ్రీ. భాహుసాహెబ్ ఉమాటె
శ్రీ. ప్రశాంత్ సరుడ్‌కర్
ప్రొ. శివానీ లిమయే
శ్రీ. సంజయ్ వజ్రేకర్
ప్రొ. సాధన కులకర్ణి

**ముఖచిత్రం మరియు అలంకరణ**

శ్రీ. దిలీప్ కదం

**మాన చిత్ర పటాలు**

శ్రీ. రవికిరణ్ జాదవ్

**అక్షర కూర్పు**

సృష్టి, ఖార్ఘర్, నవి ముంబయి

కాగితం : 70 జి.ఎస్.ఎమ్. క్రీమ్‌వోవ్

ముద్రణాదేశం :

ముద్రణ :

**సమన్వయకులు**

శ్రీ. మొగల్‌జాధవ్
విశేషాధికారి, చరిత్ర మరియు పౌర శాస్త్రం
శ్రీమతి వర్షా సరోదే
విషయ సహాయకులు, చరిత్ర మరియు పౌర శాస్త్రం
పాఠపుస్తక సంస్థ, పుణె.

**అనువాదం**

శ్రీ శంకరయ్య బాలయ్య బొడ్డు, శ్రీ దొంతుల లక్ష్మీనారాయణ

**సమీక్ష**

శ్రీ శంకరయ్య బాలయ్య బొడ్డు, శ్రీ దొంతుల లక్ష్మీనారాయణ

**అనువాద సమన్వయకులు**

డా॥ శ్రీమతి తులసి భారత్ భూషణ్
విశేషాధికారిణి-తెలుగు, పాఠ్యపుస్తక సంస్థ, పుణె.

**నిర్మితి**

శ్రీ. సచ్చితానంద ఆఫళే, ముఖ్య నిర్మితి అధికారి
శ్రీ. ప్రభాకర్ పరబ్, నిర్మితి అధికారి
శ్రీ. శశాంక్ కణికదళె, సహాయక నిర్మితి అధికారి

**ప్రకాశకులు**

శ్రీ. వివేక్ ఉత్తమ్ గోసావీ, నియంత్రకులు
పాఠ్యపుస్తక సంస్థ, ప్రభాదేవి, ముంబయి - 25.

# భారత సంవిధానము

## ప్రస్తావన

**భారతదేశ ప్రజలమగు మేము**, భారతదేశమును **సార్వభౌమ్య**
**సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగ**
నెలకొల్పుటకు మరియు అందలి పౌరులెల్లరకు
సామాజిక, ఆర్థిక, రాజకీయ **న్యాయమును**,
భావము, భావప్రకటన, విశ్వాసము,
ధర్మము, ఆరాధన -- వీటి **స్వాతంత్ర్యమును**,
అంతస్తులోను, అవకాశములోను **సమానత్వమును**
చేకూర్చుటకు; మరియు వారందరిలో
వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను,
అఖండతను తప్పక ఒనగూర్చు **సౌభ్రాత్రమును**,
పెంపొందించుటకు; సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,
ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ
దినమున **మా సంవిధాన సభయందు ఇందుమూలముగ,**
**ఈ సంవిధానమును అంగీకరించి, అధిశాసనము చేసి**
**మాకు మేము ఇచ్చుకొన్నవారమైతిమి.**

## జాతీయ గీతము

జనగణమన – అధినాయక జయ హే
భారత – భాగ్యవిధాతా
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కల, బంగ,
వింధ్య, హిమాచల, యమునా, గంగా,
ఉచ్ఛల జలధితరంగ,
తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిస మాగే,
గాహే తవ జయగాథా,
జనగణ మంగలదాయక జయ హే,
భారత – భాగ్యవిధాతా
జయ హే, జయ హే, జయ హే,
జయ జయ జయ, జయ హే

## ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

# ప్రస్తావన

విద్యార్థి మిత్రులారా !

మూడవ తరగతి నుంచి ఐదవ తరగతి చరిత్ర మరియు పౌరశాస్త్ర అధ్యయనం మీరు 'పరిసరాల అధ్యయనం'లో చేశారు. ఆరవ తరగతి నుంచి వచ్చే పాఠ్య ప్రణాళికలో చరిత్ర మరియు పౌరశాస్త్రాలు ప్రత్యేక విషయాలు. ఆరవ తరగతి నుంచి ఈ రెండు విషయాలను ఒకే పాఠ్యపుస్తకంలో పొందుపరచడం జరిగింది. ఎనిమిదవ తరగతి పాఠ్యపుస్తకం మీ చేతికి అందిస్తున్నందులకు మాకు సంతోషంగా ఉంది.

పాఠ్యపుస్తకంలోని, విషయం సరిగాఅర్థం కావడం, మనోరంజకంగా ఉండడం మరియు మన పూర్వీకులు చేసిన పనుల నుంచి ప్రేరణ లభించాలనే ఉద్దేశంతో పాఠ్యపుస్తకాన్ని రచించడం జరిగింది. ఈ పాఠ్యపుస్తక అభ్యాసం వలన జ్ఞానంతోబాటు మీ అధ్యయనం అర్థవంతం అవుతుందని మేము భావిస్తున్నాము. అందుకోసం పాఠ్యపుస్తకంలో రంగురంగుల చిత్రాలు, మానచిత్రపటాలు ఇవ్వబడినవి. పాఠ్యపుస్తకంలోని ప్రతిపాఠం శ్రద్ధతో అభ్యసించండి. అందులోని ఏ భాగం మీకు అర్థం కాదో ఆ భాగాన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహాయంతో అర్థం చేసుకోండి. ఇవ్వబడిన గడులలోని అంశాలు మీ జిజ్ఞాసను పెంపు చేయునవిగా ఉన్నాయి. మీకు అధికంగా తెలుసుకోవాలని ఉంటే 'ఆప్' మాధ్యమం ద్వారా, క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రతి పాఠానికి సంబంధించిన సరియైన దృశ్య-శ్రవణ ఉపకరణాలు లభించును. అవి అధ్యయనం కొరకు తప్పకుండా ఉపయోగపడుతాయి. చరిత్రను మనోరంజకం చేయుట కొరకు ప్రయత్నించడం వలన మీకు ఈ విషయం పట్ల అభిరుచి తప్పక కలుగుతుంది.

చరిత్ర భాగంలో 'ఆధునిక భారతదేశ చరిత్ర' ఇవ్వడం జరిగింది. చరిత్రలోని నూతన ప్రవాహం మరియు విద్య యొక్క జాతీయ లక్ష్యాలు, అధ్యయన ఫలితాలను మిళితం చేసి ఈ పాఠ్యపుస్తకాన్ని తయారు చేయడం జరిగింది. ఆధునిక భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం మరియు న్యాయం అను సిద్ధాంతాల ఆవిష్కరణ ఎలా జరుగుతూ పోయిందో ఈ పాఠ్యపుస్తక అభ్యాసం నుంచే స్పష్టం కాగలదు. పాఠ్యపుస్తకంలో ఆధునిక భారతదేశ చరిత్ర ఆధారాల పరిచయం జరిగింది. అదే విధంగా భారతదేశంలో ఆంగ్లేయుల అధికార విస్తరణ ఎలా జరిగిందను విషయంపై సమీక్షించడం జరిగింది. ఆంగ్ల అధికార కబందహస్తాల నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధింపజేయుటకు భారతదేశ ప్రజలు చేసిన అవిస్మరణీయ పోరాటం, త్యాగాల సమాచారం గురించి చరిత్ర విభాగంలో ఇవ్వడం జరిగింది.

పౌరశాస్త్ర విభాగంలో పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిని పరిచయం చేయడం జరిగింది. మన దేశంలోని పరిపాలన సంవిధానం, చట్టాలు మరియు నియమనిబంధనలననుసరించి జరుగుతుందని చెప్పడం జరిగింది. పాఠ్యపుస్తకంలో భారతదేశంలోని భారతదేశ పార్లమెంటు, కేంద్ర కార్యనిర్వాహక మండలి, భారతదేశంలోని న్యాయవ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన, ఉద్యోగిస్వామ్య నిర్మాణం మరియు వీటన్నిటి యొక్క సమాజ ప్రజాస్వామ్యీకరణ ప్రక్రియలోని పాత్రను స్పష్టం చేయడం జరిగింది.

పుణె
తేది : 18 ఎప్రిల్ 2018, అక్షయ తృతీయ
భారత సౌరమానం : 28 చైత్రం 1940

(డా. సునీల్ మగర్)
సంచాలకులు,
మహారాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె

# ఉపాధ్యాయుల కొరకు

ఆరవ తరగతి మరియు ఏడవ తరగతి పాఠ్యప్రణాళికలో క్రమంగా ప్రాచీన, మధ్యయుగ భారతదేశ చరిత్రను మీరు అభ్యసించారు. ఎనిమిదవ తరగతి చరిత్రలో భారతదేశంలో వలసవాద మరియు నిర్వలసవాద ప్రక్రియ అదే విధంగా స్వాతంత్ర్యానంతర కాలంలో సంయుక్త మహారాష్ట్ర ఆందోళనలు పొందుపరచబడినవి. స్వాతంత్ర్య పోరాటానికి వెనుక గల ఆలోచనాప్రేరణ, భారతదేశంలో జాతీయభావనా అంకురం మరియు వికాసం, స్వాతంత్ర్యసైనికుల తోడ్పాటును అభ్యసించుట వలన విద్యార్థులలో జాతీయ బాధ్యతాభావన మరియు దేశభక్తి అభివృద్ధి చెందును.

చరిత్ర అనునది శాస్త్రయుక్తమైన అభ్యసన విషయం. అందులో చారిత్రక ఆధారాలకు అనన్యసామాన్యమైన ప్రాముఖ్యత ఉంది. కాలక్రమం ప్రకారం చరిత్ర ఆధారాల మారుతున్న స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకొని మొదటి పాఠంలో చారిత్రక ఆధారాలను పొందుపరచడం జరిగింది. యూరోపులోని పునరుజ్జీవన యుగం మరియు విప్లవ యుగం వలన సామ్రాజ్యవాదం పెరిగి ఆసియా, ఆఫ్రికా ఖండాలలో వలసల ప్రక్రియ అభివృద్ధి చెందింది. భారతదేశం కూడా ఈ పాశ్చాత్య సామ్రాజ్యవాద ఆకాంక్షకు ఎలా బలి అయిందో, బ్రిటిష్ పాలనతో భారతదేశంపై ఏ పరిణామం కలిగింది, తరువాత కాలంలో భారతీయుల ఆత్మగౌరవం జాగృతం చెంది స్వాతంత్ర్య ప్రేరణ ఎలా లభించిందో మనం తెలుసుకోబోతున్నాం.

భారతదేశ స్వాతంత్ర్య పోరాటాన్ని బోధిస్తున్నపుడు 1857 స్వాతంత్ర్యపోరాటం, జాతీయ మహాసభ స్థాపన, అతివాదులు, మితవాదుల కాలంలోని జాతీయ మహాసభ కార్యకలాపాలు, గాంధీయుగంలో సత్యాగ్రహ మార్గంలో జరిగిన ఉద్యమాలు, సాయుధ విప్లవ ఉద్యమం, ఆజాద్ హింద్ సైన్య పోరాటం, భారతదేశానికి స్వాతంత్ర్య ప్రాప్తి, సంస్థానాల విలీనీకరణం, ఫ్రెంచ్ మరియు పోర్చుగీసు వలసల విముక్తి వంటి సంఘటనల సమగ్ర సమాచారం విద్యార్థులకు దృశ్య-శ్రవణ సాధనాలు (చలనచిత్రం, డాక్యుమెంటరీ, సమాచార చలన చిత్రం, ధ్వని ముద్రణ మొదలగునవి) క్షేత్ర సందర్శనం, ప్రదర్శనలు, సేకరణలు, వార్తాపత్రికల మాధ్యమం ద్వారా అందజేయవచ్చును.

రాజకీయ వ్యవహారాల గురించి ఆలోచిస్తున్నపుడే భారతదేశ సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎలా మార్పు జరుగుతూ పోయిందో, సామాజిక మరియు రాజకీయ సమానత్వపు ఆలోచన భారతీయుల్లో ఎలా నాటుకుపోయిందో దానిని విద్యార్థులకు పరిచయం చేయవచ్చును. భారతదేశ చరిత్ర నేపథ్యాన్ని అభ్యసిస్తున్నపుడు మహారాష్ట్ర రాష్ట్ర నిర్మాణం యొక్క సంఘటనలు మరియు సంయుక్త మహారాష్ట్ర ఆందోళన గురించి మనం ఆలోచించవలెను.

ఏడవ తరగతి పౌరశాస్త్ర విభాగంలో మనం సంవిధానం నుంచి వ్యక్తమయ్యే తత్వజ్ఞానం, విలువల గురించి అభ్యసించాం. ఎనిమిదవ తరగతి పౌరశాస్త్ర విభాగంలో సంవిధానం ఏర్పాటు చేసిన ప్రభుత్వ పద్ధతి, పరిపాలనా వ్యవస్థ, న్యాయవ్యవస్థ మరియు న్యాయం చేకూర్చే పద్ధతుల గురించి ఆలోచించడం జరిగింది. ప్రస్తుత ఆశయాన్ని సమకాలీన సంఘటనల ఆధారంగా బోధించండి. వాటిని సంవిధానంలోని తత్వజ్ఞానంతో, అందునుంచి ప్రతిబింబించే విలువలు మరియు ఆదర్శాలతో జతచేయండి.

సంవిధానం ఒక నడిచే దస్తావేజు. దాని ద్వారా ప్రజాస్వామ్యం మరియు చట్టం యొక్క ఆధిపత్యం ప్రత్యక్షంగా కొనసాగుతుందని విద్యార్థులకు తెలియజేయండి. దానివలన విద్యార్థుల సామాజిక మరియు ఆర్థికపరమైన జాగ్రత్తలు అధికంగా బలపడుటకు దోహదపడును. ప్రజాస్వామ్య సంస్థలు మరియు వివిధ రాజకీయ ప్రక్రియలలోని సంబంధాన్ని విద్యార్థులు కనుగొనుటకు సాధ్యమగును. పాఠ్యపుస్తకంలో ఇవ్వబడిన ఆశయం ఆధారంగా చర్చలు, సమూహ చర్చలు, ప్రకల్పం, గోడ పత్రికలు, ఒకే విషయం ఆధారంగా అనేక రాజకీయ కోణాలు అర్థం చేసుకోవచ్చునట్లుగా విద్యార్థుల నుంచి ఉపక్రమాలను చేయించవచ్చును.

పాఠ్యపుస్తకాన్ని రచిస్తున్నపుడు జ్ఞాన నిర్మితివాద విద్య మరియు కృతియుక్త బోధనలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఇవ్వబడింది. అందుకై విద్యార్థులకోసం పాఠ్యాంశాలకు సంబంధించిన అధిక మరియు ఆనందదాయక సమాచార చదరాలను పాఠాలలో ఇవ్వబడినవి. వానితోబాటు చర్చిద్దాం పద, చేసి చూడండి వీటి నుంచి విద్యార్థులు అధ్యయన ప్రక్రియలో ఎలా క్రియాశీలంగా పాల్గొంటారో ఆలోచించడం జరిగింది. విద్యార్థుల క్రియాశీలతకు, ఆలోచనాశక్తికి మరియు స్వీయ భావప్రకటనకు ప్రోత్సాహం లభించు దృష్టికోణంతో అభ్యాసాలు మరియు ఉపక్రమాల కూర్పు చేయడం జరిగింది. పాఠానికి సంబంధించిన అదనపు సమాచారం ఇవ్వడం కోసం QR Codeను పాఠ్యపుస్తకంలో పొందుపరచడం జరిగింది. దానిని ఉపయోగించి మనం ప్రభావవంతంగా బోధించడం సులభం అవుతుంది.

# చరిత్ర

## (ఆధునిక భారతదేశ చరిత్ర)

### విషయ సూచిక


| క్ర.సం. | పాఠం పేరు | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | చరిత్ర ఆధారాలు ........................................................ | 1 |
| 2. | యూరోప్ మరియు భారతదేశం.................................................. | 5 |
| 3. | బ్రిటిష్ అధికార పరిణామం...................................................... | 10 |
| 4. | 1857 స్వాతంత్ర్యపోరాటం...................................................... | 15 |
| 5. | సామాజిక మరియు మత పునరుజ్జీవనం .................................... | 21 |
| 6. | స్వాతంత్ర్యోద్యమ యుగ ప్రారంభం............................................. | 25 |
| 7. | సహాయ నిరాకరణోద్యమం .................................................... | 31 |
| 8. | సవినయ శాసనోల్లంఘన ఉద్యమం ........................................... | 36 |
| 9. | స్వాతంత్ర్యపోరాట అంతిమ ఘట్టం ........................................... | 40 |
| 10. | సాయుధ విప్లవకారుల ఉద్యమం ............................................. | 45 |
| 11. | సమానత్వ పోరాటం ......................................................... | 50 |
| 12. | స్వాతంత్ర్య ప్రాప్తి ............................................................. | 56 |
| 13. | స్వాతంత్ర్యపోరాట పరిసమాప్తి................................................ | 59 |
| 14. | మహారాష్ట్ర రాష్ట్ర అవతరణ .................................................... | 62 |


**S.O.I. Note :** The following foot notes are applicable : (1) © Government of India, Copyright : 2018. (2) The responsibility for the correctness of internal details rests with the publisher. (3) The territorial waters of India extend into the sea to a distance of twelve nautical miles measured from the appropriate base line. (4) The administrative headquarters of Chandigarh, Haryana and Punjab are at Chandigarh. (5) The interstate boundaries amongst Arunachal Pradesh, Assam and Meghalaya shown on this map are as interpreted from the "North-Eastern Areas (Reorganisation) Act. 1971," but have yet to be verified. (6) The external boundaries and coastlines of India agree with the Record/Master Copy certified by Survey of India. (7) The state boundaries between Uttarakhand & Uttar Pradesh, Bihar & Jharkhand and Chattisgarh & Madhya Pradesh have not been verified by the Governments concerned. (8) The spellings of names in this map, have been taken from various sources.

## అధ్యయన ఫలితాలు

| అధ్యయన-అధ్యాపన ప్రక్రియ | అధ్యయన ఫలితాలు |
| --- | --- |
| అధ్యయనార్థులకు జతగా/జట్టులో/వ్యక్తిగతముగా అధ్యయనమునకు అవకాశం ఇచ్చుట మరియు వారిని కింది అంశాలకై ప్రవృత్తులను గావించుట.<br>• బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపనీకి భారతీయ రాజుల అంతరంగిక వంశ పరంపరాగతమైన కలహాలలో కల్పించుకోవడం ఎందుకు ముఖ్యమైనదనిపించిందనుట వంటి వివిధ విషయాలపై, సంఘటనలపై ప్రశ్నలు లేవనెత్తుట.<br>• వలసవాద పరిపాలనా కేంద్రాలు, భారత స్వతంత్ర పోరాటంలోని ముఖ్యమైన స్థావరాలు వంటి చారిత్రక దృష్ట్యా ముఖ్యమైన స్థలాలలను సందర్శించుట.<br>• గాంధీజీ యొక్క అహింసా సిద్ధాంతం. అది భారతదేశ స్వాతంత్ర్య /జాతీయోద్యమంపై చూపిన పరిణామం,<br>• భారత స్వాతంత్ర్యోద్యమంలోని ముఖ్య సంఘటనలను చూపే కాలరేఖ,<br>• చౌరీచౌరా సంఘటనలపై ఆధారిత పాత్రల అభినయానికై ప్రణాళిక,<br>• 'వలసవాద కాలంలో వాణిజ్యపంటలు పండించడం వలన నష్టాలకు గురియైన రంగాలు' భారతదేశ మానచిత్రపటంలో చూపుట వంటి ప్రాజెక్టులు/కృత్యాలు/ఉపక్రమాలను నిర్వహించుట.<br>• దేశీయ మరియు బ్రిటిష్ రచనలు, స్వీయచరిత్రలు, చరిత్రలు, నవలలు, చిత్రాలు, ఛాయాచిత్రాలు, సమకాలీన రచనలు, దస్తావేజులు, వార్తాపత్రికలలోని రచనలు, చలన చిత్రాలు, డాక్యుమెంటరీలు, ఆధునిక రచనలు వంటి ఆధారాలను గుర్తించి ఆ కాలంనాటి వివిధ ఉద్యమాల చరిత్రను అర్థం చేసుకొనుటకు మరియు పునఃరచన చేయుటకు ఉపయోగించుట.<br>• స్వయం మూల్యాంకనం కొరకు అధ్యాపనం శాస్త్రీయ దృష్ట్యా నూతనత్వంగా, అభిలక్షణాలకు సంబంధించిన ప్రశ్నలను (ఉదా. 'ప్లాసీ యుద్ధం వెనుక గల కారణాలు ఏవి?') పరిచయం చేయుట. | అధ్యయనార్థులు<br>08.73H.01 చరిత్ర యొక్క వివిధ ఆధారాలను గుర్తిస్తారు, ఈ కాలం లో చరిత్ర పునర్లేఖనం కోసం వాటి ఉపయోగాలను స్పష్టం చేస్తారు.<br>08.73H.02 వివిధ మూలాలు, వివిధ ప్రాంతాల కొరకు ఉపయోగం లోకి తెచ్చిన నామావళి, ఆయా కాలంలో సంభవించిన చారిత్రక సంఘటనల ఆధారంగా 'ఆధునిక కాలం', 'మధ్యయుగ కాలం', 'ప్రాచీన కాలం' వీనిలోని భేదాలను స్పష్టం చేయగలుగుతారు.<br>08.73H.03 బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపని అత్యధిక బలోపేతమైన శక్తిగా ఎలా తయారైనదో స్పష్టం చేస్తారు.<br>08.73H.04 వివిధ ప్రాంతాలలో బ్రిటిష్ వారి వ్యవసాయ ధోరణులలోని భేదాన్ని స్పష్టంగా చెబుతారు. ఉదా. నీలి విప్లవం.<br>08.73H.05 పందొమ్మిదో శతాబ్దంలో ఆదిమవాసుల సమాజ నిర్మాణం, వారికి పర్యావరణంతోగల సంబంధాలను వర్ణిస్తారు.<br>08.73H.06 ఆదిమవాసుల సమాజ విషయంలో బ్రిటిష్ వారి పరిపాలనా ధోరణులను వివరిస్తారు.<br>08.73H.07 1857 స్వాతంత్ర్య పోరాట పుట్టుక, స్వరూపం, విస్తరణ దాని నుంచి నేర్చుకొన్న నీతిని వివరిస్తారు.<br>08.73H.08 బ్రిటిష్ పరిపాలన కాలంలో ప్రాచీన నగరాలు మరియు వ్యాపార కేంద్రాలు, చేతివృత్తులపై ఆధారపడిన పరిశ్రమలు అంతరించి నూతన పట్టణాలు, వ్యాపార కేంద్రాలు, పరిశ్రమలు ఎలా అభివృద్ధి చెందాయో విశ్లేషిస్తారు.<br>08.73H.09 భారతదేశంలోని నూతన విద్యా వ్యవస్థ సంస్థాగతం ఎలా అయినదో స్పష్టం చేస్తారు.<br>08.73H.10 జాతి వ్యవస్థ, స్త్రీల స్థానం, వితంతువుల పునర్వివాహం, బాల్యవివాహాలు, సామాజిక సంస్కరణలు మొదలగు సమస్యల గురించి బ్రిటిష్‌వారి ధోరణులు, చట్టాలను విశ్లేషిస్తారు.<br>08.73H.11 ఆధునిక కాలంలో కళా రంగంలో సంభవించిన ముఖ్యమైన సంఘటనల రూపు రేఖలను చెప్పగలుగుదురు.<br>08.73H.12 1870 నుంచి స్వాతంత్ర్యం లభించే వరకు గల కాలగమనాన్ని సమీక్షిస్తారు.<br>08.73H.13 దేశ నిర్మాణ ప్రక్రియలో ముఖ్యమైన అంశాల విశ్లేషణ చేస్తారు. |

# 1. చరిత్ర సాధనాలు

ప్రాచీన, మధ్యయుగ భారతదేశ చరిత్ర ఆధారాల గురించి మీరు అధ్యయనం చేశారు. ఈ సంవత్సరం ఆధునిక భారతదేశ చరిత్ర ఆధారాల గురించి అధ్యయనం చేయనున్నారు. చరిత్ర ఆధారాలలో భౌతిక, లిఖిత, మౌఖిక ఆధారాలు పొందుపరచబడును. అదేవిధంగా ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడిన దృశ్య, శ్రవణ మరియు దృశ్య-శ్రవణ ఆధారాలు కూడా పొందుపరచబడును.

**భౌతిక ఆధారాలు :** చరిత్ర యొక్క భౌతిక ఆధారాలలో వివిధ వస్తువులు, కట్టడాలు, నాణేలు, విగ్రహాలు, పతకాలు మొదలగు ఆధారాలను పొందుపరచ వచ్చును.

**భవనాలు మరియు కట్టడాలు :** ఆధునిక భారతదేశ చరిత్రలోని కాలం ప్రత్యేకించి యురోపీయ బ్రిటిష్ అధికారుల మరియు సంస్థానాధీశుల రాజ్యపరిపాలనా కాలంగా భావింపబడును. ఈ కాలంలో వివిధ భవనాలు, వంతెనలు, రహదారులు, చలివేంద్రాలు, ఫౌంటేన్ల వంటి కట్టడాలు నిర్మించబడినవి. ఈ భవనాలలో పరిపాలనా కార్యాలయాలు, అధికారుల, నాయకుల మరియు విప్లవకారుల నివాసస్థానాలు, సంస్థానాధీశుల రాజభవనాలు, కోటలు, చెఱసాలల వంటివి ఉంటాయి. ఈ కట్టడాలలో చాలా భవనాలు నేడు మంచిస్థితిలో కనిపిస్తాయి. కొన్ని కట్టడాలు జాతీయ స్మారకాలుగా ప్రకటింపబడినవి. కొన్ని భవనాలలో వస్తు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయడం జరిగింది. ఉదా : అండమాన్‌లోని సెల్యూలర్ జైల్.

ఈ కట్టడాలను సందర్శించిన తరువాత మీకు ఆ కాలం నాటి చరిత్ర, వాస్తునిర్మాణ శాస్త్రం, వాస్తు (కట్టడాల) స్వరూపాన్ని బట్టి ఆనాటి ఆర్థిక సంపద గురించిన వివరాలు లభిస్తాయి. ఉదా: అండమాన్‌లోని సెల్యూలర్ జైలును సందర్శించిన మీదట స్వాతంత్ర్యవీర్ సావర్కర్ గారి విప్లవ కార్యకలాపాల గురించి, ముంబయిలోని మణిభవన్ లేక వర్ధాలోని సేవాగ్రామ్ ఆశ్రమాన్ని సందర్శించిన మీదట గాంధీయుగం యొక్క చరిత్ర గురించి సమాచారం లభిస్తుంది.

**మీకు తెలుసా ?**

**వస్తు ప్రదర్శన శాలలు మరియు చరిత్ర :** చరిత్ర అధ్యయనం కొరకు వస్తుప్రదర్శనశాలల్లో వివిధ వస్తువులు, చిత్రాలు, ఛాయాచిత్రాల వంటి వివిధ వస్తువులు భద్రపరచబడతాయి. పుణెలోని ఆగాఖాన్ ప్యాలెస్‌లో గాంధీ స్మారక వస్తుప్రదర్శనశాలలో మీకు మహాత్మాగాంధి ఉపయోగించిన అనేక వస్తువులు, దస్తావేజులు వీక్షించుటకు లభిస్తాయి.



ఆగాఖాన్ ప్యాలెస్, పుణె

**విగ్రహాలు మరియు స్మారకాలు :** స్వాతంత్ర్యానికి పూర్వం మరియు స్వాతంత్ర్యోత్తర కాలంలో అనేక మంది స్మారకాలను విగ్రహాల రూపంలో నెలకొల్పడం జరిగింది. ఈ విగ్రహాలు కూడా ఆధునిక భారతదేశ చరిత్ర అధ్యయనం దృష్ట్యా ముఖ్యమైనవి. వివిధ విగ్రహాల ద్వారా మనకు ఆ కాలంలోని రాజులు, సమాజంలోని ప్రతిష్ఠాత్మక వ్యక్తుల గురించి సమాచారం లభిస్తుంది. విగ్రహం యొక్క అడుగు భాగాన ఉన్న పలకంపై ఆ వ్యక్తికి సంబంధించిన పూర్తిపేరు, జనన మరణాల నమోదు, ఆ వ్యక్తి కార్యకలాపాల సంక్షిప్త వర్ణన, జీవనం మొదలగు వాటి గురించి సమాచారం లభిస్తుంది. మహాత్మా జ్యోతీరావుఫులె, లోకమాన్య తిలక్, డా. బాబా సాహెబ్ అంబేద్కర్‌ల విగ్రహాల మాదిరిగా వివిధ సంఘటనల స్మృత్యర్థం స్థాపించిన స్మారకాలు సంఘటనలు, సంఘటనలకు సంబంధించిన కాలం ఆ సంఘటనలతో సంబంధం కలిగియున్న వ్యక్తుల గురించి

సమాచారం ఇస్తాయి. ఉదా : వివిధ స్థలాలలో స్థాపించిన అమరవీరుల స్మారకాలు.



**చేసి చూడండి.**

మీ సమీపంలో ఉండే పరిసరాలలోని స్మారకాలు, విగ్రహాలకు సంబంధించిన సమాచారం సేకరించండి. దానినిబట్టి మీకు ఆ సంఘటన లేక వ్యక్తి గురించి ఏ సమాచారం లభిస్తుందో నమోదు చేయండి.

**లిఖిత ఆధారాలు** :ఆధునిక భారతదేశ చరిత్ర లిఖిత ఆధారాలలో కింది అంశాలు పొందుపరచబడును.




**వార్తాపత్రికలు మరియు అనుకాలికలు** : వార్తాపత్రికల ద్వారా మనకు సమకాలీన సంఘటనల గురించి సమాచారం లభిస్తుంది. దానితోబాటు ఏదేని సంఘటన యొక్క లోతైన విశ్లేషణ, గొప్పవారి అభిప్రాయాలు, అభిప్రాయభేదాలు, సంపాదకీయాలు ప్రచురింపబడుతుంటాయి. మనకు ఆ కాలంలోని రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సంఘటనల సమాచారం లభిస్తుంది. స్వాతంత్ర్యపూర్వకాలంలో జ్ఞానోదయ్, జ్ఞానప్రకాశ్, కేసరి, దీనబంధు, అమృత్‌బజార్ పత్రికల వంటి వార్తాపత్రికలు జనజాగృతి కొరకు ముఖ్యమైన సాధనాలుగా ఉండెను. ఈ వార్తాపత్రికల ద్వారా మనం బ్రిటిష్ ప్రభుత్వం సంకల్పించిన పరిపాలనా విధాలు, భారతదేశంపై వాటి పరిణామం వంటి విషయాల అధ్యయనం చేయవచ్చును. బ్రిటిష్‌కాలంలో వార్తాపత్రికలు కేవలం రాజకీయపరమైనవే కాకుండా సామాజిక పునరుజ్జీవన సాధనాలుగా కూడా పనిచేయుచుండెడివి. విష్ణుశాస్త్రి చిప్లూన్‌కర్ 'నిబంధమాల' అను మాస పత్రికలో లోకహితవాదిగా ప్రసిద్ధిగాంచిన గోపాల్ హరిదేశ్‌ముఖ్ 'ప్రభాకర్' అను వారపత్రికలో రాసిన శతపత్రే (వంద శీర్షికల) ద్వారా వివిధ సామాజిక, సాంస్కృతిక విషయాలను నిర్వచించారు.

**తెలుసుకొందాం పద ...**

**డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ మరియు వార్తాపత్రికలు** : డా. బాబా సాహెబ్ అంబేడ్కర్ 1920 జనవరి నెలలో 'మూక్‌నాయక్'అను పక్ష పత్రికను ప్రారంభించారు. కాని ఆయన పై చదువుల కోసం ఇంగ్లాండు వెళ్ళవలసి వచ్చినందువలన ఈ పత్రికను అతని అనుచరునికి అప్పగించారు. డా. బాబా సాహెబ్ అంబేడ్కర్ ఏప్రిల్ 1927లో 'బహిష్కృత భారత్'అను వార్తాపత్రికను ప్రారంభించారు. సామాన్యప్రజల ప్రబోధం మరియు సంఘటితం చేయడానికి బహిష్కృత భారత్ అను పత్రిక ద్వారా ఆయన రచనలు చేశారు. ఇంతేకాకుండా 'జనత', 'ప్రబుద్ధభారత్' అను మరో రెండు వార్తాపత్రికలను నడిపారు.




**మానచిత్ర పటాలు మరియు రేఖాచిత్రాలు** : మానచిత్ర పటాలు కూడా చరిత్రయొక్క ముఖ్యమైన ఆధారాలుగా భావింపబడును. మాన చిత్రపటం ద్వారా మనకు పట్టణాలు లేక ఏదేని ఒక స్థలం యొక్క మారుతున్న స్వరూపాన్ని అధ్యయనం చేయవచ్చును. బ్రిటిష్ కాలంలో స్థాపించబడిన సర్వే ఆఫ్ ఇండియా అను స్వతంత్ర విభాగం భారత దేశము మరియు దేశములోని వివిధ ప్రాంతాలు, పట్టణాలను శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేసి మానచిత్రపటాలను తయారు చేసింది. మాన చిత్రపటాల మాదిరిగా వాస్తు విశారదులు తయారుచేసిన రేఖాచిత్రాలు కూడా భవన నిర్మాణశాస్త్రం అదే విధంగా ఒక ప్రాంతం యొక్క అభివృద్ధి దశలను అధ్యయనం

చేయుటకు ఉపయోగపడును. ఉదా : ముంబయి పోర్ట్ ట్రస్ట్ విభాగం వద్ద ముంబయి ఓడరేవుకు సంబంధించిన మౌలిక రేఖాచిత్రాలు ఉన్నాయి. ఈ ఓడరేవును తదుపరి అభివృద్ధి చేయుచున్నపుడు వాస్తు విశారదులు మరియు ఇంజనీర్లు గీసిన రేఖాచిత్రాల ద్వారా మనకు ముంబయి పట్టణాభివృద్ధికి సంబంధించిన సమాచారం లభిస్తుంది.

**మౌఖిక సాధనాలు :** ఆధునిక భారతదేశ చరిత్ర యొక్క మౌఖిక ఆధారాలలో కిందనీయబడిన ఆధారాలు పొందుపరచబడినవి.




**స్ఫూర్తి గీతాలు :** స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక స్ఫూర్తిగీతాలు రచింపబడ్డాయి. అందులో అనేక గీతాలు నేడు లిఖితరూపంలో లభ్యమగుచున్నవి. కాని ప్రచురితంకాని అనేక స్ఫూర్తిగీతాలు స్వాతంత్ర్య సైనికులకు కంఠస్థమై ఉన్నాయి. ఈ స్ఫూర్తిగీతాల ద్వారా మనకు స్వాతంత్ర్యానికి పూర్వ కాలంలోని పరిస్థితులు, స్వాతంత్ర్యపోరాట నేపథ్యంలోని ప్రేరణల గురించిన సమాచారం లభిస్తుంది.

**పోవాడాలు (జానపద వీరగాథలు) :** పోవాడాల ద్వారా చారిత్రక సంఘటనల గురించి అదేవిధంగా వ్యక్తుల కార్యకలాపాల గురించి సమాచారం లభిస్తుంది. బ్రిటిష్ పరిపాలన కాలంలో 1857 స్వాతంత్ర్య పోరాటం, వివిధ విప్లవకారులు చేసిన పరాక్రమాలపై ఆధారపడిన పోవాడాలు రచింపబడినవి. ప్రజల్లో ప్రేరణ, చైతన్యం నిర్మించడానికి ఈ పోవాడాలు ఉపయోగింపబడేవి. స్వాతంత్ర్య పోరాటం మాదిరిగా సత్యశోధక సమాజం పోవాడాల మాధ్యమం ద్వారా పీడిత వర్గాలలోతీసుకొచ్చిన జాగృతి, సంయుక్త మహారాష్ట్ర పోరాటం వంటి సంఘటనలపై ఆధారపడిన పోవాడాల రచనలు చేసింది.



**చేసి చూడండి.**

భారత జాతీయ స్వాతంత్ర్య పోరాట కాలానికి సంబంధించిన స్ఫూర్తి గీతాలు మరియు పోవాడాలను సంగ్రహించి వాటిని ప్రదర్శించండి.

**దృశ్య, శ్రవణ మరియు దృశ్య-శ్రవణ ఆధారాలు :** ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం యొక్క అభివృద్ధి వలన ఛాయా చిత్రణము, ధ్వని ముద్రణం, చలన చిత్రాలు మొదలగు కళల వికాసం జరిగింది. అనగా వాటి నుండి నిర్మాణమైన ఛాయాచిత్రాలు, ధ్వనిముద్రణలు (రికార్డులు) చలన చిత్రాలను చరిత్ర ఆధారాలుగా ఉపయోగించవచ్చును.

**ఛాయాచిత్రాలు :** ఛాయాచిత్రాలు ఆధునిక భారతదేశ చరిత్రయొక్క దృశ్యరూప ఆధారాలు. ఛాయాచిత్రణ కళను కనుగొన్న తరువాత వివిధ వ్యక్తులు, సంఘటనలు అదేవిధంగా వస్తువులు, కట్టడాలు వాటి ఛాయా చిత్రాలు తీయడం జరుగుచుండెను. ఈ ఛాయాచిత్రాల ద్వారా వివిధ వ్యక్తులు ఎలా ఉండిరో వివిధ సంఘటనలు ఎలా సంభవించినవో వాటి గురించి దృశ్యరూపంలో సమాచారం లభిస్తుంది. మధ్యయుగ కాలంలోని వ్యక్తులు ఎలా కనిపించేవారో లేదా సంఘటనలు ఎలా జరిగినవో వాటి చిత్రాలు అందుబాటులో ఉన్నవి. కాని ఈ చిత్రాలు ఎంత విశ్వసనీయమైనవి అనే విషయంపై సందేహాలు వెలిబుచ్చడం జరుగుతుంది. తులనాత్మకంగా ఛాయాచిత్రాలు అధిక విశ్వసనీయమైనవని భావింపబడుచున్నవి. వ్యక్తియొక్క ఛాయాచిత్రాన్ని బట్టి ఆ వ్యక్తి ఎలా కనిపించేవాడు, అతని ఆకారం ఎలా ఉండేది అను విషయం గురించి సమాచారం లభిస్తుంది. సంఘటన యొక్క ఛాయాచిత్రాల ద్వారా ఆ సంఘటన కండ్లముందు నిలుస్తుంది. అయితే కట్టడాలు లేక వస్తువుల ఛాయాచిత్రాల ద్వారా వాటి స్వరూపం తెలుస్తుంది.

**ధ్వని ముద్రణలు (రికార్డులు) :** ఛాయాచిత్రణ కళ మాదిరిగా ధ్వనిముద్రణ సాంకేతికతను కనుగొనడం కూడా చాలా ముఖ్యమైనది. ధ్వని ముద్రణలు లేక రికార్డులు అనునవి చరిత్రయొక్క శ్రవణ రూప ఆధారాలు. ఆధునిక కాలంలో నాయకులు లేక ముఖ్యమైన వ్యక్తులు చేసిన ఉపన్యాసాలు, పాటలు ధ్వనిముద్రణల రూపంలో అందుబాటులో ఉన్నాయి. వాటిని చరిత్ర ఆధారాలుగా ఉపయోగించు కోవచ్చును. ఉదా : స్వయంగా రవీంద్రనాథ్ టాగోర్, ఆలపించిన 'జణగణమణ' జాతీయగీతం లేక సుభాష్‌చంద్రబోస్ ప్రసంగం వీటిని ఆధునిక భారతదేశ చరిత్ర అధ్యయనంలో శ్రవణ ఆధారాలుగా ఉపయోగించవచ్చును.

**చలన చిత్రం :** చలన చిత్రం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం యొక్క ఒక విశేష ఆవిష్కరణగా భావింపబడుతుంది. ఇరవయ్యవ శతాబ్దంలో చలనచిత్ర సాంకేతిక పరిజ్ఞానంలో పెద్దఎత్తున అభివృద్ధి జరిగింది. దాదాసాహెబ్ ఫాల్కే క్రీ.శ. 1913లో భారతీయ చలనచిత్ర సృష్టికి శుభారంభాన్ని అందించాడు. భారతీయ స్వాతంత్ర్య పోరాటంలోని దండియాత్ర, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి చారిత్రక సంఘటనల ధ్వని చిత్ర ముద్రణల (ఆడియో వీడియో టేపులు) క్యాసెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ క్యాసెట్ల వలన జరిగిన సంఘటనలను యథాతథంగా చూడవచ్చును.

ప్రాచీన మరియు మధ్యయుగ కాలం యొక్క తులనలో ఆధునిక భారతదేశ చరిత్రయొక్క అధ్యయనం చేయుటకు అధిక ప్రమాణంలో మరియు వివిధ రకాల ఆధారాలు అందుబాటులో ఉన్నాయి. ఈ కాలంలోని భౌతిక ఆధారాలు చాలావరకు మంచి స్థితిలో ఉన్నాయి. అభిలేఖాగారంలో భద్రపరచబడిన అనేక లిఖిత ఆధారాలు కూడా అందుబాటులో ఉన్నాయి. లిఖిత ఆధారాలను ఉపయోగిస్తున్నపుడు మాత్రం, ఆ ఆలోచనలు ఎవరి ఆలోచనలతో ప్రేరితమైనవి, ఒక సంఘటనను వీక్షించే సాధకుని దృక్పథం ఏమిటి అనునది పరిశీలించవలసి వస్తుంది. అటువంటి ఆధారాలను భద్రపరచడం అవసరం. చారిత్రక ఆధారాలను భద్రపరచడం వలన చరిత్రయొక్క సమృద్ధమైన వారసత్వ సంపదను మనం భావితరాలకు అందించవచ్చును.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియమైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(1) చరిత్ర ఆధారాలలో ................ ఆధారాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడినవి.

(అ) లిఖిత (బ) మౌఖిక

(క) భౌతిక (డ) దృశ్య-శ్రవణ

(2) పుణెలోని ........... గాంధీ స్మారక వస్తువు ప్రదర్శనశాలలో గాంధీజీ యొక్క చరిత్ర గురించి సమాచారం లభిస్తుంది.

(అ) ఆగాఖాన్ ప్యాలెస్ (బ) సాబర్‌మతి ఆశ్రమం

(క) సెల్యూలర్ జైలు (డ) లక్ష్మీ విలాస్ ప్యాలెస్

(3) ఇరవయ్యవ శతాబ్దంలోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం యొక్క ఒక విశేష ఆవిష్కరణ అనగా ...........

(అ) పోవాడా (బ) చాయా చిత్రం

(క) ముఖాముఖి (డ) చలనచిత్రం

**2. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

(1) బ్రిటిష్ కాలంలో వార్తాపత్రికలు సామాజిక పునరుజ్జీవన సాధనాలుగా పనిచేయుచుండెడివి.

(2) క్యాసెట్లు (ఆడియో వీడియో టేపులు) ఆధునిక భారతదేశ చరిత్ర అధ్యయనంలో అత్యధిక విశ్వసనీయ ఆధారాలుగా భావింపబడుచున్నవి.

**3. టిప్పణులు రాయండి.**

1) ఛాయాచిత్రాలు (2) వస్తుప్రదర్శన శాలలు మరియు చరిత్ర (3) శ్రవణ ఆధారాలు

**4. కింది సంకల్పనా చిత్రాన్ని పూర్తి చేయండి.**




**ఉపక్రమం**

(1) భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలోని వివిధ సంఘటనల ఛాయాచిత్రాలను అంతర్జాలం సహాయంతో సంగ్రహించండి.

(2) స్వాతంత్ర్య పోరాటంలోని సుప్రసిద్ధ నాయకులు మరియు వారి చరిత్రల గురించి వివరాలు సేకరించి వాటిని చదవండి.

BD52ID

# 2. యురోప్ మరియు భారతదేశం

ఆధునిక కాలంలో యురోప్‌లో సంభవించిన వివిధ మార్పుల ప్రతిరూపం భారతదేశంలో స్పష్టంగా కనిపిస్తుండేది. అందువలన ఆధునిక భారతదేశ చరిత్ర కాలాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు మనకు ఆ కాలంలో యురోప్‌లో జరిగిన సంఘటనలను అధ్యయనం చేయవలసి వస్తుంది.

**పునరుజ్జీవన కాలం :** యురోపీయ చరిత్రలో మధ్యయుగం యొక్క చివరి దశ అనగా క్రీ.శ. 13వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దం వరకు పునరుజ్జీవన యుగంగా గుర్తించబడుతుంది. ఈ కాలంలో ప్రబోధాలు, మతసంస్కరణల ఉద్యమాలు మరియు భౌగోళిక పరిశోధనల సంఘటనల వలన ఆధునిక యుగ పునాది వేయబడింది. అందువలన ఈ కాలాన్ని పునరుజ్జీవన కాలం అని అంటారు.

పునరుజ్జీవనకాలంలో యురోప్‌లోని కళలు, వాస్తు నిర్మాణాలు, తత్వజ్ఞానం మొదలగు రంగాలలో గ్రీకు, రోమన్ సంప్రదాయాల పునరుజ్జీవనం జరిగింది. దీనినుంచే సర్వతోముఖ అభివృద్ధికి ప్రేరణ లభించింది. ఈ కాలంలో మానవతావాదానికి ప్రేరణ లభించింది. మానవుడు తోటి మానవున్ని చూసే దృష్టికోణం మారింది. మతానికి బదులుగా మానవుడు అన్ని ఆలోచనలకు కేంద్రబిందువు అయ్యాడు.

**లియొనార్డో-ద-వించీ :** ఇతడు పునరుజ్జీవన కాలంలోని బహుముఖ ప్రజ్ఞాశాలిగా భావింపబడ్డాడు. అతడు అనేక శాస్త్రాలు మరియు కళలలో పారంగతుడు. శిల్పకళ, వాస్తు నిర్మాణకళ, గణితం, ఇంజనీరింగ్, సంగీతం, ఖగోళశాస్త్రం వంటి వివిధ విషయాలలో అతనికి విశేష పరిజ్ఞానము ఉండెను. కాని అతడు చిత్రకారునిగా జగత్ప్రసిద్ధి పొందాడు. అతని 'మోనాలిసా', 'దలాస్ట్ సప్పర్' అను చిత్రాలు అజరామరములైనవి.



పునరుజ్జీవన ఉద్యమంతో మానవ జీవనం అన్ని రంగాలకు వ్యాపించింది. జ్ఞానం, విజ్ఞానశాస్త్రం అదే విధంగా వివిధ కళారంగాలలో మనకు పునరుజ్జీవన ఉద్యమ ఆవిష్కరణ గోచరమవుతుంది. పునరుజ్జీవన కాలంనాటి కళలు, సాహిత్యాల నుంచి మానవుల మనోభావనలు, సంవేదనల వర్ణణ చేయబడుతుండెను. ప్రజలకు అర్థమగు ప్రాంతీయ భాషల ద్వారా సాహిత్య నిర్మాణం జరుగసాగింది. క్రీ.శ. 1450 సుమారు కాలంలో జర్మనీ యొక్క జోహన్స్ గుటెన్‌బర్గ్ అచ్చుయంత్రాన్ని కనుగొన్నాడు. అచ్చుయంత్రం కనుగొనడం వలన కొత్త ఆలోచనలు, నూతన భావనలు, జ్ఞానం సమాజంలోని ప్రజలందరికి చేరసాగింది.

**మతసంస్కరణోద్యమం :** సొంతంగా ఆలోచించే మేధావులు రోమన్ క్యాథలిక్ చర్చ్ యొక్క పురాతన మత భావనలపై తిరుగుబాటు చేశారు. ప్రజల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకొని క్రైస్తవ మతగురువులు కర్మకాండల అనుచిత ఖర్చులు చేయించేవారు. మతంపేరిట ప్రజలను దోచుకొనేవారు. దీనికి వ్యతిరేకంగా యురోప్‌లో ఏ ఉద్యమం ప్రారంభమైనదో దానిని మత సంస్కరణోద్యమం అని అంటారు. ఈ ఉద్యమం వలన మతరంగంలో మానవుని స్వాతంత్ర్యం, హేతువాదం అను సిద్ధాంతాలకు ప్రాముఖ్యత లభించింది.

**భౌగోళిక పరిశోధనలు :** క్రీ.శ. 1453లో అట్టోమన్ తురుష్కులు, బైజాంటైన్ సామ్రాజ్య రాజధాని అయిన కాన్స్టంటినోపల్ (ఇస్తాంబుల్)ను జయించారు. ఈ పట్టణం నుంచి ఆసియా మరియు యురోప్‌లను కలిపే భూ వ్యాపార మార్గం ఉంది. తురుష్కులు ఈ మార్గాన్ని నిలిపివేయడం వలన యురోపియన్ దేశాలకు ఆసియా వైపు పోయే కొత్త మార్గాన్ని కనుగొనే అవసరం కలిగింది. దానినుంచే భౌగోళిక పరిశోధనల నూతన అధ్యాయం ప్రారంభమైంది.



**దీనిని తెలుసుకోండి.**

**భౌగోళిక పరిశోధనలు :** పదిహేనవ శతాబ్దంలో యురోపీయ నావికులు భారతదేశానికి జలమార్గాన్ని అన్వేషించుటకు సముద్రయానం చేశారు.

- క్రీ.శ. 1487లో భారతదేశాన్ని కనుగొనుటకు బార్థోలోమ్యూ డాయస్ అను పోర్చుగీసు నావికుడు బయలుదేరాడు. కాని అతడు ఆఫ్రికా దక్షిణ అగ్రం అనగా కేప్ ఆఫ్ గుడ్ హోప్ వరకు మాత్రమే చేరుకోన్నాడు.
- క్రీ.శ. 1492లో భారతదేశ పశ్చిమప్రాంతాన్ని కనుగొనే ప్రయత్నంలో క్రిస్టోఫర్ కొలంబస్ అమెరికా ఖండం యొక్క తూర్పుతీరం చేరుకొన్నాడు.
- క్రీ.శ. 1498లో పోర్చుగీసు నావికుడు వాస్కో-ద-గామా ఆఫ్రికా యొక్క దక్షిణ అగ్రాన్ని చుట్టి భారతదేశ పశ్చిమతీరంలోని కాలికట్ ఓడరేవు చేరుకొన్నాడు.



**చేసి చూడండి.**

- ప్రపంచ మానచిత్రపటంలో నావికులు కనుగొన్న కొత్త సముద్ర మార్గాలను మరియు ప్రాంతాలను చూపండి.

**యురోప్‌లో భావ విప్లవం :** పునరుజ్జీవన కాలంలో జరిగిన మార్పులవల్ల యురోప్ మధ్యయుగం నుంచి ఆధునిక యుగంవైపు ప్రస్థానం ప్రారంభించింది. ఇదే కాలంలో యురోప్‌లో భావ విప్లవం సంభవించింది. గతంలోని అజ్ఞానం, మూఢనమ్మకాలు నుంచి సమాజం బయటపడసాగింది. నెలకొనియున్న ఆచార సంప్రదాయాలు మరియు జరిగే సంఘటనలను పరిశీలనాత్మక దృష్టితో చూడడం ప్రారంభమైంది. ఈ సంపూర్ణ మార్పు 'భావ విప్లవం' అని పిలువబడుతుంది. ఈ భావ విప్లవం నుంచి యురోప్‌లో విజ్ఞాన రంగంలో పరిశోధనలకు ప్రేరణ లభించింది.

**రాజకీయ రంగంలో విప్లవం :** ఆధునిక కాల ప్రారంభదశలో యురోప్‌లో అనేక రాజకీయ మార్పులు సంభవించాయి. 18వ అదే విధంగా 19వ శతాబ్దంలో జరిగిన అనేక విప్లవ సంఘటనల వలన ఈ కాలం 'విప్లవ యుగం' గా గుర్తింపబడింది. ఈ కాలంలో ఇంగ్లండ్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వికాసం జరిగింది. క్యాబినెట్ పద్ధతి స్వరూపంలో మార్పు జరిగింది. క్రీ.శ. 1689 బిల్ ఆఫ్ రైట్స్ వలన రాజుయొక్క అధికారం పై పరిమితులు విధించబడినవి. పార్లమెంట్ సార్వభౌమత్వం స్థాపించబడినది.

**అమెరికా స్వాతంత్ర్య యుద్ధం :** యురోప్‌లో సంభవిస్తున్న విప్లవాత్మక సంఘటనల నేపథ్యంపై అమెరికాలోని స్వాతంత్ర్యయుద్ధాన్ని కూడా తెలుసుకోవడం ముఖ్యం. అమెరికా ఖండాన్ని కనుగొన్న తర్వాత యురోపీయ దేశాలు తమ దృష్టిని ఈ ఖండంవైపు సారించాయి. సామ్రాజ్యవాద యురోపీయ దేశాలు అమెరికా ఖండంలోని వివిధ ప్రాంతాలను స్వాధీనం చేసుకొని అక్కడ తమ వలసలను స్థాపించాయి. ఇంగ్లండ్ ఉత్తర అమెరికా తూర్పు తీరప్రాంతంలో పదమూడు వలసలను స్థాపించింది. ప్రారంభంలో ఇంగ్లండ్‌కు ఈ వలసలపై నామమాత్రపు అధికారం ఉండెను. కాని తరువాత కాలంలో ఇంగ్లాండ్ పార్లమెంటు అమెరికాలోని వలస ప్రాంతాలపై కఠినమైన నిబంధనలను, పన్నులను విధించడం ప్రారంభించింది. అమెరికన్ వలస ప్రాంతాలలో స్వాతంత్ర్యేచ్ఛ గల ప్రజలు దీనిని వ్యతిరేకించారు. ఇంగ్లండ్ వలస ప్రాంతాలను అణచివేయుటకు వలస ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించింది. స్థానిక అమెరికన్ వలస ప్రజలు జార్జ్ వాషింగ్టన్ నాయకత్వంలో సైన్యాన్ని సంఘటితం చేసి తిరగబడ్డారు. చివరకు వలస ప్రజల సైన్యం విజయం సాధించింది. ఈ సంఘటన 'అమెరికా స్వాతంత్ర్యయుద్ధం'గా గుర్తింపబడుతుంది. దీనినుంచే అమెరికా సంయుక్త రాష్ట్రాలు అను సమాఖ్య ప్రభుత్వ పద్ధతి, లిఖిత రాజ్యాంగం కలిగిన, ప్రజాస్వామ్య వ్యవస్థ గల నూతన దేశం మనుగడలోనికి వచ్చింది.

**ఫ్రెంచ్ విప్లవం :** కీ.శ. 1789లో ఫ్రాన్స్‌లోని ప్రజలు అక్కడి అనియంత్రిత అన్యాయపూరిత రాజరికం మరియు భూస్వామ్య (సామంత రాజ్య) పద్ధతికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి గణతంత్ర రాజ్యాన్ని స్థాపించారు. ఈ సంఘటన 'ఫ్రెంచ్ విప్లవం'గా పిలువబడుతుంది. ఫ్రెంచ్ విప్లవంతో ప్రపంచానికి స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అను విలువలు అందింపబడినవి.

ప్రపంచ చరిత్రలోని రాజకీయ విప్లవంలో అమెరికా స్వాతంత్ర్యయుద్ధం, ఫ్రెంచ్ విప్లవాలకు ప్రత్యేక స్థానం ఉన్నది.

**పారిశ్రామిక విప్లవం :** పద్దెనిమిదవ శతాబ్దపు ఉత్తరార్ధం నుంచి యురోప్‌లోని పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులు జరుగసాగాయి. బాష్ప (నీటి ఆవిరి) శక్తిపై నడిచే యంత్రాల సహాయంతో ఉత్పత్తులు జరుగసాగాయి. చిన్న కుటీర పరిశ్రమల స్థానాన్ని పెద్ద కర్మాగారాలు తీసుకొన్నాయి. చేతిమగ్గం కాకుండా మరమగ్గం ఉపయోగించడం ప్రారంభమైనది. రైలుబండి, మర పడవల వంటి నూతన రవాణా సాధనాలు వచ్చాయి. యంత్రయుగం అవతరించింది. దీనినే 'పారిశ్రామిక విప్లవం' అని అంటారు.

ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైన తరువాత అది దశలు దశలుగా పాశ్చాత్య ప్రపంచంలో విస్తరించింది. ఈ కాలంలో పారిశ్రామిక అభివృద్ధి ఎంతగా జరిగిందంటే ఇంగ్లండ్‌ను 'ప్రపంచ కర్మాగారం' అని వర్ణించ సాగారు.

**పెట్టుబడిదారీ విధానం యొక్క ప్రారంభం :** నూతన సముద్ర మార్గాలను కనుగొన్న తరువాత యురోప్ మరియు ఆసియా దేశాలలో వ్యాపారం యొక్క నూతన అధ్యాయం ప్రారంభమైనది. సముద్ర మార్గంలో తూర్పు దేశాలతో వ్యాపారం చేయుటకు అనేక మంది వ్యాపారులు ముందుకు వచ్చారు. కాని ఒక వ్యాపారస్థునికి పడవ నుంచి వస్తువులను విదేశాలకు పంపుట సాధ్యం కాలేదు. అందువల్ల అనేక మంది వ్యాపారులు కలిసి వ్యాపారం ప్రారంభించారు. దీనినుంచే పెట్టుబడిలో భాగస్వామ్యం గల అనేక వ్యాపార సంస్థలు పుట్టుకొచ్చాయి. ప్రాచ్యదేశాలతో జరిగే వ్యాపారం లాభసాటిగా ఉండెను. ఈ వ్యాపారం నుంచి దేశాల ఆర్థికాభివృద్ధి జరుగుతుండేది. అందువలన యురోప్‌లోని రాజులు వ్యాపార కంపెనీలకు సైనిక రక్షణ, వ్యాపార అనుమతులు ఇవ్వసాగారు. ఈ వ్యాపారం వలన యురోపీయ దేశాలలో ధనం పెరగసాగింది. ఈ సంపదను పెట్టుబడి రూపంలో వ్యాపారం, పరిశ్రమలలో ఉపయోగించసాగారు. అందువలన యురోపీయ దేశాలలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ప్రారంభమైంది.

**వలసవాదం :** ఒక దేశంలోని కొందరు ప్రజలు మరో భూప్రాంతంలోని ఒక ప్రత్యేక ప్రాంతంలో నివాసం ఉండటాన్ని వలసను స్థాపించడం అంటారు. ఆర్థిక, సైనిక దృష్ట్యా బలోపేతమైన దేశం తన సామర్థ్య బలంపై ఒక భూప్రాంతం చేరుకొని ఆ ప్రాంతంలో తన రాజకీయ అధికారాన్ని స్థాపించడాన్ని 'వలసవాదం' అంటారు. యురోపీయ దేశాల ఈ వలసవాద ప్రవృత్తినుంచే సామ్రాజ్యవాదం ఉదయించింది.

**సామ్రాజ్యవాదం :** అభివృద్ధి చెందిన దేశం అభివృద్ధి చెందని దేశంపై తన సర్వతోముఖ అధికారాన్ని స్థాపించి అనేక నూతన వలసలు నెలకొల్పడాన్ని 'సామ్రాజ్యవాదం' అంటారు. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో అనేక దేశాలు యురోపీయ దేశాల సామ్రాజ్యవాద ఆకాంక్షకు బలిఅయినవి.

**భారతదేశంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సామ్రాజ్యవాదం :** భారతదేశంలో వ్యాపార గుత్తాధిపత్యం పొందడానికి యురోపీయ దేశాల మధ్య తీవ్ర పోటీ ఉండెను. క్రీ.శ. 1600లో ఆంగ్లేయులు భారతదేశంలో వ్యాపారం చేయుట కోసం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీని స్థాపించారు. ఈ కంపెనీ జహంగీర్ చక్రవర్తి నుంచి అనుమతి తీసుకొని సూరత్ వద్ద గిడ్డంగులను స్థాపించింది. ఈ కంపెనీ ద్వారా భారతదేశంతో ఇంగ్లండ్ వ్యాపారం కొనసాగుతుండేది.

**ఆంగ్లేయుల మరియు ఫ్రెంచ్‌వారి పోరాటం :** భారతదేశంలోని వ్యాపార పోటీలో ఆంగ్లేయులు మరియు ఫ్రెంచ్‌వారు ఒకరికొకరు పోటీదారులుగా ఉండిరి. ఈ పోటీలో ఆంగ్లేయులు మరియు ఫ్రెంచ్‌వారి మధ్య మూడు యుద్ధాలు జరిగాయి. ఆ యుద్ధాలను 'కర్ణాటక యుద్ధాలు' అని అంటారు. మూడవ కర్ణాటక యుద్ధంలో ఆంగ్లేయులు ఫ్రెంచ్ వారిని ఘోరంగా ఓడించారు. దీని తరువాత బ్రిటిష్ ఈస్ట్ఇండియా కంపెనీకి భారతదేశంలో ప్రబలమైన యురోపీయ పోటీదారులు మిగులలేదు.

**బెంగాల్‌లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అధికార పునాది :** బెంగాల్ ప్రాంతం భారతదేశంలో అతి సమృద్ధి గల ప్రాంతంగా ఉండెను. క్రీ.శ. 1756 సంవత్సరంలో సిరాజ్ ఉద్దౌలా బెంగాల్‌కు నవాబు అయ్యాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు మొఘలు చక్రవర్తి నుంచి బెంగాలు ప్రాంతంలో పొందిన వ్యాపార సౌకర్యాన్ని దుర్వినియోగం చేసేవారు. ఆంగ్లేయులు నవాబు అనుమతి తీసుకోకుండా కోల్‌కతాలో తమ గిడ్డంగుల చుట్టూ ప్రహరీగోడ నిర్మించారు. అందువలన సిరాజ్ ఉద్దౌలా ఆంగ్లేయులపై దాడిచేసి కోల్‌కతా గిడ్డంగులను జయించాడు. ఈ సంఘటనతో ఆంగ్లేయులలో అసంతృప్తి నెలకొన్నది. రాబర్ట్ క్లైవ్ రాజనీతిజ్ఞతతో నవాబు యొక్క సేనాధిపతి మీర్ జాఫర్‌కు నవాబు పదవిని ఎరగా

చూపి తన వైపుకు తిప్పుకొన్నాడు. క్రీ.శ. 1757లో ప్లాసీ వద్ద నవాబు సిరాజ్‌ఉద్దౌలా మరియు ఆంగ్లసైన్యాలు తలపడ్డాయి. కాని మీర్‌జాఫర్ నాయకత్వంలోని నవాబుయొక్క సైన్యం యుద్ధంలో దిగకపోవడం వలన సిరాజ్ ఉద్దౌలా ఓడిపోయాడు.

ఆంగ్లేయుల మద్ధతుతో మీర్ జాఫర్ బెంగాల్ నవాబు అయ్యాడు. తర్వాత అతడు వ్యతిరేకించిన వెంటనే అతని అల్లుడైన మీర్ కాసింను అతడు నవాబు చేశాడు. మీర్ కాసిం ఆంగ్లేయుల చట్టవిరుద్ధమైన వ్యాపారాన్ని నిలిపివేసే ప్రయత్నం చేయుటతో అతడు మళ్ళీ మీర్ జాఫర్‌ను నవాబు చేశాడు.

బెంగాల్‌లోని ఆంగ్లేయుల కార్యకలాపాలకు కళ్ళెం వేయుటకు మీర్ కాసిం అయోధ్య నవాబు షుజాఉద్దౌలా మరియు మొఘలు చక్రవర్తి శాహ ఆలంలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా కలిసికట్టుగా దండయాత్ర చేశారు. క్రీ.శ. 1764లో బీహార్‌లోని బక్సార్ వద్ద యుద్ధం జరిగింది. అందులో ఆంగ్లేయులు విజయం సాధించారు. ఈ యుద్ధం తరువాత అలహాబాదు ఒడంబడిక ప్రకారం బెంగాల్ సుభాలో రెవెన్యూ అనగా పన్ను సేకరించే అధికారం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి లభించింది. ఈ విధంగా భారతదేశంలో ఆంగ్లేయ అధికార పునాది బెంగాల్‌లో వేయబడింది.

**ఆంగ్లేయులు మైసూర్ పోరాటం :** మైసూరు రాజ్యంలో హైదర్‌అలీ తిరుగుబాటు చేసి మైసూరు రాజ్యాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. హైదర్‌అలీ మరణానంతం అతని కుమారుడు టిప్పు సుల్తాన్ మైసూరు రాజ్యాధికారం చేపట్టాడు. అతడు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాటం చేశాడు. చివరకు 1799లో శ్రీరంగపట్టణం వద్ద జరిగిన యుద్ధంలో టిప్పుసుల్తాన్ మరణించాడు. ఈ విధంగా మైసూరు ప్రాంతంపై ఆంగ్లేయుల అధికారం ఏర్పడింది.


టిప్పుసుల్తాన్

**సింధుప్రాంతం ఆంగ్లేయుల స్వాధీనం :** భారతదేశంలో తమ అధికారం సురక్షితం చేసుకోవడానికి ఆంగ్లేయులు వాయవ్య సరిహద్దు వైపు తిరిగారు. రష్యా భారతదేశంపై ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఆక్రమణ చేయగలదనే భయం వారికి ఉండెను. కాబట్టి ఆంగ్లేయులు ఆఫ్ఘనిస్తాన్‌పై తమ అధికారాన్ని నెలకొల్పాలని నిర్ణయించారు. ఆఫ్ఘనిస్తాన్‌వైపు వెళ్ళే మార్గం సింధు ప్రాంతం నుంచి పోతుంది. అందువలన సింధు యొక్క ప్రాముఖ్యత ఆంగ్లేయుల దృష్టికి వచ్చింది. 1843 సంవత్సరంలో వారు సింధును ఆక్రమించుకొన్నారు.

**సిక్కుల అధికార క్షీణత :** పంతొమ్మిదవ శతాబ్ద ప్రారంభ కాలంలో పంజాబ్ అధికారం రంజిత్‌సింగ్ చేతుల్లో ఉండెను. రంజిత్‌సింగ్ మరణానంతరం బాల్యదశలో నున్న అతని కుమారుడు దిలీప్‌సింగ్ సింహాసనాన్ని అధిష్టించాడు. అతని పక్షాన అతని తల్లి రాణి జిందన్ సర్ధారుల సహాయముతో రాజ్యపాలన చేయసాగింది. కాని సర్ధారులపై ఆమె అదుపు కోల్పోయింది. ఈ అవకాశాన్ని అదునుగా చేసుకొని వంచించారు. ఆంగ్లేయులు కొందరు సిక్కు సర్దారులను రాజద్రోహులను చేసింది. ఆంగ్లేయులు పంజాబ్‌పై దండయాత్ర చేయగలరని సిక్కులు అర్థం చేసుకోవడంతో వారు ఆంగ్లేయులపై దండయాత్ర చేశారు. ఈ మొదటి సిక్కు ఆంగ్ల యుద్ధంలో సిక్కులు ఓడిపోయారు. దిలీప్‌సింగ్‌ను ఆంగ్లేయులు సింహాసనంపై సుస్థిరంగా ఉంచారు. పంజాబ్‌పై పెరుగుతున్న ఆంగ్లేయుల అధికారం కొందరు స్వాతంత్ర్య ప్రియులైన సిక్కులకు సమ్మతం కాలేదు. ముల్తాన్ అధికారి మౌల్‌రాజ్ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు. వేలమంది సిక్కు సైనికులు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొన్నారు. ఈ రెండో యుద్ధంలో కూడా సిక్కులు పరాజయం పాలయ్యారు. 1849లో ఆంగ్లేయులు పంజాబ్ ప్రాంతాన్ని తమ రాజ్యంలో కలుపుకొన్నారు.


రంజిత్‌సింగ్

మరాఠీయుల అధికారం భారతదేశంలో ముఖ్యమైన మరియు బలోపేతమైన అధికారంగా ఉండెను. మరాఠీయులను ఓడించి ఆంగ్లేయులు భారతదేశంలో తమ అధికార పునాదిని ఎలా దృఢతరం చేసుకొన్నారో దాని గురించి మనం రాబోవు పాఠంలో అధ్యయనం చేయనున్నాం.

## అభ్యాసం

1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.

(1) క్రీ.శ. 1453లో అట్టోమన్ తురుష్కులు ................ పట్టణాన్ని జయించారు.

(అ) వెనిస్ (బ) కన్స్టాంటినోపల్

(క) రోమ్ (డ) ప్యారిస్

(2) పారిశ్రామిక విప్లవం ................లో ప్రారంభమైనది.

(అ) ఇంగ్లండ్ (బ) ఫ్రాన్స్

(క) ఇటలీ (డ) పోర్చుగీస్

(3) ఆంగ్లేయుల చట్టవ్యతిరేక వ్యాపారాన్ని నిలిపివేయుటకు ................. ప్రయత్నించాడు.

(అ) సిరాజ్ ఉద్దౌలా (బ) మీర్ కాసిమ్

(క) మీర్ జాఫర్ (డ) శాహ ఆలమ్

2. కింది భావనలను స్పష్టీకరించండి.

(1) వలస వాదం (2) సామ్రాజ్యవాదం

(3) పునరుజ్జీవన యుగం (4) పెట్టుబడిదారీ విధానం

3. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టం చేయండి.

(1) ప్లాసీ యుద్ధంలో సిరాజ్ ఉద్దౌలా ఓడిపోయాడు.

(2) యురోపీయ దేశాలకు ఆసియావైపు వెళ్ళే నూతన మార్గం కనుగొనే అవసరం కలిగింది.

(3) యురోప్‌లోని రాజులు వ్యాపార కంపెనీలకు సైనిక సంరక్షణ, వ్యాపార సౌకర్యాలు ఇవ్వసాగారు.

4. పాఠం సహాయంతో కింది పట్టిక పూరించండి.

| విద్యార్థులు | పనులు |
|---|---|
| .......................... | ఆఫ్రికాఖండ దక్షిణ అగ్రం వరకు చేరుకొన్నాడు. |
| క్రిస్టోఫర్ కొలంబస్ | ............................ ............................ |
| .......................... | భారతదేశ పశ్చిమ తీరంలో కాలికట్ ఓడరేవుకు చేరుకొన్నాడు. |

**ఉపక్రమం**

పునరుజ్జీవన కాలంలోని ప్రసిద్ధ చిత్రకారులు, సాహిత్యకారులు, శాస్త్రజ్ఞుల పనులగురించి సందర్భ గ్రంథాలు, అంతర్జాలం సహాయంతో సమాచారం, చిత్రాలు సేకరించి తరగతిలో ప్రకల్పాన్ని (ప్రాజెక్టు) సమర్పించండి.

BDDXK1

# 3. బ్రిటిష్ అధికారం యొక్క పరిణామం

ఈ పాఠంలో మనం ఆంగ్లేయ అధికారం భారతదేశంపై చూపిన పరిణామం గురించి నేర్చుకొందాం.

**బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపన :** భౌగోళిక పరిశోధనల వలన యురోపియన్ అధికారాలు భారతదేశ సముద్ర తీరానికి ఎలా చేరుకొన్నాయో మనం తెలుసుకొన్నాం. పోర్చుగీసు, డచ్, ఫ్రెంచ్, బ్రిటిష్ వంటి యురోపియులందరు భారతదేశ వర్తకకేంద్రాలను ఆక్రమించుకోవలెనని అధికార పోటీలోకి దిగారు. ఆంగ్లేయులు భారతదేశానికి వ్యాపార నిమిత్తం వచ్చారు. అప్పుడు భారతదేశంలో వారికంటే ముందే ఉన్న పోర్చుగీసు వారితో తీవ్ర వ్యతిరకత ఏర్పడింది. తరువాత కాలంలో ఆంగ్లేయ పోర్చుగీసు సంబంధాలు స్నేహరూపం దాల్చడంతో వ్యతిరేకత తగ్గింది. కాని భారతదేశంపై అధికారం స్థాపించాలనే పోటీలో ఆంగ్లేయులకు ఫ్రెంచ్, డచ్ మరియు స్థానిక రాజుల వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది.

**ఆంగ్లేయులు మరియు మరాఠీయులు :** ఆంగ్లేయులకు పశ్చిమ భారతదేశంలోని ముంబయి ఒక ముఖ్య కేంద్రంగా ఉండెను. దాని సమీపంలోని ప్రాంతాన్ని ఆక్రమించుకొనే ప్రయత్నం వారు చేయుచుండిరి. కాని ఆ ప్రాంతంపై మరాఠీయులకు మంచి పట్టు ఉండెను. మాధవరావు పేశ్వా మరణానంతరం అతని దాయాది రఘునాథరావు పేశ్వా పదవిని ఆశించి ఆంగ్లేయుల సహాయం కోరాడు. అందువలన మరాఠీయుల రాజకీయంలో ఆంగ్లేయులు ప్రవేశించారు.

1774 నుంచి 1818 కాలంలో మరాఠీయులు మరియు ఆంగ్లేయుల మధ్య మూడు యుద్ధాలు జరిగాయి. మొదటి యుద్ధంలో మరాఠీ సర్దారులు ఐకమత్యంతో ఆంగ్లేయులను ఎదుర్కొన్నారు. అందువలన మరాఠీయులు విజయం సాధించారు. 1782 సంవత్సరంలో సాల్‌బాయి ఒప్పందం జరగడంతో మొదటి ఆంగ్లేయమరాఠా యుద్ధం ముగిసింది.

**సైనిక మోహరింపు :** 1798లో లార్డ్‌వెల్లెస్లీ గవర్నర్ జనరల్‌గా భారతదేశానికి వచ్చాడు. భారతదేశమంతటా ఆంగ్లేయుల అధికారం నెలకొల్పడం అతని ముఖ్యోద్దేశము. అందుకోసం అతడు భారతీయ రాజులతో సైనిక మోహరింపు ఒప్పందం చేసుకొన్నాడు. ఈ ఒప్పందం ప్రకారం భారతదేశ రాజులకు ఆంగ్లేయుల సైనిక సహాయ వాగ్దానం ఇవ్వబడింది. కాని అందుకోసం కొన్ని షరతులు విధించాడు. భారతీయ రాజులు వారి రాజ్యంలో ఆంగ్లేయుల సైన్యం ఉంచుకొనవలెను. ఆ సైన్యం ఖర్చుల కొరకు నగదు రొక్కం లేక దానికి సరిపడు ఉత్పాదక ప్రాంతం కంపెనీకి ఇవ్వవలెను. వారు ఆంగ్లేయుల మధ్యవర్తిత్వంతోనే ఇతర రాజులతో సంబంధాలు పెట్టుకొనవలెను, తమ ఆస్థానంలో ఆంగ్లేయ స్థానిక ప్రతినిధిని ఉంచవలెనను షరతులు విధించెను. భారతదేశంలోని కొందరు రాజులు ఈ పద్ధతిని స్వీకరించి తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు.

1802లో రెండవ బాజీరావు పేశ్వా ఆంగ్లేయులతో సైనిక మోహరింపు ఒప్పందం చేసుకొన్నాడు. ఈ ఒప్పందం వసయి ఒడంబడికగా ప్రసిద్ధి చెందింది. కాని ఈ ఒడంబడికను కొందరు మరాఠీ సర్దారులు అంగీకరించలేదు. అందువల్ల రెండవ ఆంగ్లమరాఠా యుద్ధం జరిగింది. అందులో ఆంగ్లేయులు విజయం పొందిన తరువాత మరాఠీ రాజ్యంలో వారి జోక్యం పెరుగసాగింది. అది సహించని రెండవ బాజీరావు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించాడు ఈ యుద్ధంలో అతడు పరాజయం పాలైనాడు. 1818లో అతడు శరణుజొచ్చాడు.

ఆ సమయంలో మొఘలుల రాజధాని దిల్లీ వాస్తవంగా దౌలత్‌రావు శిందే నియంత్రణలో ఉండెను. శిందే సైన్యాన్ని ఓడించి జనరల్ లేక్ అనునతడు మొఘలు చక్రవర్తిని స్వాధీన పరచుకొని భారతదేశాన్ని జయించాడు.


ఛత్రపతి ప్రతాప్ సింహ్

**ఛత్రపతి ప్రతాప్ సింహ్ :** పేశ్వాల అస్తమయం జరిగినప్పటికి సాతారాలో ఛత్రపతి ప్రతాప్‌సింహ్ సింహాసనంపై ఉండెను. ఆంగ్లేయులు ఛత్రపతి ప్రతాపసింహ్‌తో ఒడంబడిక చేసుకొని గ్రాండ్ డఫ్ అను అధికారిని ప్రతాప సింహ్ రాజ్య పరిపాలనలో సహాయం చేయుటకొరకు నియమించారు. కాని తరువాత అతనిని సింహాసనం నుంచి దించి కాశీలో ఉంచడం జరిగింది. అక్కడే 1847లో అతడు మరణించాడు.

ఛత్రపతి ప్రతాపసింహ్ అధికారి రంగో బాపూజీ గుప్తే ఇంగ్లండ్ వరకు వెళ్ళి ఈ అన్యాయానికి వ్యతిరేకంగా న్యాయం కోరే ప్రయత్నం చేశాడు. కాని న్యాయంకోసం చేసిన అతని ప్రయత్నాలు విఫలమయ్యాయి. తరువాత లార్డ్ డల్హౌసీ దత్తత

విధానాన్ని సమ్మతించక 1848లో సాతారా రాజ్యాన్ని ఆక్రమించాడు.



**మీకు తెలుసా ?**

ఛత్రపతి ప్రతాపసింహ్ సాతారా పట్టణంలో యెవలేశ్వర్ దేవాలయం వెనుకవైపు, మహాదరా వద్ద చెరువు నిర్మించి దాని నీటిని పట్టణంలో సరఫరా చేశాడు. పట్టణంలో రోడ్లు నిర్మించాడు. రోడ్లకు ఇరుప్రక్కల చెట్లు నాటించాడు. బాలబాలికలకు సంస్కృతం, మరాఠీ, ఆంగ్లం నేర్పించుటకు పాఠశాలలు నిర్మించాడు. అక్కడ ఒక ముద్రణాలయం నిర్మించి అనేక ఉపయుక్తమైన గ్రంథాలను ముద్రించాడు. 1827 సంవత్సరంలో రాజనీతికి సంబంధించిన 'సభానీతి' అనుగ్రంథాన్ని రచించి ముద్రించాడు. అతడు సాతారా మొదలుగా మహాబళేశ్వర్ నుంచి ప్రతాపగడ్ వరకు రోడ్డు నిర్మించాడు. ఆ రోడ్డునే తరువాత మహాడ్ వరకు తీసుకురావడం జరిగింది. ఛత్రపతి ప్రతాప్‌సింహ్ ప్రతిరోజు దినచర్య స్వయంగా రాసేవాడు.

## భారతదేశంపై బ్రిటిష్ అధికారం యొక్క పరిణామం

**ద్వంద్వ రాజ్య వ్యవస్థ :** రాబర్ట్‌క్లైవ్ 1765 సంవత్సరంలో బెంగాల్‌లో ద్వంద్వ రాజ్యవ్యవస్థను మనుగడలోకి తెచ్చాడు. పన్ను వసూలు చేయు పనిని కంపెనీ స్వీకరించింది. శాంతి, సువ్యవస్థలను చూసుకొనే పనిని బెంగాల్ నవాబుకు అప్పగించాడు. దీనినే 'ద్వంద్వ రాజ్య వ్యవస్థ' అని అంటారు.

ద్వంద్వ రాజ్యవ్యవస్థ దుష్పరిణామాలు కాలక్రమంలో కానవచ్చాయి. సామాన్య ప్రజల నుంచి పన్ను రూపంలో సేకరించిన సొమ్మును కంపెనీలోని అధికారులు సొంత జేబులో వేసుకొన్నారు. భారతదేశంలోని వ్యాపార గుత్తాధిపత్యం కేవలం ఈస్ట్ ఇండియా కంపెనీకి ఇవ్వడం వలన ఇంగ్లం డ్‌లోని అనేక వ్యాపారులకు కంపెనీపై ఈర్ష్య కలుగుతుం డేది. భారతదేశంలోని కంపెనీ పరిపాలనపై ఇంగ్లండ్‌లో విమర్శలు వచ్చుచుండెను. అప్పుడు కంపెనీ పరిపాలనను నియంత్రించుటకు ఇంగ్లండ్ పార్లమెంట్ కొన్ని ముఖ్యమైన చట్టాలు చేసింది.

**పార్లమెంట్ చేసిన చట్టాలు :** 1773 రెగ్యులేటింగ్ ఆక్ట్ ప్రకారం బెంగాల్ గవర్నర్‌కు 'గవర్నర్ జనరల్' అను హోదాను ఇవ్వడం జరిగింది. ఈ ఆక్ట్ (చట్టం) ప్రకారం లార్డ్ వారన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్ అయ్యాడు. ముంబయి, మద్రాసు ప్రాంతాల ధోరణులను నియంత్రించు అధికారం అతనికి లభించింది. అతనికి సహాయంగా నలుగురు సభ్యులు గల సమితి నియమించబడింది.

1784లో భారతదేశానికి సంబంధించిన పిట్ చట్టం మంజూరు అయింది. భారతదేశంలో కంపెనీ పరిపాలనపై పార్లమెంట్ నియంత్రణ కలిగియుండుటకు ఒక శాశ్వత నియామక మండలి స్థాపించబడింది. కంపెనీకి భారతదేశంలో పరిపాలనకు సంబంధించిన ఆదేశాలను ఇచ్చే అధికారం ఈ మండలికి ఇవ్వబడింది. 1813, 1833, 1853లో కంపెనీ పరిపాలనలో మార్పులు చేసే చట్టాన్ని పార్లమెంట్ చేసింది. ఈ విధంగా పరిపాలనపై బ్రిటిష్ ప్రభుత్వం యొక్క పరోక్ష నియంత్రణ అమలులోకి వచ్చింది.

ఆంగ్లేయ అధికార ఆగమనం వెనువెంట నూతన పరిపాలనా పద్ధతి భారతదేశంలో ఆచరణలోకి వచ్చింది. స్థానిక ఉద్యోగిస్వామ్యం, సైన్యం, పోలీసు దళం, న్యాయవ్యవస్థ భారతదేశంలోని ఆంగ్లేయుల పరిపాలన యొక్క ప్రముఖ ఆధారస్తంభాలు.

**స్థానిక ఉద్యోగిస్వామ్యం :** భారతదేశంలో ఆంగ్లేయుల అధికారం దృఢపరచడానికి ఆంగ్లేయులకు ఉద్యోగిస్వామ్యం అవసరమైనది. లార్డ్‌కార్న్‌వాలిస్ ఉద్యోగిస్వామ్యాన్ని ఏర్పాటు చేశాడు. స్థానిక ఉద్యోగిస్వామ్యం ఆంగ్ల ప్రభుత్వపు ముఖ్యాంగం అయినది. కంపెనీ అధికారులు ప్రైవేటు వ్యాపారం చేయడకూడదనే నియమం విధించాడు. అందుకోసం అతడు అధికారుల జీతాలు పెంచాడు.

పరిపాలనా సౌలభ్యం కోసం అతడు ఆంగ్లేయుల ఆధీనంలోని ప్రాంతాలను జిల్లాలవారీగా విభజించాడు. జిల్లాధికారి జిల్లా పరిపాలనకు ప్రముఖుడు. పన్నులు వసూలు చేయడం, న్యాయం కల్పించడం, శాంతి, సువ్యవస్థ నెలకొల్పడం అతని బాధ్యతలుగా ఉండేవి. అధికారుల నియామకం ఇండియన్ సివిల్ సర్వీసెస్ (అయ్.సీ.ఎస్) అను పోటీపరీక్ష ద్వారా జరుగసాగింది.

**సైన్యం మరియు పోలీసు దళం :** భారతదేశంలో ఆంగ్లేయుల ఆధీనంలో ఉన్న ప్రాంతాల రక్షణ, కొత్త ప్రాంతాలను హస్తగతం చేసుకొనుట, భారతదేశంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా చేయబడే తిరుగుబాట్లను అణచి వేయుట వంటివి సైన్యం యొక్క పనులుగా ఉండేవి. దేశంలో చట్టం, సువ్యవస్థను చూచుకొనే పని పోలీసు దళానిది.

**న్యాయవ్యవస్థ :** ఇంగ్లండ్‌లోని న్యాయవ్యవస్థ ఆధారంగా ఆంగ్లేయులు భారతదేశంలో నూతన న్యాయవ్యవస్థను స్థాపించారు. ప్రతిజిల్లాలో పౌరవివాదాల కొరకు దివానీ న్యాయస్థానం, నేరసంబంధ వివాదాల కొరకు ఫౌజ్‌దారీ (క్రిమినల్) న్యాయస్థానాలను స్థాపించారు. వాటి తీర్పులను పునర్విచారించుటకు ఉన్నత న్యాయస్థానాలను స్థాపించారు.

**చట్టంముందు సమానత్వం :** భారతదేశంలో పూర్వం అక్కక్కడ వేరు వేరు చట్టాలు ఉండెను. న్యాయం అందించడంలో జాతులననుసరించి భేదభావం చూపబడేది. లార్డ్‌మెకాలే నాయకత్వంలో స్థాపించబడిన చట్టసమితి చట్టం యొక్క నియమావళి తయారు చేసింది. భారత దేశమంతట ఒకే చట్టాన్ని అమలు చేసింది. చట్టం ముందు అందరు సమానమే అను సిద్ధాంతాన్ని ఆంగ్లేయులు అమలు చేశారు.

ఈ పద్ధతిలో కూడా కొన్ని దోషాలు ఉండెను. యురోపీయ ప్రజల వివాదాలపై న్యాయవిచారణ కొనసాగించుటకు స్వతంత్ర న్యాయస్థానాలు, వేరుగా చట్టం అమలులో ఉండెను. కొత్త చట్టాలు ప్రజలకు అర్థం అయ్యేవికావు. న్యాయాన్ని పొందడం సామాన్యప్రజలకు చాలా ఖర్చుతోకూడిన అంశం అయింది. వివాదాలు సంవత్సరాల తరబడి కొనసాగేవి.

**ఆంగ్లేయుల ఆర్థిక ధోరణులు :** ప్రాచీన కాలం నుంచి భారతదేశంపై ఆక్రమణలు జరుగుచుండెను. అనేక ఆక్రమణదారులు భారతదేశంలో స్థానికులైనారు. వారు భారతీయ సంస్కృతిలో కలిసిపోయారు. వారు ఇక్కడ పరిపాలన చేసినప్పటికి భారతదేశ ఆర్థికవ్యవస్థలో మౌలిక మార్పులు చేయలేదు. కానీ ఆంగ్లేయులు మాత్రం అనేకమైన మార్పులు చేసారు.

ఇంగ్లండ్ ఆధునికదేశం. పారిశ్రామిక విప్లవం వలన అక్కడ పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ ఆచరణలో ఉండెను. ఈ వ్యవస్థకు పరిపోషక ఆర్థిక వ్యవస్థను వారు భారతదేశంలో అమలు చేశారు. అందువలన ఇంగ్లండ్‌కు ఆర్థిక లాభం జరిగింది. కాని భారతీయులకు మాత్రం ఆర్థిక పీడనజరుగసాగింది.

**భూమిశిస్తుకు సంబంధించిన ధోరణి :** ఆంగ్లేయుల అధికారం ప్రారంభం కాకముందు గ్రామాలలోని ఆర్థిక వ్యవస్థ స్వయం సమృద్ధిగా ఉండెను. వ్యవసాయం, ఇతర పరిశ్రమల ద్వారా గ్రామ అవసరాలు గ్రామంలోనే తీర్చబడేవి. భూమిశిస్తు రాజ్యానికి ఆదాయాన్నిచ్చే ముఖ్యసాధనంగా ఉండెను. ఆంగ్లేయులకు పూర్వం పంటననుసరించి భూమిశిస్తు నిర్ణయింపబడేది. పంట బాగుగా పండకపోతే భూమిశిస్తులో మినహాయింపు లభించేది. పన్ను ముఖ్యంగా ధాన్యరూపంలో తీసుకోబడేది. భూమిశిస్తు చెల్లించడంలో ఆలస్యం అయినప్పటికి రైతుల భూములను స్వాధీనం (జప్తు) చేసుకొనేవారు కాదు.

ఆదాయం పెంచుకొనుటకు ఆంగ్లేయులు శిస్తు పద్ధతిలో ముఖ్యమైన మార్పులు చేశారు. ఆంగ్లేయులు భూమిని కొలిచి భూక్షేత్రం ప్రకారం భూమిశిస్తును నిర్ణయించారు. నగదు రూపంలో, నిర్ధారిత సమయములో భూమిశిస్తు చెల్లించాలనే నిర్బంధం విధించారు. భూమిశిస్తు సకాలంలో చెల్లించని యెడల రైతుల భూమిని జప్తు చేయబడుననే నియమం తయారుచేశారు. భూమిశిస్తును వసూలుచేయు ఆంగ్లేయుల పద్ధతి భారతదేశంలోని వేరు వేరు ప్రాంతాలలో వేరువేరుగా ఉండెను. అంతటా రైతుల పీడనం జరుగుతుండేది.

**నూతన భూమిశిస్తు వ్యవస్థ పరిణామం :** నూతన భూమిశిస్తు వ్యవస్థ వలన గ్రామీణ జీవనంపై బాధాకర పరిణామం జరిగింది. భూమిశిస్తు చెల్లించుకొనుట కొరకు వచ్చిన ధరకే రైతులు పంటను అమ్ముకొనసాగారు. వ్యాపారులు, దళారీలు గిట్టుబాటు ధరకన్నా తక్కువ ధరకు వారి పంటను ఖరీదు చేయసాగారు. వేళకు భూమి శిస్తు చెల్లించుటకోసం వడ్డీవ్యాపారుల వద్ద భూమిని తాకట్టుపెట్టి అప్పు చేయవలసివచ్చేది. అందువలన రైతులు అప్పుల పాలయ్యారు. అప్పులు చెల్లించని పక్షంలో వారికి తమ భూములను అమ్ముకోవలసి వచ్చేది. ప్రభుత్వం, జమీందార్లు, సాహుకార్లు, వ్యాపారులందరు రైతులను పీడించేవారు.

**వ్యవసాయ వాణిజ్యీకరణ :** పూర్వం రైతులు ముఖ్యంగా ఆహారధాన్యాలను పండించేవారు. ఈ ఆహారధాన్యాలు వారికి ఇంటి అవసరాలు, గ్రామ అవసరాలను తీర్చుడం కోసం ఉపయోగించవలసి వచ్చేది. ప్రత్తి, నీలి, పొగాకు, తేయాకు మొదలగు వాణిజ్య పంటలకు ఆంగ్ల ప్రభుత్వం ప్రోత్సాహం అందించసాగింది. ఆహారధాన్యాల కంటె లాభాలనిచ్చే వాణిజ్య పంటలు

పండించడానికి ప్రాధాన్యత ఇచ్చే ఈ ప్రక్రియను వ్యవసాయ వాణిజ్యీకరణ అని అంటారు.

**కరువు :** 1860 నుంచి 1900 కాలంలో భారతదేశంలో పెద్ద కరువు వచ్చింది. అయినను ఆంగ్ల పరిపాలకులు కరువు నివారణ కొరకు తగినన్ని ప్రయత్నాలు చేయకుండిరి. అదేవిధంగా నీటి సరఫరా ప్రణాళికలకై అంతగా ఖర్చు చేయకుండిరి.

**రవాణా మరియు సమాచార వ్యవస్థలో సంస్కరణలు :** ఆంగ్లేయులు వ్యాపారవృద్ధి, పరిపాలనా సౌలభ్యం కొరకు భారతదేశంలో రవాణా, సమాచారాల ఆధునిక సౌకర్యాలను నిర్మించారు. కోల్‌కతా, ఢిల్లీలను కలిపే జాతీయ రహదారిని వారు నిర్మించారు. 1853 సంవత్సరంలో ముంబయి థాణె రైల్వేమార్గంపై రైలుబండి నడువసాగింది. అదే సంవత్సరంలో తంతి వ్యవస్థ ద్వారా సందేశం పంపే యంత్రాలను ఆంగ్లేయులు భారతదేశంలో ప్రారంభించారు. వీటిద్వారా భారతదేశంలోని ప్రముఖ పట్టణాలు, సైనిక స్థావరాలు ఒకదానితో ఒకటి కలుపబడ్డాయి. అదేవిధంగా ఆంగ్లేయులు తపాలా వ్యవస్థను కూడా ప్రారంభించారు.



ముంబయి థాణె రైల్వే (1853)

ఈ సంస్కరణలన్నింటి వలన భారతీయ సమాజ జీవనంపై దీర్ఘకాలిక పరిణామం జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల పరస్పర సంప్రదింపులు పెరిగాయి. అందువలన వారిలో ఐకమత్యభావన వృద్ధి చెందుటకు దోహదపడింది.

**భారతదేశంలోని పురాతన పరిశ్రమల క్షీణత :** భారతదేశం నుంచి ఇంగ్లండ్‌కు వెళ్ళే సరుకులపై ఆంగ్ల ప్రభుత్వం బలవంతంగా పన్ను విధించేది. దానికి వ్యతిరేకంగా ఇంగ్లండ్ నుంచి భారతదేశానికి వచ్చే వస్తువులపై చాలా తక్కువ పన్ను విధించేది. అదేవిధంగా ఇంగ్లండ్ నుంచి వచ్చే వస్తువులు యంత్రాలపై తయారుచేయబడేవి. అందువలన వారి ఉత్పత్తులు పెద్ద యెత్తున, తక్కువ ఖర్చుతో తయారయ్యేవి. అటువంటి చౌక వస్తువులతో పోటీ పడటం భారతీయ కార్మికులకు కష్టతరమైంది. ఫలితంగా భారతదేశంలోని సంప్రదాయ పరిశ్రమలు మూతపడినవి. ఎందరో కార్మికులు నిరుద్యోగులైనారు.

**భారతదేశంలో నూతన పరిశ్రమల అభివృద్ధి :** ఆంగ్ల ప్రభుత్వ మద్దతు, నిర్వహణ అనుభవం, పెట్టుబడి మొదలగు అంశాల ఆభావం వలన భారతీయ పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో ముందుకు రాలేకపోయారు. కాని అటువంటి అడ్డంకులను అధిగమిస్తూ కొందరు భారతీయులు పరిశ్రమలను నెలకొల్పారు.

1854లో కావస్‌జీ నానాభాయ్ దావర్ ముంబయిలో మొదటి వస్త్ర పరిశ్రమ ప్రారంభించాడు. 1855లో బెంగాల్‌లోని రిశ్రా వద్ద మొదటి జనుపనార పరిశ్రమ ప్రారంభమైనది. 1907 సంవత్సరంలో జంశేద్‌జీ టాటా జంశేద్‌పూర్ వద్ద టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ పేరుతో ఉక్కు తయారుచేసే పరిశ్రమను జంశేద్‌జీ టాటా స్థాపించాడు.



జంశేద్‌జీ టాటా

భారతదేశంలో బొగ్గు, లోహం, చక్కెర, సిమెంట్, రసాయనిక పదార్థాల పరిశ్రమలు కూడా ప్రారంభమైనవి.

**సామాజిక, సాంస్కృతిక పరిణామం :** పంతొమ్మిదవ శతాబ్దంలో యూరోప్‌లో మానవతావాదం, హేతువాదం, ప్రజాస్వామ్యం, జాతీయవాదం, ఉదారవాదం అను విలువలపై ఆధారపడిన నూతన యుగం వెలిసింది. పాశ్చాత్య ప్రపంచం లోని ఈ పరివర్తన భారతదేశంలో కూడా వేళ్ళూనుకోవడం స్వాభావికమయింది. ఆంగ్లేయులు పరిపాలన సాగించుటకు భారతదేశంలోని సమాజాన్ని పరిచయం చేసుకోవలసి వచ్చింది. అందుకోసం వారు ఇక్కడి సంప్రదాయం, చరిత్ర, సాహిత్యం, కళలు అదేవిధంగా ఇక్కడి సంగీతం, జంతువులు, పక్షులను కూడా అధ్యయనం చేయుట ప్రారంభించారు.

1784 సంవత్సరంలో విలియం జోన్స్ అను ఆంగ్ల అధికారి కోల్‌కతా వద్ద 'ఏసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్' అను సంస్థను స్థాపించాడు. మాక్స్ ముల్లర్ అను జర్మన్ మేధావి భారతీయ మతం, భాష, చరిత్రలను లోతుగా అధ్యయనం చేశాడు. ఈ ఉదాహరణల వలన మనం కూడా మన మతం, చరిత్ర, సంప్రదాయాలను అధ్యయనం చేయాలనే తలంపు నూతనంగా విద్యావంతులైన భారతీయులలో కలుగసాగింది.

ఆంగ్లేయులు భారతదేశంలో అనేక చట్టాలు చేశారు. 1829లో లార్డ్ బెంటింక్ సతీసహగమన నిషేధ చట్టం చేశాడు. 1856లో లార్డ్ డల్‌హౌసీ వితంతు పునర్వివాహాలకు అనుమతినిచ్చే చట్టం చేశాడు. ఈ చట్టం సమాజ సంస్కరణకు పరిపూరకమైనది.

పరిపాలన నిర్వహించుట కొరకు బ్రిటీష్ వారికి ఆంగ్ల విద్యను నేర్చుకొన్న భారతీయుల అవసరం కలిగింది. లార్డ్ మెకాలే సిఫారసుల ప్రకారం 1835లో భారతదేశంలో ఆంగ్ల విద్యను ప్రారంభించడం జరిగింది. నూతన విద్య ద్వారా నూతన పాశ్చాత్య భావనలు, ఆధునిక సంస్కరణలు, విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానాలను భారతీయులకు పరిచయం చేయడం జరిగింది. 1857 సంవత్సరంలో కోల్‌కతా, ముంబయి, మద్రాసుల (చెన్నయి) వద్ద విశ్వవిద్యాలయాల స్థాపన జరిగింది. పాశ్చాత్య విద్యను అభ్యసించిన మధ్యతరగతి ప్రజలు భారతదేశంలోని సామాజిక పునరుజ్జీవన ఉద్యమానికి నాయకత్వం వహించారు.

## అభ్యాసం

1. **ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(1) పోర్చుగీసు, .................... ఫ్రెంచ్, బ్రిటీష్ వారు భారతదేశ వ్యాపార కేంద్రాలను ఆక్రమించుకొనే పోటీలో దిగారు.

(అ) ఆస్ట్రియన్ (బ) డచ్

(క) జర్మన్ (డ) స్వీడిశ్

(2) 1802లో ................. పేశ్వా ఆంగ్లేయులతో సైనిక మోహరింపు ఒప్పందం చేసుకొన్నాడు.

(అ) మొదటి బాజీరావు (బ) సవాయీ మాధవరావు

(క) పేశ్వే నానాసాహెబ్ (డ) రెండవ బాజీరావు

(3) జంశేద్‌జీ టాటా ................... వద్ద టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ పేరుతో ఉక్కు తయారీ కర్మాగారాన్ని స్థాపించాడు.

(అ) ముంబయి (బ) కోల్‌కతా

(క) జంశేద్‌పూర్ (డ) ఢిల్లీ

2. **కింది భావనలను స్పష్టీకరించండి.**

(1) స్థానిక ఉద్యోగిస్వామ్యం

(2) వ్యవసాయ వాణిజ్యీకరణ

(3) ఆంగ్లేయుల ఆర్థిక ధోరణులు

3. **కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

(1) భారతదేశంలోని రైతులు అప్పులపాలయ్యారు.

(2) భారతదేశంలోని పురాతన పరిశ్రమలు క్షీణించాయి.

4. **పాఠం సహాయంతో కింది పట్టికను పూర్తి చేయండి.**

| వ్యక్తులు | పనులు |
|---|---|
| లార్డ్ కార్న్‌వాలిస్ | ................................ |
| ................................ | సతీసహగమన నిషేధ చట్టం చేశాడు |
| లార్డ్ డల్‌హౌసీ | ......................... |
| ................................ | ఏసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్‌ను స్థాపించాడు. |

**ఉపక్రమం**

బ్రిటీష్‌వారు పరిపాలన, విద్య, రవాణా, సమాచార రంగాలలో చేసిన సంస్కరణల సమాచారాన్ని చిత్రాలతో తయారు చేయండి.

BDMTLN

# 4. 1857 స్వాతంత్ర్య పోరాటం

1857 సంవత్సరంలో ఆంగ్లేయుల అధికారాన్ని బయకంపితం చేసిన గొప్ప పోరాటం భారతదేశంలో జరిగింది. ఈ పోరాటం అకస్మాత్తుగా సంభవించ లేదు. అంతకుముందు కూడా భారతదేశంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయి. 1857 పోరాటం యొక్క విస్తరణ, దాని నేపథ్యంలోని భూమికను దృష్టిలోనుంచుకొని స్వాతంత్ర్యవీర్ సావర్కర్ తన పుస్తకం ద్వారా చేసిన ప్రతిపాదనయే '1857 స్వాతంత్ర్య సమరం'. ఈ పుస్తకం తరువాత అనేక విప్లవకారులకు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేయుటకు ప్రేరణనిచ్చింది.

**1857కు పూర్వం పోరాటాలు :** భారతదేశంలో ఏయే ప్రాంతాలలో ఆంగ్లేయుల అధికారం స్థాపించబడిందో అక్కడి ప్రజలకు ఆంగ్ల ప్రభుత్వ పరిపాలన యొక్క దుష్పరిణామాలను అనుభవించవలసి వచ్చింది. కంపెనీ అధికారంవలన అన్ని స్థాయిల్లో మన పీడన జరుగుతుందనే విషయం భారతీయుల మనసుల్లో మెదలసాగింది. ఈ అధికారానికి వ్యతిరేకంగా అసంతృప్తి కూడా పెరుగుతూ పోయింది.

**మీకు తెలుసా ?**

**పదాతిదళ తిరుగుబాటు :** ఒడిషాలో మధ్యయుగ కాలం నుంచి పదాతి దళ పద్ధతి మనుగడలో ఉండెను. అక్కడి వేరువేరు స్వతంత్రరాజుల వద్ద గల కాల్బల సైనికులను పదాతిదళం అని అంటారు. రాజులు ఈ పదాతిదళ సైనికులకు వ్యవసాయం చేసుకొనుటకు భూములను ఉచితంగా ఇచ్చేవారు. వాటిని దున్నుకొని వారు పొట్టబోసుకొనేవారు. దానికి బదులుగా యుద్ధ సమయంలో ఆసన్నమయిన వారు తమ రాజు పక్షాన యుద్ధంలో పోరాడాలనే నియమం ఉండెను.

క్రీ.శ. 1803లో ఆంగ్లేయులు ఒడిషాను జయించారు. ఆంగ్లేయులు పదాతిదళ సైనికులకు వంశపారంపర్యంగా సంక్రమించిన భూములను స్వాధీనం చేసుకొన్నారు. అందువలన సైనికులు కోపోద్రిక్తులైనారు. అదే విధంగా ఆంగ్లేయులు విధించిన పన్ను వలన ఉప్పు ధర పెరిగి సామాన్య ప్రజల జీవనం దుర్భరమైంది. దాని ఫలితంగా క్రీ.శ. 1817లో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పదాతిదళ సైనికులు సాయుధ తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటుకు బక్షీ జగన్‌బంధు విద్యాధర్ నేతృత్వం వహించారు.

రైతులు, సామాన్య ప్రజలు కంపెనీ ప్రభుత్వ కాలంలో కొల్లగొట్టబడ్డారు. అంతలోనే 1770లో బెంగాల్ ప్రాంతంలో పెద్ద కరువు సంభవించింది. ఆంగ్ల పరిపాలకులు ప్రజలతో ప్రవర్తించే తీరు మాత్రం ఉదాసీనంగా, సంవేదన రహితంగా ఉండెను. 1763 సంవత్సరం నుంచి 1857 మధ్యకాలంలో బెంగాల్‌లో మొదట సన్యాసులు, తరువాత ఫకీరుల నాయకత్వంలో రైతులు పోరాటం చేశారు. అటువంటి పోరాటాలు గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, దక్షిణ భారతదేశంలో కూడా జరిగాయి.



ఉమాజీ నాయిక్

ఉమాజీ నాయిక్ చేసిన పోరాటం కూడా ఇలా తీవ్రమైనదే. ఉమాజీ తన రామోశీ జాతి ప్రజలను, స్థానిక యువకులను సంఘటితం చేసి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు. అతడు ఒక బహిరంగ ప్రకటన వెలువరించి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేసి ఆంగ్ల అధికారాన్ని పారద్రోల వలెననే పిలుపునిచ్చాడు. పుణె, సాతారా, అహ్మద్‌నగర్, సోలాపూర్, నాశిక్, భోర్ మొదలగు ప్రాంతాలలో అతడు ఆంగ్లేయులను భయభ్రాంతులను చేశాడు. 1832లో కంపెనీ ప్రభుత్వం ఉమాజీ నాయిక్‌ను నిర్బంధించి పుణెలో ఉరి తీయడం జరిగింది.

భారతదేశంలోని ఆదిమవాసీ, వన్యప్రాంతపు షెడ్యూలు తెగలు కూడా ఆంగ్ల అధికారానికి సవాళ్ళు చేశాయి. ఈ తెగల ప్రజల జీవనోపాధి అడవిలోని సంపద మీద ఆధారపడింది. బ్రిటిష్‌వారు చట్టం చేసి వారి హక్కులను కాలరాశారు. ఫలితంగా బీహార్, ఛోటానాగ్‌పూర్ పరిసరాల లోని కోలమ్‌లు, ఒడిషాలోని గోండులు, బీహార్‌లోని సంథాళ్ ప్రజలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. మహారాష్ట్రలోని భిల్లులు, కోళీలు, రామోశీలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. కొల్హాపూర్ పరిసరాలలో గడ్కరీలు, కొంకణంలో ఫోండ్-సావంత్‌లు ఆంగ్ల అధికారాన్ని సవాలు చేశారు.

1857 సంవత్సరానికి పూర్వం దేశంలోని వివిధ ప్రాంతాల్లో కొందరు జమీందార్లు, రాజులు సర్దారులు కూడా పోరాటం చేశారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యంలో అనేకమంది భారతీయ సైనికులు ఉండిరి. కంపెనీ వారిపట్ల కపటభావంతో ప్రవర్తించేది. వారి జీతభత్యములు ఆంగ్ల సైనికులతో పోల్చితే చాలా తక్కువగా ఉండేవి. 1806 సంవత్సరంలో వెల్లోర్ 1824 సంవత్సరంలో బరాక్‌పూర్ తిరుగుబాట్లు ఉగ్రరూపాన్ని దాల్చాయి.

ఈ పోరాటాలన్ని ఆయా పరిసరాలలో జరిగాయి. అవి స్థానిక స్వరూపంగా ఉండంతో ఒంటరి పోరాటాలయినవి. ఆంగ్లేయులు బలప్రయోగం చేసి వాటిని అణచివేశారు. ప్రజల అసంతృప్తి అణచివేయబడింది. కాని అది రూపుమాపబడలేదు. ఈ దావానలం 1857 స్వాతంత్ర్య పోరాటంలో చెలరేగింది. బ్రిటిష్ కంపెనీ అధికారానికి వ్యతిరేకంగా అనేకచోట్ల పోరాటాలు కొనసాగాయి. మద్యం గోదాములకు నిప్పు పెట్టట ద్వారా విస్ఫోటనాలు జరిపే పరిస్థితి వచ్చింది. భారతదేశంలోని వివిధ వర్గాలలో పేరుకుపోయిన అసంతృప్తి ఈ పోరాటం రూపంలో బయటకు వచ్చింది. ఆ ఉద్రేకంతో అభూతపూర్వమైన సాయుధ పోరాటం జరిగింది.

**1857 పోరాటానికి కారణాలు :** ఆంగ్లేయులకు పూర్వ కాలంలో భారతదేశంలో అనేక రాజ్యాలు ఉండెను. వాటిలో మార్పులు జరిగినప్పటికి గ్రామాలు పూర్వం వలెనే కొనసాగినవి. కానీ ఆంగ్లేయులు మాత్రం అమలులో ఉన్న వ్యవస్థను మార్చి నూతన వ్యవస్థను ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. గ్రామాల మారుతున్న స్వరూపాన్ని చూసి ప్రజలు అంతరంగాల్లో అస్థిరత, అభద్రతాభావం ఏర్పడింది.

**ఆర్థిక కారణాలు :** ఆంగ్లేయులు ఆర్థిక ఆదాయం పెంచుటకొరకు నూతన శిస్తు పద్ధతి అమలులోనికి తెచ్చారు. రైతుల నుంచి బలవంతపు పన్ను వసూళ్లు చేయబడేవి. పర్యవసానంగా వ్యవసాయ వ్యవస్థ కుంటుబడింది. ఇంగ్లండ్ వర్తక కేంద్రాలలోని సరుకులను భారతదేశంలో అమ్మి లాభాన్ని గడించాలని బ్రిటిషు వారి ధోరణిగా ఉండెను. వారు ఇక్కడి స్థానిక పరిశ్రమలపై భరించరాని పన్ను విధించారు. భారతదేశంలో అభివృద్ధి చెందిన హస్తకళలు, వస్త్ర పరిశ్రమలు నష్టపోయినవి. అనేకమంది భారతీయ కార్మికులు నిరుద్యోగులయ్యారు. వీరందరి మనసుల్లో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా అసంతృప్తి పెరుగుతూ పోయింది.

**సామాజిక కారణాలు :** ఆంగ్లేయులు మన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లలో జోక్యం చేసుకొంటున్నారని భారతీయులు భావించసాగారు. సతీసహగమన నిషేధం, వితంతు వివాహ చట్టాలు సామాజిక దృష్ట్యా యోగ్యమైనప్పటికి మన జీవనవిధానంలో జోక్యం జేసుకొంటున్నారని భారతీయులు భావించారు. అందువలన వారు అసంతృప్తులైనారు.

**రాజకీయ కారణాలు :** 1757 నుంచి ఆంగ్లేయులు అనేక భారతీయ రాజ్యాలను స్వాధీనం చేసుకొన్నారు. తరువాత డల్‌హౌసీ అనేక సంస్థానాలను వివిధ కారణాలతో ఆక్రమించుకొన్నాడు. చట్ట వ్యతిరేక కారణాన్ని చూపి అయోధ్య నవాబును పదవీచ్యుతున్ని గావించాడు. సాతారా, నాగ్‌పూర్, ఝాన్సీ సంస్థానాలను అక్కడి రాజుల దత్తపుత్రుల వారసత్వ హక్కును రద్దు చేసి విలీనం చేశాడు. డల్‌హౌసీ యొక్క ఈ ధోరణి వలన భారతీయులలో అవిశ్వాస వాతావరణం పెరుగుతూపోయింది.

**హిందు సైనికుల అసంతృప్తి :** హిందూ సైనికులతో ఆంగ్ల అధికారులు నీచంగా ప్రవర్తించేవారు. సైన్యంలో సుభేదారు కంటె పెద్ద పదవులు వారికి ఇచ్చేవారు కాదు. తెల్ల సైనికులకంటె వారి జీతం తక్కువగా ఉండేది. వారికి ప్రారంభంలో ఇవ్వబడే భత్యం కూడా ఆంగ్లేయులు మెల్లమెల్లగా తగ్గించారు. ఇటువంటి అనేక కారణాల వలన హిందూ సైనికులలో అసంతృప్తి పెరుగుతూ పోయింది.

**తక్షణ కారణాలు :** బ్రిటిష్ వారు 1856 సంవత్సరంలో హిందు సైనికులకు పొడవాటి ఎన్‌ఫీల్డ్ తుపాకులు ఇచ్చారు. అందులోని తూటాలపై చుట్టబడిన తొడుగును దంతాలతో తొలగించవలసి వచ్చేది. ఈ తొడుగుకు ఆవు, పంది క్రొవ్వు పూయబడుతుందనే వార్త నలుదిశలా వ్యాపించింది. అందువలన హిందు, ముస్లిం సైనికుల మతభావనలు దెబ్బతినడంతో సైనికులలో అసంతృప్తి రాజుకొన్నది.

**దావానలం చెలరేగింది :** క్రొవ్వు పూయబడిన తూటాలను ఉపయోగించుటకు వ్యతిరేకించిన సైనికులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోబడినవి. ఆ సైనికులను తీవ్రంగా శిక్షించడం జరిగింది. బరాక్‌పూర్ స్థావరంలోని మంగల్



మంగళ్ పాండే

పాండే ఆంగ్ల అధికారుల అన్యాయ ప్రవర్తనకు వ్యతిరేక భావనతో బ్రిటిష్ అధికారిపై కాల్పులు జరిపాడు. మంగళ్ పాండేను నిర్బంధించి ఉరితీయడం జరిగింది. ఈ వార్త దావానలంలా నలువైపులా వ్యాపించింది. మీరట్ సైనిక స్థావరంలోని హిందు సైనిక దళం అంతా తిరుగుబాటు చేసింది. సైనికులు ఢిల్లీవైపు బయలుదేరారు. దారిలో వేలమంది పౌరులు అప్పటికప్పుడు వారితో కలిసి పోయారు. 12 మే 1857 రోజున సైనికులు ఢిల్లీని స్వాధీనం చేసుకొన్నారు. వారు మొఘల్ చక్రవర్తి బహాదూర్‌షాహకు పోరాట నాయకత్వాన్ని అప్పగించారు. భారతదేశ చక్రవర్తిగా అతని పేరు చాటింపు చేయబడింది.

**పోరాట విస్తరణ :** ఢిల్లీ స్వాధీనంలోకి రాగానే సైనికుల ఆత్మవిశ్వాసం పెరిగింది. భారతదేశంలో ఇతర ప్రాంతాలలో ఉన్న సైనికులకు దీనివలన ప్రేరణ లభించింది. త్వరలోనే తిరుగుబాటు విజయోత్సాహం ఉత్తర భారతంలో విస్తరించింది. బీహార్ నుంచి రాజపుతాన వరకు ఆంగ్లేయ సైనిక స్థావరాలలోని హిందూ సైనికులు తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. లక్నో, అలహాబాద్, కాన్‌పూర్, బనారస్, బరేలీ, ఝాన్సీ ప్రాంతాలలో తిరుగుబాటు మొదలైంది. తరువాత ఈ ఉత్సాహం దక్షిణ భారతదేశంలో కూడా విస్తరించింది. నాగపూర్, సాతారా, కొల్హాపూర్, నరగుంద్ వంటి ప్రాంతాల్లో తిరుగుబాటు జరిగింది. సాతారాలోని ఛత్రపతి వారసుడు శహాజీ ప్రతాప్ సింహ్, సేవాధికారి రంగో బాపూజీ, కొల్హాపూర్ చిమాసాహెబ్, నరగుంద్‌లోని బాబా సాహెబ్ భావె, అహ్మద్‌నగర్ జిల్లాలో సంగంనేర్ సమీపంలోని భాగోజీ నాయిక్ మొదలగువారు ఈ పోరాటంలో ముందున్నారు. నాశిక్ జిల్లాలోని పేఠ్, సురగాణా రాణి వంటి స్త్రీలు కూడా అందులో భాగస్వాములైనారు. 1857 సంవత్సరంలో ఖాందేశ్‌లో కజార్‌సింగ్ నాయకత్వంలో భిల్లులు తిరుగుబాటు చేశారు. సాత్పురా పరిసరాలలో శంకర్ శాహ పోరాటానికి నేతృత్వం వహించాడు. ఖాందేశ్‌లోని తిరుగుబాటులో నాలుగు వందల మంది భిల్లు స్త్రీలు పాల్గొన్నారు.

**పోరాటానికి నాయకత్వం :** 18వ శతాబ్దంలో మొఘలు సామ్రాజ్యం బలహీనపడిన తరువాత నాదిర్‌శాహ, అబ్దాలీ వంటి విదేశీయులు హిందుస్థాన్‌పై ఆక్రమణ చేయడం ప్రారంభించారు. ఈ ఆక్రమణలను మొఘలు సామ్రాజ్యం ప్రతిఘటించలేదని దృష్టికి వచ్చిన వెంటనే మరాఠీయులు విదేశీ ఆక్రమణల నుంచి హిందుస్థాన్‌ను రక్షించే బాధ్యతను తమ నెత్తినపెట్టుకొన్నారు. ఆ భూమిక వహించి మరాఠీయులు అబ్దాలీకి వ్యతిరేకంగా పానిపత్ వద్ద పోరాడారు. 1857 స్వాతంత్ర్య పోరాటంలో మొఘలు సామ్రాజ్య వారసుడు బహదుర్‌శాహ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడుటకు అసమర్థుడు అని గ్రహించిన తరువాత బహదుర్‌శాహ నేతృత్వాన్ని అంగీకరించి నానా సాహెబ్‌పేశ్వా, ఝాన్సీరాణీ లక్ష్మీబాయి, తాత్యాటోపేలు 1857 స్వాతంత్ర్య పోరాట పగ్గాలు తమ చేతుల్లోకి తీసుకున్నారు. దీని ఫలితంగా ఈ స్వాతంత్ర్య పోరాటంలో హిందు-ముస్లిం సోదరులు ఏకమయినట్లు గోచరిస్తుంది. మౌల్వీ అహ్మద్ ఉల్లా, కుంవర్ సింహ్, మొఘల్ సేనాధిపతి బఖ్త్‌ఖాన్, బేగమ్ హజరత్



నానా సాహెబ్ పేశ్వా



తాత్యాసాహెబ్ టోపే



రాణి లక్ష్మీబాయి



బేగం హజరత్ మహల్



కుంవర్ సింహ్




మహల్‌లు వివిధ ప్రాంతాలలో తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. దిల్లీ, కాన్పూర్, లక్నో, ఝాన్సీ అదేవిధంగా పశ్చిమ బీహార్‌లోని తిరుగుబాటు తీవ్రరూపం దాల్చింది.

**అణచివేత :** భారతీయులు ఆంగ్లేయులతో ప్రాణాలను లెక్కచేయక పోరాడారు. అందులో సైనికులు, జమీందార్లు, రాజులు, సేనాధిపతులు, ప్రజలు కూడా ఉండిరి. హిందూ సైనికుల తిరుగుబాటు నిశ్చయించిన సమయానికి ముందే ప్రారంభమైనది. ప్రారంభంలో సైనికులకు విజయం లభిస్తూ ఉండెను. కాని ఆంగ్ల అధికారం యొక్క సైన్యం సంఖ్య, పరిపాలనా బలం పెద్దగా ఉండెను. ఆంగ్లేయులు కూడా తిరుగుబాటును సామ, దాన, భేద, దండోపాయాలననుసరించి అణచివేశారు. ఈ కుదుపునుంచి ఆంగ్ల ప్రభుత్వం త్వరలోనే కోలుకొని తరువాత ఆరునెలలోనే కోల్పోయిన ప్రాంతాలను తిరిగి పొందింది. రాణీ లక్ష్మీబాయి, కుంవర్‌సింహ్, అహ్మద్‌ఉల్లాలు వీరమరణం పొందారు. బహాదుర్‌శాహను రంగూన్ కారాగారంలో ఉంచడం జరిగింది. నానా సాహెబ్, బేగం హజరత్ మహల్‌లు నేపాల్‌లో ఆశ్రయం పొందారు. తాత్యాటోపె పదిమాసాలు ఆంగ్లేయులతో పోరాటం చేసాడు. కాని స్వామిద్రోహం వలన అతడు దొరికిపోయాడు. అతడు ఉరికంబం ఎక్కవలసి వచ్చింది. ఈ విధంగా 1858 చివరి వరకు ఆంగ్లేయులు ఈ పోరాటాన్ని కఠినంగా అణచివేశారు.



బహాదుర్‌షాహ

పోరాటం హిందూ సైనికుల అసంతృప్తి నుంచి ప్రారంభమైనప్పటికి తరువాత రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు, ఆదిమవాసులు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఏకమయ్యారు. ఈ అన్యాయపూరిత రాజ్యపాలనను కూలద్రోయుట కొరకు భారతీయులందరు పోరాటం చేశారు. ఈ పోరాటంలో హిందువులు, ముస్లింలు, వివిధ జాతులు-తెగల ప్రజలు గొప్పశక్తిగా నిలిచారు. ఆంగ్లేయులను భారతదేశం నుంచి తరిమివేయుటయే అందరి లక్ష్యంగా ఉండెను. దీని వెనుక స్వాతంత్ర్య ప్రేరణ ఉండెను. కావున ఈ పోరాటానికి విశాల జాతీయ స్వరూపం లభించింది.

**పోరాటం విఫలం కావడానికి కారణాలు :** 1857 పోరాటం కింది కారణాలవలన విఫలమైనది.

- **పోరాటం యొక్క ప్రచారం భారతదేశమంతటా జరుగలేదు :** ఈ పోరాటం సంపూర్ణ భారతదేశంలో ఒకే సమయంలో జరుగలేదు. ఉత్తర భారతదేశంలో పోరాట తీవ్రత అధికంగా ఉండెను. ఉత్తర భారతదేశంలోనే రాజపుతానా, పంజాబ్, బెంగాల్లో కొంత భాగం, ఈశాన్య భారతదేశం వంటి ప్రాంతాలు పోరాటానికి దూరంగా ఉన్నాయి.

- **ఏకగ్రీవ నాయకత్వ అభావం :** పోరాటంలో భారతీయ ప్రాతిపదికన ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఏకగ్రీవమైన నాయకత్వ ఏర్పాటుకు సాధ్యం కాలేదు. అందువలన ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఏకం కాలేకపోయారు.

- **రాజులు-సర్దారుల మద్దతు లేకపోవడం :** ఆంగ్ల పరిపాలన యొక్క బాధలు ఏ విధంగా ప్రజలకు కలుగు చుండెనో అదే విధంగా సంస్థానాధీశులకు కూడా కలుగు చుండేవి. అందులో కొందరిని మినహాయిస్తే ఇతరులు ఆంగ్లేయులతో కలిసియున్నారు.

- **సైనిక వ్యూహరచన లోపం :** భారతీయ సైనికులలో వీరత్వం ఉంది కాని సరియైన సమయంలో సరియైన వ్యూహం రచించబడలేదు. ఢిల్లీని జయించిన తరువాత దానిని నిలుపుకోరాలేదు. అదేవిధంగా తిరుగుబాటుదార్ల వద్ద సరిపోవునన్ని శస్త్రాస్త్రాలు లేకుండెను. ఆంగ్లేయుల వద్ద పెద్దయెత్తున అర్థబలం, క్రమశిక్షణతో కూడిన సైన్యం, ఆధునీకరించిన శస్త్రాస్త్రాలు, అనుభవజ్ఞులైన సేనాధిపతులు ఉండిరి. సమాచార వ్యవస్థ వారి స్వాధీనంలో ఉండడం వలన వారి కదలికలు వేగవంతంగా ఉండేవి. అందువలన భారతీయ సైనికులు వారిముందు నిలువలేకపోయారు. పోరాటాలు అనుని కేవలం వీరత్వంతోనే గాక సైనిక వ్యూహాలతో విజయం సాధించవలసి ఉంటుంది.

- **ఆంగ్లేయులకు అంతర్జాతీయ పరిస్థితుల అనుకూలత :** ఆంగ్లేయులకు రష్యాలో సాగుతున్న క్రిమియన్ యుద్ధం అప్పుడే ముగిసింది. అందులో ఆంగ్లేయులు విజయం సాధించారు. ప్రపంచంలోని అనేక దేశాలతో వారి వ్యాపారం కొనసాగుతుంది. ఆంగ్లేయుల నౌకాదళ బలం చాలా పెద్దది. దీనికి వ్యతిరేకంగా తిరుగుబాటుదార్ల పరిస్థితి ఉండెను.

## స్వాతంత్ర్య పోరాట పరిణామాలు

**ఈస్ట్ ఇండియా కంపనీ పరిపాలన ముగిసింది :** కంపనీ అధికారం వలన భారతీయుల అసంతృప్తి పెరుగుతూ పోయింది. అందువలననే ఆంగ్లేయ అధికారానికి 1857 పోరాటం అనే సవాలు ఎదురైనది. దాని అవగాహన ఇంగ్లండ్ రాణికి కలిగింది. భారతదేశంలోని ఆంగ్లేయ అధికారం కంపనీ చేతుల్లో ఉండడం సురక్షితం కాదని భావించడం వలన 1858 సంవత్సరంలో బ్రిటిష్ పార్లమెంట్ చట్టం చేసి ఈస్ట్ ఇండియా కంపనీ పరిపాలనను రద్దు చేసింది. దీని ద్వారా గవర్నర్ జనరల్ పదవి తొలగించి వైస్‌రాయ్ పదవిని ఏర్పాటు చేయడం జరిగింది. లార్డ్ కనింగ్ చివరి గవర్నర్ జనరల్ మరియు మొదటి వైస్‌రాయ్ అయ్యాడు. అదే విధంగా భారతదేశానికి సంబంధించిన పరిపాలన చేయుటకు భారతమంత్రి అను పదవిని ఇంగ్లండ్ ప్రభుత్వంలో ఏర్పాటు చేయడం జరిగింది.

**రాణి ప్రకటన :** ఇంగ్లండ్ రాణి విక్టోరియా భారతీయులనుద్దేశించి ఒక బహిరంగ ప్రకటన చేసింది. భారతీయులందరు మా ప్రజలు, కులం, మతం, జాతి లేక జన్మస్థలాన్ని బట్టి ప్రజల్లో భేదభావం చూపం. ప్రభుత్వ ఉద్యోగాలు అర్హతను బట్టి ఇవ్వబడును. మత విషయంలో ఎటువంటి జోక్యం చేయబడదు. సంస్థానాధీశులతో చేసుకొన్న ఒప్పందాలు పాటించబడును. వాటిని ఏ కారణం చేతనైనా విలీనం చేసుకోబోమనే వాగ్దానం ఆ ప్రకటనలో ఇవ్వబడింది.

**భారతీయ సైన్యం యొక్క పునర్నిర్మాణం :** సైన్యం లోని ఆంగ్ల సైనికుల సంఖ్య పెంచబడింది. ముఖ్యమైన ప్రాంతాలలో ఆంగ్ల అధికారులను నియమించడం జరిగింది. మందుగుండు సామాగ్రి పూర్తిగా ఆంగ్లేయ అధికారుల ఆధీనంలో ఉంచబడింది. సైనిక విభాగాలను జాతి ఆధారంగా విభజించడం జరిగింది. భారతీయ సైనికులు ఏకమై ఆంగ్లేయ అధికారంపై తిరుగుబాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకోబడినవి.

**ధోరణాత్మక మార్పులు :** భారతీయుల సామాజిక, మత విషయాలలో జోక్యం చేసుకోకూడదనే ధోరణి ఆంగ్లేయులు స్వీకరించారు. దానితో బాటు భారతీయ సమాజం సామాజిక దృష్ట్యా ఐక్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించారు. భారతీయులలో కులం, మతం, జాతి ప్రాంతం ఈ కారణాల వలన ఎప్పుడూ పోరాటాలు జరుగునట్లు, ఒకరిపట్ల ఒకరికి భేదభావం సృష్టించి భారతీయుల మనస్సులు కలుషితం అగునటువంటి ధోరణిని అమలుపరచడం మొదలైనది. దీనితో విభజించి పాలించు అనునది ఆంగ్లేయుల పరిపాలనా సూత్రం అయింది.

1857 స్వాతంత్ర్య పోరాటం వల్ల ఆంగ్లేయ రాజ్యాధికారాన్ని సంఘటితంగా వ్యతిరేకించాలని భారతీయులు భావించసాగారు. 1857 స్వాతంత్ర్య పోరాటం భారత జాతీయోద్యమానికి ప్రేరణ అయింది.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(ఉమాజీ నాయిక్, స్వాతంత్ర్య సమరం, లార్డ్ డల్‌హౌసీ, భారతమంత్రి, తాత్యాటోపే)

(1) స్వాతంత్ర్య వీర్ సావర్కర్ 1857 పోరాటానికి ............. అను పేరు పెట్టాడు.

(2) రామోశీ ప్రజలను సంఘటితం చేసి ................. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు.

(3) 1857 పోరాటం తరువాత భారతదేశానికి సంబంధించిన పరిపాలన చేయడానికి .................... అను పదవిని ఇంగ్లండ్ ప్రభుత్వంలో ఏర్పాటు చేయబడింది.

(4) భారతదేశంలోని సంస్థానాలు ............. అను గవర్నర్ జనరల్ స్వాధీనం చేసుకొన్నాడు.

**2. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

(1) ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పదాతిదళ సైనికులు సాయుధ తిరుగుబాటు చేశారు.

(2) హిందు, ముస్లిం సైనికుల మధ్య అసంతృప్తి ఏర్పడింది.

(3) భారతీయ సైనికులు ఆంగ్ల సైన్యం ముందు నిలువలేకపోయారు.

(4) స్వాతంత్ర్య పోరాటానంతరం భారతీయ సైన్యభాగాలను జాతిననుసరించి విభజించడం జరిగింది.

(5) ఆంగ్లేయులు భారతీయ పరిశ్రమలపై భరించరాని పన్ను విధించారు.

**3. కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా జవాబులు రాయండి.**

(1) 1857 స్వాతంత్ర్యపోరాటం వెనుక ఏ సామాజిక కారణాలున్నాయి ?

(2) 1857 స్వాతంత్ర్య పోరాటంలో భారతీయులు ఎందుకు విఫలమయ్యారు ?

(3) 1857 స్వాతంత్ర్య పోరాటం యొక్క పరిణామాలను రాయండి.

(4) 1857 స్వాతంత్ర్య పోరాటం తరువాత ఆంగ్లేయులు ఏ ధోరణాత్మక మార్పులు చేశారు ?

**ఉపక్రమం**

(1) స్వాతంత్ర్యవీర్ సావర్కర్ రచించిన '1857 స్వాతంత్ర్య సమరం' అను పుస్తకాన్ని సేకరించి చదవండి.

(2) భారతదేశ మానచిత్రపటంలో 1857 స్వాతంత్ర్య పోరాట స్థానాలను చూపండి.

BDWPNB

# 5. సామాజిక మరియు మత పునరుజ్జీవనం

ఆంగ్ల విద్య ప్రచారంతోబాటు నూతన ఆలోచనలు, నూతన భావనలు నూతన తత్వజ్ఞాన ప్రచారం జరిగింది. అదే విధంగా అనేక పాశ్చాత్య ఆలోచనలు, సంస్కృతులు భారతీయులకు పరిచయమైనవి. అందువలన భారతీయ సమాజం యొక్క సామాజిక, మత, ఆర్థిక, సాంస్కృతిక రంగాలన్నింటిలో మార్పులు జరిగాయి.

భారతీయ సమాజం యొక్క వెనుకబడినతనము వారి మూఢనమ్మకాలు, ఆచార ప్రియత్వం, జాతి భేదం, ఉచ్చనీచ భ్రమతోకూడిన భావన, జిజ్ఞాస మరియు పరిశీలనా ప్రవృత్తుల అభావం ఉన్నదనే విషయం విద్యావంతులు తెలుసుకొన్నారు. దేశాన్ని ప్రగతిపథంపై నడిపించుటకు భారతీయ సమాజం లోని దోషాలు, అసాంఘిక ప్రవృత్తులను నిర్మూలించి మానవత్వం, సమానత్వం, సౌభ్రాతృత్వం అను సిద్ధాంతాలపై ఆధారపడిన నూతన సమాజాన్ని నిర్మించే అవసరం ఉండెను. భారతీయ సమాజంలోని వివిధ సమస్యలను తొలగించుటకు విద్యావంతులైన మేధావులు మత రచనల ద్వారా జనజాగృతి చేయసాగారు. ఆనాటి భారతదేశంలో ప్రారంభమైఉన ఆలోచనాత్మక జాగృతిని భారతీయ పునరుజ్జీవనం అని అంటారు.

## మత సంస్కరణ మరియు సమాజ సంస్కరణల పర్వం

**బ్రహ్మ సమాజం :** రాజా రామమోహనరాయ్ క్రీ.శ. 1828లో బెంగాల్ ప్రాంతంలో బ్రహ్మ సమాజ స్థాపన చేశాడు. అతడు అనేక భాషలు, మతాలను అధ్యయనం చేశాడు. దానినుంచే అతని యొక్క అద్వైతవాద విచారసరళి అభివృద్ధి చెందింది. దేవుడు ఒక్కడే (ఏకేశ్వరవాదం) ఉచ్చనీచ అను భేదభావం పాటించ కుండుట, కర్మకాండలను వ్యతిరేకించుట, ప్రార్థనా మార్గాన్ని అనుసరించుట అనునవి బ్రహ్మసమాజ సిద్ధాంతాలు. రాజా రామమోహనరాయ్ సతీసహగమన సంప్రదాయం, బాల్యవివాహం, పరదా పద్ధతులను వ్యతిరేకించాడు. వితంతు వివాహం స్త్రీ విద్యలను ప్రోత్సహించాడు. కోల్‌కతా వద్ద హిందూ కళాశాలను స్థాపించాడు. అదేవిధంగా 'సంవాద కౌముది' అను వార్తాపత్రిక ద్వారా జనజాగృతి చేశాడు.



రాజా రామమోహనరాయ్

**ప్రార్థనా సమాజం :** దాదోబా పాండురంగ్ తర్ఖడ్‌కర్ క్రీ.శ. 1848 సంవత్సరంలో ముంబయిలో పరమహంస సభను స్థాపించాడు. పరమహంస సభ విచ్ఛిన్నమైన పిదప అందులోని కొందరు సభ్యులు ప్రార్థనా సమాజాన్ని స్థాపించారు. దాదోబా సోదరుడు డా. ఆత్మారామ్ పాండురంగ్ ప్రార్థనా సమాజానికి ప్రథమ అధ్యక్షుడుగా నియమింపబడినాడు. ఈ సంస్థకు ముంబయి విశ్వవిద్యాలయంలోని యువకులైన పట్టభద్రుల సహకారం లభించడం వలన దాని కీర్తి నానాటికి వ్యాప్తి చెందింది.



దాదోబా పాండురంగ్ తర్ఖడ్‌కర్

న్యాయమూర్తి మహాదేవ్ గోవింద్ రానడే, డా. రా.గో. భాండార్కర్‌లు ప్రార్థనా సమాజం పనులను కొనసాగించారు. విగ్రహారాధనను వ్యతిరేకించుట, ఏకేశ్వరవాదం ఒక్కడే, కర్మకాండలను వ్యతిరేకించుట ప్రార్థనా సమాజ సిద్ధాంతాలు. ఉపాసన, ప్రార్థనలకు వారు ప్రాధాన్యతనిచ్చారు. ప్రార్థనా సమాజం సామాజిక సంస్కరణలకోసం అనాథాశ్రమాలు, స్త్రీ విద్యా సంస్థలు, కార్మికుల కోసం రాత్రి పాఠశాలలు, దళితుల కోసం సంస్థలను ప్రారంభించింది. ప్రార్థనా సమాజ సభ్యుడు మహర్షి విఠల్ రామ్‌జీ శిందే 'డిప్రెస్డ్ క్లాసెస్ మిషన్' స్థాపించి దాని మాధ్యమం ద్వారా సామాజిక సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశాడు.

**సత్యశోధక సమాజం :** మహాత్మా జ్యోతిరావు ఫులే క్రీ.శ. 1873లో సత్యశోధక సమాజం స్థాపించాడు. సమానత్వ సిద్ధాంతంపై ఆధారపడిన నవసమాజ నిర్మాణం కొరకు సత్యశోధక సమాజం అనేక కార్యక్రమాలు నిర్వహించింది. ఆయన అస్పృశ్యతను (అంటరానితనాన్ని) వ్యతిరేకించాడు. దానితోబాటు బహుజన సమాజ విద్యను, స్త్రీ విద్యను

ప్రోత్సహించాడు. మహాత్మా జ్యోతిరావు పులే 'బ్రాహ్మణాంచే కసబ్', 'గులాంగిరి', 'శేత్కర్యాచా ఆసూడ్', 'సార్వజనిక్ సత్యధర్మ్' వంటి పుస్తకాల మాధ్యమం ద్వారా సమాజ పునరుజ్జీవనం చేశాడు. స్త్రీపురుషులు లేక మనుషుల మధ్య భేదం సృష్టించబడే ఆచార వ్యవహారాలను తీవ్రంగా విమర్శించాడు.



మహాత్మా జ్యోతిరావు పులే

**ఆర్య సమాజం :** స్వామి దయానంద సరస్వతి క్రీ.శ. 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. 'సత్యార్థ ప్రకాశ్' అను వేదాలకు అర్థం తెలిపే గ్రంథాన్ని రచించాడు. ప్రాచీన వైదిక మతమే నిజమైన మతమని, అందులో జాతులకు స్థానం లేకుండెనని, స్త్రీపురుష సమానత్వం ఉండెనని అతడు ప్రతిపాదించాడు. 'వేదాలవైపు మరల వెళ్ళండి' అనునది ఆర్యసమాజ నినాదం. ఆర్యసమాజం శాఖలు భారతదేశమంతటా తెరువబడినవి. ఆర్యసమాజం యొక్క ఆధ్వర్యంలో అక్కడక్కడ విద్యాసంస్థలు స్థాపించబడినవి.



స్వామి దయానంద సరస్వతి

**రామకృష్ణ మిషన్ :** రామకృష్ణ పరమహంస శిష్యుడైన స్వామి వివేకానంద క్రీ.శ. 1897లో రామకృష్ణ మిషన్ స్థాపించాడు. రామకృష్ణ మిషన్ అనేక ప్రజాసేవ కార్యకలాపాలను చేసింది. కరువు ప్రజలకు సహాయం, రోగులకు, దీనులకు ఔషధోపచారాలు (చికిత్స), స్త్రీ విద్య, ఆధ్యాత్మిక చింతన అనే రంగాలలో మిషన్ పనులు చేసింది మరియు చేస్తూ ఉంది. స్వామి వివేకానంద ఉత్తమ ఉపన్యాసకుడు. అతడు క్రీ.శ. 1893లో అమెరికాలోని చికాగోలో విశ్వమతపరిషత్‌లో హిందూమత ప్రతినిధిగా పాల్గొనెను. భారతదేశంలోని యువకులకు లెండి, మేలుకోండి, లక్ష్యం సాధించేవరకు ముందుకు సాగండి అను సందేశాన్నిచ్చాడు.



స్వామి వివేకానంద

**సిక్కు సమాజంలో సంస్కరణలు :** సిక్కుల మత సంస్కరణ కొరకు అమృత్‌సర్ వద్ద 'సింగ్ సభ' స్థాపించబడింది. ఈ సంస్థ సిక్కు సమాజంలో విద్యాభివృద్ధి మరియు ఆధునీకీకరణ సాధించింది. తరువాత 'ఆకాలీ ఉద్యమం' సిక్కు సమాజంలో సంస్కరణల సంప్రదాయాన్ని కొనసాగించింది.

**స్త్రీలకు సంబంధించిన సంస్కరణలు :** బ్రిటిష్ అధికారం భారతదేశంలో విస్తరించింది. ఆ కాలంలో భారతదేశంలోని స్త్రీల పరిస్థితి దయనీయంగా ఉండెను. వారికి విద్యను పొందే హక్కు లేకుండెను. స్త్రీలను పురుషులతో సమానంగా చూచేవారు కాదు. బాల్య వివాహాలు, వృద్ధులతో కన్యల వివాహం, వరకట్న పద్ధతి, సతీసహగమన సంప్రదాయం, విధవా శిరోముండనము, వితంతు వివాహాలకు వ్యతిరేకత మొదలగు సంప్రదాయాలు సమాజంలో ఉండేవి. ఆనాటి గవర్నర్ లార్డ్ బెంటిక్‌కు సతీసహగమన నిషేధ చట్టం చేయుటకు రాజారామమోహనరాయ్ వంటి సంఘ సంస్కర్తలు మద్దతునిచ్చారు. లోకహితవాదిగా పేరు గాంచిన గోపాల్ హరిదేశ్‌ముఖ్ వంద శీర్షికల (శతపత్రాల) ద్వారా స్త్రీపురుష సమానత్వాన్ని ప్రోత్సహించాడు.



గోపాల్ హరిదేశ్‌ముఖ్

1848లో మహాత్మాపులే పుణెలోని భిడెవాడలో బాలికల మొదటి పాఠశాలను నెలకొల్పాడు. అందులో అతనికి తన భార్య సావిత్రీబాయి తోడ్పాటు లభించింది. సమాజంలోని ఛాందసులు చేసిన విమర్శలు, నిందలను భరిస్తూ సావిత్రీబాయి విద్యాబోధనను కొనసాగించింది. మహాత్మాపులే తన సొంత ఇంటిలో బాలహత్యా ప్రతిబంధక గృహం



సావిత్రీబాయి పులే

స్థాపించాడు. విధవా శిరోముండన పద్ధతిని నిలిపివేయాలని మంగలి వారితో సమ్మె చేయించాడు.

వితంతువుల పునర్వివాహానికి అనుమతి లభించుట కొరకు పం. ఈశ్వరచంద్ర విద్యాసాగర్, విష్ణుశాస్త్రి పండిత్, వీరేశలింగం పంతులు విశేష ప్రయత్నాలు చేశారు. గోపాల్ గణేశ్ ఆగర్కర్ తన సుధారక్ అను వార్తాపత్రిక ద్వారా బాల్యవివాహాలు, యుక్తవయస్సు ఆమోద చట్టంపై ఘాటైన అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. మహర్షి విఠల్ రామ్‌జీ శిందే ముంబయిలో దేవదాసి సంప్రదాయంపై సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. తారాబాయి శిందే 'స్త్రీపురుష తులన' అను గ్రంథం ద్వారా అత్యంత తీవ్రమైన పదజాలంతో స్త్రీల హక్కులను ప్రోత్సహించింది. మహర్షి ధోండో కేశవ్ కర్వే పుణెలో 'అనాథ బాలికల ఆశ్రమం' ప్రారంభించాడు. వితంతువులు, నిరాధార స్త్రీలతోబాటు అందరు మహిళలు విద్యను అభ్యసించి సొంతకాళ్ళపై నిలబడవలెనని అతని ఉద్దేశం. అతని ప్రయత్నాల నుంచియే ఇరువదవ శతాబ్దంలో భారతదేశంలోని మొదటి మహిళా విశ్వవిద్యాలయం స్థాపించబడింది. పండిత రమాబాయి 'శారదా సదన్' అనే సంస్థను స్థాపించి దివ్యాంగ బాలబాలికలు, స్త్రీల పోషణ బాధ్యతను స్వీకరించింది. రమాబాయి రానడే 'సేవాసదన్' సంస్థ ద్వారా స్త్రీల కొరకు వైద్య పరిచారికా పాఠ్యప్రణాళికను ప్రారంభించింది. ఆమె స్త్రీలకు ఓటు హక్కు లభించాలని ప్రభుత్వాన్ని కోరింది. స్త్రీలపై జరుగు అన్యాయాలను డా. బాబా సాహెబ్ అంబేడ్కర్ తన రచనల ద్వారా బహిర్గతం చేశాడు. మహాత్మాగాంధీ స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. స్త్రీలు స్వాతంత్ర్యోద్యమ కాలంలో తమ అమూల్యమైన తోడ్పాటు అందించారు.



వీరేశలింగం పంతులు



మహర్షి ధోండో కేశవ్ కర్వే

స్త్రీ సంస్కరణోద్యమాల వలన సమాజంలో అన్యాయపూరిత సంప్రదాయాలు నిలిపివేయుటకు సహకారం లభించింది. స్త్రీల సమస్యలు బహిర్గతమైనవి. స్త్రీలు తమ సొంత ఆలోచనలను రచనల ద్వారా ప్రస్తావించసాగారు. విద్యవలన జీవనంలోని అన్ని రంగాలలో స్త్రీల పురోగతి జరిగింది.

**కొంచె ఆలోచించండి –**

* సంఘ సంస్కర్తలు స్త్రీ విద్యను ప్రారంభించకపోతే ?
* వర్తమాన కాలంలో స్త్రీల జీవనంలో విద్య వలన ఏ మార్పులు జరిగినవి ?
* నేటికి స్త్రీవిద్యకోసం ప్రయత్నించే అవసరం ఉందని మీకు అనిపిస్తుందా ? అలా అనిపిస్తే ఏ ప్రయత్నాలు చేయవలయును ?

**ముస్లిం సమాజంలో సంస్కరణోద్యమాలు :** అబ్దుల్ లతీఫ్ ముస్లిం సమాజంలోని మత సంస్కరణలను ప్రారంభించాడు. అతడు బెంగాల్ ప్రాంతంలో 'ద మొహమ్మదన్ లిటరరి సొసైటీ' అను సంస్థను స్థాపించాడు.

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ 'మొహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజ్'ను స్థాపించాడు. తరువాత అది అలిగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందింది. అతడు పాశ్చాత్య విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానాలను ప్రోత్సహించాడు. పాశ్చాత్య విద్య మరియు విజ్ఞానశాస్త్రాలను అంగీకరించనిదే ముస్లిం సమాజాభివృద్ధి జరగదని అతని ప్రగాఢ విశ్వాసం.



సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్

**హిందు సమాజంలోని ఉద్యమాలు :** హిందూ సమాజానికి గౌరవప్రదమైన స్థానం కల్పించవలెనని 1915 సంవత్సరంలో 'హిందూ మహాసభ' అను సంఘం స్థాపించబడింది. పం. మదన్ మోహన్ మాలవీయ్ 'బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేశాడు. డా. కేశవ్ బళీరాం హెడ్గేవార్ 1925 సంవత్సరంలో 'జాతీయ స్వయంసేవక్ సంఘ్'ను నాగ్‌పూర్‌లో స్థాపించాడు. హిందూవాద యువకుల క్రమశిక్షణభరిత, చరిత్ర

సంపన్న సంఘాన్ని ఏర్పాటు చేయడం అతని లక్ష్యంగా ఉండెను. స్వాతంత్ర్యవీర్ వి.దా. సావర్కర్ రత్నగిరి వద్ద హిందూ మతంలోని అన్ని జాతులకు స్వచ్ఛంధ ప్రవేశంగల పతితపావన అనే మందిరాన్ని నిర్మించాడు. సహపంక్తి భోజనాలు మొదలగు కార్యక్రమాలను నిర్వహించాడు.



డా. కేశవ్ హెడ్గేవార్

### మీకు తెలుసా ?

**ఇతర రంగాలలో పునరుజ్జీవన ఆవిష్కరణలు :** సంస్కరణోద్యమాల మాదిరిగా పునరుజ్జీవ కాలంలో సాహిత్యం, కళలు, విజ్ఞానశాస్త్రం వంటి రంగాలలో జరిగిన అభివృద్ధి ముఖ్యమైనది. సాహిత్య రంగంలో గురుదేవ్ రవీంద్రనాథ్ టాగోర్, విజ్ఞానశాస్త్ర రంగంలో సి.వి.రామన్‌లకు నోబెల్ పురస్కారం లభించింది. దీనినిబట్టి భారతదేశ అభివృద్ధి గురించి తెలుసుకోవచ్చును. ఇటువంటి అభివృద్ధి వలన ఆధునిక భారతదేశ స్వరూపం ఏర్పడింది. కథలు నవలల నుంచి స్వాతంత్ర్య ప్రేరణ లభించసాగింది. సంఘ సంస్కరణ ఆలోచనలు కూడా వ్యక్తమవసాగాయి.

ఈ కాలంలో స్త్రీలు రచనలు చేయసాగారు. కొత్త వార్తాపత్రికలు, మాసపత్రికలు సంఘ సంస్కరణలు, రాజకీయ జాగృతి వాహకాలుగా అవతరించాయి.

కళారంగంలో కూడా ఈ కాలంలో అభివృద్ధి జరిగింది. సంగీతం అధికంగా ప్రజల ముందుకు వెళ్ళసాగింది. భారతీయశైలి, పాశ్చాత్య పద్ధతులను సమ్మిళితం చేయడంతో నూతన చిత్రకళ ముందుకు వచ్చింది.

విజ్ఞానశాస్త్ర విషయంలో అనేక గ్రంథాలు రాయబడు చుండెను. భారతదేశ అభివృద్ధి కొరకు ప్రయోగశీలత, శాస్త్రీ దృక్పథం ముఖ్యమని ప్రజలకు తెలియసాగింది.

ఆధునిక భారతదేశ చరిత్రలో పునరుజ్జీవన ఆవిష్కరణ ముఖ్యమైనది. స్వాతంత్ర్యం, సమానత్వం, జాతీయవాదం అను భావనలతో నిండియున్న సంస్కర్తలు రాజకీయ రంగంలో దేశవ్యాప్త ఉద్యమాలను నడిపారు. వాటిని మనం తరువాతి పాఠంలో అధ్యయనం చేయనున్నాం.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(సర్‌సయ్యద్ అహ్మద్‌ఖాన్, స్వామి వివేకానంద, మహర్షి విఠల్ రామ్‌జీ శిందే)

(1) రామకృష్ణ మిషన్‌ను ................ స్థాపించాడు.

(2) మొహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజ్‌ను ............. స్థాపించాడు.

(3) డిప్రెస్డ్ క్లాసెస్ మిషన్‌ను ................. స్థాపించాడు.

**2. కింది పట్టికను పూరించండి.**

| సంఘ సంస్కర్త పేరు | సంస్థ | వార్తాపత్రిక / పుస్తకం | సంస్థ పనులు |
|---|---|---|---|
| రాజారామ మోహనరాయ్ | ................ | సంవాద కౌముది | ........... |
| ............................ | ఆర్యసమాజ్ | ................ | ........... |
| మహాత్మా ఫులే | ................ | గులాంగిరీ | ........... |

**3. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

(1) భారతదేశంలో సామాజిక, మత పరివర్తన ఉద్యమాలు ప్రారంభమైనవి.

(2) మహాత్మాఫులే మంగలి వాండ్రతో సమ్మెను నిర్వహించాడు.

**4. టిప్పణులు రాయండి.**

(1) రామకృష్ణ మిషన్

(2) సావిత్రీబాయి ఫులే చేసిన స్త్రీ సంబంధ సంస్కరణలు

**ఉపక్రమం**

(1) 'స్త్రీ విద్య' అను విషయంపై పాఠశాలలో వ్యాసరచన పోటీ నిర్వహించండి.

(2) సంఘ సంస్కర్తల ఛాయా చిత్రాలను సంగ్రహించండి.

✿✿✿

BE6KPY

# 6. స్వాతంత్ర్యోద్యమ యుగ ప్రారంభం

ఆంగ్ల విద్య యొక్క పరిణామం భారతదేశ సమాజ జీవనంపై మిశ్రమ ప్రభావం చూపించింది. నూతనంగా విద్యావంతమైన సమాజం జరిపిన పునరుజ్జీవనం వలన జాతీయ భావన బీజాలు నాటబడినవి. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలోని ఉద్యమాలవలన వేర్వేరు ప్రాంతాలలోని రాజకీయ సంస్థలను ఒకే సిద్ధాంతం క్రిందికి తెచ్చుట, రాజకీయ దృష్ట్యా జాగృతమైన వివిధ సమూహాలు, వ్యక్తులను ఏకం చేయడం, దేశం యొక్క సమ్యలవైపు ప్రజల దృష్టిని మళ్ళించి దేశం యొక్క లక్ష్యాలను ప్రకటించుట కొరకు అఖిల భారతీయ స్థాయిలో ఒక రాజకీయ సంఘం ఏర్పాటుచేయుటకు అనుకూల పరిస్థితి ఏర్పడినది.

**బ్రిటిష్ ప్రభుత్వకాలంలో పరిపాలన కేంద్రీకృతం :** బ్రిటిష్ పరిపాలన వలన భారతదేశంలో వాస్తవంగా ఏకఛత్రాధిపత్యం ప్రారంభమైంది. దేశమంతటా సమానధోరణులు, చట్టం ముందు అందరూ సమానం అనే భావనల వలన ప్రజలలో ఏకత్వం మరియు జాతీయభావన అభివృద్ధి చెందింది. బ్రిటిష్‌వారు తమ పరిపాలన సౌలభ్యం కొరకు, సైన్యం యొక్క త్వరిత తరలింపు కొరకు రైల్వేలు, రహదారులను, నిర్మించారు. కాని ఈ ఆధునిక భౌతిక సౌకర్యాల లాభం భారతీయులకు కూడా జరిగింది. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలోని ప్రజల మధ్య సంబంధాలు అధికమై వారిమధ్య సంప్రదింపులు పెరిగి జాతీయ భావన అభివృద్ధి చెందింది.

**ఆర్థిక పీడన :** అపార భారతీయ సంపదను అనేక మార్గాల గుండా ఇంగ్లండ్‌కు తరలించడం ప్రారంభమైంది. ఇంగ్లండ్ యొక్క సామ్రాజ్యవాద ధోరణి వలన భారతదేశ ఆర్థిక పీడన జరుగసాగింది. రైతుల చేత నిర్బంధంగా వాణిజ్య పంటలను పండింపజేయుట, భూమిశిస్తు భారం, నిరంతర కరవుల వలన భారతదేశ వ్యవసాయపు నడుం విరిగింది. సంప్రదాయ పరిశ్రమలు క్షీణించడంతో నిరుద్యోగం పెరిగింది. పెట్టుబడిదారుల వలన కార్మిక వర్గం దోపిడికి గురైంది. మధ్యతరగతిపై కొత్త కొత్త పన్నులు విధించారు. అందువలన ప్రజలలో అసంతృప్తి పెరుగుతూ వచ్చింది.

**పాశ్చాత్య విద్య :** పాశ్చాత్య విద్యాప్రసారం వలన న్యాయం, స్వాతంత్ర్యం, సమానత్వం, ప్రజాస్వామ్యం వంటి నూతన భావనలు భారతీయులకు పరిచయమైనవి. హేతువాదం, శాస్త్రీయ దృక్పథం, మానవత్వం, జాతీయవాదం వంటి విలువలు భారతీయులు స్వీకరించారు. అందువలన మన దేశాన్ని పరిపాలించుటకొరకు మనం సమర్థులం కావున ఈ విలువల ఆధారంగా మనదేశ అభివృద్ధిని సాధించాలనే భావన పెంపొందింది. ఆంగ్ల భాష వలన భాషా వైవిధ్యంతో సుసంపన్నమైన భారతదేశానికి సంప్రదింపులకోసం ఒక కొత్త భాషామాధ్యమం లభించింది.

**భారతదేశ ప్రాచీన చరిత్ర అధ్యయనం :** కోల్‌కతాలో



డా. భావుదాజీ లాడ్

బ్రిటిష్‌వారు 'ఏసియాటిక్ సొసైటీ'ని స్థాపించారు. అనేక మంది భారతీయులు పాశ్చాత్య విద్యావేత్తలు భారతీయ సంస్కృతిని అధ్యయనం చేయడం ప్రారంభించారు సంస్కృతం, ఫారసీ మరియు ఇతర భారతీయ భాషలలోని వ్రాతప్రతులు పరీక్షించి వాటిపై పరిశోధనా గ్రంథాలను ప్రచురించారు. డా. భావుదాజీ లాడ్. డా. రా.గో. భాండార్కర్ వంటి కొందరు భారతీయ విద్యాంసులు ప్రాచీన భారతదేశ సంస్కృతిని లోతుగా అధ్యయనం చేశారు. మనకు సమృద్ధమైన ప్రాచీన వారసత్వం లభించిందని తెలియగానే భారతీయుల ఆత్మగౌరవం జాగృతమైంది. పుణెలో 'భాండార్కర్ ప్రాచ్యవిద్యా పరిశోధన మందిరం' అను సంస్థ గత వంద సంవత్సరాల నుంచి పని చేస్తుంది.



డా. రా.గో. భాండార్కర్

**వార్తా పత్రికల పని :** ఇదే కాలంలో ఆంగ్లం, ప్రాంతీయభాషల నుంచి వార్తా పత్రికలు నియతకాలికలు ప్రచురింపబడసాగాయి. ఈ వార్తాపత్రికల ద్వారా రాజకీయ,

సామాజిక జాగృతి జరుగ సాగింది. దర్పణ్, ప్రభాకర్, హిందూ, అమృత్ బజార్ పత్రిక, కేసరి, మరాఠా వంటి వార్తా పత్రికల ద్వారా ప్రభుత్వ ధోరణులపై విమర్శలు జరుగసాగాయి.



వ్యోమేశ్‌చంద్ర బెనర్జీ

**భారత జాతీయ మహాసభ స్థాపన :** 28 డిసెంబర్ 1885 రోజున ముంబయిలోని గోకుల్‌దాస్ తేజ్‌పాల్ సంస్కృత పాఠశాలలో జాతీయ మహాసభ మొదటి సమావేశం నిర్వహింపబడింది. భారతదేశం లోని వివిధ ప్రాంతాలలోని 72 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరైనారు. కోల్‌కతాలో పేరుగాంచిన న్యాయవాది వ్యోమేశ్‌చంద్ర బెనర్జీ ఈ సమావేశానికి అధ్యక్షుడుగా ఉండెను. వీరందరు కలిసి ఇదే సభలో భారత జాతీయ మహాసభ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్)ను స్థాపించారు. అలన్ ఆక్టేవియన్ హ్యూమ్ అను బ్రిటిష్ అధికారి జాతీయ మహాసభ స్థాపనలో చొరవ తీసుకొన్నాడు. భారతీయులకు పరిపాలనలో అధిక ప్రాతినిధ్యం కల్పించాలని బ్రిటిష్ ప్రభుత్వపు సైన్యం ఖర్చు తగ్గించాలి అని కోరుతూ ఒక వినతి పత్రం బ్రిటిష్ ప్రభుత్వానికి పంపించబడింది.

**జాతీయ మహాసభ ఉద్దేశాలు :** భారతదేశంలోని వేరువేరు ప్రాంతాలలోని ప్రజలను మతం, జాతి, కులం, భాష, భౌగోళిక ప్రాంతం అనే భేదాలు విడిచి ఒకే వేదికపై తీసుకురావటం, పరస్పర సమస్యలను తెలుసుకొని చర్చించడం, ప్రజలలో ఐక్యతా భావనను అభివృద్ధి పరచడం, దేశ ప్రగతికి ప్రయత్నించడం వంటివి జాతీయ మహాసభ ఉద్దేశాలు.

**మితవాదుల యుగం (1885 నుంచి 1905) :** జాతీయ మహాసభ స్థాపన తరువాత ప్రారంభ దశాబ్దంలో వారి కార్యక్రమాలు నెమ్మదిగా నడచినను నిరంతరం కొనసాగినవి. జాతీయ మహాసభ నాయకులు వాస్తవవాదులు, విద్యాధికులైయుండిరి. సంస్థ కార్యకలాపాల ద్వారా పటిష్టమైన పునాది వేయవలెనను విషయాన్ని గ్రహించారు. పాశ్చాత్య ఆలోచనా పరుల ఉదారవాదతత్వజ్ఞానం, స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అను విలువల ప్రభావం వారిపై యుండెను. వారికి చట్టబద్ధమైన మార్గంపై విశ్వాసం ఉండెను. చట్టబద్ధమైన మార్గంలో కోరిన తమ కోరికలకు ఆంగ్లేయులు తప్పక న్యాయం చేకూర్చుతారు అనే ఆశాభావంతో భారతీయులు ఉండిరి. గోపాలకృష్ణ గోఖలే, ఫిరోజ్‌షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీలు మితవాద నాయకులు.

జాతీయ మహాసభ సమావేశంలో ప్రాంతీయ చట్టసభల్లో ప్రజాప్రతినిధులు ఉండాలని భారతీయ విద్యావంతులకు ఉద్యోగాలు లభించాలని, పెరిగిన సైన్యం ఖర్చులు తగ్గించాలని, ప్రజల హక్కులు చట్టబద్ధంగా కాపాడబడవలెనని, కార్యనిర్వాహక సంస్థ మరియు న్యాయ సంస్థలను విభజించాలనే వివిధ నిర్ణయాలను వారు ప్రతిపాదించారు.

జాతీయ ఉద్యమంలో చీలిక తేవడం కొరకు ఆ తరువాత కాలంలో బ్రిటిష్‌వారు 'విభజించు పాలించు' అను నీతిని అవలంబించారు.

**అతివాదుల యుగం (1905 నుంచి 1920) :** రాజకీయ దృష్ట్యా జాగృతమైన భారతీయ నాయకులందరు కులం, మతం, భాష, ప్రాంతం అన్ని భేదాలను ప్రక్కన పెట్టి జాతీయ మహాసభ వేదికపై కలిసేవారు. జాతీయ మహాసభ ఉద్దేశాలు, చట్టబద్ధమైన మార్గంలో ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళుటపై ఏకాభిప్రాయం ఉన్నప్పటికి కార్యాచరణ విషయంలో వారిలో భేదాభిప్రాయాలు ఉండెను. ఈ భేదాభిప్రాయాలు సిద్ధాంతపరమైనవిగా ఉండెను. రాజకీయ ఉద్యమంలో ఈ భేదాభిప్రాయాల వలన రెండు ప్రముఖ రాజకీయ సముదాయాలు తయారైనవి. శాంతియుత రాజ్యాంగ బద్ధ మార్గాన్ని ఆశ్రయించినవారు మితవాదులుగా, స్వాతంత్ర్యం కొరకు అధిక తీవ్రంగా పోరాటం చేయవలెనని భావించినవారు అతివాదులుగా రెండు కూటములు ఏర్పడినవి. లాలాలజపతిరాయ్, బాల గంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్ అతివాద నాయకులుగా భావింపబడ్డారు.



బాలగంగాధర తిలక్

ప్రారంభకాలంలో అతివాద నాయకులు భారతీయులలో రాజకీయ జాగృతి కలిగించుటకొరకు వార్తా పత్రికలు, జాతీయ ఉత్సవాలు, జాతీయ విద్య అను మార్గాలను అనుసరించారు. 'కేసరి', 'మరాఠా' అను వార్తాపత్రికల ద్వారా లోకమాన్యతిలక్ ప్రభుత్వ అణచివేతలపై తీవ్రమైన విమర్శ చేశాడు. బెంగాల్ ప్రాంతంలో 'అమృత్‌బజార్ పత్రిక'

అతివాదుల ఆలోచనలను తెలిపే పత్రికగా పేరొందింది. అంతర్గత భేదాలు విడిచి ప్రజలు కలిసిపోవాలని, వారిలోని ఆలోచనల వినిమయం జరగాలని, జాతీయనేతల చర్యల ద్వారా సామాన్యప్రజలకు ప్రేరణ లభించాలనే ఉద్దేశాలతో తిలక్ శివ జయంతి మరియు గణేశోత్సవాలను నిర్వహించాడు. రాజకీయ ఉద్దేశంతో ప్రజలు సంఘటితమయితే ప్రభుత్వం వారిని నిర్బంధిస్తుంది. కాని మత ఉద్దేశంతో ప్రజలు కలుసుకుంటే మాత్రం ప్రభుత్వం దానిపై నిషేధం విధించదని అతని అభిప్రాయం. తిలక్ మాండలే జైలులో 'గీతారహస్య' అను గ్రంథం రచించాడు. దాని సారం కర్మయోగం కావున ప్రజలు కృతిశీలురుగా ఉండవలెననే విషయానికి ప్రాధాన్యత నిచ్చాడు. సొంతభాష, సొంత సంస్కృతిపై అభిమానం, భక్తిని పాటించే తరం నిర్మాణం కావాలని అతివాద నాయకులు విద్యా సంస్థలను స్థాపించారు. అనేకమంది ప్రజలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములయి ప్రభుత్వానికి సవాలు విసరి పోరాటం చేస్తేనే ఫలితం దక్కుతుందని అతివాద నాయకుల అభిప్రాయంగా ఉండెను. ఉద్యమం అధిక తీవ్రం చేయాలను విషయంపై వారు ఏకాభిప్రాయం కలిగియుండిరి. కాని వారు సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించకుండా విశాల జనాందోళన నిర్వహించవలెనని పట్టుదలతో ప్రతిపాదన చేశారు. మితవాదులు స్వాతంత్ర్య ఉద్యమ పునాదిని నిర్మించారు. అతివాదులు ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళారు.

1897లో పుణెలో ప్లేగు వ్యాధి పెద్ద సంకటాన్ని కలిగించింది. వందల మంది మృత్యువాత పడ్డారు. ఈ అంటువ్యాధి నిర్మూలించడానికి ర్యాండ్ అను అధికారి నియమింపబడ్డాడు. ప్లేగు వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి తనిఖీ శిబిరాలు ప్రారంభించి ప్రజలపై దౌర్జన్యం చేయసాగాడు. దీనికి ప్రతీకారంగా చాపేకర్ సోదరులు అతన్ని వధించారు. అయితే ప్రభుత్వం ఈ కుట్రలో తిలక్‌ను ఇరికించడానికి శాయశక్తులా ప్రయత్నించింది. కానీ అందులో విఫలం మైనప్పటికి ప్రభుత్వం కక్షతో లోకమాన్యతిలక్‌ను జైలులో పెట్టింది.

**బెంగాల్ విభజన :** హిందూముస్లిం సమాజంలో వేర్పాటు బీజాలు నాటి 'విభజించు పాలించు' అను నీతిని అవలంబించాలని బ్రిటిష్ వారు నిర్ణయించుకొన్నారు. ఆనాటి వైస్‌రాయ్ లార్డ్‌కర్జన్ దానిని పెంచి పోషించారు. బెంగాల్ ఒక పెద్ద ప్రదేశం. ఈ ప్రాంత ప్రభుత్వ పరిపాలన దృష్ట్యా కఠినం అవుతుందనే మిష చూపి లార్డ్‌కర్జన్ 1905లో బెంగాల్ ప్రాంత విభజనను ప్రకటించాడు. ఈ విభజన వలన ముస్లింలు అధిక సంఖ్యలోగల ప్రాంతాన్ని తూర్పు బెంగాల్, హిందువులు అధిక సంఖ్యలో గల ప్రాంతాన్ని పశ్చిమ బెంగాల్‌గా ఏర్పరచడం జరిగింది. విభజన వలన హిందూ ముస్లింలలో చీలిక తెచ్చి స్వాతంత్ర్యోద్యమాన్ని బలహీనపరచడం అనునది అందులో దాగి ఉన్న ఉద్దేశం.

**బెంగాల్ విభజన ఉద్యమం :** బెంగాలులోనే కాక భారతదేశమంతట విభజనకు వ్యతిరేకంగా ప్రజలు జాగృతమయ్యారు. 16 అక్టోబర్ విభజన దినాన్ని జాతీయశోకదినంగా పాటించడం జరిగింది. భారతదేశమంతట నిరసన సభల ద్వారా ప్రభుత్వ నిషేధం పాటించబడింది. 'వందేమాతరం' అను గీతం అంతటా ఆలపించబడసాగింది. ఐక్యతకు ప్రతీకగా రక్షాబంధన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బహిష్కరించి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. బెంగాలు విభజన ఆందోళనకు సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనంద్ మోహన్ బోస్, రవీంద్రనాథ్ ఠాగోర్‌లు నేతృత్వం వహించారు. బెంగాలు విభజన ఉద్యమంతో భారత జాతీయ మహాసభ విస్తరించింది. అది ఒక జాతీయ ఉద్యమం అయింది. అసంతృప్తి తీవ్రతను చూసి 1911 సంవత్సరంలో బ్రిటిష్‌వారు బెంగాలు విభజనను రద్దు చేశారు.

**జాతీయ మహాసభ నాలుగు సూత్రాలు :** 1905 జాతీయ మహాసభ సమావేశ అధ్యక్షుడుగా నామ్‌దార్ గోఖలే ఉండెను. అతడు బెంగాల్ విభజన ఆందోళనకు మద్దతునిచ్చాడు. 1906 సమావేశానికి అధ్యక్షుడుగా దాదాబాయి నౌరోజీ ఉండెను. వేదిక మీద దాదాబాయినౌరోజీ 'స్వరాజ్య' అను పదాన్ని ప్రప్రథమంగా ఉచ్చరించాడు. అధ్యక్ష ఉపన్యాసంలో అతడు ఐకమత్యం సాధించండి, సరియైన ప్రయత్న చేయండి. స్వరాజ్యం యొక్క లక్ష్యాన్ని సాధించండి. ఎందుకంటే నేడు అనేకమంది సోదరులు పేదరికం, పస్తులు, రోగాల బారిన పడుతున్నారు. వారిని రక్షించవచ్చును.


దాదాబాయి నౌరోజీ

సంస్కరింప బడిన దేశాల్లో భారతదేశానికి ఏ గౌరవ స్థానం

ఉందో అది మరల లభించగలదనే సందేశాన్ని ఇచ్చాడు. ఇదే సమావేశంలో స్వరాజ్యం, స్వదేశీ వస్తువుల వినియోగం జాతీయ విద్య మరియు విదేశీ వస్తు బహిష్కారం అను నాలుగు సూత్రాలను జాతీయ మహాసభ ఏకగ్రీవంగా స్వీకరించింది. స్వదేశీ ఉద్యమం వలన మనం స్వయం సమృద్ధి, స్వావలంబన కలిగియుంటాం. స్వదేశీ మార్గంలో వెళ్ళుటకు మనదేశంలోని పెట్టుబడి, వనరులు, మానవ వనరులు, ఇతర శక్తులన్నిటిని మనం ఏకం చేయవలసి వస్తుంది. దానినుంచే మనం దేశ ప్రయోజనాలు సాధించవచ్చును. విదేశీ వస్తువులు, సరుకులపై బహిష్కరణ అనునది మొదటి మెట్టు, విదేశ పరిపాలనను బహిష్కరించుట అనునది రెండవ మెట్టు అని నిర్ణయింపబడింది. బహిష్కరణ వలన బ్రిటిష్ సామ్రాజ్య మూలం పైనే దెబ్బ తీయవచ్చునని నాయకులు అభిప్రాయపడిరి.

**మీకు తెలుసా ?**



గోపాలకృష్ణ గోఖలే

నామ్‌దార్ గోపాలకృష్ణ గోఖలే 1905లో 'భారత సేవక సమాజం'ను స్థాపించాడు. ప్రజల్లో దేశభక్తి నిర్మించి స్వార్థాన్ని త్యజించుటను నేర్పించడం. మతం, జాతి భేదాలను నిర్మూలించి సామాజిక సామరస్యతను ఏర్పాటు చేయుట. విద్యా ప్రచారం గావించుట, అనునవి భారత సేవక సమాజం ఉద్దేశాలు.

**అతివాదులు, మితవాదుల మధ్య భేదాభిప్రాయాలు :** జాతీయ మహాసభలోని ఆలోచనాసరళిలో అభిప్రాయభేదాలు 1907 సంవత్సరంలో సూరత్ సమావేశంలో బయటపడ్డాయి. స్వదేశీ వస్తు వినియోగం, విదేశీ వస్తు బహిష్కరణ ఈ నిర్ణయాలను ప్రక్కన పెట్టవలెనని మితవాదులు ప్రయత్నించారు. వారు నెగ్గకూడదని అతివాదులు ప్రయత్నించారు. గోఖలే, సురేంద్రనాథ్ బెనర్జీ, ఫిరోజ్‌షా మెహతా వంటి మితవాద నాయకులు అతివాద నాయకులు జాతీయ మహాసభను అధిగమించే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణ చేశారు. లాలా లజపత్‌రాయ్ మధ్యవర్తిత్వం చేసే ప్రయత్నం చేశాడు. భారత జాతీయ మహాసభ జాతీయ వేదిక కావున అందులో చీలిక రాకూడదని తిలక్ అభిప్రాయపడ్డాడు. సమావేశ సమయంలో ఉద్రిక్తత పెరిగి రాజీ అసాధ్యం కావడంతో చివరికి భారత జాతీయ మహాసభ చీలిపోయింది.

**బ్రిటిష్ ప్రభుత్వ అణచివేత :** బెంగాలు విభజన తరువాత ప్రారంభమైన తీవ్ర ప్రజాఉద్యమాన్ని చూచి ప్రభుత్వం కలవరపడింది. ఈ ఆందోళనను నిలిపి వేయుటకు ప్రభుత్వం అణచివేత ధోరణి చేపట్టింది. సార్వజనిక సభలపై చట్టం ద్వారా నిషేధం విధించింది. ఈ చట్టాన్ని ఉల్లఘించిన వారిని కఠినంగా శిక్షించింది. పాఠశాల విద్యార్థులను కూడా దండించారు. వార్తాపత్రికలపై అనేక నిర్భంధాలు విధించారు. ప్రభుత్వంపై విమర్శలు చేశారనే ఆరోపణతో అనేక ముద్రణాలయాలను జప్తు చేశారు. రచయితలను, సంపాదకులను జైలులో పెట్టారు. ప్రభుత్వం అతివాద నాయకులకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకొంది. దానికి తీవ్రమైన ప్రతిస్పందన బెంగాలులో జరిగింది. విప్లవకారులు తుపాకీ కాల్పులు, బాంబు దాడుల మార్గాన్ని అవలంబించారు. ఈ బాంబు దాడులను కేసరి పత్రిక ద్వారా సమర్థించిన లోకమాన్యతిలక్‌పై రాజద్రోహ నేరం మోపి అతన్ని ఆరు సంవత్సరాలు మ్యాన్‌మార్‌లోని మాండలే జైలులో పెట్టారు. బిపిన్ చంద్రపాల్‌కు కారాగార శిక్ష విధించారు. లాలాలజపత్‌రాయ్‌ను పంజాబ్ నుంచి బహిష్కరించారు.



లాల్ - బాల్ - పాల్

**ముస్లిం లీగ్ స్థాపన :** బెంగాలు విభజన ఆందోళనలో జాతీయ మహాసభకు చేరుకొనే ప్రజల యొక్క తీవ్ర స్పందనను చూసి బ్రిటిష్ అధికారులు కలవరపడ్డారు.

ఆంగ్లేయులు విభజించి పాలించు అను నీతిని మళ్ళీ అనుసరించారు. ముస్లింల ప్రయోజనాలను కాపాడుకొనుటకు, వారికై స్వతంత్ర రాజకీయ సంఘం ఉండవలెనెనే ప్రచారం వారు ప్రారంభించారు. బ్రిటిష్ ప్రభుత్వ ప్రోత్సాహం వలన ముస్లిం సమాజంలోని ఉచ్చ వర్ణీయుల ఒక శిష్ట మండలి ఆగాఖాన్ నాయకత్వంలో గవర్నర్ జనరల్ లార్డ్ మింటోను కలిసింది. లార్డ్ మింటో మరియు ఇతర బ్రిటిష్ అధికారుల ప్రోత్సాహంతో 1906లో 'ముస్లిం లీగ్' స్థాపించబడింది.

**మోర్లే మింటో చట్టం :** భారత ప్రజల్లో బ్రిటిష్ ప్రభుత్వ చర్యలపట్ల అసంతృప్తి ఉండెను. భారత ప్రజల పేదరికానికి ముఖ్య కారణం బ్రిటిష్ వారి ఆర్థిక ధోరణి అని ప్రజలు భావించిరి. కర్జన్ యొక్క అణచివేత ధోరణి, విద్యావంతులైన భారతీయులను ఉద్యోగాలలో చేర్చుకోకపోవడం, భారతదేశం బయటి ఆఫ్రికాలోని భారతీయులతో అన్యాయంగా ప్రవర్తించడం వలన కూడా అసంతృప్తి పెరిగిపోయింది. భారతీయుల అసంతృప్తికి తాత్కాలిక ఉపశమనంగా మోర్లేమింటో సంస్కరణల చట్టం 1909లో చేయబడింది. ఈ చట్టం ప్రకారం చట్టసభలో భారతీయ సభ్యుల సంఖ్య పెంచబడింది. కొందరు ఎన్నికైన భారతీయ ప్రతినిధులను చట్టసభలో చేర్చుకొనే ఏర్పాటు చేయబడింది. ఈ చట్టం ప్రకారం ముస్లిం ప్రజల కొరకు ప్రత్యేక నియోజకవర్గం ఏర్పాటు చేయడం జరిగింది. బ్రిటిష్ వారి ఈ కుటిల నీతివలన భారతదేశంలో వేర్పాటువాద బీజాలు నాటబడ్డాయి.

**లక్నో ఒప్పందం :** భారత జాతీయ మహాసభ 1916 లక్నో సమావేశంలో తిలక్ నాయకత్వంలలో జాతీయ మహాసభలోని అభిప్రాయభేదాలను రూపుమాపే ప్రయత్నం జరిగింది. ఇదే సంవత్సరం భారత జాతీయ మహాసభ, ముస్లిం లీగ్‌లలో కూడా రాజీ కుదరడం జరిగింది. దీనినే 'లక్నో ఒప్పందం' అని అంటారు. ఈ ఒప్పందం ప్రకారం ముస్లింల ప్రత్యేక నియోజకవర్గాలను జాతీయ మహాసభ అంగీకరించింది. భారతదేశానికి రాజకీయ అధికారం లభింపజేయు పనిలో జాతీయ మహాసభతో సహకరించుటకు ముస్లింలీగ్ అంగీకరించింది.

**హోమ్‌రూల్ ఉద్యమం :** 1914లో తిలక్ మాండలే జైలు నుంచి విడుదల అయ్యాడు. అప్పుడు యూరోప్‌లో



డా. అనీబిసెంట్

ప్రపంచయుద్ధం ప్రారంభమైనది. ఈ యుద్ధం యొక్క ప్రత్యక్ష పరిణామాన్ని భారతదేశం అనుభవించవలసి వచ్చింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. బ్రిటిష్ ప్రభుత్వం భారతీయులపై అనేక నిర్బంధాలను విధించింది. అందువలన భారతీయులలో అసంతృప్తి పెరగసాగింది. అటువంటి పరిస్థితులలో డా. అనీబిసెంట్, లోకమాన్యతిలక్‌లు హోంరూల్ ఉద్యమం ప్రారంభించారు. హోంరూల్ అనగా మన రాజ్యపాలన మనం చేసుకోవడం. దానినే స్వపరిపాలన అంటారు. ఐర్లండ్ అను దేశంలో కూడా వలసవాదానికి వ్యతిరేకంగా ఇటువంటి ఉద్యమం ప్రారంభం అయింది. దాని ఆధారంగా భారతీయ హోంరూల్ ఉద్యమం స్వపరిపాలన అధికారాన్ని బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరింది. డా. అనీబిసెంట్, లోకమాన్యతిలక్‌లు దేశమంతట సుడిగాలి పర్యటన చేసి స్వపరిపాలన కోరికను ప్రజలవరకు చేర్చారు. 'స్వరాజ్యం నా జన్మ సిద్ధ హక్కు, దానిని నేను సాధిస్తాను' అని తిలక్ నొక్కి వక్కాణించాడు.

**మొదటి ప్రపంచయుద్ధం మరియు భారతదేశం :** యురోప్‌లోని యుద్ధ వాతావరణం, భారతీయ ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, హోంరూల్ ఉద్యమానికి పెరుగుతున్న ప్రజాదరణ దృష్ట్యా భారతీయుల సహాయం లభించడం బ్రిటిష్ వారికి అవసరమైంది. అందుకోసం సంస్కరణల యొక్క మలివిడత కిస్తు భారతీయులకు ఇవ్వాలి అనగా భారతీయులకు కొన్ని రాజకీయ అధికారాలను దశలవారీగా బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా భారతదేశానికి అంచెలం చెలుగా స్వపరిపాలనాధికారం, బాధ్యతాయుత రాజ్యపద్ధతి ఇవ్వబడునని 1917లో ఆనాటి భారతమంత్రి మాంటెగ్యూ ప్రకటించాడు. ప్రభుత్వం భారతీయుల కోరికల విషయంలో సహానుభూతి, స్థిర చిత్తాన్ని చూపినట్లయితే భారత ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరిస్తారని తిలక్ ప్రకటించాడు. లోకమాన్యతిలక్ యొక్క ఈ ధోరణిని 'ప్రతియోగి సహకారత' అని అంటారు.

**మాంటెగ్యూ చెమ్స్‌ఫర్డ్ చట్టం :** 1919లో బ్రిటిష్ పార్లమెంట్ భారతదేశంలో సంవిధానాత్మక సంస్కరణలు చేయుటకు ఒక చట్టాన్ని తయారుచేసింది. దానిని మాంటెగ్యూ చెమ్స్‌ఫర్డ్ చట్టం అంటారు. ఈ చట్టం ప్రకారం అప్రధానమైన శాఖలు భారతీయ మంత్రులకు అప్పగించడం జరిగింది. కాని ఆర్థిక, రెవిన్యూ, గృహ వంటి ముఖ్యమైన శాఖలు గవర్నర్ స్వాధీనంలో ఉండెను. 1919 చట్టంతో భారతీయుల బాధ్యతాయుత రాజ్యపద్ధతి యొక్క ప్రతిపాదనకు పూర్తిగా అవకాశం లభించలేదు. ఈ చట్టం అందరిని నిరాశపరచింది. 'ఇది స్వరాజ్యం కాదు. దాని పునాది కాదు' అని కఠినమైన పదాలతో లోకమాన్యతిలక్ ఈ చట్టంపై విమర్శలు చేశాడు. ప్రభుత్వాన్ని వంచాలంటె ఆందోళనను తీవ్రతరం చేయవలసిన అవసరం ఉందనే విషయం భారతీయులందరికి అర్థమైనది. భారత దేశం నూతన ఆందోళనకు సిద్ధమైంది.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(1) భారత సేవక సమాజంను ................. స్థాపించాడు.

(అ) గణేశ్ వాసుదేవ్ జోషి

(బ) భాపూ దాజీ లాడ్

(క) మ.గో. రానడే

(డ) గోపాలకృష్ణ గోఖలే

(2) జాతీయ మహాసభ మొదటి సమావేశం ................లో జరిగింది.

(అ) పుణె (బ) ముంబయి

(క) కోల్‌కతా (డ) లక్నో

(3) గీతా రహస్య అను గ్రంథాన్ని ................ రచించాడు.

(అ) లోకమాన్య తిలక్ (బ) దాదాబాయి నౌరోజీ

(క) లాలా లజపతిరాయ్ (డ) బిపిన్ చంద్రపాల్

**2. పేర్లు రాయండి.**

(1) మితవాద నాయకులు ................. .................

(2) అతివాద నాయకులు ................. .................

**2. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

(1) స్వాతంత్ర్య పోరాటంలో భారతీయుల ఆత్మగౌరవం జాగృతమయింది.

(2) భారత జాతీయ మహాసభలో రెండు కూటములు ఏర్పడినవి.

(3) లార్డ్ కర్జన్ బెంగాలును విభజించవలెనని నిర్ణయించాడు.

**3. క్లుప్తంగా రాయండి.**

(1) జాతీయ మహాసభ ఉద్దేశాలు

(2) బెంగాలు విభజన ఉద్యమం

(3) జాతీయ మహాసభ యొక్క నాలుగు సూత్రాలు

**4. భారత జాతీయ మహాసభ స్థాపన నేపథ్యాన్ని కింది అంశాల ఆధారంగా స్పష్టీకరించండి.**

- పరిపాలనా కేంద్రీకరణ
- ఆర్థిక పీడన
- పాశ్చాత్య విద్య
- భారతదేశ ప్రాచీన చరిత్ర అధ్యయనం
- వార్తాపత్రికల పనులు

**ఉపక్రమం**

జాతీయ మహాసభ ప్రారంభ కాలంలోని నాయకుల గురించి అధిక సమాచారం అంతర్జాలం సహాయంతో సేకరించండి.

BEFGRL

# 7. సహాయ నిరాకరణోద్యమం

క్రీ.శ. 1920 నుంచి 1947 వరకు గల భారత స్వాతంత్ర్యోద్యమ కాలాన్ని 'గాంధీయుగం' అను పేరున గుర్తింపబడుచున్నది. 1920లో లోకమాన్య తిలక్ మరణానంతరం జాతీయోద్యమ పగ్గాలు మహాత్మాగాంధీ చేపట్టారు. గాంధీజీ సత్యం, అహింస, సత్యాగ్రహం అను సూత్రాల ఆధారంగా భారత స్వాతంత్ర్య పోరాటానికి నూతన దిశను కల్పించాడు. గాంధీజీ ప్రభావవంతమైన నాయకత్వం వలన జాతీయోద్యమం అధికంగా వ్యాపించింది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం యొక్క నూతన అధ్యాయం ప్రారంభమైంది.

**దక్షిణాఫ్రికాలో గాంధీజీ కార్యకలాపాలు :** మహాత్మాగాంధీ 1893లో న్యాయవాద వృత్తి రీత్యా దక్షిణాఫ్రికాకు వెళ్ళాడు. దక్షిణాఫ్రికా కూడా ఇంగ్లండ్ యొక్క వలస దేశం. అక్కడ పరిశ్రమలు, వ్యాపారం, ఇతర పనుల కొరకు అనేక భారతీయులు స్థానికులుగా ఉండిపోయారు. అక్కడి హిందూ ప్రజలను నేరస్థులుగా చూడడం జరిగేది. వారిని ప్రతిచోట అవమానించడం జరుగుచుండేది. 1906లో ప్రభుత్వం యొక్క ఆదేశానుసారం నల్లజాతివారికి గుర్తింపు పత్రం కలిగియుండడం తప్పనిసరి చేయబడింది. వారి స్వాతంత్ర్యంపై నిబంధనలు విధించడం జరిగింది. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా గాంధీజీ సత్యాగ్రహ మార్గంలో అక్కడి ప్రజలకు న్యాయం కల్పించాడు.


మహాత్మాగాంధీ

**భారతదేశానికి గాంధీజీ ఆగమనం :** 9 జనవరి 1915లో గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి తిరిగివచ్చాడు. నామ్‌దార్ గోపాల కృష్ణ గోఖలే సలహా ప్రకారం అతడు దేశమంతటా పర్యటించాడు. సామాన్య ప్రజల దు:ఖం, పేదరికం చూసి అతడు దు:ఖితుడయ్యాడు. అతడు దేశసేవా ప్రతిజ్ఞ చేశాడు. అహ్మదాబాద్ సమీపంలోని సాబర్‌మతి నదీ తీరాన గల ఒక ఆశ్రమంలో అతడు నివసించసాగాడు. సామాన్య ప్రజలకు న్యాయం అందించడానికి సత్యాగ్రహం అనే నూతన పద్ధతిని అవలంబించాడు.

**సత్యాగ్రహ తత్వజ్ఞానం :** గాంధీజీ సత్యాగ్రహం అను నూతన పద్ధతిని ప్రజా ఉద్యమంలోకి తీసుకువచ్చాడు. సత్యాగ్రహం అనగా సత్యం, న్యాయం కావాలని పట్టుదలగా కోరడం. అన్యాయం చేసే వ్యక్తికి సంయమనంతో, అహింసా మార్గంలో సత్యం, న్యాయం వీటి గురించి తెలియజేసి, అతని అభిప్రాయంలో పరివర్తన కలిగించడం అనునవి సత్యాగ్రహం యొక్క ఉద్దేశం. సత్యాగ్రహం చేయు వ్యక్తి హింస మరియు అసత్యాలను విడనాడవలెనని గాంధీజీ బోధించాడు.

తరువాత భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని అనేక దేశాలలో ప్రజలు అన్యాయాన్ని ఎదిరించడానికి సతాగ్రహమార్గాన్ని స్వీకరించారు. అమెరికాలోని నల్లజాతీయుల హక్కుల కోసం పోరాడిన మార్టిన్ లూథర్ కింగ్, దక్షిణాఫ్రికాలోని నెల్సన్ మండేలాలపై గాంధీజీ సత్యాగ్రహ మార్గం యొక్క ప్రభావం పడింది.

**చంపారణ్య సత్యాగ్రహం :** బిహార్ యొక్క చంపారణ్య ప్రాంతంలో బ్రిటిష్ తోటల యజమానుల ద్వారా నీలి పంట పండించమని భారత రైతులపై నిర్బంధం విధించబడేది. ఈ నీలి పంటను వారు నిర్ణయించిన ధరలకే భూస్వాములకు అమ్మవలెననే నిర్బంధం ఉండుట వలన అందులో రైతులకు ఆర్థిక నష్టం జరుగుచుండేది. ఈ పరిస్థితులలో గాంధీజీ 1917లో చంపారణ్యకు వెళ్ళాడు. గాంధీజీ చంపారణ్యలో రైతులను సంఘటితం చేసి సత్యాగ్రహ మార్గంలో ఆందోళన చేశాడు. భారతదేశంలో గాంధీజీ యొక్క ఈ మొదటి పోరాటం విజయవంతం కావడంతో. రైతులకు న్యాయం జరిగింది.

**ఖెడా సత్యాగ్రహం :** గుజరాత్‌లోని ఖెడా జిల్లాలో నిరతరం సంభవించిన కరువు కాటకాల వలన పంటల పరిస్థితి చాలా దారుణంగా ఉండెను. అయినను ప్రభుత్వం ద్వారా నిర్బంధంగా భూమి శిస్తు వసూలు చేయబడుచుండెను. గాంధీజీ రైతులకు భూమిశిస్తు చెల్లించకూడదని సలహా ఇచ్చాడు. అప్పుడు స్థానిక రైతులు 1918లో ఖెడా జిల్లాలో పన్ను ఎగవేత ఉద్యమం ప్రారంభించారు. గాంధీజీ ఉద్యమ నాయకత్వం

స్వీకరించాడు. ఆనతికాలంలోనే ప్రభుత్వం భూమిశిస్తు రద్దు చేసింది.

**అహ్మదాబాద్ కార్మిక పోరాటం :** మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. మిల్లు కార్మికులు జీతాలను పెంచమనికోరారు. కాని మిల్లు యజమానులు ఈ కోరికను తిరస్కరించారు. గాంధీజీ సలహ ప్రకారం కార్మికులు సమ్మె, నిరాహార దీక్షలు చేశారు. గాంధీజీ కూడా కార్మికుల తోబాటు నిరాహార దీక్ష చేశాడు. చివరకు మిల్లు యజమానుల దిగివచ్చి కార్మికులకు జీతాలను పెంచారు.

**రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం :** మొదటి ప్రపంచ యుద్ధంలో భారతీయులు బ్రిటిష్ వారికి సహాయం చేశారు. యుద్ధం ముగిసిన తరువాత భారతీయుల ప్రయోజనం దృష్ట్యా నిర్ణయం తీసుకోబడుతుంది, బాధ్యతాయుత ప్రభుత్వ పద్ధతి తీసుకురాబడుతుందని భారతీయులు భావించుచుండిరి. పెరుగుతున్న ధరలు, పెరిగిన పన్నులు మొదలగు ఆర్థిక, రాజకీయ కారణాల వలన బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతదేశంలోని ప్రజల్లో అసంతృప్తి పెరుగుతూ పోయింది.

బ్రిటిష్ ప్రభుత్వం ఈ అసంతృప్తిని తొలగించుటకై నివారణోపాయాలు కనుగొనుటకు సర్ సిడ్నీ రౌలట్ అను అధికారి అధ్యక్షతన ఒక సమితిని నియమించింది. ఈ సమితి సిఫారసుల ప్రకారం 17 మార్చ్ 1919లో కేంద్ర శాసన మండలిలోని భారత సభ్యులు చేసిన వ్యతిరేకతను లెక్కచేయక కొత్త చట్టం చేసింది. దానిని 'రౌలట్ చట్టం' అని అంటారు. ఈ చట్టంతో ఏ భారతీయుడినైనను విచారణ లేకుండానే నిర్బంధించుట, న్యాయస్థానంలో వ్యాజ్యం వేయకుండా జైలులో పెట్టు అధికారం ప్రభుత్వానికి కల్పించడం జరిగింది. ఈ చట్టం వలన ఇవ్వబడిన శిక్షకు వ్యతిరేకంగా అపీలు చేసుకొనే అవకాశం లేకుండా చేయబడింది. భారతీయులు ఈ చట్టాన్ని 'నలుపు చట్టం' అని సంబోధించారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశమంతటా కోపోద్రిక్తతలు ఎగిసాయి. గాంధీజీ ఈ చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం ప్రకటించాడు. 6 ఏప్రిల్ 1919లో రౌలట్ చట్టాన్ని వ్యతిరేకించుటకై దేశవ్యాప్త సమ్మె పాటించమని పిలుపునిచ్చాడు. ఈ పిలుపుకు భారతీయులు పెద్ద యెత్తున ప్రతిస్పందించారు.

**జలియన్ వాలా బాగ్ మారణకాండ :** రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా ప్రకటించిన పోరాటం పంజాబ్ ప్రాంతంలో తీవ్రరూపం దాల్చింది. అమృతసర్ పట్టణం ఈ ఉద్యమానికి ముఖ్య కేంద్రమైనది. ప్రభుత్వం అణచివేత చర్యలు ప్రారంభించింది. గాంధీజీ పంజాబ్ ప్రాంతంలో ప్రవేశించుటను నిషేధించింది. జనరల్ డయ్యర్ అమృత్‌సర్‌లో సభానిషేధ ఆజ్ఞలు జారీ చేశాడు. అమృత్‌సర్‌లోని సమ్మె సందర్భంగా డా. సత్యపాల్, సైఫుద్దీన్ కిచలు వంటి ప్రముఖ నేతలను నిర్బంధించడం జరిగింది.

ఈ సంఘటన నిషేదార్థం 13 ఏప్రిల్ 1919 రోజున అమృత్‌సర్‌లోని జలియాన్‌వాలా బాగ్‌లో బైసాఖీ పండుగ నిమిత్తం సభ నిర్వహించడం జరిగింది. ఆ సమయంలో జనరల్ డయ్యర్ సైనిక వాహనాలతో అక్కడికి వచ్చాడు. జలియన్‌వాలా బాగ్ మైదానంలో ఒకే వైపు గల ఇరుకైన త్రోవ అడ్డగించబడింది. నిరాయుధులు, నిరపరాధులైన ప్రజలపై ముందస్తు సూచన ఇవ్వకుండా అమానుషంగా కాల్పులు జరుపబడినవి. తుపాకుల యొక్క 1600 ఆవృత్తాలు (రౌండ్లు) కాల్పులు జరిపిన తరువాత తూటాలు అయిపోవడంతో కాల్పులు నిలిపివేయబడినవి. ఈ హత్యాకాండలో సుమారు నాలుగు వందల మంది స్త్రీపురుషులు మరణించారు. అసంఖ్యాకులు గాయపడ్డారు. కాల్పుల తరువాత వెంటనే సంచారనిషేధం ప్రకటించడం వలన గాయపడిన వారికి వెంటనే చికిత్స జరగలేకపోయింది. పంజాబ్ అంతట సైనిక చట్టం అమలు చేసి ప్రభుత్వం అనేక మందిని చెరసాలలో నిర్బంధించింది.

ఈ హత్యాకాండకు పంజాబ్ గవర్నర్ మైకేల్ ఓడవాయర్ బాధ్యుడయ్యెను. దేశమంతటా ఈ చట్టాన్ని వ్యతిరేకించుట జరిగింది. హత్యాకాండను నిరసిస్తూ రవీంద్రనాథ్ ఠాగోర్ బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన 'సర్' అను బిరుదును త్యాగం చేశాడు.



రవీంద్రనాథ్ ఠాగోర్

తరువాత ఈ హత్యాకాండపై విచారణ జరిపించాలనే భారతీయుల కోరిక మేరకు బ్రిటిష్ ప్రభుత్వం హంటర్ కమిషన్‌ను నియమించింది.

**ఖిలాఫత్ ఉద్యమం :** టర్కిస్తాన్ సుల్తాన్ ప్రపంచ ముస్లింలందరికి ఖలీఫా అనగా మత ప్రముఖుడు. మొదటి ప్రపంచయుద్ధంలో ఇంగ్లండ్‌కు వ్యతిరేక కూటమిలో ఉండెను. యుద్ధంలో భారతీయ ముస్లింల సహాయం అందుకొనుటకు యుద్ధం ముగిసిన తరువాత ఖలీఫా సామ్రాజ్యానికి హాని తలపెట్టడం జరదని ఇంగ్లండ్ ప్రధానమంత్రి వాగ్దానం చేశాడు. కాని యుద్ధం సమాప్తమయిన తరువాత ఇంగ్లండ్ ఈ వాగ్దానాన్ని పాటించలేదు. అందువలన ముస్లింలలో అసంతృప్తి పెల్లుబికింది. ఖలీఫాకు మద్దతు ఇచ్చుటకు భారతీయ ముస్లింలు ప్రారంభించిన ఉద్యమాన్ని 'ఖిలాఫత్ ఉద్యమం' అని అంటారు. ఈ సమస్య ఆధారంగా జాతీయ ఉద్యమం ప్రారంభించినట్లయితే ప్రభుత్వం ఖచ్చితంగా లొంగిపోతుందని గాంధీజీ భావించాడు. అందువలన గాంధీజీ ఖిలాఫత్ ఉద్యమానికి మద్దతునిచ్చాడు. ప్రభుత్వానికి సహాయం అందించకూడదనే గాంధీజీ ప్రస్తావన ఖిలాఫత్ కమిటీ అంగీకరించింది. ఈ కాలంలో హిందూముస్లిం ఐక్యత విశేషంగా కనిపించింది.

**సహాయ నిరాకరణోద్యమం :** సహాయ నిరాకరణోద్యమం వెనుక గల కారణం బ్రిటిష్ ప్రభుత్వం భారతీయుల సహకారంపై ఆధారపడి నడుస్తుందని గాంధీజీ భావించడం. ఒకవేళ భారతీయులందరు బ్రిటిష్ ప్రభుత్వానికి పూర్తి సహాయ నిరాకరణ ప్రకటించినట్లయితే అది కుప్పకూలుతుందనే ఉద్దేశంతో గాంధీజీ ప్రజలను సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనుటకు పిలుపునిచ్చాడు.

1920లో జాతీయ మహాసభ సమావేశాలు నాగపూర్‌లో జరిగాయి. ఈ సమావేశంలో చిత్తరంజన్‌దాస్ ప్రతిపాదించిన సహాయ నిరాకరణోద్యమ తీర్మానానికి అనుమతి లభించింది. సహాయ నిరాకరణోద్యమ పగ్గాలన్నీ గాంధీజీకి అప్పగింపబడినవి. ఈ తీర్మానం ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయస్థానాలు, విదేశీ వస్తువులు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బహిష్కరించవలెనని నిశ్చయించబడినది.

**సహాయ నిరాకరణోద్యమ ప్రస్థానం :** సహాయ నిరాకరణ కార్యక్రమం ప్రకారం పండిత మోతీలాల్ నెహ్రూ చిత్తరంజన్‌దాస్ మొదలగు పేరుగాంచిన న్యాయవాదులు న్యాయస్థానాలను బహిష్కరించారు. ఇదే కాలంలో పాఠశాలలు, కళాశాలల బహిష్కారం నుంచి జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడం జరిగింది. అనేక జాతీయ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు స్థాపించబడినవి. రానున్న ఎన్నికలను కూడా బహిష్కరించడం జరిగింది. విదేశీ వస్త్రాలను బహిష్కరించడం, విదేశీ వస్త్రాలను దహనం చేయడం, విదేశీ వస్త్రాలు విక్రయించే దుకాణాల ముందు ప్రదర్శనలు చేయబడినవి. అందువలన విదేశీ వస్త్రాల దిగుమతి తగ్గిపోయింది.

1921లో ముంబయికి వచ్చిన 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్' యొక్క స్వాగతం సమ్మె పాటిస్తూ చేయబడింది. నిర్మానుష్యమైన రహదారులు, మూతవేయబడిన దుకాణాలు రాజపుత్రునికి స్వాగతం పలికాయి. అస్సాంలోని తేయాకు తోటల వారి నుంచి బెంగాల్‌లోని రైల్వే ఉద్యోగుల వరకు ఈ ఉద్యమం వ్యాపించింది. సహాయ నిరాకరణోద్యమానికి చరమగీతం పాడుటకు ప్రభుత్వం అణచివేత చర్యలు ప్రారంభించింది.

ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లాలోని చౌరీచౌరా వద్ద ఫిబ్రవరి 1922లో శాంతియుత ఊరేగింపుపై పోలీసులు తూటాలు కాల్చారు. అందువలన కోపోద్రిక్తులైన మూక పోలీసు ఠాణాను తగులబెట్టింది. అందులో ఒక పోలీసు అధికారితోబాటు 22 మంది పోలీసులు మరణించారు. ఈ సంఘటన వలన గాంధీజీ చింతాగ్రస్తుడైనాడు. 12 ఫిబ్రవరి 1922 రోజున గాంధీజీ సహాయనిరాకరణోద్యమం నిలిపివేశాడు.



**మీకు తెలుసా ?**

**ముళశీ సత్యాగ్రహం :** సహాయ నిరాకరణోద్యమ కాలంలో పుణె జిల్లాలోని ముళశీ తాలూకాలో రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం చేశారు. ఈ సత్యాగ్రహానికి సేనాపతి పాండురంగ్ మహదేవ్ బాపట్ నాయకత్వం వహించాడు. అందుకోసం అతనికి ఏడు సంవత్సరాల శిక్ష పడింది.

మార్చ్ 1922లో గాంధీజీని నిర్బంధించడం జరిగింది. అతనిపై 'యంగ్ ఇండియా'లో మూడు దేశద్రోహ రచనలు చేశాడనే ఆరోపణచేస్తూ రాజద్రోహ నేరం మోపబడింది. అహ్మదాబాద్‌లో ప్రత్యేక న్యాయస్థానం స్థాపించబడింది. గాంధీజీకి ఆరు సంవత్సరాల శిక్ష విధించడం జరిగింది.

తరువాత ఆరోగ్యం విషమించిన కారణంగా గాంధీజీని జైలు నుంచి విడుదల చేయడం జరిగింది. గాంధీజీ సహాయ నిరాకరణోద్యమంతో బాటు నిర్మాణాత్మక పనులు చేపట్టాడు. అందులో ముఖ్యంగా స్వదేశీ ప్రచారం, హిందూముస్లిం ఐక్యత, మద్యపాన నిషేధం, అస్పృశ్యతా నిర్మూలన, ఖాధీ ప్రచారం, జాతీయ విద్య వంటి అంశాలు ఉండెను. ఈ నిర్మాణాత్మక కార్యక్రమం వలన గ్రామీణ ప్రాంతంలో జాతీయోద్యమం అధికంగా వ్యాప్తి చెందింది.

**స్వరాజ్య పార్టీ (పక్షం) :** జాతీయ మహాసభలో చిత్తరంజన్‌దాస్, మోతీలాల్ నెహ్రూలు ప్రభుత్వాన్ని అడ్డగించుటకు చట్టసభలోనికి ప్రవేశించాలనే ప్రతిపాదన చేశారు. 1922లో జాతీయ మహాసభలో అంతర్భాగంగా స్వరాజ్య పార్టీని స్థాపించడం జరిగింది.

1923 ఎన్నికల్లో కేంద్ర, ప్రాంతీయ శాసనమండలికి స్వరాజ్యపార్టీ యొక్క అనేక అభ్యర్థులు ఎన్నుకోబడ్డారు. అందులో ముఖ్యంగా మోతీలాల్ నెహ్రూ, మదనమోహన్ మాలవీయ్, లాలా లజపతిరాయ్, న.చి. కేళ్కర్‌లు ఉండిరి. దేశంలో ఎప్పుడయితే రాజకీయ ఉద్యమం చల్లబడిందో అప్పుడు శాసనసమండలిలో స్వరాజ్యపార్టీ పోరాటం చేసింది. శాసన మండలిలో ప్రభుత్వం యొక్క అన్యాయపు ధోరణులను వారు తీవ్రంగా వ్యతిరేకించారు. భారతదేశంలో భవిష్యత్ కాలంలో బాధ్యతాయుత రాజ్యపద్ధతిని కల్పించాలని కోరడం జరిగింది. భారతీయుల సమస్యలను పరిష్కరించుటకు రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని శాసనమండలిలో తీర్మానాన్ని అంగీకరింపజేసుకొన్నారు. ప్రభుత్వం స్వరాజ్యపార్టీ యొక్క చాలా ప్రతిపాదనలను తిరస్కరించింది.

**సైమన్ కమీషన్ :** 1919 మాంటెగ్యూ-చెమ్స్‌ఫర్డ్ చట్టం చేసిన సంస్కరణలు సంతృప్తికరంగా లేకుండెను. అందువలన భారతీయ ప్రజల్లో అసంతృప్తి నిండుకొన్నది. ఈ నేపథ్యంపై ఆంగ్ల ప్రభుత్వం 1927లో సర్‌జాన్ సైమన్ అధ్యక్షతన ఒక కమీషన్ ఏర్పాటు చేసింది. ఈ ఏడుగురు సభ్యుల కమీషన్‌లో ఒక్క భారతీయ సభ్యుడు కూడా లేకుండెను. కావున భారతదేశంలోని రాజకీయ పార్టీలు సైమన్ కమీషన్‌ను బహిష్కరించవలెనని నిర్ణయించాయి.




సైమన్ వెళ్ళిపో

1928 సంవత్సరంలో సైమన్ కమీషన్ భారతదేశంలోనికి వచ్చింది. అప్పుడు ఆ కమీషన్ ఎక్కడెక్కడికి పోయిందో అక్కడక్కడ వారికి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేయబడినవి. 'సైమన్ గో బ్యాక్', 'సైమన్ వెళ్ళిపో' అను నినాదాలతో తీవ్రంగా వ్యతిరేకించడం జరిగింది. ప్రదర్శనకారులపై లాఠీఛార్జ్ చేయబడింది. లాహోర్ వద్ద సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనలో లాలాలజపతిరాయ్ నాయకత్వం వహించాడు. ఈ ప్రదర్శనకారులపై లాఠీచార్జ్ చేయబడింది. సాండర్ అను అహకంరారియైన పోలీసు అధికారి లాలాజీ ఛాతిపై లాఠీతో దాడిచేశాడు. ఈ దాడి తరువాత జరిగిన నిషేధ సభలో లాలాజీ ఇలా అన్నాడు 'లాఠీతో కొట్టిన ఒక్కొక్క దెబ్బకు బ్రిటిష్ సామ్రాజ్య శవపేటికపై ఒక్కొక్క మేకు భిగింపబడుతుంది' తరువాత కొన్ని రోజులకే లాలాజీ మరణించాడు.



లాలా లజపతిరాయ్

**నెహ్రూ నివేదిక :** భారతదేశంలోని నాయకులు ఏకాభిప్రాయంతో రాజ్యాంగము తయారు చేయుట సాధ్యం కాదని భారతమంత్రి బర్కన్‌హెడ్ విమర్శించాడు. ఈ సవాలును స్వీకరించి సర్వపక్ష సమితి స్థాపించడం జరిగింది. ఈ సమితికి పండిత మోతీలాల్ నెహ్రూ అధ్యక్షులుగా ఉండిరి.

భారతదేశంలో వలస స్వరాజ్యం స్థాపించాలి, ప్రౌఢుల ఓటింగ్ పద్ధతి అమలు చేయాలి, భారతీయులకు ప్రాథమిక పౌర హక్కులను కల్పించాలి, భాషాప్రయుక్త ప్రాంతాల

నిర్మాణం చేయాలనే ప్రస్తావన ఈ నివేదికలో ఉండెను. ఈ నివేదికను 'నెహ్రూ నివేదిక' అని అంటారు.

1929 చివరి వరకు ప్రభుత్వం నెహ్రూ నివేదికను స్వీకరించనట్లయితే సవినయ శాసనోల్లంఘన పోరాటం ప్రారంభిస్తామని హెచ్చరిక చేశాడు. ఈ నేపథ్యంపై 1929 డిసెంబర్‌లో పండిత జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన నిర్వహించబడిన లాహోర్ సమావేశం చారిత్రాత్మకమైనది.

**సంపూర్ణ స్వరాజ్యాన్ని కోరుట :** వలస స్వరాజ్యం అనునది ఇప్పటివరకు గల జాతీయ మహాసభ ఉద్దేశం చాలామంది యువకులైన కార్యకర్తలకు అంగీకృతం కాకుండెను. పం. జవాహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్‌లు సంపూర్ణ స్వరాజ్యం కోరే యువకులకు నాయకులుగా ఉన్నారు. ఈ యువ సముదాయపు ప్రభావం వలన జాతీయ మహాసభ లాహోర్ సమావేశంలో సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని సమ్మతించడం జరిగింది. ఈ తీర్మానం ద్వారా జాతీయ మహాసభ వలన స్వరాజ్యం అను ఉద్దేశాన్ని పరిత్యజించింది. ఆ తరువాత భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యమే జాతీయోద్యమ లక్ష్యమైంది.



పం. జవాహర్‌లాల్ నెహ్రూ

31 డిసెంబర్ 1929 రోజున రావి నదితీరంలో పం. జవాహర్‌లాల్ నెహ్రూ మూడు రంగుల జెండాను ఎగురవేశాడు. 26 జనవరి రోజును స్వాతంత్ర్య దినంగా పాటించాలని నిశ్చయించబడింది. బ్రిటిష్ అధికారం నుంచి భారతదేశాన్ని విముక్తి పొందించుటకు స్వాతంత్ర్యపోరాటం అహింసామార్గంలో నడిపించాలని 26 జనవరి 1930 రోజున దేశమంతటా ప్రతిజ్ఞ చేయబడింది. దీనివలన దేశమంతట చైతన్యవంతమైన వాతావరణం ఏర్పడింది.

## అభ్యాసం

1. **ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(1) గాంధీజీ తన పనిని ................................ దేశం నుంచి ప్రారంభించాడు.

(అ) భారత (బ) ఇంగ్లండ్

(క) దక్షిణాఫ్రికా (డ) మ్యాన్‌మార్

(2) రైతులు ............................ జిల్లాలో పన్ను ఎగవేత ఉద్యమం ప్రారంభించారు.

(అ) గోరఖ్‌పూర్ (బ) ఖెడా

(క) సోలాపూర్ (డ) అమరావతి

(3) జలియన్ వాలా బాగ్ హత్యాకాండ నిషేదార్థం రవీంద్రనాథ్ ఠాగోర్ ప్రభుత్వం ఇచ్చిన ..................... బిరుదును త్యాగం చేశాడు.

(అ) లార్డ్ (బ) సర్

(క) రావ్ బహదూర్ (డ) రావు సాహెబ్

2. **కింది ప్రశ్నలకు ఒక వాక్యంలో జవాబులు రాయండి.**

(1) దక్షిణాఫ్రికాలో నల్లజాతీయులపై 1906 ఆదేశానుసారం ఏ నిబంధనలు విధించడం జరిగింది ?

(2) గాంధీజీ భారతదేశంలో మొదటి సత్యాగ్రహం ఎక్కడ చేశాడు ?

(3) జలియన్ వాలా బాగ్‌లో కాల్పులకు ఆదేశించిన అధికారి ఎవరు ?

3. **కింది ప్రశ్నలకు 25 నుంచి 30 పదాల్లో జవాబులు రాయండి.**

(1) సత్యాగ్రహం యొక్క తత్వజ్ఞానాన్ని స్పష్టీకరించండి.

(2) స్వరాజ్యపక్షం (పార్టీ) ఎందుకు స్థాపించబడింది ?

4. **కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

(1) రౌలట్ చట్టాన్ని భారత ప్రజలు వ్యతిరేకించారు.

(2) గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేశాడు.

(3) భారతీయులు సైమన్ కమీషన్‌ను బహిష్కరించారు.

(4) భారతదేశంలో ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభింపబడింది.

**ఉపక్రమం**

26 జనవరి 1930 రోజున చేయబడిన స్వాతంత్ర్య ప్రతిజ్ఞను సేకరించి దానిని తరగతిలో సామూహికంగా పఠనం చేయండి.

BEPCT9

# 8. సవినయ శాసనోల్లంఘన ఉద్యమం

లాహోర్ సమావేశంలో సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం ఆమోదం పొందిన తరువాత మహాత్మాగాంధీ సవినయ శాసనోల్లంఘన ఉద్యమం చేయుటకు నిశ్చయించాడు. ఈ ఉద్యమం ప్రారంభించుటకు ముందు గాంధీజీ బ్రిటిష్ ప్రభుత్వానికి వివిధ విన్నపాలు చేశాడు. అందులో ఉప్పుపై గల పన్నును రద్దుచేసి ఉప్పు తయారు చేయుటలో ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని రద్దు చేయమనే విన్నపం ఉండెను. కాని ప్రభుత్వం గాంధీజీ కోరికను తిరస్కరించడం వలన గాంధీజీ ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించి దేశమంతట సత్యాగ్రహం చేయుటకు నిశ్చయించుకొనెను.



దండి యాత్ర

ఉప్పు సామాన్య మానవుల ఆహారంలో ముఖ్యమైన భాగం. అందువలన ఉప్పు వంటి నిత్యావసర వస్తువులపై పన్ను విధించడం అన్యాయంగా ఉండెను. అందువలన గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం చేశాడు. ఉప్పు సత్యాగ్రహం ప్రతిఘటనాత్మకంగా ఉండెను. బ్రిటిష్ ప్రభుత్వం యొక్క దౌర్జన్యం, అన్యాయపూరిత చట్టాలను శాంతియుత మరియు సత్యాగ్రహ మార్గంలో ఎదిరించాలని దీని వెనుక గల విశాల ఉద్దేశం.

ఉప్పు సత్యాగ్రహం చేయుటకు గాంధీజీ గుజరాత్ సముద్రతీరంపై దండి అను ప్రాంతాన్ని ఎంపిక చేశాడు. 12 మార్చి 1930 రోజున గాంధీజీ 78 మంది సహచరులతో సాబర్మతి ఆశ్రమం నుంచి దండి వద్దకు వెళ్ళుటకు బయలు దేరాడు. సుమారు 385 కిలోమీటర్ల పాదయాత్రలో మార్గంలోని అనేక గ్రామాలలో అతడు ప్రసంగించాడు. తన ప్రసంగాల ద్వారా గాంధీజీ ప్రజలను నిర్భయంగా శాసనోల్లంఘన ఉద్యమంలో చేరమని పిలుపునిచ్చాడు. గాంధీజీ ప్రసంగాల వలన శాసనోల్లంఘన సందేశం అంతటా వ్యాపించి ఉద్యమానికి అనుకూల వాతావరణం తయారైంది. 5 ఏప్రిల్ 1930 రోజున గాంధీజీ దండికి చేరుకొన్నాడు. 6 ఏప్రిల్ రోజున దండి సముద్ర తీరంపై ఉప్పును చేపట్టి గాంధీజీ ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించడంతో దేశమంతట సవినయ శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభమైనది.

**పెషావర్ సత్యాగ్రహం :** వాయవ్య సరిహద్దు ప్రాంతంలో ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ గాంధీజీకి విశ్వాస పాత్రుడైన అనుచరుడుగా ఉండెను. అతనిని సరిహద్దు గాంధీ అని పిలిచేవారు. అతడు 'ఖుదా-ఇ-ఖిద్‌మత్‌గార్' అను సంఘాన్ని స్థాపించాడు. 23 ఏప్రిల్ 1930 రోజున అతడు పెషావర్‌లో సత్యాగ్రహం ప్రారంభించాడు. సుమారు వారం రోజులపాటు పెషావర్ పట్టణం సత్యాగ్రహం స్వాధీనంలో ఉండెను. ప్రభుత్వం గఢవాల్ సైన్యవిభాగాన్ని సత్యాగ్రహులపై కాల్పులు జరపమని ఆదేశించింది. కాని గఢవాల్ సైన్య విభాగపు అధికారి చంద్రసింగ్ ఠాకూర్ కాల్పులు జరుపుటకు నిరాకరించాడు. అందువలన సైనిక న్యాయస్థానం అతనికి కఠిన శిక్ష విధించింది.



ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్

మహాత్మాగాంధీ ప్రారంభించిన సవినయ శాసనోల్లంఘన ఉద్యమం వలన బ్రిటిష్ ప్రభుత్వం కష్టాల్లో పడింది. 4 మే 1930 రోజున గాంధీజీని నిర్బంధించడం జరిగింది. దేశమంతట అణచివేత చర్యలు ప్రారంభమైనవి. గాంధీజీ నిర్బంధాన్ని దేశమంతట నిషేధించడం జరిగింది.

**సోలాపూర్ సత్యాగ్రహం :** సోలాపూర్‌లోని సత్యాగ్రహంలో మిల్లు కార్మికులు ముందుండిరి. 6 మే 1930 రోజున సోలాపూర్‌లో సమ్మె పాటించడం జరిగింది. ఈ సందర్భంగా సోలాపూర్‌లో పెద్ద ఊరేగింపు తీయడం జరిగింది. ఆనాటి కలెక్టర్ ఊరేగింపుపై కాల్పులు జరపమని ఆదేశించాడు. అందులో శంకర్ శివదారేతోబాటు అనేక

స్వయం సేవకులు మృత్యువాత పడ్డారు. ఫలితంగా ప్రజలు పోలీస్‌స్టేషన్‌లు, రైల్వే స్టేషన్లు, న్యాయస్థానాలు, మున్సిపల్ భవనాలు మొదలగు వాటిపై దాడి చేశారు. ప్రభుత్వం మార్షల్ లా అనగా సైనిక చట్టం జారీ చేసింది. ఆందోళన అణచివేయబడినది. ఈ ఆందోళనలో ముందున్న మల్లప్ప ధనశెట్టి, శ్రీకృష్ణ సారడా, కుర్బాన్ హుసేన్, జగన్నాథ్ శిందేలను ఉరి తీయడం జరిగింది.


మల్లప్ప ధనశెట్టి


శ్రీకృష్ణ సారడా


కుర్బాన్ హుసేన్


జగన్నాథ్ శిందే

**ధారాసనా సత్యాగ్రహం :** గుజరాత్‌లోని ధారాసనాలో సరోజిని నాయుడు సత్యాగ్రహానికి నాయకత్వం వహించింది. ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించడానికి బయలుదేరిన సత్యాగ్రహులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. సత్యాగ్రహులు కూడా శాంతియుతంగా లాఠీదెబ్బలను సహిస్తుండిరి. వారిని చికిత్స కొరకు తీసుకు వెళ్ళిన తరువాత రెండం బృందం సత్యాగ్రహం చేయుటకు ముందుకు వచ్చేది. ఇలా అఖండితంగా సత్యాగ్రహం కొనసాగుతుండెను. మహారాష్ట్రలో వడాళా, మూలవణ్, శిరోడా ప్రాంతాలలో ఉప్పు సత్యాగ్రహం జరిగింది.


సరోజిని నాయుడు

ఎక్కడ ఉప్పు గిడ్డంగులు లేవో అక్కడ ప్రజలు అటవీ సంబంధ చట్టాన్ని ధిక్కరించడం ప్రారంభించారు. మహారాష్ట్రలో బిళాశీ, సంగమనేర్, కళవణ్, చిరనేర్, పుసద్ మొదలగు ప్రాంతాల్లో సత్యాగ్రహం జరిగింది. ఆదివాసులు అటవీ సత్యాగ్రహంలో పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారు.

**బాబూగెనూ బలిదానం :** ముంబయిలో విదేశీ వస్తువులపై బహిష్కరణ ఆందోళన ప్రారంభమైంది. విదేశీ వస్తువుల రవాణా చేయు వాహనాలను ఆందోళనకారులు అడ్డగించేవారు. ముంబయిలోని మిల్లులో పని చేస్తున్న బాబుగెనూ సైద్ ఈ ఆందోళనలో ముందుండెను. పోలీసు బందోబస్తుతో విదేశీ వస్తువులను తీసుకువెళ్ళే ఒక ట్రక్ బాబుగెనూ ఎదురుగా వచ్చింది. ట్రక్‌ను అడ్డగించుటకు అతడు దారిలో అడ్డుగా పడుకొన్నాడు. పోలీసులు భయపెట్టినా కూడా అతడు అక్కడినుంచి కదలలేదు. చివరకు ట్రక్ అతని శరీరం మీదుగా వెళ్ళింది. అందులో బాబు గెనూ స్వర్గస్తుడైనాడు.


బాబు గెను


మీకు తెలుసా ?

**శాసనోల్లంఘన ఉద్యమ విశిష్టతలు :**

- ఇప్పటి వరకు జరిగిన ఉద్యమాలు పట్టణ ప్రాంతం వరకే పరిమితమై యుండెను. కాని ఈ ఉద్యమం దేశవ్యాప్తమైంది. గ్రామగ్రామాలు నుంచి ప్రజలు తమ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.
- ఇందులో స్త్రీలు కూడా పెద్ద యెత్తున భాగస్వాములైనారు. కస్తురిబా గాంధీ, కమలాదేవి చటోపాధ్యాయ, అవంతికాబాయి గోఖలే, లీలావతి మున్షీ, హంసాబెన్ మెహతాలు సత్యాగ్రహులకు నాయకత్వం వహించారు.
- ఈ ఉద్యమం పూర్తిగా అహింసాయుత పద్ధతిలో కొనసాగింది. ఆంగ్ల ప్రభుత్వం చాలా అణచివేత చర్యలు చేపట్టినప్పటికి ప్రజలు నిరాయుధులై ప్రతిఘటించారు. అందువలన భారతీయ ప్రజలు నిర్భయులైరి.

**రౌండ్ టేబుల్ సమావేశం :** సవినయ శాసనోల్లంఘన ఆందోళన కొనసాగుతున్న సమయంలోనే భారతదేశానికి సంబంధించిన రాజ్యాంగబద్ధమైన సమస్యలను గురించి ఆలోచించవలెనని బ్రిటిష్ ప్రధానమంత్రి రామ్సే మాక్‌డొనాల్డ్ అభిప్రాయ పడ్డాడు. అందుకోసం అతడు లండన్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. ఈ సమావేశాన్ని రౌండ్‌టేబుల్ సమావేశం అని అంటారు. 1930 నుంచి 1932 వరకు గల వ్యవధిలో మూడు రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేయబడినవి.

**మొదటి రౌండ్ టేబుల్ సమావేశం :** రామ్సె మాక్‌డొనాల్డ్ మొదటి సమావేశానికి అధ్యక్షుడుగా ఉండెను. ఈ సమావేశానికి భారతదేశ ప్రతినిధులు అదేవిధంగా ఇంగ్లండ్‌లోని వివిధ ప్రతినిధులు హాజరైనారు. అందులో డా.బాబాసాహెబ్ అంబేడ్కర్, సర్ తేజ్‌బహాదూర్ సప్రూ, బారిష్టర్ జిన్నా మొదలగువారి భాగస్వామ్యం ఉండెను. కేంద్రస్థాయిలో బాధ్యతాయుత ప్రభుత్వపద్ధతి, భారతదేశంలో సమాఖ్య రాజ్యస్థాపన వంటి వివిధ విషయాలపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో వివిధ జాతీయ పార్టీలు, సంస్థానాధీశుల ప్రతినిధులు హాజరైనారు. కాని జాతీయ మహాసభ ఈ సమావేశంలో పాల్గొనలేదు. జాతీయ మహాసభ భారతదేశ ప్రతినిధిత్వసంస్థ. దాని భాగస్వామ్యం లేకుండా రౌండ్ టేబుల్ సమావేశంలోని చర్చలు నిష్ఫలమైనవి.

**గాంధీ-ఐర్విన్ ఒప్పందం :** రౌండ్ టేబుల్ సమావేశంలో రెండవ ఆవృత్తంలోని చర్చల్లో జాతీయ మహాసభ భాగస్వామి అవుతుందని బ్రిటిష్ ప్రధానమంత్రి ఆశించాడు. ప్రధానమంత్రి ఆహ్వానం దృష్టిలో నుంచుకొని వైస్‌రాయ్ గాంధీజీ, ఇతర నాయకులను కారాగారం నుంచి విడుదల చేశాడు. జాతీయ మహాసభ స్వేచ్ఛగా చర్చించే అవకాశం కలిగించుటకు తగి వాతావరణాన్ని కల్పించాడు. మహాత్మాగాంధీ, వైస్‌రాయ్ ఐర్విన్‌ల మధ్య ఒప్పందం జరిగింది. దీనినే గాంధీ-ఐర్విన్ ఒప్పందం అని అంటారు. ఈ ఒప్పందం ప్రకారం బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశ ప్రస్తావిత రాజ్యాంగంలో బాధ్యతాయుత ప్రభుత్వ పద్ధతిని స్వీకరించే మాట యివ్వబడింది. ఫలితంగా 'జాతీయ మహాసభ సవినయ శాసనోల్లంఘన ఉద్యమం ఉపసంహరించుకొని రెండవ రౌండ్ టేబుల్ సమావేశ చర్చల్లో భాగస్వామి అగుటకు సంసిద్ధత కనబరిచింది.

**రెండవ రౌండ్ టేబుల్ సమావేశం :** 1931 సంవత్సరంలో రెండవ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మహాత్మాగాంధీ జాతీయ మహాసభ ప్రతినిధిగా హాజరయ్యాడు. జాతీయ మహాసభ ప్రకారం భారతదేశంలోని వేరువేరు జాతులు-తెగలు, పార్టీలు అదేవిధంగా సంస్థానాదీశుల ప్రతినిధులను పిలవడం జరిగింది. రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వం అల్ప సంఖ్యాకుల సమస్యను ప్రవేశపెట్టింది. ఈ సమస్యపై అదేవిధంగా భవిష్యత్ సమాఖ్య రాజ్యాంగ స్వరూపం గురించి అభిప్రాయ భేదాలు ఏర్పడ్డాయి. గాంధీజీ ఏకాభిప్రాయంకోసం ప్రయత్నించాడు. కాని అతడు విఫలమయ్యాడు. చివరికి నిరాశచెంది గాంధీజీ భారతదేశానికి తిరిగి వచ్చాడు.

**పుణె ఒప్పందం :** డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ రౌండ్‌టేబుల్ సమావేశంలో దళితులకు ప్రాతినిధ్యం వహించాడు. అక్కడ అతడు దళితుల కోసం ప్రత్యేక నియోజక వర్గాన్ని కోరాడు. రెండవ రౌండ్ టేబుల్ సమావేశం తరువాత బ్రిటిష్ ప్రధానమంత్రి రామ్సె మాక్‌డొనాల్డ్ జాతీయ నిర్ణయాన్ని ప్రకటించాడు. దాని ప్రకారం దళితుల కొరకు ప్రత్యేక నియోజక వర్గాలు ప్రకటింపబడినవి. జాతీయ ప్రకటన ప్రకారం హిందూ సమాజంలో జరిగిన విభజన మహాత్మాగాంధీకి నచ్చలేదు. కావున అతడు ఈ నిర్ణయానికి వ్యతికంగా యెరవడా జైల్లో ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించాడు. జాతీయ మహాసభ నాయకులు డా.బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అతని ప్రతిపాదనను పునర్విచారించమని విన్నవించారు. జాతి ప్రయోజనాన్ని దృష్టిలో నుంచుకొని డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ ఈ విన్నపాన్ని ఒప్పుకొన్నాడు. 1932 లో మహాత్మాగాంధీ, డా. బాబాసాహెబ్ అంబేడ్కర్‌ల మధ్య పుణె వద్ద ఒక ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం 'పుణె ఒప్పందం'గా ప్రసిద్ధి చెందింది. ఈ ఒప్పందం ప్రకారం దళితుల కొరకు ప్రత్యేక నియోజకవర్గం బదులుగా ఆరక్షిత(రిజర్వు) స్థానాల ఏర్పాటు జరిగింది.


డా. బాబాసాహెబ్ అంబేడ్కర్

**మూడవ రౌండ్ టేబుల్ సమావేశం** : నవంబర్ 1932లో ఇంగ్లండ్‌లో మూడవ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. కాని జాతీయ మహాసభ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. అందువలన ఈ సమావేశం అర్థరహితమైంది.

**సవినయ శాసనోల్లంఘనం రెండవ దశ** : రెండవ రౌండ్ టేబుల్ సమావేశం నుంచి ఉద్వేగభరిత మనస్సుతో గాంధీజీ భారతదేశానికి తిరిగి వచ్చాడు. అతడు సవినయ శాసనోల్లంఘన ఆందోళన మళ్ళీ ప్రారంభించడానికి నిర్ణయించాడు. గాంధీజీని ప్రభుత్వం వెంటనే నిర్బంధించింది. అందువలన ప్రజల్లో అసంతృప్తి ఏర్పడింది.

ప్రభుత్వం ఈ ఉద్యమానికి అమానుష అణచివేత చర్యలతో జవాబిచ్చింది. అంతట పౌర హక్కులను కాలరాయడం జరిగింది. జాతీయ మహాసభ, దాని అనుబంధ సంఘాలు చట్టవిరుద్ధమైనవిగా ప్రకటింపబడ్డాయి. వాటి కార్యాలయాలను, నిధులను స్వాధీనం చేసుకొన్నది. జాతీయ వార్తాపత్రికలు, సాహిత్యాలపై నిర్బంధం విధించబడింది. చివరికి ఏప్రిల్ 1934లో గాంధీజీ ఉద్యమాన్ని వెనుకకు తీసుకొన్నాడు. అంతటితో సవినయ శాసనోల్లంఘన ఉద్యమం యొక్క చరిత్రాత్మక అధ్యాయం ముగిసింది.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాల నుంచి సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(మహాత్మాగాంధీ, ఖుదా-ఇ-ఖిద్‌మత్‌గార్, రామ్సె మాక్‌డొనాల్డ్, సరోజిని నాయుడు)

1) లండన్‌లో ............... రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశాడు.

2) ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ ................... అను సంఘాన్ని స్థాపించాడు.

3) ధారాసనా సత్యాగ్రహానికి ........... నాయకత్వ వహించింది.

4) రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి జాతీయ మహాసభ ప్రతినిధిగా ........................ హాజరయ్యాడు.

**2. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

1) చంద్రసింగ్ ఠాకూర్‌కు సైనిక న్యాయస్థానం కఠినమైన శిక్ష విధించింది.

2) సోలాపూర్‌లో ప్రభుత్వం మార్షల్ లా అనగా సైనిక చట్టాన్ని జారీ చేసింది.

3) మొదటి రౌండ్‌టేబుల్ సమావేశంలోని చర్చలు విఫలమయ్యాయి.

4) గాంధీజీ యెరవడా జైలులో ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించాడు.

**3. కింది ప్రశ్నలకు 25 నుంచి 30 పదాలలో జవాబులు రాయండి.**

1) గాంధీజీ ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించి దేశమంతట సత్యాగ్రహం చేయుటకు ఎందుకు నిర్ణయించుకొన్నాడు?

2) జాతీయ మహాసభ సవినయ శాసనోల్లంఘన ఉద్యమాన్ని ఎందుకు ఉపసంహరించింది ?

**4. సవియన శాసనోల్లంఘన ఉద్యమం యొక్క కింది కాలరేఖను పూరించండి.**

12 మార్చి 1930 | 6 ఏప్రిల్ 1930 | 23 ఏప్రిల్ 1930 | 4 మే 1930 | 6 మే 1930

### ఉపక్రమం

1) సవినయ శాసనోల్లంఘన ఉద్యమంలోని కింది వ్యక్తుల పనుల గురించి అధిక సమాచారాన్ని సేకరించి ఛాయాచిత్రాలతో తరగతిలో ప్రదర్శించండి.
(అ) సరోజిని నాయుడు (బ) ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ (క) బాబుగెనూ సైద్.

2) పాఠంలో పేర్కొన్న సవినయ శాసనోల్లంఘన ఉద్యమంలోని స్థలాలను భారతదేశ మానచిత్ర పటంలో చూపించండి.

BEY8UH

# 9. స్వాతంత్ర్య పోరాట అంతిమ ఘట్టం

ఈ పాఠంలో మనం భారతదేశాన్ని విడిచిపెట్టండి (క్విట్ ఇండియా) ఉద్యమం, అజ్ఞాత (రహస్య) ఉద్యమం, ఆజాద్‌హింద్ ఫౌజ్ పనుల గురించి అభ్యసనం చేయనున్నాం.

**1935 చట్టం :** ఈ చట్టంతో భారతదేశంలో బ్రిటిష్ పాలిత ప్రాంతాలు, సంస్థానాలను కలుపుతు ఒక సమాఖ్య రాజ్యాన్ని ఏర్పాటు చేసే చట్టం చేయబడింది. దీని ప్రకారం బ్రిటిష్‌పాలిత ప్రాంతాల పరిపాలన భారతీయ ప్రతినిధులకు అప్పగింపబడనుండెను. సమాఖ్య రాజ్యంలో కలిస్తే సంస్థానాలకు స్వయం ప్రతిపత్తి ఉండదు. అందువలన సంస్థానాధీశులు, సమాఖ్య రాజ్యంలో కలియుటకు తిరస్కరించారు. కావున ఈ చట్టంలోని సమాఖ్య రాజ్య ప్రణాళిక అమలులోనికి రాలేదు.

**ప్రాంతీయ మంత్రి మండళ్ళు :** 1935 చట్టం జాతీయ మహాసభను సంతృప్తి పరచనప్పటికి ఈ చట్టం ప్రకారం జరిగే ప్రాంతీయ శాసన మండళ్ళ ఎన్నికల్లో జాతీయ మహాసభ పాల్గొనుటకు నిశ్చయించుకొన్నది. 1937లో దేశంలోని పదకొండు ప్రాంతాలలో ఎన్నికలు జరిగాయి. అందులో ఎనిమిది ప్రాంతాలలో జాతీయ మహాసభకు ఆధిక్యత లభించడంతో వారి మంత్రిమండళ్ళు అధికారంలోకి వచ్చాయి. ఇతర మూడు ప్రాంతాల్లో ఏ పార్టీకి కూడా ఆధిక్యత లభించక పోవడంతో అక్కడ సంకీర్ణమంత్రి మండళ్ళు ఏర్పాటు చేయబడినవి.

జాతీయ మహాసభ మంత్రిమండళ్ళు రాజకీయ ఖైదీలను కారాగార విముక్తి, మౌళిక పరిశ్రమల విద్యారంభం, దళిత సమాజ సంస్కరణకై తరుణోపాయాలు, మద్యనిషేధం, రైతుల కొరకు ఋణమాఫీ చట్టం వంటి అనేక ప్రజోపయోగ పనులు చేసింది.

**క్రిప్స్ ప్రణాళిక :** రెండవ ప్రపంచయుద్ధంలో ఇంగ్లండ్ జపాన్‌కు వ్యతిరేకంగా అమెరికా పక్షాన నిలిచింది. జపాన్ సేనలు భారతదేశ తూర్పు సరిహద్దులకు సమీపంలో ఆక్రమణ చేసింది. జపాన్ భారతదేశంపై ఆక్రమణ చేసినట్లయితే దానిని ప్రతిఘటించుటకు భారతీయుల సహాయాన్ని పొందుట 'ఇంగ్లండ్‌కు అసాధ్యమనిపించ సాగింది. అందువలన ఇంగ్లండ్ ప్రధానమంత్రి విన్స్టన్ చర్చిల్ స్టఫర్డ్ క్రిప్స్‌ను భారతదేశానికి పంపాడు. మార్చ్ 1942లో అతడు భారతదేశానికి సంబంధించిన ఒక ప్రణాళికను భారతీయుల ముందుంచాడు. కానీ ఈ ప్రణాళిక వలన ఏ రాజకీయ పార్టీకూడా సంతృప్తి పడలేదు. పూర్తి స్వాతంత్ర్యపు కోరికకు సంబంధించిన విషయం ప్రణాళికలో స్పష్టంగా పేర్కొనక పోవడం వలన జాతీయ మహాసభ దానిని తిరస్కరించింది. క్రిప్స్ ప్రణాళికలో పాకిస్థాన్ ఏర్పాటు అంశం లేకపోవడంతో ముస్లిం లీగ్ ఈ ప్రణాళికను తిరస్కరించింది.

**రెండవ ప్రపంచయుద్ధం మరియు జాతీయ మహాసభ :** 1939లో యూరోప్‌లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. అప్పటి వైస్‌రాయ్ లార్డ్ లిన్‌లిథగో భారతదేశం ఇంగ్లండ్ పక్షాన యుద్ధంలో పాల్గొన్నదని ప్రకటించాడు. యూరోప్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ చేయుటకొరకు మేము పోరాడుతున్నామని ఇంగ్లండ్ వాదించింది. ఈ వాదన నిజమైనదైతే ఇంగ్లండ్ భారతదేశానికి తక్షణమే స్వాతంత్ర్యం ఇవ్వాలని జాతీయ మహాసభ కోరింది. ఈ కోరికను నెరవేర్చుటకు ఇంగ్లండ్ ఒప్పుకోకపోవడంతో నవంబరు 1939లో జాతీయ మహాసభ యొక్క ప్రాంతీయ మంత్రి మండళ్ళు రాజీనామా చేశాయి.

**క్విట్ ఇండియా ఉద్యమం :** క్రిప్స్ ప్రణాళిక అనంతరం జాతీయ మహాసభ స్వాతంత్ర్యం కొరకు తీవ్ర ఉద్యమం చేయుటకు నిశ్చయించు కొన్నది. వర్ధాలో 14 జులై 1942 రోజున జాతీయ మహాసభ కార్యవర్గం భారతదేశంలోని బ్రిటిష్ అధికారం వెంటనే ఉపసంహరించుకొని భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలని కొరుటకై తీర్మాణం చేసింది. ఈ కోరికను నెరవేర్చక పోతే జాతీయ మహాసభ భారతదేశ స్వాతంత్ర్యం కొరకు అహింసాయుత ఉద్యమం ప్రారంభించునని హెచ్చరించింది.

**క్విట్ ఇండియా తీర్మాణం :** 7 ఆగష్టు 1942 రోజున ముంబయి గవాలియా టాంక్ మైదానంపై (క్రాంతి మైదానం) జాతీయ మహాసభ సమావేశం మొదలైంది. ఈ సమావేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అధ్యక్షుడుగా ఉండెను. బ్రిటిష్‌వారు భారతదేశాన్ని విడిచి వెళ్ళాలి అని జాతీయ మహాసభ కార్యవర్గం వర్ధాలో చేసిన తీర్మాణంపై ముంబయిలోని సమావేశంలో ఆమోదింపబడనుండెను. 8 ఆగష్టు రోజున పండిత జవహర్‌లాల్ నెహ్రూ



మౌలానా ఆజాద్

ప్రతిపాదించిన ఈ 'క్విట్ ఇండియా' తీర్మాణం మతాధిక్యతతో ఆమోదించపబడింది. గాంధీజీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అహింసాయుత ఆందోళన ప్రారంభించుటకు నిర్ణయించడం జరిగింది. గాంధీజీ అన్నాడు. '' ఈ క్షణం నుంచి మీలో స్త్రీ-పురుషులందరు మేము స్వతంత్రుల మయ్యామని భావించాలి. స్వతంత్ర భారతదేశ పౌరులుగా వ్యవహరించాలి. మనం భారతదేశానికి స్వాతంత్ర్యాన్నైనా సాధించుదాం లేక ఈ భగీరత ప్రయత్నంలో మరణాన్నైనా పొందుదాం'' గాంధీజీ ప్రజలకు 'కరేంగే యా మరేంగే' (విజయమో వీరస్వర్గమో) అను భావనతో బలిదానానికి సిద్ధం కావాలని స్ఫూర్తిదాయక పిలుపును ఇచ్చాడు.

**ప్రజా ఉద్యమ ప్రారమభం :** జాతీయ మహాసభ ప్రముఖ నాయకులను నిర్భంధించారనే వార్త దేశమంతటా వ్యాపించింది. కోపోద్రిక్తులైన ప్రజలు అక్కడక్కడ ఊరేగింపులు తీసారు. పోలీసులు ప్రజలపై లాఠీలు ఝుళిపించారు, తూటాలు పేల్చారు. అయినను ప్రజలు భయపడలేదు. కొన్ని చోట్ల బ్రిటిష్ ప్రభుత్వ అణచివేతకు ప్రతీకలుగా ఉన్న చెరసాలలు, పోలీసు స్టేషన్లు, రైల్వే స్టేషన్లపై ఆందోళన కారులు దాడి చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను స్వాధీనం

**తెలుసుకొందాం పద...**

**వ్యక్తిగత సత్యాగ్రహం :** బ్రిటిష్ ప్రభుత్వం అభ్యర్ధనలను నిరంతరంగా నిర్లక్ష్యం చేయడం వలన జాతీయ మహాసభ యుద్ధానికి వ్యతిరేక ప్రచారం చేయదలచింది. అందుకోసం సామూహిక ఉద్యమం చేయకుండా ఒక్కో వ్యక్తి శాసనోల్లంఘన చేయాలనే నిర్ణయం తీసుకోబడింది. దీనినే వ్యక్తిగత సత్యాగ్రహం అని అంటారు. ఆచార్య వినోబా భావె వ్యక్తిగత సత్యాగ్రహానికి ఆద్యుడు. అతని తరువాత సుమారు ఇరువది ఐదు వేల సత్యాగ్రహులు వ్యక్తిగత సత్యాగ్రహంలో పాల్గొని కారాగారవాసం స్వీకరించారు.



ఆచార్య వినోబా భావె

చేసుకొనే ప్రయత్నం జరిగింది. మహారాష్ట్రలో చిమూర్, ఆష్టీ, యావలీ, మహాడ్, గార్గోటి మొదలగు అనేక గ్రామాలనుంచి ఆబాల వృద్ధులు తీవ్రంగా అవధులు లేని ధైర్యంతో చేసిన పోరాటం అవిస్మరణీయమైనది.



**మీకు తెలుసా ?**

**బాల వీరుల స్ఫూర్తి గాథ ...**



శిరీష్ కుమార్

బాలవీరుల స్ఫూర్తిగాథ స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో పాఠశాల విద్యార్థులు కూడా తోడ్పాటు నందించారు. నందుర్‌బార్ వద్ద పాఠశాల విద్యార్థులు శిరీష్‌కుమార్ నాయకత్వంలో మూడు రంగుల జెండా తీసుకొని ఊరేగింపు చేశారు. 'వందేమాతరం' నినాదాలు చేశారు. పోలీసులు కోపోద్రిక్తులై చిన్నపిల్లలపై కూడా కాల్పులు జరిపారు. కాల్పుల్లో శిరీష్‌కుమార్, లాల్‌దాస్, ధన్‌సుఖ్‌లాల్, శశిధర్, ఘనశ్యాం అను పాఠశాల విద్యార్థులు వీరమరణం పొందారు.



జయప్రకాశ్ నారాయణ్

**అజ్ఞాత ఉద్యమం :** 1942 చివరలో ప్రజాఉద్యవం కొత్త మలుపు తిరిగింది. ఉద్యమ నాయకత్వం యువకులైన సామ్యవాద కార్యకర్తల చేతుల్లోకి వచ్చింది. జయప్రకాశ్ నారాయణ్, డా. రామ్ మనోహర్ లోహియా, ఛోటూభాయి పురాణిక్, అచ్యుతరావు పట్వర్ధన్, అరుణ అసఫ్‌అలి, యుసుఫ్ మెహర్ అలి, సుచేతా కృపలాని, ఎస్.ఎమ్. జోషి, శిరూభావు లిమయె, నా.గ.గోరె, యశవంతరావు చవాన్, వసంత్ దాదా పాటిల్, మగన్‌లాల్ బాగడి, ఉషా మెహతా వంటి అనేక మంది నాయకులు ముందుండిరి. రైల్వేమార్గాలను తెగగొట్టడం, టెలిఫోన్ తీగలను కత్తిరించడం, వంతెనలను ధ్వంసం చేయడం మొదలగు పనులతో ఉద్యమకారులు రవాణా మరియు ప్రభుత్వ యంత్రాంగాన్ని విధ్వంసం చేశారు. సంపూర్ణ



అరుణ అసఫ్‌అలీ



అచ్యుతరావు పట్వర్ధన్

భారతదేశంలో ఉద్యమ ప్రతిధ్వనులు మిన్నుముట్టాయి. సింధు ప్రాంతంలో హేము కలాని సాయుధ బ్రిటిష్ సైన్యాన్ని తీసుకువెళుతున్న రైలుబండి వస్తున్నదనే వార్త తెలియగానే తన అనుచరులతో రైలుమార్గాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నించాడు. న్యాయస్థానం అతనికి ఉరి శిక్ష విధించింది.

ప్రస్తుత రాయగడ్ జిల్లాలోని కర్జత్ తాలుకాలో భాయి కోత్వాల్ 'ఆజాద్ దస్తా' నాగపూర్‌లోని జనరల్ ఆవారి 'లాల్ సేనా' వంటి బృందాలు ఎన్నో మాసాలు ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టి వదిలాయి. ముంబయిలో విఠల్ జవేరీ, ఉషా మెహతా మరియు వారి అనుచరులు ఒక రహస్య ప్రసార కేంద్రాన్ని స్థాపించారు. దానిని 'ఆజాద్ రేడియో' అనేవారు. దానిలో దేశభక్తి గీతాలు ఆలపించ బడేవి. దేశంలోని ఉద్యమవార్తలు ప్రసారం చేయబడేవి. దేశభక్తికి సంబంధించిన ప్రసంగాలు ప్రసారం చేయబడేవి. అందువలన ఉద్యమం నడిపించడానికి ప్రజలకు ప్రోత్సాహం లభించేది. ఇటువంటి ప్రసార కేంద్రాలు కోల్‌కతా, ఢిల్లీ, పుణెల్లో కొంతకాలం నడిచాయి.

**సమాంతర ప్రభుత్వాల స్థాపన :** దేశంలోని కొన్ని ప్రాంతాల్లో బ్రిటిష్ అధికారులను వెళ్ళగొట్టి అక్కడ ప్రజాభిముఖ ప్రభుత్వాలు ఏర్పాటు చేయబడినవి. వీటిని 'సమాంతర ప్రభుత్వములు' అని అంటారు. బెంగాల్‌లోని మిదనాపూర్, ఉత్తరప్రదేశ్‌లోని బాలియా మరియు ఆఝంగడ్, బీహార్‌లోని భాగల్‌పూర్ మరియు పూర్ణియా జిల్లాల్లో సమాంతర ప్రభుత్వాలు స్థాపించబడినవి.

మహారాష్ట్రలో సాతారా జిల్లాలో క్రాంతిసింగ్ నానా పాటిల్ 1942 సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని అంతమొందించి సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేశాడు. కుండల్ వద్ద విప్లవ కారుడు జి.డి. అలియాస్ బాపూలాడ్ నాయకత్వంలో స్థాపించబడిన తుఫాన్ సేన మాధ్యమం ద్వారా పన్ను వసూలు చేయుట, చట్టం మరియు సువ్యవస్థలను కాపాడుట, నేరస్థులను శాసించడం వంటి పనులు సమాంతర ప్రభుత్వం ద్వారా చేయబడేవి. ఈ ప్రభుత్వంచే నియమించబడిన ప్రజాన్యాయస్థానాల ద్వారా ఇవ్వబడిన తీర్పులను ప్రజలు అంగీకరించేవారు. వడ్డీ వ్యాపార వ్యవస్థకు వ్యతిరేకత, మద్యనిషేధం, అక్షరాస్యత ప్రచారం, జాతిభేద నిర్మూలనం వంటి అనేక నిర్మాణాత్మక పనులు ఈ ప్రభుత్వాలు చేశాయి. అందువలన సమాంతర ప్రభుత్వాలు ప్రజలకు ప్రేరణ కలిగించేవిగా మారాయి.



క్రాంతిసింగ్ నానా పాటిల్

**క్విట్ ఇండియా ఉద్యమ ప్రాముఖ్యత :** 1942 ఉద్యమం దేశవ్యాప్త ఉద్యమ రూపం దాల్చింది. స్వాతంత్ర్య ప్రాప్తి ఉద్దేశాన్ని పూర్తి చేయడం కొరకు వేల మంది భారతీయులు అవధులులేని త్యాగం చేశారు. చాలా మంది ప్రాణత్యాగం చేశారు. ఉద్యమకారుల సంఖ్య విపరీతంగా పెరుగుట వలన వారిని ఖైదీలుగా ఉంచుటకు దేశంలోని చెరసాలలు కూడా సరిపోలేని పరిస్థితి ఏర్పడింది. సానే గురూజీ, దేశ (రాష్ట్ర) సంత్ తుకడోజీ మహారాజ్ మొదలగువారి దేశభక్తి గీతాలతో ఉద్యమకారుల ఉత్సాహం పెంపొందింపబడింది. ఈదేశ వ్యాప్త ఉద్యమాన్ని 'ఆగష్టు విప్లవం' అని కూడా అంటారు.



దేశసంత్ తుకడోజీ మహారాజ్

**ఆజాద్ హింద్ సేన (ఫౌజ్) :** భారతదేశ స్వాతంత్ర్యార్జన కోసం నేతాజీ సుభాస్‌చంద్ర బోస్ అభూతపూర్వ ప్రయత్నం చేశాడు. భారతదేశ తూర్పు సరిహద్దులపై వేలమంది భారతీయ సైనికులు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా యుద్ధం చేయుటకు సన్నద్ధమయ్యారు. ఈ సైనికులందరు ఆజాద్ హింద్ సేనకు చెందినవారు. వారి నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్.

సుభాష్ చంద్రబోస్ జాతీయ మహాసభ యొక్క ముఖ్యమైన నాయకుడు. అతడు రెండు మార్లు జాతీయ మహాసభ అధ్యక్ష పదవిని అలంకరించాడు. ఇంగ్లండ్



నేతాజీ సుభాష్‌చంద్ర బోస్

రెండవ ప్రపంచ యుద్ధంలో నిమగ్నమై యున్న సమయాన్ని అదునుగా తీసుకొని భారతదేశంలో ఉద్యమాన్ని తీవ్రం చేసే ఉద్దేశ్యంతో ఆంగ్లేయుల శత్రువుల సహాయం తీసుకోవాలి అని సుభాష్‌బాబు అభిప్రాయపడ్డాడు. కాని దీని గురించి 'జాతీయ మహాసభ జ్యేష్ఠ నాయకులతో భేదాభిప్రాయాలు ఏర్పడినవి. ఫలితంగా సుభాష్‌బాబు అధ్యక్షపదవికి రాజీనామా చేశాడు. తన ఆలోచనలను ప్రజలముందు ఉంచడానికి అతడు 'ఫార్వర్డ్‌బ్లాక్' అను పార్టీని స్థాపించాడు.

సుభాష్‌చంద్ర బోస్ తన ప్రసంగం ద్వారా బ్రిటిష్ అధికారానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయమని భారతీయులకు పిలుపునివ్వసాగాడు. అందువలన ప్రభుత్వం అతన్ని జైలులో పెట్టింది. జైలులో సుభాష్‌బాబు ప్రాణాంతక నిరాహారదీక్ష ప్రారంభించడంతో ప్రభుత్వం అతన్ని విడుదల చేసి గృహ నిర్బంధంలో ఉంచింది. కానీ మారువేషం వేసుకొని అక్కడి నుంచి సుభాష్‌బాబు తప్పించుకొన్నాడు. 1941 ఏప్రిల్‌లో అతడు జర్మనీ చేరుకొన్నాడు. అక్కడ అతడు ఫ్రీ ఇండియా సెంటర్‌ను స్థాపించాడు. జర్మనీలోని బర్లిన్ రేడియో కేంద్రం నుంచి భారతదేశ స్వాతంత్ర్యం కొరకు ప్రజలు సాయుధ పోరాటంలో భాగస్వాములు కావలెనని పిలుపునిచ్చాడు. ఇదే కాలంలో రాస్‌బిహారీ బోస్ సుభాష్ బాబును జపాన్‌కు రమ్మని ఆహ్వానించాడు.



రాస్‌బిహారీ బోస్

**ఆజాద్ హింద్ సేన (సైన్యం) స్థాపన :** రాస్‌బిహారీ బోస్ 1915 నుంచి జపాన్‌లో ఉండెను. ఆగ్నేయ ఆసియాలోని దేశభక్తిగల భారతీయులను సంఘటిత పరచి అతడు 'ఇండియన్ ఇండిపెండన్స్ లీగ్' అనే పేరున సంఘాన్ని స్థాపించారు. 1942 పూర్వార్ధంలో జపాన్ ఆగ్నేయ ఆసియాలోని బ్రిటిష్‌వారి స్వాధీనంలోని ప్రాంతాలను జయించింది. అక్కడి బ్రిటిష్ సైన్యంలోని వేలమంది భారతీయ సైనికులు, అధికారులు జపాన్ చేతుల్లో పడ్డారు. యుద్ధఖైదీలుగా ఉన్న భారతీయ సైనికుల ఒక సైనిక బృందాన్ని కా. మోహన్ సింగ్ సహాయంతో రాస్‌బిహారీ బోస్ ఏర్పాటు చేశాడు. దానికి 'ఆజాద్ హింద్ సేన (ఫౌజ్)' అని పేరు పెట్టాడు. తరువాత నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ ఆజాద్ హింద్ సేనకు నాయకత్వం వహించాడు.

1943 అక్టోబర్‌లో నేతాజీ సింగపూర్ వద్ద ఆజాద్‌హింద్ ప్రభుత్వం ఏర్పాటు చేశాడు. షహనవాజ్‌ఖాన్, జగన్నాథ్ భోస్లే. డా.లక్ష్మీ స్వామినాథన్, గురుబక్షింగ్ ధిల్లాన్, ప్రేమ్‌కుమార్ సెహగల్ మొదలగువారు అతనికి ముఖ్యమైన అనుచరులు. క్యాప్టన్ లక్ష్మీస్వామినాథన్ ఝాన్సీరాణి మహిళా దళానికి ప్రముఖురాలుగా ఉండెను. నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారతీయ ప్రజలకు 'తుమ్ ముఝె ఖూన్‌దో, మై తుమ్హే ఆజాదీ దూంగా' (నీవు రక్తాన్నీ చిందిస్తే, నీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను) అని పిలుపు నిచ్చాడు.

**ఆజాద్ హింద్ సేన (ఫౌజ్) పరాక్రమం :** నవంబరు 1943లో జపాన్ అండమాన్ మరియు నికోబార్ దీవులను జయించి వాటికి ఆజాద్ హింద్ ప్రభుత్వానికి అప్పగించింది. నేతాజీ వాటికి క్రమంగా 'శహీద్' 'స్వరాజ్య' అని పేరు పెట్టాడు. 1944లో ఆజాద్ హింద్‌సేన మ్యాన్‌మార్‌లోని ఆరాకాన్ ప్రాంతాన్ని పొందింది. అస్సాం తూర్పు సరిహద్దుపై గల ఠాణాలను జయించింది. ఇదే కాలంలో ఆజాద్ హింద్ సేనకు జపాన్ నుంచి లభించే సహాయం ఆగిపోవడం వలన ఇంఫాల్ ఆక్రమణ అర్ధాంతరంగా ముగిసింది. కాని ప్రతికూల పరిస్థితులలో కూడా ఆజాద్ హింద్ సేన సైనికులు తీవ్రంగా పోరాటం చేయుచుండిరి. కాని ఇదేకాలంలో జపాన్ శరణాగతి వేడుకొన్నది. 18 ఆగష్టు 1945 రోజున విమాన ప్రమాదంలో సుభాష్‌చంద్రబోస్ మరణించాడు. ఈ నేపథ్యంలో ఆజాద్ హింద్ సేన ఆయుధాలను కిందికి దించవలసి వచ్చింది. ఈ విధంగా ఆజాద్ హింద్ సేన వీరోచిత పోరాట అధ్యాయం ముగిసింది.

తరువాత ఆజాద్ హింద్ సేన అధికారులపై బ్రిటిష్ ప్రభుత్వం రాజద్రోహ నేరం మోపింది. పం.జవహర్‌లాల్ నెహ్రూ, భులాభాయి దేసాయి, తేజ్‌బహాదూర్ సప్రూ వంటి నిపుణులైన న్యాయపండితులు వారిని రక్షించే పనులు చేశారు. కాని సైనిక న్యాయస్థానం ఈ అధికారులను దోషులుగా నిర్ధారించి జీవితఖైదు శిక్షను విధించింది. అందువలన భారత ప్రజల్లో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. చివరికి సైనిక న్యాయస్థానం విధించిన శిక్షను ప్రభుత్వం రద్దు

చేయవలసి వచ్చింది.

**భారత నౌకాదళం, వైమానిక దళంలో తిరుగుబాటు :** ఆజాద్ హింద్ సేన ప్రేరణతో నావికాదళ సైనికుల్లో మరియు వాయుదళ సైనికుల్లో బ్రిటిష్ ప్రభుత్వంపై అసంతృప్తి ఏర్పడింది. దాని ప్రభావము 18 ఫిబ్రవరి 1946 రోజున ముంబయిలోని 'తల్వార్' అను యుద్ధనౌకపై పడింది. సైనికులు యుద్ధనౌకపై మూడురంగుల జెండాను ఎగురవేశారు. బ్రిటిష్ అధికారానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం సైన్యాన్ని పంపి నౌకాదళ సైనికులపై కాల్పులు జరిపించింది. దానికి తిరుగుబాటుదారులు కాల్పులతో జవాబు చెప్పారు. ముంబయిలోని కార్మికులు మరియు సామాన్యప్రజలు నౌకాదళ సైనికులకు మద్దతునిచ్చారు. చివరికి సర్దార్ వల్లభభాయి పటేల్ మధ్యవర్తిత్వంతో నౌకాదళ సైనికులు ఆయుధాలను క్రిందకు దించారు.

ముంబయిలోని నౌకాదళ సైనికుల తిరుగుబాటుకు మద్దతునిచ్చుటకు ఢిల్లీ, లాహోర్, కరాచి, అంబాలా, మేరట్ మొదలగు ప్రాంతాల వాయుదళాలలోని అధికారులు కూడా సమ్మె ప్రకటించారు. ఈ తిరుగుబాటు పరిపాలకులపై అసంతృప్తి భావన తారాస్థాయికి చేరిందని చెప్పడానికి నిదర్శనం. ఈ విధంగా 1942 నుంచి 1945 మధ్యకాలంలో భారతదేశంలోని బ్రిటిష్ అధికార పునాది బీటల వారింది. 'క్విట్ ఇండియా' ఉద్యమం ద్వారా భారత ప్రజల తీవ్రమైన బ్రిటిష్ వ్యతిరేకత వ్యక్తమైంది. సైన్యం, నౌకాదళం, వాయుదళాలు బ్రిటిష్ అధికార ఆధార స్తంభాలు. అవి కూడా ఇప్పుడు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తయారు కాసాగినవి. ఈ సంఘటనలన్నింటి వలన భారతదేశంలోని తమ అధికారం చాలాకాలం కొనసాగింపలేమనే విషయం బ్రిటిష్ పాలకులకు తెలిసింది.

## అభ్యాసం

1. **ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

   (అండమాన్ మరియు నికోబార్, ఆగస్ట్ విప్లవం, వినోబాభావే)

   (1) వ్యక్తిగత సత్యాగ్రహానికి .................... ఆద్యుడు.

   (2) 1942 దేశవ్యాప్త ఉద్యమాన్ని ............ అని అంటారు.

   (3) నవంబర్ 1943లో జపాన్ ............. దీవులను జయించి వాటిని ఆజాద్ హింద్ ప్రభుత్వానికి అప్పగించింది.

2. **కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

   (1) నవంబర్ 1939లో జాతీయ మహాసభ ప్రాంతీయ మంత్రిమండళ్ళు రాజీనామాలు చేశాయి.

   (2) ఆజాద్ హింద్ సేన ఆయుధాలను క్రిందకు దించవలసి వచ్చింది.

   (3) సమాంతర ప్రభుత్వాలు ప్రజలకు ప్రేరణ కలిగించాయి.

3. **కింది పట్టికను పూరించండి.**

| సంఘటనలు | సంస్థాపకులు |
|---|---|
| ఫార్వర్డ్ బ్లాక్ | |
| ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్ | |
| తుఫాన్ సైన్యం | |

4. **కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా జవాబులు రాయండి.**

   (1) శిరీష్‌కుమార్ పనులు మీకు ఎలా ప్రేరణాదాయకం?

   (2) ఇంగ్లండ్ ప్రధానమంత్రి విన్స్టన్ చర్చిల్ స్టఫర్డ్ క్రిప్స్‌ను భారతదేశానికి ఎందుకు పంపాడు?

   (3) జాతీయ మహాసభ ప్రముఖ నాయకులు నిర్బంధించబడినారనే వార్త దేశమంతటా వ్యాపించిన పిదప ఏ ప్రతిస్పందన లభించింది?

**ఉపక్రమం**

(1) ఆజాద్ హింద్ సేన (ఫౌజ్) చేసిన పోరాటంలోని సంఘటనల సమయరేఖను తయారుచేయండి.

(2) 1942 క్విట్ ఇండియా ఉద్యమ ఛాయాచిత్రాలను అంతర్జాలం సహాయంతో సేకరించి జాతీయ దినాల సందర్భంగా వాటిని ప్రదర్శించండి.

BF84HJ

# 10. సాయుధ విప్లవకారుల ఉద్యమం

బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా భారతదేశంలో వివిధ మార్గాల్లో ఉద్యమాలు జరిగాయి. అందులో ఒక మార్గం సాయుధ విప్లవం. దాని పరిచయం ఈ పాఠంలో చేసుకోబోతున్నాం.

1857కు పూర్వం ఆంగ్లేయుల అధికారానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాట్లు మరియు 1857 స్వాతంత్ర్యపోరాటం గురించి మనం అభ్యసించాము. ఆ తరువాత కాలంలో రామ్‌సింగ్ కుకా పంజాబ్‌లో ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటుకు ఏర్పాటు చేశాడు.

**వాసుదేవ్ బలవంత్ ఫడ్కే :** మహారాష్ట్రలో వాసుదేవ్ బలవంత్ ఫడ్కే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేశాడు. బ్రిటిష్ సామ్రాజ్యంతో సాయుధ పోరాటం చేయాలని అతడు భావించాడు. అతడు వస్తాద్ లహుజీ సాళవే వద్ద శస్త్ర విద్యను నేర్చుకొన్నాడు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేఖంగా సాయుధ తిరుగుబాటు చేయడానికి అతడు రామోశీ ప్రజలను సంఘటితం చేసి తిరుగుబాటు ప్రకటించాడు. కానీ ఈ తిరుగుబాటు ఫలించలేదు. బ్రిటిష్ ప్రభుత్వం అతనిని ఎడన్ చెరసాలకు పంపించింది. అక్కడనే అతడు 1883లో మరణించాడు. స్వాతంత్ర్యంకోసం అతడు సాయుధ పోరాటాన్ని ప్రారంభించారు.


వాసుదేవ్ బలవంత్ ఫడ్కే

**ఛాపేకర్ సోదరులు :** 1897 సంవత్సరంలో పుణెలో ప్లేగు వ్యాధి నివారణ ఏర్పాట్లు చేస్తున్నప్పుడు ప్లేగ్ కమీషనర్ రాండ్ దౌర్జన్యం చేశాడు. దానికి ప్రతీకారంగా దామోదర్, బాలకృష్ణ అను చాఫేకర్ సోదరులు 22 జూన్ 1897 రోజున రాండ్‌ను హత్యచేశారు. దామోదర్, బాలకృష్ణ మరియు వాసుదేవ్ ఈ ముగ్గురు సోదరులు, వారి అనుచరుడు మహదేవ్ రానడేలు ఉరి తీయబడ్డారు. ఒకే ఇంటినుంచి ముగ్గురు సోదరులు దేశసేవకై వీర మరణాన్ని స్వీకరించారు.

ఇదే కాలంలో బీహార్‌లో ముండా ఆదిమవాసులు బిరసా ముండా నాయకత్వంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చాలా పెద్ద తిరుగుబాటు చేశారు.


స్వాతంత్ర్యవీర్ వి. దా. సావర్కర్

**అభినవ భారత్ :** 1900 సంవత్సరంలో స్వాతంత్ర్యవీర్ వినాయన్ దామోదర్ సావర్కర్ నాశిక్ వద్ద 'మిత్రమేళా' అను విప్లవకారుల రహస్య సంస్థను స్థాపించాడు. 1904 సంవత్సరంలో ఇదే సంస్థకు 'అభినవ భారత్' అని పేరు పెట్టడం జరిగింది. ఉన్నత విద్యను అభ్యసించే ఉద్దేశంతో సావర్కర్ ఇంగ్లండ్ వెళ్ళాడు. అక్కడి నుంచి అతడు అభినవ భారత్ సంస్థ యొక్క భారతదేశంలోని సభ్యులకు విప్లవ సాహిత్యం, పిస్తోళ్ళు మొదలగు వస్తువులను పంపడం ప్రారంభించాడు. అతడు జోసేఫ్ మాజిని అను పేరుపొందిన ఇటాలియన్ విప్లవకారుని స్ఫూర్తిదాయక చరిత్రను రచించాడు. 1857 తిరుగుబాటును మొదటి స్వాతంత్ర్యయుద్ధంగా అభివర్ణిస్తూ '1857 స్వాతంత్ర్యసమరం' అను గ్రంథాన్ని అతడు రచించాడు.


**మీకు తెలుసా ?**

యాభై సంవత్సరాల కఠిన కారాగార శిక్షను అనుభవించడానికి స్వాసావర్కర్‌ను అండమాన్‌కు తీసుకొనివెళ్ళడం జరిగింది. అతడు అక్కడ పది సంవత్సరాలు ఉండెను. 'మాఝీ జన్మఠేప్' (నా జీవితఖైదు) అను స్వీయచరిత్రలో సావర్కర్ అండమాన్‌లోని ఆ భయంకరమైన రోజుల అనుభవాలను వ్రాసాడు. తరువాత ప్రభుత్వం అతనిని రత్నగిరికి తరలించి అక్కడే నిర్బంధించింది. అక్కడ సావర్కర్ జాతిభేద నిర్మూలన, అస్పృశ్యతా నిర్మూలన, సహపంక్తిభోజనాలు, భాషాశుద్ధీకరణ వంటి సామాజిక ఉద్యమాలు చేశాడు. అతడు ఒక గొప్ప సాహిత్యకారుడు. 1938 సంవత్సరంలో ముంబయిలో ఏర్పాటు చేసిన మరాఠీ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించాడు.

ప్రభుత్వానికి అభినవ భారత్ సంస్థ కార్యకలాపాల ఆచూకీ దొరికింది. అందువలన ప్రభుత్వం బాబారావ్ సావర్కర్‌ను నిర్బంధించింది. అతనికి జీవిత ఖైదు శిక్ష పడింది. ఈ శిక్షకు ప్రతీకారం తీర్చుకోవడానికి అనంత లక్ష్మణ్ కాన్హేరె అను యువకుడు నాశిక్ కలెక్టర్ జాక్సన్‌ను హత్య చేశాడు. ప్రభుత్వం అభినవ భారత్ సంస్థతో సంబంధం కలిగియున్న ప్రజలను నిర్బంధించడం ప్రారంభించింది. జాక్సన్ హత్యకు స్వాతంత్ర్యవీర్ సావర్కర్‌కు సంబంధముందని ప్రభుత్వం అతన్ని నిర్బంధించి వ్యాజ్యం వేసింది. న్యాయస్థానం అతనికి యాభై సంవత్సరాల కఠిన కారాగారశిక్ష విధించింది.

**బెంగాల్‌లోని విప్లవాత్మక ఉద్యమం :** బెంగాలు విభజన తరువాత బ్రిటిష్ వ్యతిరేక ఆందోళన చాలా తీవ్రమైంది. స్థానిక తిరుగుబాట్ల స్థానంలో విశాలమైన విప్లవాత్మక ఉద్యమం జాతీయస్థాయిలో ఉదయించసాగింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విప్లవాత్మక ఆలోచనలతో మునిగియున్న యువకులు రహస్య సంఘాలను స్థాపించ సాగారు. బ్రిటిష్ అధికారులను భయభ్రాంతులను చేయుట, బ్రిటిష్ ప్రభుత్వ యంత్రాంగాన్ని బలహీనపరచుట, ప్రజలకు బ్రిటిష్ ప్రభుత్వ భీతిని లేకుండా చేయుట, బ్రిటిష్ వారి అధికారాన్ని కూలద్రోయుట ఇవి వారి ముఖ్య ఉద్దేశాలు.

బెంగాల్‌లో 'అనుశీలన సమితి' అనువిప్లవకారుల సంస్థ నడుస్తుండెను. అనుశీలన సమితికి ఐదువందలకుపైగా శాఖలు ఉండెను. అరవింద్ ఘోష్ సోదరుడు బారీంద్రకుమార్ ఘోష్ ఈ సంస్థకు ప్రముఖుడు. అరవిందఘోష్ సలహాలు, దిశానిర్దేశం ఈ సంస్థకు లభిస్తుండేది. కోల్‌కతా సమీపంలోని మాణిక్తాళా వద్ద ఈ సమితి యొక్క బాంబులు తయారు చేయు కేంద్రం ఉండెను.

1908 సంవత్సరంలో ఖుదీరామ్ బోస్, ప్రఫుల్ల చాకీ అను ఈ అనుశీలన సమితి సభ్యులు కింగ్స్ ఫోర్డ్ అను న్యాయమూర్తిని హతమార్చే పథకం పన్నారు. కాని వారు బాంబు వేసిన వాహనంలో కింగ్స్‌ఫోర్డ్ ప్రయాణం చేయుట లేదు. ఈ దాడిలో వాహనంలో ఉన్న ఇద్దరు ఆంగ్ల వనితలు మృత్యువాత పడ్డారు. ఆంగ్లేయుల చేతుల్లో పడకూడదని ప్రఫుల్ల చాకీ స్వయంగా తనపై తుపాకీ పేల్చుకొన్నాడు. ఖుదీరామ్ బోస్ పోలీసుల చేతులకు చిక్కాడు. అతనిని ఉరి తీయడం జరిగింది. ఈ సంఘటనను పరిశీలిస్తున్నపుడు పోలీసులకు అనుశీలన సమితి కార్యకలాపాల సమాచారం తెలిసింది. వారు ఈ సంస్థ యొక్క సభ్యులను నిర్బంధించడం మొదలుపెట్టారు. అరవింద ఘోష్‌ను కూడా నిర్బంధించడం జరిగింది. అరవిందబాబుకు బాంబులు తయారు చేయటలో సంబంధం ఉందని నిరూపించడంలో ప్రభుత్వం విఫలమైనందున అతనిని న్యాయస్థానం నిర్దోషిగా విడుదల చేసింది. ఇతర సభ్యులకు దీర్ఘకాల శిక్షను విధించడం జరిగింది.

రాస్ బిహారీ బోస్, సచింద్రనాథ్ సన్యాల్ విప్లవాత్మక సంఘాల జాలమును బెంగాల్ బయట విస్తరింపజేశాడు. పంజాబ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లలో విప్లవకార్యకలాపాల కేంద్రాలను నెలకొల్పాడు. వైస్‌రాయ్ లార్డ్ హర్డింగ్స్‌పై బాంబు వేయు సాహసకృత్యం రాస్‌బిహారీ బోస్, అతని అనుచరుడు చేశారు. కాని దాడి నుంచి లార్డ్ హర్డింగ్స్ బయటపడ్డాడు.

మద్రాసు ప్రాంతంలో కూడా విప్లవ కార్యకలాపాలు కొనసాగుతుండెను. వాంచి అయ్యర్ అను విప్లవకారుడు ఆశ్ అను బ్రిటిష్ అధికారిని చంపాడు. ఆ తరువాత అతడు తనపై తూటా పేల్చుకొని ప్రాణత్యాగం చేశాడు.

**ఇండియా హౌజ్ :** భారతదేశంలోని విప్లవ కార్యకలాపాలకు విదేశాలలోని భారతీయ విప్లవకారుల నుంచి సహాయం లభిస్తుండేది. లండన్‌లోని ఇండియా హౌజ్ అనునది అటువంటి సహాయానికి ముఖ్య కేంద్రమయింది. పం. శ్యామ్‌జీ కృష్ణ వర్మ అను భారతీయ దేశభక్తుడు ఇండియా హౌజ్‌ను స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా భారతీయ యువకులకు ఇంగ్లండ్‌లో ఉన్నత విద్యనభ్యసించుటకొరకు ఉపకారవేతనం ఇవ్వబడేది. స్వాతంత్ర్య వీర్ సావర్కర్‌కు అటువంటి ఉపకారవేతనం లభిస్తుండేది. మేడం కామా జర్మనీలో స్టుటగార్డ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రపంచ సామ్యవాద సమావేశంలో భారతదేశ



పం. శ్యామ్‌జీ కృష్ణ వర్మ



మేడం కామా

స్వాతంత్ర్యం యొక్క సమస్యను ప్రస్తావించింది. ఇదే సమావేశంలో ఆమె భారతదేశ జెండాను ఎగురవేసింది. ఇండియా హౌజ్‌తో సంబంధమున్న మరొక విప్లవకారుడు అనగా మదన్‌లాల్ ధింగ్రా అను యువకుడు. అతడు కర్జన్ వాయ్‌లీ అను ఆంగ్ల అధికారిని చంపివేశాడు. అందువల్ల ధింగ్రాకు ఉరిశిక్ష విధించబడింది.

**గదర్ ఉద్యమం :** మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ వ్యతిరేక విప్లవ కార్యకలాపాలకు ఊతం లభించింది. బ్రిటిష్ వారి శత్రువుల సహాయం తీసుకొని భారతదేశంలో అధికార మార్పిడి సాధించవచ్చునని ఈ ప్రయత్నంలో భారతీయ సైనికుల సహాయం పొందవచ్చునని, విప్లవకారులకు అనిపించేది. ఈ అవకాశాన్ని వినియోగించుకొనుటకు విప్లవకారుల సంస్థలు స్థాపించబడినవి. 'గదర్' అందులో ఒక ముఖ్యమైన సంస్థ.

అమెరికా మరియు కెనడాలలోని భారతీయులు 'గదర్' సంస్థను స్థాపించారు. లాలా హర్‌దయాళ్, భాయి పరమానంద్, డా. పాండురంగ్ సదాశివ్ ఖాన్‌ఖోజే మొదలగు విప్లవకారులు ఈ సంస్థ యొక్క ముఖ్య నాయకులు. 'గదర్' అనగా విద్రోహం. 'గదర్' అనునది ఆ సంస్థ యొక్క ప్రచార పత్రిక యొక్క పేరు. ఈ ప్రచార పత్రిక నుంచి బ్రిటిష్ పరిపాలన వలన భారతదేశంపై కలిగే దుష్పరిణామాలు విషదం చేయబడేవి. భారతీయ విప్లవకారుల సాహసోపేత కృత్యాల సమాచారం చెప్పబడేది. ఈ విధంగా దేశభక్తి, సాయుధ విప్లవం వీటికి సంబంధించి 'గదర్' అను ప్రచార పత్రిక భారతీయులకు సందేశమిచ్చింది.

బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటు చేయుటకొరకు 'గదర్' సంస్థ నాయకులు యుద్ధ పరిస్థితులను వినియోగించుకొనుటకు సంకల్పించిరి. వారు పంజాబ్‌లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయుటకు వ్యూహం పన్నారు. సైన్యంలోని భారతీయ సైనికులను తిరుగుబాటులో భాగస్వాములగుటకు సన్నద్ధులను చేసింది. రాస్‌బిహారి బోస్, విష్ణు గణేశ్ పింగళే తిరుగుబాటుకు నాయకత్వం వహించాలని నిర్ణయించబడింది. కాని విశ్వాసఘాతం వలన బ్రిటిష్‌వారికి ఈ వ్యూహరచన ఆచూకీ దొరికింది. పింగళే పోలీసుల చేతికి చిక్కాడు. అతనిని ఉరి తీయడం జరిగింది. రాస్‌బిహారి బోస్ మాత్రం తప్పించుకొని పోవడంలో సఫలీకృతుడయ్యాడు. జపాన్‌కు వెళ్ళి అతడు తన విప్లవ కార్యకలాపాలను కొనసాగించాడు.

యుద్ధ సమయంలో ఇతరత్రా కూడా విప్లవకారుల ఉద్యమం కొనసాగుచుండెను. బర్లిన్‌లో వీరేంద్రనాథ్ చటోపాధ్యాయ, భూపేన్‌దత్త, హర్‌దయాళ్‌లు జర్మన్ విదేశాంగ శాఖ సహకారంతో బ్రిటిష్ వ్యతిరేక వ్యూహాలను రచించారు. 1915 సంవత్సరంలో మహేంద్రప్రతాప్, బర్కతుల్లా, ఓబిదుల్లా సింధీలు కాబూల్‌లో స్వతంత్ర భారతదేశ తాత్కాలిక ప్రభుత్వం స్థాపన చేశారు.

**కాకోరి కుట్ర :** ప్రభుత్వం యొక్క అణచివేత చర్యలతో విప్లవకారుల ఉద్యమం అంతం కాలేదు. గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం నిలిపివేసిన తరువాత అనేకమంది యువకులు విప్లవమార్గం వైపు తిరిగారు. చంద్రశేఖర్ ఆజాద్, రామ్‌ప్రసాద్ బిస్మిల్, యోగేశ్ చటర్జీ సచింద్రనాథ్ సన్యాల్ మొదలగు విప్లవకారులు ఏకమయ్యారు. విప్లవ కార్యకలాపాలకు అవసరమయ్యే డబ్బు కూడగట్టుటకు వారు రైల్వే ద్వారా తీసుకెళ్ళే ప్రభుత్వ ఖజానాను 9 ఆగస్టు 1925 రోజున ఉత్తరప్రదేశ్‌లోని కాకోరి అను రైల్వేస్టేషన్ దగ్గర దోచుకొన్నారు. దీనినే 'కాకోరి కుట్ర' అంటారు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి విప్లవకారులను నిర్బంధంలో పెట్టింది. వారిపై న్యాయవిచారణ కొనసాగింది. అశ్ఫాక్ ఉల్లా ఖాన్, రామ్‌ప్రసాద్ బిస్మిల్, రోషన్ సింగ్, రాజేంద్ర లాహిరిలకు ఉరిశిక్ష విధించబడింది. చంద్రశేఖర్ ఆజాద్ మాత్రం పోలీసులకు దొరకలేదు.


చంద్రశేఖర్ ఆజాద్

**హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ :** సామ్యవాద భావాలకు ప్రభావితమైన యువకులు దేశవ్యాప్త విప్లవకారుల సంస్థను నెలకొల్పుటకు నిశ్చయించుకొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ మొదలగు యువకులు అందులో ముఖ్యులు. ఈ విప్లవకారులందరు లౌకికవాద ఆలోచనాసరళి కలవారు.


భగత్‌సింగ్



రాజ్‌గురు



సుఖదేవ్

1928 సం॥లో దిల్లీలోని ఫిరోజ్‌షాహ్ కోట్ల మైదానంలో జరిగిన సమావేశంలో ఈ యువకులు 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్' అను సంస్థను స్థాపించారు. భారతదేశాన్ని బ్రిటిష్‌వారి పీడన నుంచి విడిపించుట ఈ సంస్థయొక్క ఉద్దేశ్యం. దీనితోబాటు దానికి రైతుల, కార్మికులను దోపిడి చేసే అన్యాయపు సామాజిక ఆర్థిక వ్యవస్థను కూడా కూలదోయవలెనని ఉండెను. సామాజిక న్యాయం, సమానత్వాలపై ఆధారపడిన సమాజ నిర్మాణం చేయుటకు భగత్‌సింగ్ ప్రాముఖ్యతనిచ్చాడు.

ఆయుధాలు సేకరించుట, కార్యక్రమాలను అమలు చేయుట అను పనులను ఈ సంస్థ యొక్క ప్రత్యేక విభాగానికి అప్పగించడం జరిగింది. ఈ విభాగం పేరు 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ'. దీనికి ప్రముఖుడు చంద్రశేఖర్ ఆజాద్.

ఈ సంస్థ సభ్యులు అనేక విప్లవ కార్యకలాపాలు నిర్వహించారు. భగత్‌సింగ్, రాజగురులు లాలా లజపత్‌రాయ్ మరణానికి ప్రతీకారం తీర్చుకొనుటకు సాండర్స్ అను అధికారిని తుపాకీతో కాల్చి చంపారు.

ఇదే సమయంలో పౌర హక్కులను కాలరాసే రెండు చట్టాలను బ్రిటిష్ ప్రభుత్వం కేంద్ర శాసనమండలిలో ప్రవేశపెట్టింది. దానిని నిషేధించుట కొరకు భగత్‌సింగ్, బటుకేశ్వర్‌దత్తులు కేంద్ర శాసనమండలిలో బాంబు విసిరారు.

ప్రభుత్వం వెంటనే హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ కేంద్రంపై దాడులు చేసింది. అందులో సాండర్స్ హత్యకు సంబంధించిన ఆధారాలు పోలీసుల చేతుల్లో పడ్డాయి. ప్రభుత్వం విప్లవకారులను నిర్బంధించడం ప్రారంభించింది. వారిపై రాజద్రోహ నేరం మోపబడింది. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను 23 మార్చి 1931 రోజున లాహోర్ జైలులో ఉరి తీయడం జరిగింది.

చంద్రశేఖర్ ఆజాద్ మాత్రం చివరి వరకు పోలీసులకు చిక్కలేదు. తరువాత అలహాబాదులోని ఆల్ఫ్రెడ్ పార్క్‌లో పోలీసులతో జరిగిన పోరులో అతడు మరణించాడు.

**చితగావ్ ఆయుధ భాండాగారంపై దాడి :** బెంగాల్‌లోని చితగావ్ విప్లవకారుల బృందంలో సూర్యసేన్ ప్రముఖుడు. అతడు తన చుట్టూ అనంతసింగ్, గణేశ్‌ఘోష్, కల్పనాదత్, ప్రీతిలత వడ్డేదార్ వంటి విశ్వాసపాత్రులైన విప్లవకారుల సైన్యాన్ని ఏర్పరచాడు. వారి సహాయంతో చితగావ్‌లోని ఆయుధ భాండాగారంపై దాడికి సూర్యసేన్ వ్యూహం రచించాడు. వ్యూహం ప్రకారం 18 ఏప్రిల్ 1930 రోజున విప్లవకారులు చితగావ్‌లోని రెండు ఆయుధ భాండాగారాలలోని ఆయుధాలను హస్తగతం చేసుకొన్నారు. టెలిఫోన్, టెలిగ్రాఫ్ యంత్రాంగాన్ని వారు ధ్వంసం చేయడంతో సమాచార యంత్రాంగాన్ని నిలిపివేయుటలో విజయం సాధించారు. ఆ తరువాత వారు బ్రిటిష్ సేనలతో వీరోచిత పోరాటం చేశారు.



సూర్య సేన్



కల్పనా దత్



ప్రీతిలత వడ్డేదార్

16 ఫిబ్రవరి 1933 రోజున సూర్యసేన్, అతని అనుచరులు కొందరు పోలీసుల చేతికి చిక్కారు. సూర్యసేన్, అతని పన్నెండు మంది అనుచరులకు ఉరిశిక్ష విధించబడింది. కల్పనాదత్‌కు యావజ్జీవ కారాగార శిక్ష

విధింపబడింది. ప్రీతిలత వడ్డేదార్ పోలీసుల చేతికి దొరకకుండా ఆత్మాహుతి చేసుకొంది.

చిత్తగాంగ్ తిరుగుబాటు వలన విప్లవకారుల ఉద్యమానికి వేగం లభించింది. శాంతిఘోష్, సునీతిచౌదరి అను ఇద్దరు పాఠశాల విద్యార్థినులు జిల్లా న్యాయమూర్తిని హత్య చేశారు. బీనాదాస్ అను యువతి కోల్‌కతా విశ్వవిద్యాలయ పట్టభద్రుల పట్టాల పంపిణీ కార్యక్రమంలో గవర్నర్‌పై తూటాలు పేల్చింది. ఇలా అనేక విప్లవాత్మక సంఘటనలు ఈ కాలంలో జరిగాయి.

జలియన్ వాలాబాగ్ హత్యాకాండకు బాధ్యుడైన ఓడవాయర్‌ను సర్దార్ ఉధమ్‌సింగ్ ఇంగ్లండ్‌లో 1940 సంవత్సరంలో హత్యచేశాడు.

భారతీయ స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవకారుల ఉద్యమం ముఖ్యమైన తోడ్పాటునందించింది. విప్లవకారులు బ్రిటిష్ అధికారంతో పోరాడునపుడు సాహసం, దృఢ నిశ్చయాలను చూపించారు. వారి దేశభక్తి, అంకితభావం, వారి ప్రాణత్యాగం భారతీయులకు స్ఫూర్తిదాయకం.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(పం. శ్యామ్‌జీ కృష్ణ వర్మ, మిత్రమేళా, రామ్‌సింహ్ కుకా)

(1) స్వా.సావర్కర్ ............... అను విప్లవకారుల రహస్య సంస్థను స్థాపించాడు.

(2) పంజాబ్‌లో .................. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు పథకం పన్నాడు.

(3) ఇండియా హౌజ్‌ను .................. స్థాపించాడు.

**2. కింది పట్టికను పూరించండి.**

| విప్లవకారులు | సంస్థలు |
|---|---|
| .................. | అభినవ భారత్ |
| బారీంద్రకుమార్ ఘోష్ | .................. |
| చంద్రశేఖర్ ఆజాద్ | .................. |

**3. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

(1) చాఫేకర్ సోదరులు రాండ్‌ను హత్య చేశారు.

(2) ఖుదీరామ్ బోస్‌కు ఉరిశిక్ష విధించబడింది.

(3) భగత్‌సింగ్, బటుకేశ్వర్‌దత్తులు కేంద్ర శాసనమండలిలో బాంబు విసిరారు.

**4. కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా జవాబులు రాయండి.**

(1) చిత్తగాంగ్ ఆయుధ భాండాగారంపై దాడి వృత్తాంతాన్ని రాయండి.

(2) సాయుధకారుల విప్లవంలో స్వా. సావర్కర్ యొక్క తోడ్పాటును స్పష్టీకరించండి.

**ఉపక్రమం**

(1) విప్లవకారుల జీవితం ఆధారంగా తీసిన నాటకం, చలనచిత్రం చూసి అందులో మీకు నచ్చిన సంఘటనను తరగతిలో అభినయించండి.

(2) విప్లవకారుల గాథలపై ఆధారపడిన హస్తలిఖిత పత్రాలను తయారు చేయండి.

BFGZY7

# 11. సమానత్వ పోరాటం

ఆధునిక భారతదేశ ప్రస్థానంలో రాజకీయ స్వాతంత్ర్య పోరాటం ముఖ్యమైనది. ఈ పోరాటం మానవ విముక్తి యొక్క విశాల తత్వజ్ఞానంపై ఆధారపడియున్నది. అందువలన ఈ పోరాట క్రమంలో రాజకీయ పారతంత్ర్యంతోబాటు జమిందారీ (భూస్వామ్య) పద్ధతి, సాంఘిక అసమానతలు, ఆర్థిక అసమానతలు వంటి విషయాలను కూడా వ్యతిరేకించసాగారు. స్వాతంత్ర్యం మాదిరిగానే సమానత్వ సిద్ధాంతం కూడా చాలా ముఖ్యమైనది. ఆ దృష్టితో సమాజంలోని రైతులు, కార్మికులు, స్త్రీలు, దళితులు మొదలగు ప్రజలు లేవదీసిన ఉద్యమాలు మరియు సమానత్వానికి ప్రాముఖ్యతనిచ్చే సామ్యవాద భావాల తోడ్పాటు అమూల్యమైనది. దానిని స్మరించుకోకుండా ఆధునిక భారతదేశ స్వరూపాన్ని తెలుసుకోలేము. కాబట్టి మనం అటువంటి కొన్ని ఉద్యమాలను అభ్యసిద్ధాం.

**రైతుల ఉద్యమం :** బ్రిటిష్‌వారి ఆర్థిక ధోరణి యొక్క దుష్పరిణామాలు భారతదేశ రైతులు అనుభవించవలసి వచ్చింది. జమీన్‌దార్లు, వడ్డీవ్యాపారులకు బ్రిటిష్ ప్రభుత్వం రక్షణ కల్పించేది. వారు రైతులపై దౌర్జన్యాలు చేసేవారు. ఈ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రైతులు అనేక తిరుగుబాట్లు చేశారు. బెంగాల్ లోని రైతులు నీలి ఉత్పత్తి నిర్బంధంగా చేయించుటకు వ్యతిరేకంగా వ్యవసాయ సంస్థలు నెలకొల్పి తిరుగుబాటు చేశారు. దీనబంధు మిత్ర రాసిన 'నీలదర్పణ్' అను నాటకంతో నీలి పంటలను పండించే రైతుల హీనస్థితిని అన్ని సమాజాల దృష్టికి తీసుకువచ్చాడు. 1875 సంవత్సరంలో మహారాష్ట్రలోని రైతులు జమీందార్లు, వడ్డీవ్యాపారుల అత్యాచారాలకు వ్యతిరేకంగా పెద్ద తిరుగుబాటు చేశారు. బాబా రామచంద్ర చొరవ తీసుకోవడంతో 1918 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్‌లోని రైతులు 'కిసాన్ సభ' అను సంస్థను స్థాపించారు. కేరళలో మోపలా రైతులు పెద్ద తిరుగుబాటు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం దానిని అణచివేసింది.

1936 సంవత్సరంలో ప్రొ. ఎన్.జి. రంగా చొరవతో అఖిలభారతీయ కిసాన్ సభ స్థాపించబడింది. స్వామి సహజానంద సరస్వతి ఆ సభకు అధ్యక్షుడుగా ఉండెను. ఈ సభ రైతుల హక్కుల ప్రకటన పత్రాన్ని జాతీయ మహాసభకు సమర్పించింది. 1936 సంవత్సరంలో మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతంలో ఫైజ్‌పూర్ వద్ద జాతీయ మహాసభ సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశానికి వేలమంది రైతులు హాజరైనారు.



ప్రొ. ఎన్. జి. రంగా



సానె గురూజీ

1938 సంవత్సరంలో తూర్పు ఖాందేశ్‌లో అతివృష్టి సంభవించి పంట మునిగి పోయింది. రైతుల పరిస్థితి దుర్భరమైనది. భూమి శిస్తు రద్దు చేయించుట కొరకు సానె గురూజీ ప్రతిచోట సభలు, ఊరేగింపులు నిర్వహించాడు. కలెక్టర్ కార్యాలయంపై ఊరేగింపు నిర్వహించాడు. 1942 విప్లవ పర్వంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**మీకు తెలుసా ?**

సానె గురూజీ రైతు కూలీలను ఐక్యం చేశాడు. ధుళె-అమ్మళ్‌నేర్‌లను ప్రబలమైన కార్మిక సంఘాల కేంద్రాలుగా చేసే ప్రయత్నం అతడు చేశాడు. అమ్మళ్‌నేర్ మిల్లు కార్మికుల యూనియన్‌కు అతడు అధ్యక్షుడుగా ఉండెను.

పంఢర్‌పూర్ విఠల్ మందిరంలో దళితులకు కూడా ప్రవేశం కల్పించాలని అతడు పంఢర్‌పూర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేశాడు.

**కార్మిక సంఘాలు :** పంతొమ్మిదవ శతాబ్ద ఉత్తరార్థంలో భారతదేశంలో వస్త్ర మిల్లులు, రైల్వే కంపెనీల వంటి పరిశ్రమలు ప్రారంభమైనవి. కార్మిక వర్గం పెద్ద యెత్తున



నారాయణ్ మేఘాజీ లోఖండె

తయారు కాలేదు. అయినను ఈ కాలంలో కార్మికుల సమస్యలను పరిష్కరించుటకు ప్రయత్నాలు జరిగాయి. శశిపద్ బెనర్జీ, నారాయణ్ మేఘాజీ లోఖండే స్థానిక ప్రాతిపదికన కార్మికులను సంఘటిత పరిచాడు. లోఖండేగారి కార్మికులకు సంబంధించిన కార్యాలు ఎంత విలువైనవంటే అతడు 'భారతీయ కార్మిక ఉద్యమ జనకుడు' అని వర్ణింపబడ్డాడు.

**మీకు తెలుసా ?**

నారాయణ్ మేఘాజీ లోఖండె జన్మస్థలం పుణె జిల్లాలోని సాస్‌వడ్ సమీపంలోని కన్హేసర్. అతడు బాంబే మిల్ హాండ్స్ అసోసియేషన్ అను మిల్లు కార్మికుల సంఘాన్ని 1890లో స్థాపించాడు. ఈ కార్మిక సంఘం భారత దేశంలోని సంఘటితోద్యమ ప్రారంభంగా భావింపబడుతుంది. అతడు మహాత్మాఫులె స్థాపించిన సత్యశోధక సమాజం యొక్క ముంబయి శాఖ అధ్యక్షుడుగా కూడా ఉండెను. అతని ప్రయత్నాల వలన 10 జూన్ 1890 నుంచి కార్మికులకు ఆదివారంవారాంత సెలవుగా లభించింది.

ఇదే కాలంలో అస్సాంలో తేయాకు తోటలలోని కార్మికుల దారుణమైన పరిస్థితికి వ్యతిరేకంగా ఆందోళన చేయబడింది. 1899లో గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ (జి.ఐ.పి) రైల్వే కార్మికులు తమ కోర్కెల కొరకు సమ్మె ప్రకటించారు. బెంగాలు విభజన ఉద్యమకాలం స్వదేశీ ఉద్యమానికి మద్దతునిచ్చుట కొరకు కార్మికులు ఎప్పటికప్పుడు సమ్మెలు చేశారు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత భారతదేశంలో పారిశ్రామీకరణ వలన కార్మిక వర్గం పెరిగింది. అప్పుడు మాత్రం దేశవ్యాప్త కార్మిక సంఘం యొక్క అవసరం కలిగింది. ఈ అవసరం నుంచి 1920 సంవత్సరంలో ఆల్ ఇండియా ట్రేడ్ యునియన్ కాంగ్రెస్‌ను (AITUC) స్థాపించడం జరిగింది. AITUC కార్యక్రమాలలో నా.మ.జోషిది ప్రముఖ భాగస్వామ్యం ఉండెను. లాలాలజపతిరాయ్ AITUC యొక్క ప్రథమ సమావేశానికి అధ్యక్షుడిగా ఉండెను. కార్మికులు జాతీయ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొనవలెనని అతడు పిలుపునిచ్చెను.

కార్మిక వర్గంలో సామ్యవాద భావాలను ప్రచారం చేసి వారి పోరాట సంఘాలను నెలకొల్పే కార్యాన్ని శ్రీపాద అమృత్ డాంగే, ముఝఫ్ఫర్ అహ్మద్ మొదలగు సామ్యవాద నాయకులు చేశారు. 1928 సంవత్సరంలో ముంబయిలోని మిల్లు కార్మికుల సంఘం ఆరు నెలలు సమ్మె చేసింది. అటువంటి అనేక సమ్మెలు రైల్వే కార్మికులు, జనపనార మిల్లు కార్మికులు మొదలగువారు చేశారు. కార్మికుల ఉద్యమాల పెరుగుతున్న బలాన్ని చూసి ప్రభుత్వం ఆందోళన చెందింది. ఈ ఉద్యమాలను అణచి వేయుటకు చట్టాలు చేయబడినవి. కార్మికుల పోరాటం జాతీయోద్యమానికి పరిపూరకమైంది.



శ్రీపాద అమృత్ డాంగె

**సామ్యవాద ఉద్యమం :** సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడుటకు బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలద్రోయడం అవసరమని జాతీయమహాసభలోని అనేక యువ కార్యకర్తలు భావించసాగారు. అదేవిధంగా ఆర్థిక మరియు సామాజిక సమానత్వ సిద్ధాంతంపై సమాజం యొక్క పునర్నిర్మాణం జరగవలెనని వారు తెలుసుకొన్నారు ఈ స్పృహ నుంచి సామ్యవాద ఆలోచనా సరళి ప్రారంభమై అభివృద్ధి చెందింది.

జాతీయ మహాసభలోని సామ్యవాద భావజాలం కలిగిన యువకులు నాశిక్ కారాగారంలో ఉన్నప్పుడు జాతీయ మహాసభలో భాగంగా సామ్యవాద పార్టీ స్థాపించుటకు నిర్ణయించుకొన్నారు. ఆ నిర్ణయం ప్రకారం 1934 సంవత్సరంలో కాంగ్రెస్ సామ్యవాద పార్టీని స్థాపించడం జరిగింది. అందులో ఆచార్య నరేంద్రదేవ్, జయప్రకాశ్ నారాయణ్, మిను మసాని, డా.రామ్‌మనోహర్ లోహియా



ఆచార్య నరేంద్ర దేవ్



డా. రామ్‌మనోహర్ లోహియా

మొదలగు నాయకులు ఉండిరి. 1942 'క్విట్ ఇండియా' ఉద్యమంలో సామ్యవాద పార్టీ యువకులు ముందుండిరి.

కార్ల్ మార్క్స్ మరియు అతని సామ్యవాదం భారతీయులకు పరిచయం అవసాగింది. లోకమాన్యతిలక్ 1881లోనే మార్క్స్ గురించి రచనలు చేసాడు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత భారతదేశంలో సామ్యవాదం యొక్క ప్రభావం కనిపించసాగింది. మానవేంద్రనాథ్ రాయ్ అంతర్జాతీయ సామ్యవాద ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నాడు.

1925 సంవత్సరంలో భారతదేశంలో సామ్యవాద పార్టీ స్థాపన జరిగింది. కార్మికుల, రైతుల పోరాట సంఘాలను నెలకొల్పే పనిని సామ్యవాదులైన యువకులు చేశారు. ప్రభుత్వం సామ్యవాద ఉద్యమం ప్రమాదకరమని భావించింది. ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణచివేయాలని నిర్ణయించింది. శ్రీపాద అమృత్ డాంగే, ముజుఫ్ఫర్ అహ్మద్, కేశవ్ నీలకంఠ్ జోగ్లేకర్ మొదలగు వారు పట్టుబడ్డారు. బ్రిటిష్ రాజ్యాన్ని కూలద్రోయుటకు కుట్ర చేస్తున్నారనే అభియోగం వారిపై మోపబడింది. వారికి వేరువేరు శిక్షలను విధించడం జరిగింది. ఈ వ్యాజ్యం మీరట్‌లో విచారణ చేయబడింది. కాబట్టి దానిని 'మీరట్ కుట్ర విచారణ' అని అంటారు. మీరట్ అభియోగం తరువాత కూడా కార్మిక ఉద్యమంపై సామ్యవాదుల ప్రభావం స్థిరంగా ఉండెను.

**స్త్రీల ఉద్యమం :** భారతదేశంలోని సమాజవ్యవస్థలో స్త్రీలకు రెండవ స్థానం ఉండెను. అనేక అసాంఘిక ఆచార వ్యవహారాల వలన వారికి అన్యాయం జరుగుచుండేది. కాని ఆధునిక యుగంలో దీనికి వ్యతిరేకంగా జాగృతం కాసాగింది. స్త్రీ సంబంధ సంస్కరణల ఉద్యమంలో కొందరు పురుష సంస్కర్తలు చొరవ తీసుకొన్నారు. కాల గమనంలో స్త్రీల నాయకత్వం ముందుకు రాసాగింది. వారి యొక్క స్వతంత్ర సంస్థలు, సంఘాలు స్థాపించబడసాగాయి. పండిత రమాబాయి స్థాపించిన 'ఆర్య మహిళా సమాజం' 'శారదా సదన్' అను సంస్థలు, అదే విధంగా రమాబాయి రానడే స్థాపించిన 'సేవాసదన్' సంస్థ వాటికి ఉదహరణలు 'భారత్ మహిళా పరిషద్' (1904), 'ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్' (1927) అను సంస్థలు కూడా స్థాపింపబడినవి. అందువలన ఈ సంస్థాగత పనులు జాతీయస్థాయికి చేరుకొన్నాయి. వారసత్వ హక్కు, ఓటు హక్కు మొదలగు సమస్యల గురించి ఈ సంస్థల మాధ్యమం నుంచి స్త్రీలు పోరాటం చేయసాగారు.



పండితా రమాబాయి



రమాబాయి రానడే

రమాబాయి జనార్దన్ సావె భారతదేశానికి వైద్య సేవలను అందించిన మొదటి స్త్రీ వైద్యురాలు. ఆమె స్త్రీలకోసం ఆరోగ్యానికి సంబంధించిన ఉపన్యాస మాలికలను నిర్వహించింది. అదేవిధంగా రాజ్‌కోట్‌లో ఆమె రెడ్‌క్రాస్ సొసైటీ శాఖను ప్రారంభించింది.



డా. రమాబాయి సావె

ఇరవయవ శతాబ్దంలో సార్వజనిక జీవనంలో స్త్రీల భాగస్వామ్యం పెరుగసాగింది. జాతీయోద్యమంలో విప్లవ కార్యకలాపాల్లో, స్త్రీలు అమూల్యమైన భాగస్వామ్యాన్ని అందించారు. 1935 చట్టం తరువాత ప్రాంతీయ మంత్రి మండలిలో కూడా స్త్రీలు చేరిపోయారు. స్వాతంత్ర్యం పొందిన తరువాత భారతీయ సంవిధానంలో స్త్రీపురుష సమానత సిద్ధాంతాన్ని స్పష్టంగా నమోదు చేయడం జరిగింది.

మీకు తెలుసా ?

**డా. ఆనందీబాయి జోషి :** మొదటి భారతీయ మహిళా వైద్యురాలు. ఆమె కుమారుడు 10 రోజుల వయస్సులోనే మరణించాడు. ఈ సంఘటన ఆమెను వైద్య విద్య వైపు నడిపించడానికి కారణభూతమైంది. మార్చి 1886లో ఆమె ఎమ్.డి. పట్టాను పొందింది.ఆనందీబాయి భారతదేశానికి తిరిగి వస్తున్నప్పుడు ఆమెకు క్షయరోగం సోకింది. తరువత 16 ఫిబ్రవరి 1887 రోజున పుణెలో ఆమె మరణించింది.


డా. ఆనందీబాయి జోషి

**దళితుల ఉద్యమం :** భారతదేశంలోని సమాజ నిర్మాణం అసమానతలపై ఆధారపడి ఉన్నది. సమాజంలో దళితులకు జరిగె వివక్షాపూరిత వ్యవహారానికి వ్యతిరేకంగా మహాత్మాజ్యోతిరావు ఫులె, నారాయణ్ గురు వంటి సంఘ సంస్కర్తలు జన జాగృతి గావించారు. మహాత్మాఫులె బోధనలననుసరించి గోపాల్‌బాబా వలంగ్‌కర్, శివరామ్ జాన్‌బా కాంబళె అస్పృశ్యతా నిర్మూలన కార్యక్రమాలు చేపట్టారు. గోపాల్ బాబా వలంగ్‌కర్ క్రీ.శ. 1888లో 'విటాళ్ విధ్వంసన్' (అపవిత్రత వింధ్వసం) అను పుస్తకం ద్వారా అస్పృశ్యతను ఖండించాడు. శివరామ్ జానబా కాంబళే 'సోమవంశీయమిత్ర్' అను మాసపత్రిక 1 జులై 1908 రోజున ప్రారంభించాడు. దేవదాసి, మురళి జోగినుల సమస్యల గుట్టు రుట్టు చేశాడు.అదేవిధంగా దేవదాసినిల వివాహాలు జరిపించుటకు చొరవ చూపాడు. తమిళనాడులో పెరియార్ రామస్వామి అస్పృశ్యతా నివారణ ఉద్యమం ప్రారంభించాడు.

మహర్షి విఠల్ రామ్‌జీ. శింది దళితుల కొరకు 1906లో 'డిప్రెస్డ్ క్లాసెస్ మిషన్' అను సంస్థను ప్రారంభించాడు. దళితులను ఆత్మాభిమానులు, సురక్షితులు, పారిశ్రామికులుగా తయారు చేయుట అనునది అతని కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. అయితే అగ్రవర్ణీయుల మనసుల్లో దళితులపట్ల ఉన్న దుర్భావనను తొలగించడం అతని కార్యంలోని రెండవ భాగంగా భావించాడు. అందుకోసం అతడు ముంబయిలో పరళ్, దేవనార్ ప్రాంతంలో మరాఠీ పాఠశాలలు, వృత్తివిద్య పాఠశాలలు నెలకొల్పాడు. అతడు పుణెలో పర్వతీ మందిర ప్రవేశ సత్యాగ్రహం, దళిత వ్యవసాయ పరిషద్, సంయుక్త నియోజక వర్గాల ప్రణాళిక మొదలగువాని గురించి దళిత వర్గ ప్రయోజనాల దృష్ట్యా అతడు క్రియాశీలంగా పాల్గొన్నాడు.


మహర్షి విఠల్ రామ్‌జీ శింది

రాజర్షి శాహూమహారాజు డా. బాబాసాహెబ్ అంబేద్కర్ నాయకత్వాన్ని సమర్థించాడు. ఆయన కాలంలోనే ఏర్పడిన బ్రాహ్మణేతర ఉద్యమానికి నాయకత్వం వహించాడు. రాజర్షి శాహూ మహారాజు కొల్హాపూర్ సంస్థానంలో రిజర్వేషన్ యొక్క విప్లవాత్మక ప్రకటనా పత్రాన్ని విడుదల చేశాడు. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యాచట్టాన్ని చేశాడు. అతడు జాతిబేధ నిర్మూలన కొరకు చాలా పనులు చేశాడు. ఆహార నిషేధం, వధువు నిషేధం, వృత్తి నిషేధం అను మూడు నిర్బంధాలు జాతి వ్యవస్థలో ఉండెను. ఈ సందర్భంలో సభలు, సమావేశాల ద్వారా దళిత ప్రజల హస్తములతో ఆహారాన్ని తీసుకొని శాహూవ ుహారాజు ఆహార నిషేధాన్ని బహిరంగంగా ఎదిరించాడు. వధువు నిషేధం అను నిర్బంధం సమాజంలో ఎంత వరకు పాటింపబడుతుందో అంతవరకు జాతిభేదం పూర్తిగా అంతం కాదని శాహూమహారాజు భావించాడు. అతడు తన సంస్థానంలో కులాంతర వివాహాన్ని చట్టబద్ధంగా సమ్మతించే చట్టాన్ని మంజూరు చేశాడు. 22 ఫిబ్రవరి 1918 రోజున కొల్హాపూర్ ప్రభుత్వ రాజపత్రం (గజెట్) లో ప్రకటనా పత్రం ప్రచురింపబడి సంస్థానంలోని 'వతందారీ పద్ధతి'ని అంతమొందించాడు. ఏ వృత్తిని ఎవరైనా చేయుటకు అనుమతి ఇవ్వడం జరిగింది. శాహూమహారాజు వృత్తి స్వాతంత్ర్యాన్ని కల్పించి ఒక రకమైన సాంఘిక బానిసత్వం నుంచి ప్రజలను విముక్తులను చేశాడు.


రాజర్షి శాహూ మహారాజ్



ఠక్కర్ బాప్పా

దక్షిణ భారతదేశంలో జస్టిస్‌పార్టీ సాంఘిక అసమానతలను రూపుమాపుటకు అమూల్యమైన కార్యక్రమాలను చేసింది. మహాత్మాగాంధీ అస్పృశ్యత సమస్యను చేతుల్లోకి తీసుకొని దానిని కాంగ్రెస్ పార్టీ వేదికపై ప్రతిపాదించాడు. యెరవడాలోని కారాగారంలో ఉన్నప్పుడు సనాతన హిందూ పండితులతో వాదించి అస్పృశ్యతకు ఎలాంటి శాస్త్రాధారం లేదని ప్రతిపాదించాడు. అతడు హరిజన సేవక సంఘానికి ప్రేరణ నందించాడు. అతని ద్వారా ప్రేరణ పొంది అమృత్‌లాల్ విఠల్‌దాస్ ఠక్కర్ అలియాస్ ఠక్కర్ బాప్పా, అప్పాసాహెబ్ పట్వర్ధన్ మొదలగు కార్యకర్తలు సమానత్వపు కార్యాలలో లీనమైనారు.

డా.బాబాసాహెబ్ అంబేద్కర్ నాయకత్వంలో దళితుల పోరాటం ప్రారంభమైంది. స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అను సిద్ధాంతాల ఆధారంగా సమాజాన్ని నిర్మించడం డా.అంబేద్కర్ ధ్యేయంగా ఉండెను. కుల సంఘాలు సమూలంగా అంతం కాకపోతే దళితులపై అన్యాయాలు అసమానతలు అంతం కావని అతడు భావించాడు. ఆత్మాభిమానంపై ఆధారపడిన ఉద్యమం చేయవలెనని అతడు అభిప్రాయ పడ్డాడు. ఈ భూమిక ద్వారా అతడు 1924 జులైలో 'బహిష్కృత్ హితకారిణి సభ' ను స్థాపించాడు. అతడు తన అనుచరులను నేర్చుకోండి, సంఘటితం కండి, పోరాడండి అనే స్ఫూర్తిదాయక సందేశాన్నిచ్చాడు.

బాబాసాహెబ్ బోలె ముంబయి ప్రాంతం యొక్క శాసనమండలిలో సార్వజనిక జలాశయాలు అస్పృశ్యుల కొరకు అనుమతించాలనే చట్టం ఆమోదింప జేశాడు. అయినను ప్రత్యక్షంగా దళితులకొరకు జలాశయాలు అనుమతింపబడలేవు. కావున డా.బాబాసాహెబ్ అంబేద్కర్, అతని అనుచరులు మహాడ్‌లో మంచినీటి చెరువు వద్ద సత్యాగ్రహం చేశారు. అతడు అసమానతలను ప్రోత్సహించే 'మనుస్మృతి'ని తగులబెట్టాడు. నాశిక్‌లోని కాళారామ్ మందిరంలో దళితులకు ప్రవేశం లభించాలని 1930లో సత్యాగ్రహం చేశాడు. ఈ సత్యాగ్రహానికి కర్మవీర్ దాదాసాహెబ్ గాయక్‌వాడ్ నాయకత్వం వహించాడు.

వార్తా పత్రికలు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ యొక్క అవిభాజ్య అంగాలు. సమాజంలో జాగృతి నిర్మాణం చేయుట కొరకు మరియు బాధల గుట్టు రట్టు చేయుటకు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ 'మూక్‌నాయక్' 'బహిష్కృత్ భారత్', 'జనతా', 'సమత' అను వార్తా పత్రికలను ప్రారంభించాడు.



మహాడ్‌లో మంచినీటి చెరువు వద్ద సత్యాగ్రహం

డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ 'స్వతంత్ర మజూర్ పక్ష్'ను స్థాపించాడు. కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా నున్న చట్టాలను శాసన మండలిలో వ్యతిరేకించాడు. దళితుల సమస్యలను ప్రభావవంతంగా ప్రతిపాదించుటకు అతడు 1942 సంవత్సరంలో 'షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్'ను స్థాపించాడు. ఆధునిక భారతదేశంలో సమానత్వంపై ఆధారపడిన నవ సమాజ నిర్మాణం గావించే పనిలో డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ భారతీయ సంవిధానం ద్వారా ముఖ్యమైన తోడ్పాటునందించాడు. 1956లో నాగపూర్ వద్ద తన అసంఖ్యాక అనుచరులతోపాటు మానవత్వం, సమానత్వాలను ప్రోత్సహించే బౌద్ధమతాన్ని అతడు స్వీకరించాడు.

ఆధునిక భారతదేశ రూపకల్పనలో సమానత్వం కొరకు నెలకొల్పిన పోరాటానికి ప్రాముఖ్యత ఉంది.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(లాలా లజపత్‌రాయ్, సానె గురూజీ, రఖ్మాబాయి జనార్ధన్ సావే)

(1) రాజ్‌కోట్ వద్ద రెడ్ క్రాస్ సొసైటీని ...................... స్థాపించింది.

(2) అమ్మల్‌నేర్ మిల్లు కార్మికుల యూనియన్‌కు ...................... అధ్యక్షుడుగా ఉండెను.

(3) మొదటి సమావేశానికి ...................... అధ్యక్షుడుగా ఉండెను.

**2. క్లుప్తంగా రాయండి.**

(1) మహర్షి విఠల్ రామ్‌జీ శింటే చేసిన సామాజిక కార్యకలాపాలు.

(2) రాజర్షి శాహూమహారాజు కొల్హాపూర్ సంస్థానంలో చేసిన సంస్కరణలు.

**3. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

(1) ప్రభుత్వం సామ్యవాదుల ఉద్యమాన్ని అణచివేయుటకు నిశ్చయించుకొన్నది.

(2) డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ మూక్‌నాయక్, బహిష్కృత్ భారత్ వంటి వార్తా పత్రికలను ప్రారంభించాడు.

(3) దేశవ్యాప్త కార్మిక సంఘం యొక్క అవసరం కలిగింది.

**4. కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా జవాబులు రాయండి.**

(1) ఆధునిక భారతదేశ నిర్మాణానికి సమానత్వపు పోరాటం ముఖ్యమైనదిగా ఎందుకు అవుతుంది?

(2) తూర్పు ఖాందేశ్‌లో సానె గురూజీ చేసిన పనులను రాయండి.

(3) కార్మికులు నెలకొల్పిన పోరాటాలు జాతీయోద్యమానికి ఎందుకు పరిపూరకాలయ్యాయి?

(4) స్త్రీ సంబంధ సంస్కరణోద్యమ స్వరూపాన్ని స్పష్టీకరించండి.

**ఉపక్రమం**

(1) డా.ఆనందీబాయి జోషి గారి జీవనంపై వచ్చిన పుస్తకాన్ని చదవండి.

(2) రాజర్షి శాహూమహారాజు చరిత్రను చదవండి.

BFQVZU

# 12. స్వాతంత్ర్య ప్రాప్తి

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో భారతదేశ స్వాతంత్ర్య పోరాటం విస్తృతమైంది. భారతదేశ స్వాతంత్ర్య కోరిక పుంజుకొంది. దీని గురించి తీవ్రంగా జోక్యం చేసుకోవలసిన అవసరముందని బ్రిటిష్ ప్రభుత్వపాలకులు భావించారు. ఆ దృష్టితో భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చుటకు బ్రిటిష్ ప్రభుత్వం వివిధ ప్రణాళికలను తయారు చేయసాగింది.

జాతీయ మహాసభ ఏర్పాటు లౌకికవాదంపై జరిగింది. జాతీయోద్యమంలో అన్ని జాతులు-మతాల ప్రజల భాగస్వాములైనారు. ఈ ఉద్యమాన్ని బలహీన పరచడానికి బ్రిటిష్‌వారు 'విభజించు పాలించు' అను నీతిని అవలంబించారు. దాని ఫలితంగా 'ముస్లిం లీగ్' స్థాపించబడింది.

1930 సంవత్సరంలో డా. ముహమ్మద్ ఇక్బాల్ అను ప్రసిద్ధ కవి స్వతంత్ర ముస్లిం దేశ ఏర్పాటు చేయవలెనని ప్రతిపాదించాడు. తరువాత చౌదరి రహమత్ అలి పాకిస్తాన్ ఏర్పాటును ప్రతిపాదించాడు. బారిష్టర్ మహమ్మద్ అలి జిన్నా రెండు దేశాల సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. పాకిస్తాన్ అను స్వతంత్ర ముస్లిం దేశాన్ని కోరాడు. జాతీయ మహాసభ కేవలం హిందువుల సంఘమని, దాని ద్వారా ముస్లింలకు ఎలాంటి ప్రయోజనం కలుగదని బారిష్టర్ జిన్నా, ముస్లిం లీగ్‌లు ప్రచారం చేయటం ప్రారంభించెను.

**వేవెల్ ప్రణాళిక :** జూన్ 1945లో భారతదేశ వైస్రాయ్ లార్డ్ వేవెల్ ఒక ప్రణాళిక తయారుచేశాడు. ఈ ప్రణాళికలో వివిధ నిబంధనలు ఉండెను. అందులో కేంద్ర, ప్రాంతీయ శాసనసభలో ముస్లింలు, దళితులు, అల్పసంఖ్యాకులకు సరియైన ప్రాతినిధ్యం ఇవ్వబడును. వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో హిందూ, ముస్లిం సభ్యుల సంఖ్య సమానంగా ఉండును. ఇటువంటి కొన్ని ముఖ్యమైన నిబంధనలు ఉన్నాయి. ఈ ప్రణాళికపై ఆలోచించుటకు సిమ్లాలో భారతదేశంలోని ప్రముఖ రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయబడింది. వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో ముస్లిం ప్రతినిధుల పేర్లు సూచించు అధికారం కేవలం ముస్లిం లీగ్‌కే ఉండాలని బా.జిన్నా పట్టుబట్టాడు. జాతీయ మహాసభ దానిని వ్యతిరేకించింది. అందువలన వేవెల్ ప్రణాళిక సఫలం కాలేక పోయింది.

**మంత్రిత్రయ ప్రణాళిక :** రెండవ ప్రపంచ యుద్ధ సమాప్తి అనంతరం భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడానికి బ్రిటిష్ పరిపాలకులు అనుకూలంగా ఉండిరి. బ్రిటిష్ ప్రధానమంత్రి అట్లీ పార్లమెంట్‌లో భారతదేశానికి సంబంధించిన ధోరణిని స్పష్టం చేశాడు. దానిననుసరించి భారత ప్రజలకు భారతదేశ సంవిధానం తయారు చేయు అధికారాన్ని అనుమతించడం జరిగింది. అల్పసంఖ్యాకుల సమస్యలు భారతదేశ స్వాతంత్ర్యానికి అడ్డుపడవని కూడా స్పష్టం చేయడం జరిగింది. 1946 మార్చిలో ప్యాథిక్ లారెన్స్, స్టఫర్డ్ క్రిప్స్, ఎ.వి. అలెగ్జాండర్ అను బ్రిటిష్ మంత్రుల ఉన్నత మండలి భారతదేశానికి సంబంధించిన ఇంగ్లండ్ వ్యూహాన్ని భారతీయుల ముందు ప్రవేశపెట్టారు. దీనిని 'మంత్రిత్రయ ప్రణాళిక' అంటారు.

ఈ ప్రణాళికలోని కొన్ని నియమాలు జాతీయ మహాసభకు అంగీకారం కాలేదు. అదేవిధంగా ముస్లింలకు ప్రత్యేక దేశ ఏర్పాటు ఈ ప్రణాళికలో లేదని ముస్లిం లీగ్ కూడా అసంతృప్తి చెందింది. అందువలన మంత్రిత్రయ ప్రణాళిక పూర్తిగా అంగీకరింపబడలేదు.

**ప్రత్యక్ష కృతిదినం :** పాకిస్తాన్ ఏర్పాటు కోరిక నెరవేర లేకపోవడాన్ని గమనించి ముస్లింలీగ్ ప్రత్యక్ష కృతి చేయుటకు నిశ్చయించుకొన్నది. దాని ప్రకారం 16 ఆగస్టు 1946ను ప్రత్యక్ష కృతిదినంగా పాటించవలెనని ముస్లిం లీగ్ ప్రకటించింది. ఈ రోజు ముస్లిం లీగ్ అనుయాయులు హింసామార్గాని అవలంబించారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో హిందూ ముస్లిం అల్లర్లు జరిగాయి. బెంగాలు ప్రాంతంలో నోవాఖాలి వద్ద భీషణ హత్యలు జరిగాయి. ఈ హింసాచారం ఆపుటకు గాంధీజీ తన ప్రాణాన్ని లెక్కచేయకుండా అక్కడికి వెళ్ళాడు. అక్కడ శాంతిని నెలకొల్పుటకు అతడు చాలా ప్రయత్నం చేశాడు.

**తాత్కాలిక ప్రభుత్వ స్థాపన :** దేశంలో హింసాచారపు అగ్నికీలలు చెలరేగుచుండగా వైస్రాయ్ వేవెల్ తాత్కాలిక ప్రభుత్వాన్ని స్థాపించాడు. పండిత జవహర్‌లాల్ నెహ్రూ ఈ ప్రభుత్వ ప్రముఖునిగా ఉండెను. తాత్కాలిక ప్రభుత్వంలో చేరకూడదని ప్రారంభకాలంలో ముస్లిం లీగ్ నిర్ణయించుకొన్నది. కానీ కొంతకాలం తరువాత ముస్లిం లీగ్ తాత్కాలిక ప్రభుత్వంలో చేరింది. అయితే ముస్లింలీగ్ నాయకులు అడ్డుపడే పాత్రను వహించడం వలన తాత్కాలిక ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాలు అసాధ్యమైనవి.

**మౌంట్‌బ్యాటన్ ప్రణాళిక :** ఇంగ్లండ్ ప్రధానమంత్రి అట్లీ జూన్ 1948కు పూర్వం ఇంగ్లండ్ భారతదేశంపై తమ అధికారాన్ని వదులుకుంటుందని ప్రకటించాడు. భారతదేశంలోని అధికారమార్పు నేపథ్యంలో లార్డ్ మౌంట్‌బ్యాటన్ వైస్రాయ్‌గా నియమింపబడ్డాడు. లార్డ్ మౌంట్ బ్యాటన్ భారతదేశం, పాకిస్తాన్ అను రెండు ప్రత్యేక దేశాలను ఏర్పాటు చేయు ప్రణాళికను అతడు తయారు చేశాడు. జాతీయ మహాసభ విభజనకు వ్యతిరేకంగా ఉండెను. దేశ సమైక్యత అనునది జాతీయ మహాసభకు మూలాధారం. కాని ముస్లిం లీగ్ పాకిస్తాన్ ఏర్పాటు కోసం



పట్టుబట్టింది. అందువలన విభజన అనివార్యమైంది. జాతీయ మహాసభ చేయునది ఏమి లేక విభజన నిర్ణయాన్ని ఆమోదించింది.

**భారతదేశ స్వాతంత్ర్య చట్టం :** మౌంట్ బ్యాటన్ ప్రణాళిక ఆధారంగా 18 జులై 1947 రోజున ఇంగ్లండ్ పార్లమెంట్ భారతదేశ స్వాతంత్ర్య చట్టాన్ని ఆమోదించింది. 15 ఆగస్టు 1947 రోజున భారతదేశం, పాకిస్తాన్ అను స్వతంత్ర దేశాలు మనుగడలోనికి వస్తాయి. ఆ తరువాత వాటిపై బ్రిటిష్ పార్లమెంట్‌కు ఎటువంటి అధికారాలు ఉండవు. సంస్థానాలపై బ్రిటిష్‌వారి ఆధిపత్యం సమాప్తమవుతుంది. అవి భారతదేశం, పాకిస్తాన్‌లలో విలీనం కావచ్చు లేక స్వతంత్ర్యంగా ఉండవచ్చుననే నియమం ఈ చట్టంలో చేయబడింది.

**స్వాతంత్ర్యప్రాప్తి :** భారతదేశ స్వాతంత్ర్య చట్టననుసరించి 15 ఆగస్టు 1947 రోజున భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 14 ఆగస్టు 1947 మధ్య రాత్రి దిల్లీలోని పార్లమెంటు సభాభవవనంలో సంవిధాన సభ ప్రారంభమైంది. మధ్యరాత్రి పన్నెండు గంటలు అయిపోగానే భారతదేశ పారతంత్ర్యం ముగిసింది. బ్రిటిష్‌వారి యునియన్ జాక్ అనే జెండాను క్రిందకు దించి దాని స్థానంలో భారతదేశ మువ్వన్నెల జెండా ఎగురవేయబడింది. నూటయాభై సంవత్సరాల బానిసత్వం నుంచి భారతదేశం స్వాతంత్ర్యం పొందింది.

స్వాతంత్ర్యప్రాప్తి ఆనందం పూర్తిగా అనుభవయోగ్యమైనదిగా లేకుండెను. దేశ విభజన జరిగింది. ఆ సమయంలో జరిగిన భయంకరమైన హింస వలన భారత ప్రజలు దు:ఖితులయ్యారు. స్వాతంత్ర్యోత్సవంలో పాల్గొనకుండా గాంధీజీ బెంగాలులో ఆమరణ నిరాహారదీక్ష చేస్తుండెను. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ఆరు నెలలకు 30 జనవరి 1948 రోజున నాథూరామ్ గొడ్సే గాంధీజీని ఘోరంగా హత్యచేశాడు. హిందూ ముస్లింల ఐక్యత కాపాడుట కొరకు గాంధీజీ అహర్నిశలు పాటుపడ్డాడు. అందుకోసం అతడు తన ప్రాణాలను ఫణంగా పెట్టాడు.

BFZS2H

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(1) తాత్కాలిక ప్రభుత్వానికి ..................... ప్రముఖుడుగా ఉండెను.

(అ) వల్లభ్‌భాయి పటేల్ (బ) మహాత్మాగాంధీ

(క) పం.జవహర్‌లాల్ నెహ్రూ (డ) బారిష్టర్ జిన్నా

(2) భారతదేశం, పాకిస్తాన్ అను రెండు స్వతంత్ర దేశాలను ఏర్పాటు చేసే ప్రణాళికను ....... తయారు చేశాడు.

(అ) లార్డ్ వేవెల్ (బ) స్టఫర్డ్ క్రిప్స్

(క) లార్డ్ మౌంట్‌బ్యాటన్ (డ) ప్యాథిక్ లారెన్స్

**2. కింది ప్రశ్నలకు ఒక వాక్యంలో జవాబులు రాయండి.**

(1) బారిష్టర్ జిన్నా ఏ కోరికను పట్టుదలతో కోరాడు?

(2) మంత్రిత్రయ ప్రణాళికలో భాగస్వాములైన మంత్రుల పేర్లు రాయండి.

**3. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

(1) జాతీయ మహాసభ విభజనను అంగీకరించింది.

(2) తాత్కాలిక ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాలు సవ్యంగా సాగలేవు.

(3) వేవెల్ ప్రణాళిక సఫలం కాలేదు.

**4. ఇవ్వబడిన కాలరేఖపై సంఘటనల క్రమాన్ని రాయండి.**

1945 1946 1947 1948

**5. కింది ప్రశ్నలకు సవిస్తరంగా జవాబులు రాయండి.**

(1) బ్రిటిష్‌వారు భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చే దృష్టితో ఎందుకు ముందడుగు వేశారు?

(2) మౌంట్‌బ్యాటన్ ప్రణాళిక గురించి వివరించండి.

(3) 16 ఆగస్టును ప్రత్యక్షకృతి దినంగా పాటించాలని ముస్లింలీగ్ ఎందుకు ప్రకటించింది? దాని పరిణామాలు ఏమిటి ?

**ఉపక్రమం**

వివిధ సందర్భ గ్రంథాలు అదేవిధంగా అంతర్జాలం సహాయంతో స్వాతంత్ర్యం లభించినమీదట సామాన్య ప్రజల ప్రతిక్రియకు సంబంధించిన సమాచారాన్ని సేకరించండి.

# 13. స్వాతంత్ర్య పోరాట పరి సమాప్తి

భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పటికి స్వాతంత్ర్య పోరాటం ఇంకను సమాప్తం కాలేదు. భారతదేశంలో అనేక సంస్థానాలు ఉండెను. సంస్థానాలకు భారతదేశంలో విలీనం చెందుట లేక స్వతంత్రంగా ఉండే హక్కు లభించింది. అందువల్ల అఖండ భారతదేశాన్ని సాధించాలనే జాతీయ మహాసభ యొక్క కల కలగానే మిగిలిపోయింది. సంస్థానాలు స్వతంత్రంగా ఉండుటవలన భారతదేశంఅనేక ముక్కలుగా విడిపోయి ఉంటుంది. పోర్చుగీసు, ఫ్రెంచ్ వారు భారతదేశం లోని కొన్ని ప్రాంతాలపై తమ అధికారాన్ని విడిచిపెట్టలేదు కాని ఈ సమస్యను భారతదేశం ధైర్యంగా పరిష్కరించింది. దాని గురించి మనం ఈ పాఠంలో తెలుసుకొందాం.

**భారతదేశంలో సంస్థానాల విలీనీకరణ :** భారతదేశంలో చిన్నపెద్ద సంస్థానాలు ఆరువందలకు పైగా ఉండెను. సహాయ నిరాకరణోద్యమ ప్రభావం వలన సంస్థానాలలో రాజకీయ జాగృతి ప్రారంభమైంది. సంస్థానాలలో ప్రజా సంఘాల (మండళ్ళు) స్థాపన జరుగసాగింది. ప్రజాసంఘాలు అనగా సంస్థానాలలోని ప్రజల ప్రయోజనం కొరకు, వారికి రాజకీయ అధికారం లభించుట కొరకు పనిచేయు ప్రజల సమూహాలు. 1927లో అటువంటి ప్రజాసంఘాలు కలిసి ఒక అఖిలభారత ప్రజాపరిషత్‌ను స్థాపించడం జరిగింది. అందువలన సంస్థానాలలోని ఉద్యమాలకు ప్రేరణ లభించింది.


సర్దార్ వల్లభభాయి పటేల్

భారతదేశం స్వాతంత్ర్యం పొందినమీదట ఈ సంస్థానాల విలీనీకరణ సమస్యను పరిష్కరించుటకు ఆనాటి భారతదేశ గృహమంత్రి, సర్దార్ వల్లభభాయి పటేల్ చాలా రాజనీతిజ్ఞతతో పరిష్కార మార్గాన్ని అన్వేషించాడు. అతడు సంస్థానాధీశులను ఒప్పించి అందరికి ఆమోదయోగ్యమైన విధంగా 'విలీనీకరణ పత్రం' తయారు చేశాడు.

భారతదేశంలో విలీనం అయితే సంస్థానాధీశులు పొందే ఎలా ప్రయోజనాలను సర్దార్ వల్లభభాయి పటేల్ వారికి అర్థమగునట్లు చెప్పాడు. అతని ఈ పిలుపుకు సంస్థానాధీశులు బాగుగా స్పందించారు. జునాగడ్, హైదరాబాద్, కాశ్మీర్ ఈ సంస్థానాలు మినహా అన్ని సంస్థానాలు భారతదేశంలో విలీనమయ్యాయి. ఈ మూడు సంస్థానాల విలీనీకరణ సమస్యను సర్దార్ పటేల్ దృఢచిత్తంతో పరిష్కరించాడు.

**జునాగడ్ విలీనీకరణ :** జునాగడ్ సౌరాష్ట్రలోని ఒక సంస్థానం. అక్కడి ప్రజలకు భారతదేశంలో విలీనం కావాలని ఉంది. జునాగడ్ నవాబుకు మాత్రం పాకిస్తాన్‌లో విలీనం కావాలనే ఆలోచన ఉండెను. అతని ఈ నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పుడు నవాబు పాకిస్తాన్‌కు వెళ్ళిపోయాడు. ఆ తరువాత 1948 ఫిబ్రవరిలో జునాగడ్ భారతదేశంలో విలీనమయ్యింది.

**హైదరాబాద్ విముక్తి పోరాటం :** హైదరాబాద్ భారతదేశంలోని అతి పెద్ద సంస్థానం. అందులో తెలుగు, కన్నడ, మరాఠీ ప్రాంతాలు ఉండెను. అక్కడ నిజాం యొక్క నిరంకుశ రాచరిక పాలన ఉండెను. అక్కడ పౌరహక్కులు, రాజకీయ హక్కులు లేకుండెను. తమ హక్కులను పొందుటకు హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలు తెలంగాణ ప్రాంతంలో ఆంధ్ర పరిషత్, మరాఠ్వాడా ప్రాంతంలో మహారాష్ట్ర పరిషద్, కర్నాటక ప్రాంతంలో కర్నాటక పరిషత్ అను సంస్థలను స్థాపించారు. 1938లో స్వామి రామానందతీర్థ హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను స్థాపించాడు. నిజాం ఈ సంఘాన్ని నిషేధించాడు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌కు గుర్తింపు లభించుటకు, ప్రజాస్వామ్య హక్కుల కొరకు పోరాటం ప్రారంభమైంది. ఈ పోరాటానికి స్వామి రామానంద తీర్థ అను వీర సేనాని నాయకత్వం వహించాడు. అతనికి నారాయణరెడ్డి, సిరాజ్-ఉల్-హసన్ తిర్మిజీల తోడు లభించింది. పి.వి. నరసింహారావు, గోవిందభాయి శ్రాఫ్ స్వామీజీకి విశ్వాసపాత్రులైన అనుచరులు.


స్వామి రామానంద తీర్థ

1947 జులైలో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయవలెనని నిర్ణయించింది. కాని నిజాం భారతదేశానికి వ్యతిరేక ధోరణి

అవలంబించాడు. అతడు హైదరాబాద్ సంస్థానం పాకిస్తాన్‌లో విలీనం చేసే ప్రయత్నాలు చేయసాగాడు. నిజాం అనుచరుడు కాసిం రజ్వీ భారతదేశంలో విలీనం కావలెనను సంస్థానంలోని ప్రజల కోరికను అణచివేయుటకు 'రజాకార్' అను పేరుగల సంఘాన్ని నెలకొల్పాడు. కాసిం రజ్వీ, అతని అనుచరులు హిందువులపైనే కాకుండా ప్రజాస్వామ్యవాద ఉద్యమానికి మద్దతునిచ్చే ముస్లింలపై కూడా దౌర్జన్యం చేశారు. అందువలన అంతటా ప్రజలు కోపోద్రిక్తులయ్యారు. నిజాంతో స్నేహపూర్వక మంతనాలు చేసే ప్రయత్నం భారత ప్రభుత్వం చేయుచుండెను. కాని నిజాం స్పందించకుండెను. చివరికి భారత ప్రభుత్వం 13 సెప్టెంబర్ 948 రోజున నిజాంకు వ్యతిరేకంగా పోలీసు చర్యలు ప్రారంభించింది. దీనిని 'ఆపరేషన్ పోలో' అను సాంకేతిక నామం కలదు. చివరకు 17 సెప్టెంబర్ 1948 రోజున నిజాం శరుణ వేడుకొన్నాడు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయింది. సంస్థాన ప్రజల పోరాటం సఫలమైంది. ఈ పోరాటంలో ఆర్య సమాజం యొక్క విశేష తోడ్పాటు ఉండెను.

**హైదరాబాద్ విముక్తిపోరాటంలో మరాఠ్వాడా తోడ్పాటు :** ఈ పోరాటంలో స్వామి రామానంద తీర్థ, బాబాసాహెబ్ పరాంజపే, గోవిందబాయి శ్రాఫ్, అనంత భాలేరావు, ఆశాతాయి వాఘ్‌మారే మొదలగువారు అమూల్యమైన తోడ్పాటును అందిచారు.

'వందేమాతరం' ఉద్యమం ద్వారా విద్యార్థులు హైదరాబాద్ విముక్తి పోరాటంలో భాగస్వాములయ్యారు. అదేవిధంగా హైదరాబాద్ విముక్తి పోరాటంలో వేదప్రకాశ్, శ్యామ్‌లాల్, గోవింద పాన్‌సరే, బహిర్జీ శిందే, శ్రీధర్ వర్తక్, జనార్దన్ మామ, శోయెబ్ ఉల్లా ఖాన్ మొదలగువారు వీరమరణం పొందారు. వారి ప్రాణత్యాగం భారతీయులకు ప్రేరణాదాయకమైంది. దీనిని బట్టి హైదరాబాద్ విముక్తి పోరాటంలో మరాఠ్వాడాలోని నాయకులు, ప్రజల భాగసామవ్యం పెద్ద యెత్తున ఉన్నదని తెలుస్తుంది.

17 సెప్టెంబర్ హైదరాబాద్ విముక్తి పోరాటదినాన్ని మరాఠ్వాడాలో 'మరాఠ్వాడా ముక్తిదిన్'గా జరుపబడుతుంది. స్వతంత్ర భారతదేశంలో మరాఠ్వాడా 15 ఆగస్టు 1947 రోజున విలీనం కాలేదు. ఈ ప్రాంతం 1948లో ప్రజల స్ఫూర్తిదాయక పోరాటం తరువాత స్వతంత్ర భారతదేశంలో విలీనం చేయడం జరిగింది.

**కాశ్మీర్ సమస్య :** కాశ్మీర్ సంస్థానానికి రాజైన హరిసింగ్ స్వతంత్రంగా ఉండుటకు నిర్ణయించుకొన్నాడు. కాశ్మీర్‌ను పాకిస్తాన్‌లో విలీనం చేయాలనే ఆలోచనలో పాకిస్తాన్ ఉండెను. అందుకోసం పాకిస్తాన్ హరిసింగ్‌పై ఒత్తిడి తీసుకురాసాగింది. 1947 అక్టోబర్‌లో పాకిస్తాన్ ప్రేరేపణతో సాయుధ చొరబాటుదార్లు కాశ్మీర్‌పై దాడిచేశారు. అప్పుడు భారతదేశంలో విలీన ఒప్పంద పత్రంపై హరిసింగ్ సంకతం చేశాడు. ఈ విధం గా భారత దేశంలో విలీనం అయిన తరువాత భారత సైన్యాన్ని కాశ్మీరు రక్షణ కోసం పంపడం జరిగింది. సైన్యం కాశ్మీరు యొక్క చాలా ప్రాంతాన్ని చొరబాటుదార్ల హస్తాల నుంచి తిరిగి స్వాధీనం చేసుకొంది. కానీ కొంత భూప్రాంతం మాత్రం పాకిస్తాన్ స్వాధీనంలో ఉండిపోయింది.

**ఫ్రెంచ్ వలసల విలీనీకరణ :** భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత చంద్రనగర్, పుదుచ్చేరి, కారికల్, మాహె, యానాం ప్రాంతాలపై ఫ్రాన్స్ ఆధిపత్యం ఉండెను. అక్కడి భారతీయ ప్రజలు భారతదేశంలో విలీనం అగుటకు ఉత్సుకతతో ఉండిరి. ఈ ప్రాంతాలు భారతదేశ భూభాగాలు కాబట్టి వాటిని భారతదేశానికి స్వాధీన పరచాలని భారత ప్రభుత్వం కోరింది.

ఫ్రాన్స్ 1949 సంవత్సరంలో చంద్రనగర్‌లో అందరి అభిప్రాయాన్ని తీసుకొంది. అక్కడి ప్రజలు భారతదేశంవైపు మొగ్గు చూపారు. చంద్రనగర్ భారతదేశానికి స్వాధీనపరచడం జరిగింది. ఆ తరువాత ఫ్రాన్స్ భారతదేశ ఇతర ప్రాంతాలను కూడా భారతప్రభుత్వ హస్తగతం చేసింది.


డా. టి. బి. కున్హా

**గోవా విముక్తి పోరాటం :** పోర్చుగీసు మాత్రం తమ స్వాధీనంలోని భారతదేశ ప్రాంతాన్ని భారతదేశానికి అప్పగించుటకు నిరాకరించింది. ఆ ప్రాంతాన్ని పొందుట కోసం భారతీయులకు పోరాటం చేయవలసి వచ్చింది. ఈ పోరాటంలో డా. టి.బి. కున్హా ముందున్నాడు. అతడు పోర్చుగీసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో జాగృతి కలిగించే పని చేశాడు. అతడు పోర్చుగీసు వారికి వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించే ఉద్దేశంతో గోవా కాంగ్రెస్ సమితిని స్థాపించాడు.

తరువాత 1945లో డా. కున్హా 'గోవా యూత్ లీగ్' సంస్థను ముంబయిలో స్థాపించాడు. 1946లో అతడు గోవా వెళ్ళి ప్రసంగ నిషేధ ఆజ్ఞను ఉల్లంఘించాడు. అందుకోసం డా. కున్హాకు ఎనిమిది సంవత్సరాల కారాగార శిక్షను విధించడం జరిగింది. క్రీ.శ. 1946లో డా. రామ్‌మనోహర్ లోహియా గోవా విముక్తి కొరకు సత్యాగ్రహ పోరాటం ప్రారంభించాడు. అతడు నిషేధాజ్ఞలను ఉల్లంఘించి గోవాలోని మడ్‌గావ్ వద్ద ప్రసంగించాడు. అందువలన అతనిని పోర్చుగీసు ప్రభుత్వం గోవా నుంచి బహిష్కరించింది.

ఇదే కాలంలో గుజరాత్‌లోని దాద్రా, నగర్ హవేలి లోని పోర్చుగీసు వలసలను విముక్తి చేయుటకు 'ఆజాద్ గోమంతక్' దళాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. 2 ఆగస్టు 1954 రోజున ఈ దళంలోని యువకులు సాయుధ దాడిచేసి దాద్రా, నగర్ హవేలి ప్రాంతాన్ని పోర్చుగీసు అధికారం నుంచి విముక్తి గావించారు. ఈ దాడిలో విశ్వనాథ్ లవందే, రాజా భావూ వాకణ్కర్, సుధీర్ ఫడ్కే, నానా సాహెబ్ కాజరేకర్ మొదలగు వారు పాల్గొన్నారు. 1954లో గోవా విముక్తి సమితి స్థాపించబడింది. ఈ సమితి మహారాష్ట్ర నుంచి అనేక సత్యాగ్రహుల బృందాలను గోవాకు పంపింది. అందులో నా.గ. గోరే, సేనాపతి బాపట్, పీటర్ అల్వారిస్, మహాదేవశాస్త్రి జోషి, అతని భార్య సుధాతాయి మొదలగువారు పాల్గొన్నారు. మోహన్ రానడే గోవాముక్తి ఆందోళనలో ఒక బలమైన నాయకుడు. సత్యాగ్రహులపై పోర్చుగీసు ప్రభుత్వం అంతులేని దౌర్జన్యాలు చేసింది. అందువలన ప్రజలు చాలా కోపోద్రిక్తులయ్యారు.

గోవాలో స్వాతంత్ర్య పోరాటం ఉగ్రరూపం దాల్చింది. భారత ప్రభుత్వం పోర్చుగీసు ప్రభుత్వంతో స్నేహపూర్వక ఒప్పందాలు చేయుచుండెను. కాని దానికి ప్రతిస్పందన లభించకుండెను. చివరికి భారత ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో సైనిక బలాన్ని ఉపయోగించాలనే నిర్ణయం తీసుకొంది. 1961 డిసెంబర్‌లో భారతీయ సైన్యం గోవాలో ప్రవేశించింది. అనతికాలంలోనే పోర్చుగీసు సైన్యం శరణు వేడుకొన్నది. 19 డిసెంబర్ 1961 రోజు గోవా పోర్చుగీసు వారి అధికారం నుంచి విముక్తి పొందింది. భారతదేశ భూమిపై సామ్రాజ్యవాదం పూర్తిగా తొలగిపోయింది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం వాస్తవంగా పరిసమాప్తమైంది.

## అభ్యాసం

1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.
   (1) భారతదేశంలో చిన్న పెద్ద .................. ఆరు వందకులపైగా ఉండెను.
   (అ) రాజ్యాలు (బ) గ్రామాలు (క) సంస్థానాలు (డ) పట్టణాలు
   (2) జునాగడ్, ....................., కాశ్మీర్ సంస్థానాలను మినహాయిస్తే అన్ని సంస్థానాలు భారతదేశంలో విలీనమయ్యాయి.
   (అ) ఔంధ్ (బ) ఝాన్సీ (క) వడోదర (డ) హైదరాబాద్
2. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.
   (1) జునాగడ్ భారతదేశంలో విలీనమైంది.
   (2) భారత ప్రభుత్వం నిజాంకు వ్యతిరేకంగా పోలీసు చర్య ప్రారంభించింది.
   (3) భారతదేశంలో విలీనం చెందు ఒప్పంద పత్రంపై హరిసింగ్ సంతకం చేశాడు.
3. సంక్షిప్తంగా జవాబులు రాయండి.
   (1) సంస్థానాల విలీనీకరణలో సర్దార్ వల్లభభాయిపటేల్ గారి తోడ్పాటును స్పష్టీకరించండి.
   (2) హైదరాబాద్ విముక్తి పోరాటంలో స్వామి రామానంద తీర్థ గారి తోడ్పాటును స్పష్టీకరించండి.

**ఉపక్రమం**

'హైదరాబాద్ విముక్తి పోరాటం' అంశంపై చిత్రాలు, సమాచారం సేకరించండి. చరిత్ర విభాగంలో దానికి సంబంధించిన పట్టికల ప్రదర్శన నిర్వహించండి.

BG9N45

# 14. మహారాష్ట్ర రాష్ట్ర అవతరణ

భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకై పెద్ద ఎత్తున కోరడం జరుగు చుండెను. మహారాష్ట్రలో కూడ మరాఠీ భాషా ప్రాంతాన్ని ఏర్పాటు చేయుటకై 'సంయుక్త మహారాష్ట్ర ఉద్యమం' క్రీ.శ. 1946 నుంచి ప్రారంభమైంది. అనేక మార్పులకులోనై ఈ ఉద్యమ ప్రస్థానం కొనసాగుతూ చివరికి 1 మే 1960 రోజున మహారాష్ట్ర రాష్ట్ర నిర్మాణం జరిగింది.

**నేపథ్యం :** మరాఠీ భాషీయుల ఏకీకరణపు ఆలోచన ఇరవయ్యవ శతాబ్ద ప్రారంభం నుంచి అనేక మంది మేధావులు వ్యక్తం చేయడం ప్రారంభించారు. 1911 లో ఆంగ్ల ప్రభుత్వానికి బెంగాలు విభజనను రద్దు చేయవలసిన వచ్చింది. ఈ నేపథ్యంపై న.చి.కేళ్కర్ 'మరాఠీ భాషలో మాట్లాడే ప్రజలందరు ఒకే పరిపాలన క్రింద ఉండాలి' అని వ్రాసాడు. లోకమాన్య తిలక్ 1915 సంవత్సరంలో భాషా ప్రయుక్త ప్రాంతాలను ఏర్పాటు చేయాలని కోరుడు. కాని ఆ కాలంలో భారతదేశ స్వాతంత్ర్య సమస్య చాలా ముఖ్యమైనందున ఈ సమస్య వెనుకపడ్డది.

12 మే 1946లో బెళగావ్ వద్ద నిర్వహించిన సాహిత్య సమ్మేళనంలో సంయుక్త మహారాష్ట్ర విషయంలో ముఖ్యమైన నిర్ణయం ఆమోదించబడింది.

**సంయుక్త మహారాష్ట్ర పరిషద్ :** 28 జులై రోజున ముంబయిలో శంకర్‌రావు దేవ్ అధ్యక్షతన 'మహారాష్ట్ర ఏకీకరణ పరిషద్' సమావేశమైంది. ఈ పరిషద్ మరాఠీ భాషా ప్రాంతాలను ఒకే ప్రాంతంగా చేయాలని అందులో ముంబయి, మధ్య ప్రాంతంలోని మరాఠీ భాషీయులు, అదేవిధంగా మరాఠ్వాడా మరియు గోమంతక్ మరాఠీ భాషా ప్రాంతాన్ని చేర్చవలెనని తీర్మానించడం జరిగింది.

**దార్ కమీషన్ :** సంవిధాన సభ అధ్యక్షులు డా. రాజేంద్రప్రసాద్ 17 జూన్ 1948 రోజున న్యాయమూర్తి ఎన్.కె.దార్ అధ్యక్షతన భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం కొరకు 'దార్ కమీషన్' స్థాపించబడింది. 10 డిసెంబర్ 1948 రోజున దార్ కమీషన్ నివేదిక ప్రచురించబడింది. కాని దానవలన సమస్య తీరలేదు.

**జె.వి.పి. సమితి (త్రిసభ్య సమతి) :** భాషా ప్రయుక్త ప్రాంతాలు ఏర్పాటు చేయవలసిన పరిస్థితులను అధ్యయనం చేయుట కోసం కాంగ్రెస్ 29 డిసెంబర్ 1948 రోజున ఒక సమితిని నియమించింది. అందులో పండిత్ జవాహర్‌లాల్ నెహ్రూ, వల్లభభాయి పటేల్, పట్టాభిసీతారామయ్యలు ఉండిరి. ఈ ముగ్గిరి సభ్యుల మొదటి అక్షరాలతో జె.వి.పి సమితిగా గుర్తించబడింది. ఈ సమితి తన నివేదికలో భాషాప్రయుక్త ప్రాంతాల ఏర్పాటు కాంగ్రెస్‌కు సిద్ధాంతపరంగా సమ్మతమే. కాని ఇది సరియైన సమయం కాదు అని సిఫారసు చేసింది. ఈ నివేదికకు వ్యతిరేకంగా మహారాష్ట్రమంతటా తీవ్ర ప్రతిస్పందన వెలువడింది. అదే సమయంలో జనజాగృతి కొరకు సేనాపతి బాపట్ ప్రభాత ఊరేగింపులు నిర్వహించాడు.

ఆచార్య అత్రే ముంబయి మహా నగరపాలికలో ముంబయితోబాటు సంయుక్త మహారాష్ట్ర తీర్మానాన్ని ప్రతిపాదించాడు. అది 50కి 35 ఓట్లతో మంజూరు అయింది. అందువలన ముంబయి మహారాష్ట్రలో ఉండాలనే ప్రజల కోరిక నిరూపితమైంది.

**రాష్ట్రాల పునర్విభజన కమీషన్ :** భారత ప్రభుత్వం న్యాయమూర్తి ఎస్.ఫాజల్ అలి అధ్యక్షతన 29 డిసెంబర్ 1953 రోజున 'రాష్ట్రాల పునర్విభజన కమీషన్' స్థాపించింది. ఈ కమీషన్ 10 అక్టోబర్ 1955 రోజున తన నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో ముంబయిని ద్విభాషా రాష్ట్రంగా ఏర్పాటు చేయవలెనని సిఫారసు చేసింది.

**నాగపూర్ ఒప్పందం :** అన్ని మరాఠీ ప్రాంతాల ప్రజలకు కలిపి ఒకే రాష్ట్రాన్ని స్థాపించుటకై 1953లో నాగపూర్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం పశ్చిమ మహారాష్ట్ర, విదర్భ-మరాఠ్వాడాలతోపాటు సంయుక్త మహారాష్ట్ర ఏర్పడింది. సంవిధానంలోని 1956 సవరణ ప్రకారం చట్టం 371(2)ను సంవిధానంలో పొందుపరచబడింది. దాని ప్రకారం అభివృద్ధి పనులకొరకు సమన్యాయ నిధి, సాంకేతిక, వృత్తి విద్యకొరకు సరిపోవు నిధి, ఆయా ప్రాంతాలలోని జనాభా నిష్పత్తి ప్రకారం రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశం మరియు

మహారాష్ట్ర విధాన సభ సమావేశాలు సంవత్సరానికి ఒక మారు నాగపూర్‌లో నిర్వహించుట మొదలగు అంశాలకు నాగపూర్ ఒప్పందం ద్వారా హామి ఇవ్వడం జరిగింది.

మరాఠీ భాషీయులు ముంబయితోబాటుగా మహారాష్ట్ర ఏర్పడడానికి పోరాటం చేయడం ప్రారంభించారు. ముంబయిలో కామ్‌గార్ మైదానంలో పెద్ద సభ జరిగింది. ఆ సమయంలో శంకర్‌రావు దేవ్ ఇలా అన్నాడు. "మహారాష్ట్ర నుంచి ముంబయిని వేరు చేయుటను మనం ప్రాణాలకు తెగించి వ్యతిరేకిద్దాం." అని శంకర్‌రావుదేవ్ ఉద్ఘాటించారు. ప్రజల భావనలు, కోరికలు జనాందోళన రూపం దాల్చాయి. అందులో మహిళలు కూడా హఠాత్తుగా భాగస్వాములు కాసాగారు. సుమతీబాయి గోరే, ఇస్మత్ చుగతాయి, దుర్గా భాగవత్, తారా రెడ్డి, చారుశీల గుప్తే, కమలాతాయి మోరే, సుల్తానా జోహారీ వంటి అనేకమంది మహిళలు ఆందోళనలో పాల్గొన్నారు.

7 నవంబర్ 1955 రోజున కార్మికుల సభ జరిగింది. అందులో వివిధ కార్మిక సంస్థలు, కమ్యూనిస్టులు, ప్రజాస్వామ్యవాదులు, సామ్యవాదులు, రైతు కార్మిక పార్టీలు, ప్రజాసంఘాలు వంటి అనేక రాజకీయ పార్టీలు పాల్గొన్నాయి. అధ్యక్షస్థానంలో కామ్రేడ్ శ్రీపాద అమృత్ డాంగే ఉండెను. ఈ సమావేశంలో ఎస్. ఎమ్. జోషి ముంబయి విదర్భలతోబాటు సంయుక్త మహారాష్ట్ర కావలెనని తీర్మానాన్ని ప్రతిపాదించాడు.

**ప్రత్యక్ష పోరాటానికి ప్రారంభం** : మరాఠీ భాష ప్రజల్లో అసంతృప్తి పెరుగుతూ పోయింది. సేనాపతి బాపట్ నాయకత్వంలో విధానసభకు పెద్ద ఊరేగింపు బయలుదేరింది. ఆ సమయంలో మొరార్జీ దేసాయి ముఖ్యమంత్రిగా ఉండెను. ప్రభుత్వం నిషేధం ఆజ్ఞలు జారీ చేసింది. పోలీసులు ఊరేగింపుపై లాఠీచార్జ్, బాష్పవాయువులను ప్రయోగించారు. అదేరోజు సాయంత్రం కామ్‌గార్ మైదానంపై సుమారు 50వేల మంది సమక్షంలో బహిరంగ సభ జరిగింది. కామ్రేడ్ డాంగే మార్గదర్శనం చేశాడు. సంయుక్త మహారాష్ట్ర ఏర్పాటు పోరాటాన్ని అధిక వేగవంతం చేయుటకు 21 నవంబర్ 1955 రోజున ఒకరోజు సమ్మెను దృష్టాంతంగా చేయవలెనని నిర్ణయించబడింది.

**సంయుక్త మహారాష్ట్ర సమితి స్థాపన** : మరాఠీ భాషీయ ప్రజల సంయుక్త మహారాష్ట్ర కోరిక సమస్య జటిలమవుతూ



ప్ర. కే. అత్రే

పోయింది. రాష్ట్రమంతటా అసంతృప్తి రగిలి పోతుండెను. 6 ఫిబ్రవరి 1956 రోజున కేశవరావు జేధే అధ్యక్షతన పుణెలో తిలక్ స్మారక మందిరంలో సభ జరిగింది. అందులో సమితి తన కార్యవర్గాన్ని ప్రకటించడం జరిగింది. దాని ప్రకారం అధ్యక్ష పదవికి కా. శ్రీపాద అమృత్ డాంగే, ఉపాధ్యక్షుడుగా డా. త్ర్యం. రా. నరవణె, కార్యదర్శిగా ఎస్.ఎమ్. జోషిలు ఎన్నుకోబడ్డారు. సమితిని స్థాపించడంలో గ. త్ర్యం. మాడ్‌ఖోల్కర్, ఆచార్య ప్ర. కే. అత్రే, మధు దండావతె, ప్రబోధన్‌కార్ కేశవ్ ఠాకరే, య. కృ. సోవనీలు ముఖ్యపాత్ర పోషించారు. వీరితోపాటు సేనాపతి బాపట్, క్రాంతిసింహ్ నానాపాటిల్, లాల్‌జీ పెండ్సే, అహిల్యాబాయి రాంగణేకర్‌లు సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో గొప్ప తోడ్పాటునందించారు. ఉద్యమం మహారాష్ట్రలోని గ్రామగ్రామానికి విస్తరించింది.



ఎస్. ఎమ్. జోషి



ప్రబోధన్‌కార్ ఠాకరే

ఎప్పుడైతే ముంబయి మహారాష్ట్రకు దక్కదని స్పష్టమైందో అప్పుడు ప్రచండమైన ఉద్యమం చెలరేగింది. ఈ ఉద్యమంలో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో 106 మంది మరణించారు. తరువాత సంయుక్త మహారాష్ట్ర నిర్మాణం కోసం వీరమరణం పొందిన 106 మంది సుపుత్రుల 'హుతాత్మాస్మారక్' (అమర వీరుల స్మారకం) ముంబయిలో ఫ్లోరా ఫౌంటేన్ దగ్గర నిర్మించడం జరిగింది.

1 నవంబర్ 1956 రోజున ద్వైభాషిక ముంబయి ఏర్పడింది. ఆ తరువాత 1957 సంవత్సరంలో లోకసభ,



మీకు తెలుసా ?



లోక్‌శాహీర్ అన్నాభావు సాఠే



శాహీర్ అమర్ శేఖ్



శాహీర్ ద. నా. గవాణ్‌కర్

**మరాఠీ వార్తా పత్రికలు, కవుల పనులు :** ఈ ఉద్యమంలో వార్తా పత్రికల పాత్ర ముఖ్యమైనది. ప్రబోధన్, కేసరి, సకాళ్, నవాకాళ్, నవయుగ్, ప్రభాత్ వంటి అనేక వార్తా పత్రికలు జనజాగృతి గావించాయి. సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో ఆచార్య అత్రే యొక్క 'మరాఠా' వార్తాపత్రిక విశిష్టమైన పని చేసింది. బాళాసాసెబ్ ఠాకరే 'మావళా' అను కలంపేరుతో వ్యంగ చిత్రాలు వేసి ప్రజా ఉద్యమాన్ని విస్తృతం చేశాడు.

ప్రజాకవి అన్నాబావు సాఠే, కవి అమర్‌శేఖ్, కవి ద. నా. గవాణ్‌కర్‌లు తమ రచనలద్వారా పెద్ద యెత్తున జనజాగృతి గావించారు.

విధానసభ మరియు ముంబయి మహానగరపాలిక ఎన్నికలు జరిగాయి. అందులో సంయుక్త మహారాష్ట్ర సమితికి గొప్ప విజయం లభించింది. ఈ ఎన్నికల ఫలితాలను బట్టి ఓటర్లు ద్విభాషా రాష్ట్రానికి వ్యతిరేకంగా, సంయుక్త మహారాష్ట్ర పక్షాన ఉన్నారను విషయం స్పష్టమైంది.

ప్రతాపగడ్‌పై చత్రపతి శివాజీ మహారాజ్ యొక్క అశ్వారూడుడైన విగ్రహావిష్కరణ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారి హస్తములతో 30 సెప్టెంబర్ 1957 రోజున జరుగనుండెను. ఆ సమయంలో సంయుక్త మహారాష్ట్ర సమితి భాయి మాధవరావు బాగల్ నాయకత్వంలో పెద్ద ఊరేగింపు జరిపింది. ఎస్. ఎమ్. జోషి, నా. గ. గోరె, జయంత్ రావు తిలక్, ప్ర. కె. అత్రే, ఉద్ధవ్‌రావు పాటిల్ మొదలగు నాయకులు హాజరైనారు. సమితి పసరణీ ఘాట్ మరియు పోలాద్‌పూర్ సమీపంలో తీవ్ర ఆందోళన చేసింది. మరాఠీ భాషీయుల భావనలు, మొత్తం పరిస్థితిని పం. జవాహర్‌లాల్ నెహ్రూకు తెలియజేయడంలో సమితి విజయవంతమైంది.



ఉద్ధవ్‌రావు పాటిల్

సంయుక్త మహారాష్ట్ర సమితి నాయకత్వంలోని ఉద్యమం వలన కేంద్ర ప్రభుత్వం మహారాష్ట్ర ఏర్పాటుకు సుముఖత చూపింది. ఈ సమయంలో కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరాగాంధీ సంయుక్త మహారాష్ట్ర వైపు మొగ్గు చూపింది. మహారాష్ట్ర మరియు గుజరాత్ అను రెండు భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి నిచ్చింది. ఏప్రిల్ 1960లో పార్లమెంట్ ముంబయి పునర్విభజన చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం 1 మే 1960 రోజున మహారాష్ట్ర రాష్ట్రం అవతరించింది.

1 మే 1960 రోజున ఉదయం రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో పండిట్ నెహ్రూ కార్మికుల దినోత్సవం నాడు మహారాష్ట్ర రాష్ట్రాన్ని అధికారికంగా ప్రకటించాడు. మహారాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా యశ్వంతరావు చవాన్ బాధ్యతలు స్వీకరించాడు.



యశ్వంతరావు చవాన్

# అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని వాక్యాలను మరల రాయండి.**

(1) 1 మే 1960 రోజున ............... రాష్ట్రం అవతరించింది.

(అ) గోవా (బ) కర్నాటక
(క) ఆంధ్రప్రదేశ్ (డ) మహారాష్ట్ర

(2) ముంబయి మహానగరపాలికలో ముంబయితోబాటు సంయుక్త మహారాష్ట్ర తీర్మాణం ............ ప్రతిపాదించాడు.

(అ) గ. త్ర్యం. మాడ్‌ఖోల్కర్ (బ) ఆచార్య అత్రే
(క) ద. వా. పోత్‌దార్ (డ) శంకర్‌రావు దేవ్

(3) మహారాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా .................... బాధ్యతలు స్వీకరించాడు.

(అ) యశ్వంతరావు చవాన్ (బ) పృథ్వీరాజ్ చవాన్
(క) శంకర్‌రావు చవాన్ (డ) విలాస్‌రావు దేశ్‌ముఖ్

**2. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టీకరించండి.**

(1) సంయుక్త మహారాష్ట్ర సమితి స్థాపించబడింది.

(2) సంయుక్త మహారాష్ట్ర పోరాటంలో వార్తాపత్రికల పాత్ర ముఖ్యమైనది.

**3. టిప్పణులు రాయండి.**

(1) సంయుక్త మహారాష్ట్ర పరిషద్

(2) సంయుక్త మహారాష్ట్ర సమితి తోడ్పాటు

**4. కింది సంకల్పనా చిత్రాన్ని పూరించండి.**




**ఉపక్రమం**

మహారాష్ట్ర ఏర్పాటుకొరకు ముఖ్యమైన తోడ్పాటు నందించిన వ్యక్తుల సమాచారాన్ని సేకరించి దాని ఆధారంగా ప్రాజెక్టును ఉపాధ్యాయుల సహాయంతో తయారు చేయండి.

BGIJ5S

# పౌరశాస్త్రం

## (పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి)

### విషయ సూచిక


| క్ర. సం. | పాఠము పేరు | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి పరిచయం | 68 |
| 2. | భారతదేశ పార్లమెంటు | 71 |
| 3. | కేంద్ర కార్యనిర్వాహక మండలి | 75 |
| 4. | భారతదేశంలోని న్యాయ వ్యవస్థ | 79 |
| 5. | రాష్ట్ర ప్రభుత్వం | 83 |
| 6. | ఉద్యోగి స్వామ్యం | 86 |

## అధ్యయన ఫలితాలు

| అధ్యయన-అధ్యాపన ప్రక్రియ | అధ్యయన ఫలితాలు |
|---|---|
| **వ్యక్తిగతంగా/అధ్యయనార్థులు జతలుగా/సమూహాల మధ్య అధ్యయనావకాశాలను కల్పించుట మరియు కింది విషయాల కోసం ప్రేరేపించుట.**<br>• సంవిధానం, పార్లమెంటు, న్యాయ సంస్థ, సరిహద్దీకరణము లేదా సమాసీకరణము (marginalization) వంటి సంకల్పనలపై చర్చల్లో పాల్గొనుట.<br>• భారతదేశ సంవిధానం యొక్క గొప్పతనము, పీఠిక, పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి, అధికార విభజన, సమాఖ్యవాదంపై రేఖాచిత్రం, చిత్రాలతో సహా గోడ చిత్రాలను తయారుచేయుట మరియు రాతపూర్వకంగా/మౌఖికంగా ప్రదర్శించుట.<br>• తరగతిలో/పాఠశాలలో/ఇంటిలో/సమాజంలో స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి సిద్ధాంతాలను ఎలా ఆచరించబడు చుండునో చర్చించుట.<br>• దేశ/కేంద్రపాలిత ప్రాంతాల లోకసభ నియోజకవర్గాల మానచిత్రపటాన్ని పరిశీలించుట.<br>• బాల పార్లమెంటు, సాదృశ్య (సారూప్య) ఎన్నికల నియమావళితో సహా సారూప్య ఎన్నికలను నిర్వహించుట.<br>• తమ పరిసరాలలోని/ఇరుగుపొరుగులోని అర్హత కలిగిన ఓటర్ల జాబితాను తయారుచేయుట.<br>• తమ పరిసరాలలో ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి జనజాగృతికై ప్రబోధన చేయుట.<br>• తమ నియోజనకవర్గంలోని ప్రజాప్రతినిధులు చేపట్టిన సార్వజనిక పనుల విషయాలను తెలుసుకొనుట.<br>• ప్రాథమిక సమాచార వృత్తాంతం (FIR) లోని ఆశయాలను పరీక్షించుట.<br>• అభియోగదారునికి న్యాయం చేకూర్చడంలో న్యాయమూర్తి పాత్ర దీనిపై విస్తృతమైన, చికిత్సాత్మక లేఖన మాధ్యమం ద్వారా స్వీయ అభిప్రాయాన్ని అభివ్యక్తీకరించు అవకాశంను కల్పించుట.<br>• ప్రత్యేకించి స్త్రీలు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులు, సంచార మరియు విముక్త జాతులు, మతాల మరియు భాషల అల్ప సంఖ్యాకులు, దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలను కలిగిన బాలలు, ఇతర పీడిత వర్గాల యొక్క మానవ హక్కుల ఉల్లంఘన, రక్షణ మరియు ప్రచారం, వీటిపై సామూహిక చర్చలను నిర్వహించుట.<br>• బాల కార్మికులు, బాలల హక్కులు మరియు భారతదేశంలోని న్యాయవ్యవస్థపై పాత్ర పోషణ.<br>• సార్వజనిక సౌకర్యాలు మరియు నీరు, ఆరోగ్య వసతులు, విద్యుచ్ఛక్తి లభ్యతలోని లోపాలపై సహాధ్యాయులతో అనుభవాలను పంచుకొనుటకు అవకాశం ఇచ్చుట.<br>• సార్వజనిక సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం ఎలా జవాబుదారీ అవుతుందో చర్చించుట. | **అధ్యయనార్థులు**<br>08.73H.14 భారతదేశ సంవిధానం సందర్భంలో తమ ప్రాంతంలోని సామాజిక, రాజకీయ సమస్యల యొక్క సంబంధాలను అన్వయించుకొందురు.<br>08.73H.15 రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వాల మధ్య గల వ్యత్యాసాన్ని తెలుసుకొందురు.<br>08.73H.16 లోకసభ ఎన్నికల ప్రక్రియను వర్ణింతురు.<br>08.73H.17 దేశ/కేంద్రపాలిత ప్రాంతాలను లోకసభ నియోజకవర్గ మానచిత్రపటంలో తమ నియోజకవర్గ స్థానాన్ని నిశ్చయించి స్థానిక ప్రజాప్రతినిధులు పేర్లను రాయుదురు.<br>08.73H.18 చట్టాలను తయారుచేయు ప్రక్రియను వర్ణించుదురు. (ఉదా., గృహ హింస నుండి మొదలుకొని భద్రత కల్పించు చట్టం, సమాచార అధికార చట్టం, విద్యా హక్కు చట్టం మొదలగునవి)<br>08.73H.19 న్యాయస్థానాల కొన్ని ముఖ్యమైన తీర్పులను చెప్పుచు వాటి ఆధారంగా భారతదేశంలోని న్యాయస్థానాల వ్యవస్థ యొక్క పనులను స్పష్టం చేయుదురు.<br>08.73H.20 'ప్రాథమిక సమాచార వృత్తాంతం' ఏ విధంగా సమర్పించాలి అనే దానిని ప్రత్యక్షంగా చూపించుదురు.<br>08.73H.21 తమ ప్రాంతంలోని బలహీన సమాజవర్గాలు ఊరిబయట దూరంగా ఎందుకు నివసించవలసి వస్తుందో కారణాలను, పరిణామాలను విశ్లేషించుదురు.<br>08.73H.22 నీరు, సార్వజనిక స్వచ్ఛత, రోడ్లు, విద్యుచ్ఛక్తి మొదలగు సార్వజనిక సదుపాయాలను కల్పించుటలో ప్రభుత్వము యొక్క పాత్రను గుర్తించి, ఆ సేవలు లభ్యమగుటపై దృష్టిని కేంద్రీకరించుదురు.<br>08.73H.23 మహారాష్ట్రలోని ప్రభుత్వ యంత్రాంగ స్వరూపమును స్పష్టం చేయుదురు. |

# 1. పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి పరిచయం

భారతదేశ సంవిధానంలో ఏ విధమైన ప్రభుత్వ యంత్రాంగం లేక ప్రభుత్వ పద్ధతి నమోదు చేయబడిందో దాని గురించి ఈ పాఠంలో మనం అధ్యయనం చేయబోతున్నాం.

> **ఈ ప్రశ్నలు మీకు కూడా స్ఫురించాయా?**
>
> - పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి అనగా నేమి?
> - భారతదేశానికి ప్రధానమంత్రి ఉన్నాడు కాని అమెరికాకు ప్రధానమంత్రి ఎందుకులేడు?
> - పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి మరియు అధ్యక్ష ప్రభుత్వ పద్ధతిలో ఏమి వ్యత్యాసం ఉంది?

పైన పేర్కొనబడిన కొన్ని ప్రశ్నల నుండి ప్రతి దేశంలోని ప్రభుత్వ పద్ధతి యొక్క స్వరూపం వేరువేరుగా ఉంటుందని మనకు తెలుస్తుంది. వివిధ రకాల ప్రభుత్వ పద్ధతుల స్వరూపాలను అర్థం చేసుకొనుటకు ముందు మనం ప్రభుత్వ సంస్థల ప్రముఖ శాఖలను గురించిన సమాచారాన్ని క్లుప్తంగా తెలుసుకుందాం.

వీటిలో శాసన మండలి చట్టాలను రూపొందించు పనిని చేస్తుంది. కార్యనిర్వాహక మండలి ఆ చట్టాలను ప్రత్యక్షంగా అమలు చేస్తుంది. న్యాయ మండలి న్యాయాన్ని చేకూర్చు పనిని చేస్తుంది. ఈ మూడు శాఖల పనులు, వాటి అధికార పరిధులు, వాటికి గల పరిమితులు ఈ మూడు శాఖల పరస్పరమైన సంబంధాలను సంవిధానం నిర్ణయిస్తుంది. ఈ సంబంధాలు ఏ విధమైనవై ఉంటాయో దాన్నిబట్టి శాసన సంస్థల స్వరూపం నిర్ణయింపబడుతుంది.

ప్రభుత్వ పద్ధతిలోని ప్రధానమైన రెండు రకాలు వీటి నుండి ఏర్పడినవని గోచరిస్తోంది. 1) పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి 2) అధ్యక్ష ప్రభుత్వ పద్ధతి.

## పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి

పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి ముఖ్యంగా ఇంగ్లాండ్‌లో ఏర్పడింది. ఇంగ్లండ్‌లో లిఖిత సంవిధానం ఉన్నప్పటికి నేటికి కూడా అక్కడ చాలా వరకు దేశ కార్యకలాపాలు వాడుకలోనున్న పద్ధతుల ఆధారంగా నడుస్తాయి. 'పార్లమెంట్' అనేది ఆ విధంగా అక్కడ వృద్ధినొందిన సంస్థ. పార్లమెంట్‌పై ఆధారపడిన పార్లమెంటరీ (Parliamentary) ప్రభుత్వ పద్ధతి అనేది ఇంగ్లండ్ యొక్క ఆవిష్కరణగా భావింపబడుతుంది. భారతదేశంలో ఈ ప్రభుత్వ పద్ధతిని పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిగా మనం స్వీకరించడమైనది. అనగా ఇంగ్లండ్‌లో పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి మరియు భారతదేశంలోని పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలో విస్తృతమైన అర్థంతో సామ్యం(పోలిక) కనిపిస్తుంది. అయినప్పటికి సంస్థాగత దృష్ట్యా భారతీయ ప్రభుత్వ పద్ధతి వేరుగా ఉంది. భారతదేశ పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలోని కింది విశిష్టతలను అర్థం చేసుకుందాం.

- పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి అనునది దేశ పరిపాలన యొక్క ఒక పద్ధతి. కేంద్ర ప్రభుత్వ యంత్రాంగ శాసన మండలిని పార్లమెంట్ అని అంటారు. రాష్ట్రపతి, లోకసభ మరియు రాజ్యసభ కలిసి పార్లమెంట్ అవుతుంది.
- పార్లమెంట్ యొక్క లోకసభలోని ప్రతినిధులు ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నుకోబడతారు. ఈ సభలోని సభ్యుల సంఖ్య నిర్దిష్టంగా ఉంటుంది.
- నిర్దిష్టమైన కాలపరిమితి తరువాత లోకసభకు ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు పోటీ చేస్తాయి. అందులో ఏ రాజకీయ పార్టీకి సగాని కంటె ఎక్కువ స్థానాలు లభిస్తాయో అది సంఖ్యాధిక్యత (మెజారిటీ) పొందిన పార్టీగా అంగీకరించుబడుతుంది. సంఖ్యాధిక్యత ఉన్న పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.
- కొన్ని సమయాల్లో ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యత లభించదు. అలాంటి సమయాల్లో కొన్ని పార్టీలు ఒక్కటై తమ సంఖ్యాధిక్యతను నిరూపించుకుంటాయి. అవి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతాయి. దీనిని సంకీర్ణ ప్రభుత్వం అని అంటారు.
- ఈ విధంగా ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులు శాసన మండలి యొక్క సభ్యులవుతారు, సంఖ్యాధిక్యత పొందిన పార్టీ తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.

- సంఖ్యాధిక్యత పొందిన పార్టీ నాయకుడు ప్రధానమంత్రి అవుతాడు. అతడు కొంత మంది సహచరులను మంత్రి పదవులకోసం ఎన్నుకొంటాడు.
- ప్రధానమంత్రి, అతడు ఎన్నుకున్న మంత్రి మండలి పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలోని కార్యనిర్వాహక మండలి. పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలోని కార్యనిర్వాహక మండలికి రెండు విధాలైన బాధ్యతలు ఉంటాయి. (1) కార్యనిర్వాహక మండలిగా వారు చట్టాలను అమలుజరుపవలసి ఉంటుంది. (2) వారు శాసన మండలి సభ్యులుగా కూడా ఉంటారు కాబట్టి వారికి శాసన మండలికి సంబంధించిన బాధ్యతలను నెరవేర్చవలసి ఉంటుంది.

ప్రధానమంత్రి అతని మంత్రి మండలిలోని మంత్రులు తమ అన్ని కార్యాలు, విధానాల కోసం మళ్ళీ శాసనమండలికి బాధ్యులుగా ఉంటారు. అనగా, మంత్రి మండలి శాసన మండలిని తోడ్కొని దేశ పరిపాలనా వ్యవహారాలను నిర్వహించవలసి ఉంటుందని అర్థం. అందుగురించి పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిని 'బాధ్యతాయుత ప్రభుత్వ పద్ధతి' అంటారు. అదేవిధంగా సామూహిక బాధ్యత అనునది పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి యొక్క మరొక అతి ప్రత్యేకమైన విశిష్టత. ఏదైనా ఒక శాఖ యొక్క నిర్ణయాన్ని ఆ దేశ నిర్ణయంగా పరిగణిస్తారు. ఆ నిర్ణయం యొక్క బాధ్యత సంపూర్ణ మంత్రి మండలిదిగా ఉంటుంది. దీనిని ప్రత్యక్షంగా ఎలా తీసుకురావాలి అను దానిని సోదాహరణంగా మనం రాబోవు రెండు పాఠాలలో చూడబోతున్నాం.

పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలో కార్యనిర్వాహక మండలి శాసనమండలి యొక్క విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. ఎంతవరకు శాసనమండలి యొక్క మద్దతు కార్యనిర్వాహక మండలికి ఉంటుందో లేదా సమ్మతి ఉంటుందో అంతవరకు కార్యనిర్వాహక మండలి అనగా ప్రధానమంత్రి మరియు మంత్రి మండలి అధికారంలో కొనసాగుతుందని అర్థం. శాసన మండలికి లేదా పార్లమెంటుకు ఒకవేళ తమ ఇష్టానుసారంగా కార్యనిర్వాహక మండలి పని చేయడంలేదని అనిపించిన పక్షంలో అప్పుడు పార్లమెంటు అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించి కార్యనిర్వాహక మండలిని అధికారంలో నుండి తొలగిస్తుంది. అవిశ్వాస తీర్మానమనేది నియంత్రణ యొక్క ఒక ప్రభావవంతమైన సాధనం.

పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలో పార్లమెంటు లేదా శాసన మండలి శ్రేష్ఠమైనదిగా ఉంటుంది. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతినిధులు సామాన్య ప్రజల ఆకాంక్షలను పార్లమెంటులో వ్యక్తపరుస్తారు. ప్రజాక్షేమం కోసం ఏమి చేయాలనేది పార్లమెంటు నిర్ణయిస్తుంది. అది ప్రజా ప్రతినిధుల సభ కావడం వల్ల, ప్రజల సర్వశ్రేష్ఠమైన అధికారాలను వ్యక్తపరుస్తుండడం వల్ల పార్లమెంటు హోదా శ్రేష్ఠమైనదిగా ఉంటుంది.

## పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిని మనమెందుకు స్వీకరించాం?

భారతదేశం పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిని స్వీకరించడం వెనుక కొన్ని కారణాలు కలవు. బ్రిటిషువారి పరిపాలనా కాలంలోనే భారతదేశంలో పార్లమెంటరీ సంస్థ నిర్మాణం జరిగింది. బ్రిటిషు వారు ఈ పద్ధతిలోనే దేశ పరిపాలన చేయడం ప్రారంభించియుండిరి. పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి అనునది కూడా భారతదేశ స్వాతంత్ర్య పోరాటం యొక్క ఒక ఆవిష్కారం. అందువల్ల ఈ పద్ధతి భారతీయులకు పరిచయం చేయబడింది. సంవిధాన సభలో ఈ పద్ధతిపై చాలా చర్చలు జరిగాయి. సంవిధాన కర్తలు ఈ పద్ధతిలో భారతదేశ పరిస్థితులకు అనుకూలమైన మార్పులు చేశారు.

పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలో చర్చలకు, విచార వినిమయాలకు చాలా అవకాశం ఉంటుంది. సార్వజనిక సంక్షేమ సమస్యలపై పార్లమెంటులో చర్చ జరుగుతుంది. ఈ చర్చలో విపక్షాల సభ్యులు కూడా పాల్గొంటారు. సరియైన విషయంలో ప్రభుత్వానికి సహకరించుట, విధానాలలోని లేదా చట్టాలలోని లోపాలను ఎత్తి చూపుట, సమస్యలను అధ్యయన పూర్వకంగా వివరించుట మొదలగు విషయాలను విపక్షాలు నిర్వహించగలుగుతాయి. అందువల్ల పార్లమెంటులో ఎక్కువగా దోషరహితమైన చట్టాలను తయారుచేయడం సాధ్యమవుతుంది.

## అధ్యక్ష ప్రభుత్వ పద్ధతి

దేశ వ్యవహారాలకు సంబంధించిన మరొక పద్ధతిగా అధ్యక్ష ప్రభుత్వ పద్ధతిని పేర్కొనడం జరిగింది. ఇలాంటి ప్రభుత్వ పద్ధతి అమెరికా దేశంలో కలదు. ఈ పద్ధతి పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతికంటె భిన్నంగా కలదు. శాసన మండలి నుండి కార్యనిర్వాహక మండలి వేరుగా నున్నప్పటికి, అందులో కార్యనిర్వాహక ప్రముఖుడు (దేశాధ్యక్షుడు) ప్రత్యక్షంగా ప్రజలనుండి ఎన్నుకోబడుతాడు. ఈ పద్ధతియే అధ్యక్ష ప్రభుత్వ పద్ధతి. ప్రభుత్వ సంస్థ యొక్క మూడు శాఖలు ఈ పద్ధతిలో ఒకదానికొకటి స్వతంత్రంగా ఉంటాయి. అయినప్పటికి వాటి విధులలో ఏకాభిప్రాయం

వచ్చునంతవరకు వాటిమధ్య సంబంధం ఉంటుంది. అధ్యక్ష ప్రభుత్వ పద్ధతిని అమెరికా అవలంబించింది. ఈ ప్రభుత్వ పద్ధతిలోని కొన్ని విశిష్టతలు క్రింది విధంగా ఉన్నాయి.

- అధ్యక్ష ప్రభుత్వ పద్ధతిలో శాసన మండలి, కార్యనిర్వాహక మండలి ప్రత్యక్షంగా పరస్పరం ఆధారపడి ఉండవు. శాసన మండలి యొక్క రెండు సభలు అదేవిధంగా దేశాధ్యక్షుడు ప్రజల చేత ఎన్నుకోబడతారు. దేశాధ్యక్షుడు కార్యనిర్వాహక ప్రముఖుడుగా ఉంటాడు. అతని చేతిలో చట్టాలను అమలుచేయటంతోపాటు ఇతర అనేక అధికారాలు ఉంటాయి.
- అధ్యక్ష ప్రభుత్వ పద్ధతిలో కూడా ఈ విధమైన ఏర్పాటు ఉన్నప్పటికి శాసన మండలి, కార్యనిర్వాహక మండలి పరస్పరం నియంత్రణ కలిగియుంటాయి. పరస్పర నియంత్రణ మూలంగా బాధ్యతాయుతమైన పద్ధతిలో దేశ పరిపాలన జరుగగలదు.

పార్లమెంటరీ మరియు అధ్యక్ష ప్రభుత్వ పద్ధతి కాకుండా ఇతర కొన్ని ప్రభుత్వ పద్ధతులు ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, జర్మనీ మొదలగు దేశాలలో అవలంబించబడుతున్నాయి. వివిధ దేశాలు తమ పరిస్థితుల కనుగుణంగా ఆయా విధమైన ప్రభుత్వ పద్ధతులను అవలంబిస్తున్నట్లు గోచరిస్తోంది.

తర్వాత పాఠంలో మనం భారతదేశం యొక్క పార్లమెంటు నిర్మాణం, కార్యనిర్వాహణ పద్ధతి మరియు పాత్ర గురించి తెలుసుకోబోతున్నాం.

## అభ్యాసం

1. **ఇవ్వబడిన ప్రత్యామ్నాయాల నుండి సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని కింది ఖాళీలను పూరించుము.**

   (1) పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి .................... లో ఏర్పడింది.

   (అ) ఇంగ్లండ్ (బ) ఫ్రాన్స్

   (క) అమెరికా (డ) నేపాల్

   (2) అధ్యక్ష ప్రభుత్వ పద్ధతిలో .............. కార్యనిర్వాహక ప్రముఖుడుగా ఉంటాడు.

   (అ) ప్రధానమంత్రి (బ) లోకసభ అధ్యక్షుడు

   (క) దేశాధ్యక్షుడు (డ) గవర్నరు

2. **కింది పట్టికలోని వివరాలను పూర్తి చేయండి.**

| క్ర. సం. | మండలి పేరు | పనులు |
|---|---|---|
| 1. | శాసన మండలి | |
| 2. | కార్యనిర్వాహక మండలి | |
| 3. | న్యాయ మండలి | |

3. **కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టం చేయండి.**

   (1) భారతదేశం పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిని స్వీకరించింది.

   (2) పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలో చర్చకు, విచార వినిమయాలకు ప్రాముఖ్యత ఉంటుంది.

4. **కింది ప్రశ్నలకు 25 నుండి 30 పదాలలో సమాధానం రాయండి.**

   (1) బాధ్యతాయుత ప్రభుత్వ పద్ధతి అనగా నేమి?

   (2) అధ్యక్ష ప్రభుత్వ పద్ధతిలోని విశిష్టతలను స్పష్టం చేయండి.

5. **విపక్ష పార్టీ పాత్ర ముఖ్యమైనదిగా ఎందుకు ఉంటుంది? ఈ విషయంలో నీ అభిప్రాయాన్ని రాయుము.**

**ఉపక్రమం**

దూరదర్శిని జాతీయ వాహినిలో లోకసభ, రాజ్యసభ యొక్క పనులను ప్రత్యక్ష ప్రసారంలో చూచి మీ అభిప్రాయాన్ని రాయండి.

BGSF7F

# 2. భారతదేశ పార్లమెంటు



పార్లమెంటు భవనం, కొత్త ఢిల్లీ

పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలో పార్లమెంటు ముఖ్యమైనదిగా ఉంటుందని మనం చూశాం. ప్రస్తుత పాఠంలో భారతదేశ పార్లమెంటు గురించి ఆలోచించవలసి ఉంటుంది.

భారతదేశం యొక్క పార్లమెంటు నిర్మాణాన్ని సంవిధానం రూపొందించింది. జాతీయ స్థాయిలో అనగా కేంద్ర ప్రభుత్వ యంత్రాంగ శాసన మండలిని 'పార్లమెంటు' అని అంటారు. దానినుసరించి పార్లమెంటులో రాష్ట్రపతి, లోకసభ, రాజ్యసభలు పొందుపరచబడ్డాయి. రాష్ట్రపతి భారతదేశ పార్లమెంటు యొక్క అవిభాజ్య భాగంగా ఉంటాడు. కాని అతడు పార్లమెంటు సభలకు హాజరై విచారవినిమయంలో పాల్గొనలేడు.



**వెతికి చూడండి?**

రాష్ట్రాలకు వాటి జనాభా ప్రాతిపదికన లోకసభలో స్థానాలు లభిస్తాయి. ఎన్నికల కోసం ప్రతి రాష్ట్రాన్ని భౌగోళిక నియోజకవర్గాలుగా విభజించడం జరుగుతుంది. నియోజకవర్గ జనాభా సాధారణంగా ఒకే విధంగా ఉంటుంది. వివిధ రాష్ట్రాలకు లోకసభలో ఎన్ని స్థానాలు ఉన్నాయి అనునది అంతర్జాలం (ఇంటర్‌నెట్) మాధ్యమం ద్వారా శోధించండి. ఉదా.,

మహారాష్ట్ర : 48 స్థానాలు

గుజరాతు :

మధ్యప్రదేశ్ :

ఉత్తరప్రదేశ్ :

గోవా :

పార్లమెంటు యొక్క రెండు సభలను లోకసభ మరియు రాజ్యసభ అని అంటారు.

**లోకసభ :** భారతదేశ పార్లమెంటు యొక్క దిగువ మరియు మొదటి సభ అనగా లోకసభ. లోకసభ అనునది పార్లమెంటుకు ప్రత్యక్షంగా ప్రజల చేత ఎన్నుకోబడి వచ్చిన ప్రజా ప్రతినిధుల సభ. అందువల్ల లోకసభను మొదటి సభ అని అంటారు.

లోక సభ ఎన్నికల కొరకు భౌగోళిక నియోజక వర్గాలను ఏర్పాటు చేయడం జరిగింది. లోకసభ కాల పరిమితి ఐదు సంవత్సరాలు. లోకసభ ఎన్నికలు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. ఈ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలుగా గుర్తించబడతాయి. కొన్ని సమయాల్లో ఐదు సంవత్సరాల కాలపరిమితి ముగియక ముందే లోకసభ రద్దయిన ఉదాహరణలు కొన్ని కలవు. అటువంటి సమయంలో జరిగిన ఎన్నికలను మధ్యాంతర ఎన్నికలు అంటారు.

లోకసభ అనునది దేశంలోని ప్రజలకు ప్రాతినిధ్యం వహించు సభ. లోకసభ సభ్యుల సంఖ్య సంవిధానం ప్రకారం గరిష్ఠంగా 552 ఉంటుంది. మన దేశంలోని అన్ని సమాజవర్గాలకు ప్రాతినిధ్యం లభించాలని, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారి కోసం రిజర్వేషన్ కల్పించడం జరిగింది. అదే విధంగా ఆంగ్లో ఇండియన్ సమాజానికి సరిపోవునంత పాతినిధ్యం లేకపోయినట్లయితే ఆ సమాజం యొక్క ఇద్దరు ప్రతినిధులను రాష్ట్రపతి పార్లమెంటుకు ఎన్నుకోవచ్చును.

**రాజ్యసభ :** భారతదేశ పార్లమెంటు యొక్క ఎగువ మరియు రెండవ సభ అనగా రాజ్యసభ. భారతదేశం యొక్క పార్లమెంటులోని రాజ్యసభ అనునది పరోక్షంగా ఎన్నుకోబడి వచ్చిన ప్రతినిధుల సభ. రాజ్యసభ భారతదేశ



**చేసి చూడండి.**

**మేరి** : నేను పదవ తరగతి ఉత్తీర్ణురాలైన తరువాత లోకసభ ఎన్నికల్లో పోటీ చేయగలుగుతానా?

**రాధిక** : లేదు! నీకు 18 సంవత్సరాలు పూర్తయితే నీవు ఓటు వేయవచ్చును, కాని ఎన్నికల్లో పోటీ చేయలేవు!

**రణవీర్** : అరే, మీకు తెలుసుకదా లోకసభ ఎన్నికల్లో పోటీ చేయాలంటె 25 సంవత్సరాల వయస్సు పూర్తయి ఉండాలి.

**షబానా** : మన పొరుగు దేశంలోని వ్యక్తి లోకసభ ఎన్నికల్లో పోటీ చేయదలచుకున్నట్లయితే?

**ముస్కాన్** : అది ఎలా సాధ్యం? ఆ వ్యక్తి భారతదేశ పౌరుడా?

**ప్రణవ్** : ఒకవేళ నాకు కేరళ నుండి ఎన్నికల్లో పోటీ చేయవలసిన వస్తే, అది సాధ్యమేనా?

**రాధిక** : అలాగే! కారణం మన ఉపాధ్యాయుడు చెప్పినట్లుగా లోకసభ కోసం ఏ రాష్ట్రములోని నియోజకవర్గం నుండైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.

**మృణాల్** : వయస్సు, పౌరసత్వ సంబంధిత నిబంధనలు అర్థమయ్యాయి. కాని ఎన్నికల్లో పోటీచేయుటకు అనర్హుడు అని ఎవరిని అనుకోవాలి?

**మేరి** : అర్హత మాదిరిగానే అనర్హతకు కూడా కొన్ని నిబంధనలుండే ఉంటాయి. పదండి, మనం ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకుందాం.

సమాఖ్యదేశంలోని 29 రాష్ట్రాలకు, 7 కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రతినిధులు వహిస్తుంది. దీని అర్థం ఏమనగా, రాజ్యసభలో రాష్ట్రాల ప్రతినిధులు సభ్యులుగా పని చేస్తారు.

రాజ్యసభ మొత్తం సభ్యుల సంఖ్య 250. అందులో 238 మంది సభ్యులు వివిధ రాష్ట్రాల నుండి, కేంద్రపాలిత ప్రాంతాల నుండి ఎన్నుకోబడుతారు. రాజ్యసభలోని ప్రతి రాష్ట్రం యొక్క సభ్యుల సంఖ్య ఒకేవిధంగా ఉండదు. జనాభా ఆధారంగా వారికి రాజ్యసభలో ప్రాతినిధ్యం ఉంటుంది. మిగిలిన 12 మంది సభ్యులను రాష్ట్రపతి నియామకం చేస్తాడు. సాహిత్యం, విజ్ఞానం, కళలు, క్రీడలు, సామాజిక కార్యకలాపాలు మొదలగు రంగాలలోని పనులలో ప్రత్యక్ష అనుభవం కల్గిన లేదా వాటిలో విశేషమైన జ్ఞానం కల్గియున్న వ్యక్తులలో కొందరిని రాజ్యసభకు ఎన్నుకుంటారు. రాజ్యసభలోని సభ్యుల ఎన్నిక ప్రమాణికమైన ప్రాతినిధ్య పద్ధతిలో జరుగుతుంది.

రాజ్యసభ ఎప్పుడు కూడా పూర్తిగా రద్దు కాదు. అందుకే దానిని శాశ్వత సభ అని అంటారు. అనగా ప్రతి రెండు సంవత్సరాలకు రాజ్యసభలో ఆరు సంవత్సరాల పదవీ కాలం పూర్తయిన 1/3 వంతు మంది సభ్యులు పదవీ విరమణ చేస్తారు. మళ్ళీ అంతే మంది సభ్యులు ఎన్నుకోబడుతారు. దశలుదశలుగా పరిమిత సంఖ్యలో సభ్యులు పదవీ విరమణ చేయడం వల్ల రాజ్యసభ ఎల్లప్పుడు పనిచేస్తూ ఉంటుంది. రాజ్యసభకు పోటీ చేయు వ్యక్తి భారతీయ పౌరుడై ఉండాలి. అతని వయస్సు 30 సంవత్సరాలు పూర్తయి ఉండాలి.

లోకసభ మరియు రాజ్యసభ సభ్యులను పార్లమెంటు సభ్యులు అంటారు. పార్లమెంటు సభ్యులు తమ నియోజకవర్గాల ఇబ్బందులను, సమస్యలను లోకసభలో వివరించి ఆ సమస్యలను పరిష్కరించు ప్రయత్నం చేస్తారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకోసం వారికి అభివృద్ధి నిధులను ప్రభుత్వం ఇస్తుంది.

**పార్లమెంటు పనులు :** భారతీయ పార్లమెంటు యొక్క లోకసభ మరియు రాజ్యసభల గురించి తెలుసుకున్న తర్వాత వాటి పనులకు సంబంధించిన పునర్విమర్శ ఇప్పుడు మనం చేద్దాం.

**చట్టాలను రూపొందించుట :** ప్రజల శ్రేయస్సు, వారి సంక్షేమం సాధ్యం కావాలని, సంవిధానంలోని ఉద్దేశాలను ప్రత్యక్షంగా అమలులోకి తీసుకురావాలని పార్లమెంటుకు అనేక నూతన చట్టాలు రూపొందించవలసి వస్తుంది. వాటితో పాటు కాలం చెల్లిన చట్టాలను రద్దు చేయవలసి వస్తుంది. కొన్ని చట్టాలలో అవసరమైన మార్పులు చేయవలసి వస్తుంది. చట్టాలను రూపొందించు ప్రక్రియను సంవిధానంలో స్పష్టం చేయడం జరిగింది. దానినను సరించి పార్లమెంటు తన ప్రాథమిక లేదా ముఖ్య బాధ్యతను నిర్వహిస్తుంది.



**చెప్పుకోండి చూద్దాం?**

కాలం చెల్లిన కారణంగా రద్దు చేయబడిన చట్టాలకు కొన్ని ఉదాహరణలను నీవు ఇవ్వగలవా? ఉదా., సంస్థానాల భరణాలు

**మంత్రి మండలిపై నియంత్రణ :** ప్రధానమంత్రి, అతని మంత్రి మండలి పార్లమెంటు నుండే ఏర్పాటవుతుంది. పార్లమెంటు వారిపై నియంత్రణ కలిగియుంటుంది. నియంత్రణ యొక్క వివిధ మార్గాలు పార్లమెంటుకు అందుబాటులో ఉంటాయి. పార్లమెంటును నిర్లక్ష్యం చేసి మంత్రి మండలి వ్యవహారాలను నిర్వహించకుండా చూసే బాధ్యత పార్లమెంటుపై ఉంటుంది.

**సంవిధాన సవరణ :** భారతదేశం యొక్క సంవిధానంలో కొన్ని మార్పులు చేయవలసి వస్తే పార్లమెంటు దానికి సంబంధించిన నిర్ణయం తీసుకుంటుంది. సంవిధానాన్ని సవరించు ప్రతిపాదన అనేది చాలా ముఖ్యమైనది. దాని ఆవశ్యకతపై పార్లమెంటు చర్చలు జరిపి ఆ ప్రతిపాదనను స్వీకరించాలా వద్దా అనేది నిర్ణయిస్తుంది. భారతదేశ సంవిధానంలోని సవరణలకోసం కింది పద్ధతులు కలవు. (1) భారతదేశ సంవిధానంలో కొన్ని చట్టాలు పార్లమెంటు యొక్క సాధారణ సంఖ్యాధిక్యతతో సవరించబడుతాయి. (2) కొన్ని చట్టాలకు మాత్రం పార్లమెంటు యొక్క ప్రత్యేకమైన ఆధిక్యత (2/3) అవసరముంటుంది. (3) అయినప్పటికి కొన్ని చట్టాలకు పార్లమెంటు యొక్క ప్రత్యేకమైన సంఖ్యాధిక్యతతో బాటు సగంకంటె అధిక రాష్ట్రాల ఆమోదంతో సవరించబడుతాయి.

**లోకసభ అధ్యక్షుడు :** లోకసభ ఎన్నికలు జరిగిన తర్వాత మొదటి సమావేశంలో లోకసభ సభ్యులు తమలో నుండి ఒకరిని 'అధ్యక్షుడు'గా ఎన్నుకుంటారు, మరొకరిని 'ఉపాధ్యక్షుడు'గా ఎన్నుకుంటారు. లోకసభ పనులు లోకసభ అధ్యక్షుని మార్గదర్శనానుసారం మరియు నియంత్రలో నిర్వహించబడుతాయి.

లోకసభ భారతదేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అధ్యక్షుడు లోకసభకు ప్రాతినిధ్యం వహిస్తాడు. అధ్యక్షపదవికి ఎన్నుకోబడిన తర్వాత అధ్యక్షుడు సంపూర్ణ సభ పనులను నిష్పక్షపాతంగా నిర్వహించవలసి ఉంటుంది. లోకసభ సభ్యులకు ప్రజాప్రతినిధులుగా కొన్ని హక్కులు, విశేషాధికారాలు ఉంటాయి. వాటి రక్షణను అధ్యక్షుడు చేస్తాడు. సభా కార్యకలాపాలు చక్కగా నిర్వహించుట, సభా ప్రతిష్ఠను కాపాడుట, కార్యకలాపాలకు సంబంధించిన నియమాలను పాటిస్తూ వాటిని నిర్వహించడం మొదలగు పనులను అధ్యక్షుడు చేయవలసి ఉంటుంది.

**రాజ్యసభ అధ్యక్షుడు (సభాపతి) :** రాజ్యసభ పనులన్ని అధ్యక్షుడి నియంత్రణలో నిర్వహించబడుతాయి. భారతదేశ ఉపరాష్ట్రపతి రాజ్యసభ అధికారిక అధ్యక్షుడుగా ఉంటాడు. రాజ్యసభ అధ్యక్షునికి కూడా సభలో క్రమశిక్షణను కాపాడుట, చర్చలు జరుపుట, సభ్యులకు మాట్లాడు అవకాశాలను కల్పించుట మొదలగు పనులు నిర్వహించవలసి ఉంటుంది.

> **ఇది అర్థం చేసుకోండి!**
>
> లోకసభ మరియు రాజ్యసభ ఈ రెండు సభలకు ఒకేవిధమైన అధికారాలు ఉన్నాయి. అయితే కొన్ని అధికారాలు లోకసభకు ఉన్నాయి కాని రాజ్యసభకు లేవు. ఉదాహరణకు, పన్ను విషయ ప్రస్తావన డబ్బుకు సంబంధించినదై ఉంటుంది. డబ్బుకు సంబంధించిన ప్రస్తావన 'ఆర్థిక' పరమైనదని అంటారు. ఈ విధంగా అన్ని ప్రస్తావనలు కేవలం లోకసభలో ప్రవేశపెట్టబడతాయి. అక్కడే అవి మంజూరు చేయబడుతాయి. రాజ్యసభకు ఈ విషయంలో చాలా పరిమితమైన అధికారాలు ఉంటాయి.
>
> కొన్ని అధికారాలు రాజ్యసభకు కలవు కాని లోకసభకు లేవు. ఉదా., రాష్ట్ర జాబితాలోని ఏదేని ఒక విషయంపై రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా పార్లమెంటు చట్టం చేయవలసివస్తె, అలాంటి నిర్ణయం రాజ్యసభ సమ్మతితో చేయవలసి వస్తుంది.

## పార్లమెంటు చట్టాలను ఎలా తయారు చేస్తుంది?

మన దేశంలో పార్లమెంటుకు చట్టాలను రూపొందించు అధికారం ఇవ్వబడింది. చట్టాలను రూపొందించుటకు విశిష్టమైన పద్ధతిని స్వీకరించడం జరుగుతుంది. ఆ పద్ధతినే 'చట్ట నిర్మితి ప్రక్రియ' అని అంటారు.

చట్టం యొక్క ముసాయిదా ముందుగా రూపొందించబడుతుంది. ఈ ముసాయిదాను లేదా ప్రణాళికను చట్ట ప్రస్తావన లేదా బిల్లు అని అంటారు.

పార్లమెంటు సభలో ప్రవేశ పెట్టబడు బిల్లు ముఖ్యంగా రెండు విధాలుగా ఉంటుంది. (1) ఆర్థిక బిల్లు (2) సర్వసాధారణ బిల్లు.

బిల్లు చట్టంగా రూపాంతరం చెందుటకు అది కింది ప్రక్రియల గుండా పోతుంది.

**మొదటి పఠనం :** సంబంధిత శాఖ యొక్క మంత్రి లేదా పార్లమెంటు సభ్యుడు బిల్లును ప్రవేశపెట్టి, బిల్లు గురించి వివరిస్తూ దాని స్వరూపాన్ని క్లుప్తంగా స్పష్టం చేస్తాడు. దీనినే

బిల్లు యొక్క 'మొదటి పఠనం' అని అంటారు.

**రెండవ పఠనం :** రెండవ పఠనానికి రెండు దశలు ఉంటాయి. మొదటి దశలో బిల్లులోని ఉద్దేశాలపై చర్చ జరుగుతుంది. సభలోని సభ్యులు బిల్లు గురించి తమ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తారు. బిల్లును సమర్థించువారు బిల్లు పక్షాన అభిప్రాయాన్ని వ్యక్తపరిస్తే విరోధించువారు బిల్లులోని లోపాలను, దోషాలను స్పష్టపరుస్తారు. సభలో బిల్లుపై చర్చ జరిగిన తర్వాత అవసరమనిపిస్తే ఆ బిల్లు సభలోని ఒక సమితి వద్దకు పంపించబడుతుంది. బిల్లు దోషరహితంగా ఉండుటకై సూచనలు, సవరణలు తెలియజేస్తూ నివేదికను సమితి చట్ట సభకు పంపిస్తుంది.

ఆ తరువాత రెండవ పఠనం యొక్క రెండవ దశ ప్రారంభమవుతుంది. ఈ దశలో బిల్లుపై క్షుణ్ణంగా చర్చ జరుగుతుంది. సభ్యులు సవరణలను సూచించవచ్చు. ఆ తర్వాత దానిపై సభలో ఓటింగ్ తీసుకోబడుతుంది.

**మూడవ పఠనం :** మూడవ పఠనం యొక్క సమయంలో బిల్లుపై మళ్ళీ క్లుప్తంగా చర్చ జరుగుతుంది. బిల్లును మంజూరు చేయు నిర్ణయంపై ఓటింగ్ జరుగుతుంది. బిల్లుకు ఆవశ్యకమైన ఆధిక్యతతో మంజూరీ లభించినట్లయితే సభ బిల్లును సమ్మతించింది అని భావించబడుతుంది.

- పార్లమెంటు యొక్క రెండవ సభలో కూడా బిల్లుపై పైన పేర్కొనబడిన విధంగా అన్ని ప్రక్రియల నుండి వెళ్తుంది. రెండు సభలు బిల్లుకు మంజూరీ తెలిపిన తర్వాత అది రాష్ట్రపతి యొక్క సమ్మతి కొరకు పంపించబడుతుంది.
- కేంద్రంలో లోకసభ మరియు రాజ్యసభల్లో బిల్లు గురించిన అభిప్రాయభేదాలు ఏర్పడినచో రెండు సభల సంయుక్త సమావేశంలో బిల్లుకు సంబంధించిన భవితవ్యం నిర్ణయింపబడుతుంది.

రాష్ట్రపతి యొక్క అంగీకారదర్శక సంతకం తర్వాత బిల్లు చట్టంగా రూపాంతరం చెంది, చట్టంగా మారుతుంది.

**ఇది కూడా తెలుసుకొండి.**

- ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో ఆర్థిక మంత్రి దేశం యొక్క ఆర్థిక బిల్లును లోకసభలో ప్రవేశపెడతాడు.
- రాష్ట్రాల విధానసభల్లో కూడా చట్టాలను రూపొందించు నపుడు పార్లమెంటు విధంగానే పద్ధతిని స్వీకరించడం జరుగుతుంది. రాష్ట్ర విధానసభ మంజూరు చేసిన బిల్లుపై గవర్నరు అంగీకారదర్శక సంతకం చేయడంతో బిల్లు చట్టంగా రూపాంతరం చెందుతుంది.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాల నుండి సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని కింది ఖాళీలను పూరించుము.**

(1) లోకసభకు ................. పద్ధతిలో పోటీదారులు ఎన్నుకోబడి పంపించబడుతారు.

(అ) భౌగోళిక నియోజకవర్గం (బ) మత నియోజకవర్గం (క) స్థానిక పరిపాలనా సంస్థ నియోజకవర్గం (డ) ప్రమాణికమైన ప్రాతినిధ్య పద్ధతి

(2) భారతదేశ ................... రాజ్యసభకు అధికారిక అధ్యక్షుడుగా ఉంటాడు.

(అ) రాష్ట్రపతి (బ) ఉపరాష్ట్రపతి
(క) ప్రధానమంత్రి (డ) సర్వోన్నత న్యాయమూర్తి

**2. వెదికి, రాయండి.**

(1) లోకసభ మరియు రాజ్యసభల సభ్యులను ఈ పేరుతో సంబోధిస్తారు .......................

(2) చట్టాలను రూపొందించు బాధ్యత వీరిది .........................

**3. కింది వాక్యాలను సరియైన కారణాలతో స్పష్టం చేయండి.**

(1) రాజ్యసభ శాశ్వత సభ.

(2) లోకసభను మొదటి సభ అంటారు.

**4. కింది ప్రశ్నలకు 25 నుండి 30 పదాలలో సమాధానం రాయండి.**

(1) లోకసభ సభ్యులు ఎలా ఎన్నుకోబడుతారు?

(2) లోకసభ అధ్యక్షుని పనులను స్పష్టం చేయండి.

**5. చట్టాలను రూపొందించు ప్రక్రియలోని దశలను స్పష్టం చేయండి.**

**ఉపక్రమం**

రాజ్యసభలో 12 మంది సభ్యులను రాష్ట్రపతి నియామకం చేస్తాడు. ఆ సభ్యులను ఎన్నుకోవడంలో ఎలాంటి అభిలక్షణాలు ఉంటాయి వాటి సమాచారాన్ని పొందండి.

BPS71K

# 3. కేంద్ర కార్యనిర్వాహక మండలి

ఇంతకు ముందు పాఠంలో మనం కేంద్ర స్థాయిలో శాసనమండలి అనగా పార్లమెంటు యొక్క నిర్మాణం, కార్యాచరణ పద్ధతి గురించి అర్థం చేసుకున్నాం. ఈ పాఠంలో మనం కేంద్ర కార్యనిర్వాహక మండలి గురించి అధ్యయనం చేయబోతున్నాం.

**సమాఖ్య ప్రభుత్వ నిర్మాణం :** సమాఖ్య ప్రభుత్వమనగా కేంద్ర ప్రభుత్వం. సమాఖ్య ప్రభుత్వమునకు చెందిన కింది విభాగాలు కలవు.




శాసన మండలి, కార్యనిర్వాహక మండలి, న్యాయ మండలి అను ప్రభుత్వ సంస్థ యొక్క మూడు శాఖలు ఉంటాయి. ప్రజా శ్రేయస్సును దృష్టియందుంచుకొని ప్రజా సంక్షేమం కోసం అవి పని చేస్తాయనే విషయం మీకు తెలుసు. పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలో కార్యనిర్వాహక మండలి శాసనమండలి యొక్క భాగంగా ఉంటుంది. అది శాసన

**రమ :** రాష్ట్రపతి కేవలం నామ మాత్రపు ప్రముఖుడు, ప్రధానమంత్రి కార్యనిర్వాహక ప్రముఖుడు. ఈ రెండు పదవుల్లోని వ్యక్తుల మధ్య మరి ఏ విధమైన సంబంధం ఉంటుంది?

**విద్య :** ప్రధానమంత్రి రాష్ట్రపతిని తరచుగా కలుసుకుంటాడు, అతడు దేశ పరిపాలనను ఏవిధంగా నిర్వహిస్తున్నాడో ఆ వివరాలను తెలియజేస్తుంటాడని నాకు అనిపిస్తుంది.

అవును! ఇది నిజమే. దేశ పరిపాలనకు, నూతన చట్టాలకు, విధానాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రధాన మంత్రి రాష్ట్రపతికి వివరిస్తాడు. క్లుప్తంగా ఈ విధమైన సమాచారం పొందే హక్కు రాష్ట్రపతికి కలదు.

మండలికి మాత్రమే జవాబుదారీగా ఉంటుంది. ఈ కార్యనిర్వాహక మండలిలో ఎవరెవరు ఉంటారు, సంవిధానంలో ఆ విషయానికి సంబంధించి ఎలాంటి ఏర్పాట్లు కలవు, కార్యనిర్వాహక మండలి ప్రజా శ్రేయస్సు కోసం ఏ విధంగా విధానాల రూపకల్పన చేస్తుంది మొదలగు అంశాలను కార్యనిర్వాహక మండలిని అర్థం చేసుకుంటున్నపుడు మనం తెలుసుకో వలసి ఉంటుంది.

భారతదేశ కేంద్ర కార్యనిర్వాహక మండలిలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి, మంత్రి మండలిలోని మంత్రులు ఉంటారు.

**రాష్ట్రపతి :** భారతదేశ సంవిధానంలోని నియమాలననుసరించి రాష్ట్రపతి దేశానికి ప్రముఖుడు. రాష్ట్రపతి పదవి మిక్కిలి గౌరవప్రదమైన, ప్రతిష్ఠాత్మకమైనది. అందువలన అది భారతదేశ ప్రజాసత్తాకానికి (గణతంత్రం) ప్రాతినిధ్యం వహిస్తుంది. సంవిధానం దేశ కార్యనిర్వాహక అధికారాన్ని మొత్తం రాష్ట్రపతికి ఇచ్చింది. దేశ పరిపాలన రాష్ట్రపతి పేరు మీదుగా నిర్వహించబడుతుంది. ఆవిధంగా ఉన్నప్పటికి ప్రత్యక్షంగా ప్రధానమంత్రి అతని మంత్రి మండలి దేశ పరిపాలనను నిర్వహిస్తుంది. అందుకని రాష్ట్రపతి కేవలం నామ మాత్రపు ప్రముఖుడు మాత్రమే కాని ప్రధానమంత్రి కార్యనిర్వాహక ప్రముఖుడు.

**రాష్ట్రపతి ఎన్నిక :** రాష్ట్రపతి ఎన్నిక భారతదేశ ప్రజలచే పరోక్ష పద్ధతిలో జరుగుతుంది. భారతదేశంలోని సర్వసామాన్య ఓటరు రాష్ట్రపతిని ప్రత్యక్షంగా ఎన్నుకోడు. కాని వారు ఎన్నుకున్న పార్లమెంటు సభ్యులద్వారా, విధానసభ సభ్యులద్వారా రాష్ట్రపతి ఎన్నుకోబడుతాడు. పార్లమెంటు సభ్యులు మరియు విధానసభ సభ్యుల యొక్క ఈ సముదాయాన్ని ఎన్నికల సంఘం అని అంటారు.

రాష్ట్రపతి పదవీకాలం ఐదు సంవత్సరాలు ఉంటుంది. రాష్ట్రపతి పదవికి పోటీచేయు వ్యక్తి భారతదేశ పౌరుడై ఉండాలి. అతని వయస్సు 35 సంవత్సరాలు పూర్తయి ఉండాలి. రాష్ట్రపతి పదవికి ఎన్నుకోబడిన వ్యక్తి తన పదవిని స్వీకరించడానికి ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుంది. ఆ విధంగా సంవిధానాన్ని కాపాడుతూ, సంవిధానానుసారంగా దేశ

పరిపాలన జరుగుతుందా లేదా అనునది చూచుకొను బాధ్యత రాష్ట్రపతిపై ఉంటుంది. ప్రధానమంత్రి అతని మంత్రి మండలి ఇచ్చు సలహాలననుసరించి రాష్ట్రపతి దేశపాలన చేస్తాడు.

సంవిధానాన్ని కాపాడు బాధ్యత రాష్ట్రపతిపై ఉంటుంది. కాని అతని ప్రవర్తన సంవిధానాన్ని భంగ పరుచునదిగా ఉన్నట్లయితే రాష్ట్రపతిని పదవి నుండి తొలగించు అధికారం పార్లమెంటుకు ఉంటుంది. ఈ ప్రక్రియను 'మహాభియోగ' తీర్మానం అని అంటారు. రాష్ట్రపతి ద్వారా సంవిధాన భంగం జరిగినట్లయితే ఏదైనా ఒక సభ ఆరోపిస్తుంది, ఆ ఆరోపణను రెండవ సభ విచారణ చేస్తుంది. రెండు సభల ప్రత్యేక సంఖ్యాధిక్యత (2/3)తో తీర్మానం ఆమోదం పొందుట అవసరం. ఆ తరువాత రాష్ట్రపతి పదవికి దూరమౌతాడు.

**రాష్ట్రపతి విధులు, అధికారాలు :** సంవిధానం రాష్ట్రపతికి అనేక విధులను అప్పగించింది. వాటిలో కొన్ని విధులు కింద పేర్కొనబడినవి :

(1) పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేయుట, ఆపివేయుట, పార్లమెంటుకు సందేశం పంపించుట, లోకసభ గడువు ముగిసిన తరువాత లేదా గడువుకు ముందే రద్దు చేయుట వంటి అధికారాలు రాష్ట్రపతికి ఉంటాయి.

(2) లోకసభ మరియు రాజ్యసభలు ఆమోదించిన బిల్లుపై రాష్ట్రపతి సంతకం అవసరముంటుంది. అతని సంతకం లేకుండా బిల్లు చట్టంగా రూపొందదు.

(3) ప్రధానమంత్రిని రాష్ట్రపతి నియామకం చేస్తాడు. అతడు సూచించిన పార్లమెంటు సభ్యులను మంత్రి పదవులపై రాష్ట్రపతి నియామకం చేస్తాడు.

(4) సుప్రీం కోర్టు, హై కోర్టు న్యాయ మూర్తులను రాష్ట్రపతి నియమిస్తాడు. అదే విధంగా అన్ని రాష్ట్రాల గవర్నర్లను, ప్రధాన ఎన్నికల కమీషనర్‌ను ఇతర ముఖ్యమైన పదవులకై వ్యక్తులను రాష్ట్రపతి నియమిస్తాడు.

(5) రాష్ట్రపతి రక్షణ దళాలకు సర్వోన్నత ప్రముఖుడుగా ఉంటాడు. యుద్ధం, శాంతికి సంబంధించిన నిర్ణయాలను రాష్ట్రపతి తీసుకుంటాడు.

(6) రాష్ట్రపతికి కొన్ని న్యాయ సంబంధమైన అధికారాలు కూడా ఉన్నాయి. ఉదా., ఒక వ్యక్తికి శిక్షను తగ్గించుట, శిక్ష తీవ్రతను తగ్గించుట లేదా తప్పుడు ఆరోపణలనెదుర్కొను పరిస్థితిలో మానవతావాద దృక్పథంతో శిక్షను తగ్గించుట లేదా రద్దు చేయుట వంటి అధికారాలు రాష్ట్రపతికి ఉంటాయి.

(7) దేశం క్లిష్ట పరిస్థితిలో నున్నప్పుడు అత్యవసర పరిస్థితిని ప్రకటించు అధికారం రాష్ట్రపతికి కలదు. సంవిధానంలో మూడు రకములైన అత్యవసర పరిస్థితులు ఇవ్వబడ్డాయి. (1) జాతీయ అత్యవసర పరిస్థితి (2) రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి లేక రాష్ట్రపతి పరిపాలన (3) ఆర్థిక అత్యవసర పరిస్థితి.

రాష్ట్రపతి లేని సమయంలో అతని పనులను ఉపరాష్ట్రపతి నిర్వహిస్తాడు. ఉపరాష్ట్రపతిని పార్లమెంటు ఉభయ సభల సభ్యులు ఎన్నుకుంటారు.



**చేసి చూడండి.**

రాష్ట్రపతికి ఇచ్చే ప్రతిజ్ఞ ముసాయిదాను సేకరించండి. ఉపాధ్యాయుల సహాయంతో దానిలోని ఆశయాన్ని అర్థం చేసుకొండి.

**ప్రధానమంత్రి - మంత్రి మండలి :** రాష్ట్రపతి సంవిధానబద్ధమైన ప్రముఖుడు. అతని చేతిలో నామమాత్రపు అధికారాలు ఉంటాయి. ప్రత్యక్షంగా ప్రధానమంత్రి అతని మంత్రి మండలిలోని మంత్రులు దేశ పరిపాలన నిర్వహిస్తారని మనకు తెలుసు. ప్రధానమంత్రి ఏ విధులను, పాత్రను నిర్వహిస్తాడనునది ఇప్పుడు మనం తెలుసుకుందాం.

ఎన్నికలలో సంఖ్యాధిక్యత పొందిన పార్టీ తమ నాయకున్ని ప్రధానమంత్రిగా ఎన్నుకోవాలని నిర్ణయిస్తుంది. ప్రధానమంత్రికి విశ్వాస పాత్రులైన ఆ పార్టీలోని వారు ప్రధానమంత్రి యొక్క మంత్రి మండలిలోకి తీసుకోబడుతారు. ప్రధానమంత్రి మరియు ఇతర మంత్రులు పార్లమెంటు సభ్యులుగా ఉండటం అవసరం. లేనిచో వారు ఆరు నెలల లోపు పార్లమెంటు సభ్యత్వం పొంద వలసి వస్తుంది. ప్రధానమంత్రి అతని మంత్రి మండలి వాస్తవంగా దేశ పరిపాలన చేస్తుంది. దీని అర్థం దేశ వ్యవహారాల నిజమైన అధికారం ప్రధానమంత్రి అతని మంత్రి మండలికి కలదు.

## ప్రధానమంత్రి విధులు

(1) ప్రధానమంత్రికి మొదట తన మంత్రి మండలిని ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. తమ పార్టీలోని విశ్వాస పాత్రులకు ప్రధానమంత్రి ప్రాముఖ్యతనిస్తారు. కాని దానితోపాటు పరిపాలనానుభవము, దేశవ్యవహారాల కౌశల్యం, కార్యదక్షత, విషయజ్ఞానం మొదలగు వాటిని కూడా ఆధారంగా చేసుకుని మంత్రులను ఎన్నుకోవడం జరుగుతుంది.

(2) మంత్రి మండలిలో ఎవరిని తీసుకోవాలి అనేది నిర్ణయించిన తరువాత ప్రధానమంత్రి వారికి శాఖలను కేటాయిస్తాడు.

(3) ప్రధానమంత్రి మంత్రి మండలికి నాయకత్వం వహిస్తాడు. మంత్రి మండలి సమావేశాలన్ని ప్రధానమంత్రి అధ్యక్షతన జరుగుతాయి.

(4) శాఖలను కేటాయించిన తరువాత వివిధ శాఖల మధ్య సత్సంబంధాలను ఏర్పరుచుట, శాఖల మధ్య పరస్పర సహకారాలను పెంపొందించుట, శాఖల వ్యవహారాలు సమర్థవంతంగా జరుగుతున్నాయా లేదా గమనించుట మొదలగు పనులను ప్రధానమంత్రి నిర్వహించవలసి ఉంటుంది.

(5) అంతర్జాతీయ రంగంలో దేశ గౌరవాన్ని నిలబెట్టుటకు ప్రపంచ ప్రజాభిప్రాయం మనకనుకూలంగా ఉండేట్లు ప్రయత్నం చేయడం, దేశంలోని ప్రజలకు విశ్వాసాన్ని కలిగించుట, విపత్తుల కాలంలో ఆపదగ్రస్తుల పక్షాన ఖచ్చితంగా నిలబడుట మొదలగు పాత్రలను ప్రధానమంత్రి నిర్వహించవలసియుండును.



### మీకు తెలుసా?

నీవు జంబో మంత్రి మండలి అనే పదాన్ని విన్నావా?

దీని అర్థం చాలా పెద్ద మంత్రి మండలి. మన దేశంలో మంత్రి మండలి ఆకారాన్ని పెద్దగా ఏర్పాటు చేయు ప్రవృత్తి ఉండేది. మంత్రి మండలి పరిమిత ఆకారంలో ఉండాలని సంవిధానాన్ని సవరించడం జరిగింది. దానిననుసరించి మంత్రి మండలి సంఖ్య లోకసభ యొక్క మొత్తం సభ్యుల సంఖ్యకు 15 శాతం కంటె అధికంగా ఉండరాదని నిర్ణయించడం జరిగింది.

## మంత్రి మండలి విధులు

(1) పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలో మంత్రి మండలి చట్టాలను రూపొందించుటలో చొరవ తీసుకొంటుంది. దాని ప్రణాళికను తయారుచేసి దానిపై చర్చ జరుపుతుంది తరువాత అది పార్లమెంటు యొక్క సభలో ప్రవేశపెట్టడం జరుగుతుంది. మంత్రి మండలి అన్ని ముఖ్యమైన సమస్యలపై చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకుంటుంది.

(2) విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, ఆరోగ్యం, విదేశీ వ్యవహారాలు వంటి అనేక విశయాలపై మంత్రి మండలికి ఒక నిశ్చితమైన విధానాన్ని లేదా కార్యదిశను నిర్ణయించవలసి ఉంటుంది. మంత్రి మండలి నిర్ణయించిన విధానాలకు పార్లమెంటు యొక్క విశ్వాసం పొందవలసి ఉంటుంది. అందువల్ల మంత్రి మండలిలోని మంత్రి తమతమ శాఖల విధానాలను పార్లమెంటుకు వివరించి వాటిపై చర్చలను జరిపి పార్లమెంటు ద్వారా వానిని మంజూరు చేయించుకొను ప్రయత్నం చేస్తారు.

(3) మంత్రి మండలి యొక్క ముఖ్యమైన బాధ్యత విధానాలను అమలుపరచుట. విధానాలకు లేదా చట్టాల యొక్క ప్రస్తావనలకు పార్లమెంటు అంగీకారం తెలిపినట్లయితే వాటిని మంత్రి మండలి అమలుపరుస్తుంది.

## పార్లమెంటు మంత్రి మండలిపై ఏ విధంగా నియంత్రణ కలిగియుంటుంది?

పార్లమెంటు ప్రభుత్వ పద్ధతిలో పార్లమెంటు మంత్రి మండలిపై నియంత్రణ చేసే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. చట్టాలను లేదా విధానాలను రూపొందించడం, అమలు చేయడం, దాని తరువాత కాలంలో కూడా పార్లమెంటు మంత్రి మండలిపై నియంత్రణ కలిగియుంటుంది. ఈ నియంత్రణ యొక్క కొన్ని మార్గాలు కింది విధంగా కలవు :

(1) **చర్చా, విచారవినిమయం :** చట్టాలను రూపొందించు సమయంలో పార్లమెంటు సభ్యులు చర్చలు, విచారవినిమయాలు జరిపి మంత్రి మండలికి విధానాలలోని లేదా చట్టాలలోని దోషాలను చూపిస్తారు. చట్టం దోషరహితంగా రూపొందు దృష్టి కోణంలో ఈ చర్చలు చాలా ముఖ్యమైనవి.

(2) **ప్రశ్నోత్తరాలు :** పార్లమెంటు సమావేశాలు జరుగుచున్నప్పుడు కార్యకలాపాల ప్రారంభం పార్లమెంటు సభ్యులు అడిగిన ప్రశ్నలతో మొదలవుతుంది. ఈ ప్రశ్నలకు సంబంధిత మంత్రులు సరియైన సమాధానాలు ఇవ్వవలసి ఉంటుంది. మంత్రి మండలిపై నియంత్రణ

కలిగియుండటంలో ఈ ప్రశ్నోత్తరాలు ఒక ప్రభావవంతమైన మార్గంగా ఉంటాయి. ప్రభుత్వంపై విమర్శ చేయుట, వివిధ సమస్యలపై ప్రశ్నించుట అనునవి ఈ సమయంలో జరుగుతాయి. మంత్రులు ఇచ్చిన సమాధానాలు సంతృప్తికరంగా లేకపోయినట్లయితే వాదనలు జరుగవచ్చును. తమ వ్యతిరేకతను వ్యక్తం చేయుటకు కొనిసార్లు పార్లమెంటు సభ్యులు సభ నుండి వాకౌట్ చేస్తారు లేదా గట్టిగా నినాదాలు చేస్తూ సభ మధ్యలో ప్రోగవుతారు.

**(3) శూన్యకాలం :** సమావేశ కాలంలోని మధ్యాహ్నం 12 గంటల కాలం శూన్యకాలంగా గుర్తించబడుతుంది. ఈ సమయంలో సార్వజనిక దృష్ట్యా ముఖ్యమైన ప్రశ్నలపై చర్చలు జరుపబడుతాయి.

**(4) అవిశ్వాస తీర్మానము :** మంత్రి మండలిపై నియంత్రణ కలిగియుండంటంలో ఇది ఒక అత్యంత ప్రభావవంతమైన మార్గం. లోకసభలో ఎంతవరకు ఆధిక్యత ఉంటుందో అంతవరకు ప్రభుత్వం పనిచేయగలుగుతుంది. ఈ ఆధిక్యతను పార్లమెంటు సభ్యులు ఉపసంహరించుకుంటె ప్రభుత్వం లేదా మంత్రి మండలి అధికారంలో కొనసాగలేకపోతుంది. 'మంత్రి మండలిపై మాకు విశ్వాసం లేదు' అని పార్లమెంటు సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్ట వచ్చును. దానిని సంఖ్యాధిక్యతతో అంగీకరించినట్లయితే మంత్రి మండలి రాజీనామా చేయవలసి వస్తుంది.

**చెప్పుకోండి చూద్దాం?**

పార్లమెంటు సభ్యులు చర్చల్లో ప్రభావవంతగా పాల్గొనవలెనంటే వారు ఏమి చేయవలసి ఉంటుంది?

కార్యనిర్వాహక మండలి నియంత్రణలో పెద్ద ఉద్యోగిస్వామ్యం ఉంటుంది. ఉద్యోగిస్వామ్యం యొక్క నిర్మాణాన్ని మనం ఆరవ పాఠంలో నేర్చుకోబోతున్నాం.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాల నుండి సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని కింది ఖాళీలను పూరించుము.**

(1) భారతదేశంలో కార్యనిర్వాహక అధికారం ................. వద్ద ఉంటుంది.
(రాష్ట్రపతి, ప్రధానమంత్రి, స్పీకర్)

(2) రాష్ట్రపతి పదవీకాలం ........... సంవత్సరాలు ఉంటుంది.
(మూడు, నాలుగు, ఐదు)

(3) మంత్రి మండలికి నాయకత్వం ................ వహిస్తాడు.
(పార్టీ ప్రముఖుడు, ప్రధానమంత్రి, రాష్ట్రపతి)

**2. గుర్తించండి రాయండి.**

(1) రాష్ట్రపతి, ప్రధానమంత్రి, మంత్రి మండలిని భారతదేశం యొక్క ఏ మండలిలో పొందుపరచారో ఆ మండలి పేరు .....................

(2) సమావేశాల కాలంలో మధ్యాహ్నం 12 గంటల కాలాన్ని ఈ పేరుతో గుర్తిస్తారు ...............

**3. కింది భావనలను మీ పదాలలో రాయండి.**

(1) మహాభియోగ తీర్మానం (2) అవిశ్వాస తీర్మానం

(3) జంబో మంత్రి మండలి

**4. క్లుప్తంగా సమాధానాలు రాయండి.**

(1) మంత్రి మండలి విధులను స్పష్టం చేయండి.

(2) పార్లమెంటు మంత్రి మండలిపై ఏ విధంగా నియంత్రణ కలిగియుంటుంది?

**5. కింది సంకల్పనా చిత్రాన్ని పూరించండి.**




**ఉపక్రమం**

(1) ఒకవేళ నీవు ప్రధానమంత్రివి అయితే, అప్పుడు ఏ పనికి మొదటి ప్రాధాన్యత నివ్వగలవు, వాటి ప్రాధాన్యతాక్రమానుసారంగా పట్టికను తయారుచేసి తరగతిలో ప్రదర్శించుము.

(2) భారతదేశ రాష్ట్రపతుల చిత్రాలు, వివరాలను సేకరించండి.

BQ2338

# 4. భారతదేశంలోని న్యాయ వ్యవస్థ

శాసన మండలి, కార్యనిర్వాహక మండలితోపాటు న్యాయమండలి కూడా ప్రభుత్వ సంస్థ యొక్క ఒక ముఖ్యమైన భాగము. చట్టాలను రూపొందించు పని శాసన మండలి చేస్తుంది. కార్యనిర్వాహక మండలి వాటిని అమలుపరుస్తుంది. న్యాయమండలి న్యాయాన్ని చేకూర్చుతుంది. ఈ పాఠంలో మనం న్యాయమండలి న్యాయాన్ని ఎలా చేకూరుస్తుంది, దానివల్ల సమాజంలోని అన్యాయాలు దూరమై సామాజిక ఆరోగ్యం ఎలా కలుగుతుందో ఆలోచించబోతున్నాం. దానికంటె ముందు మనం న్యాయ తీర్పుల ఆవశ్యకత ఎందుకు ఏర్పడుతుందో అర్థం చేసుకుందాం.

వ్యక్తుల మధ్య అభిప్రాయాలు, ఆలోచనలు, దృష్టికోణం, అవగాహన, విశ్వాసం, సంస్కృతి మొదలగు విషయాలలో భిన్నత్వం ఉంటుంది. సహనశీలతను పాటించినట్లయితే ఈ విషయాలలో ఘర్షణలు జరుగవు. అయినప్పటికి భేదాభిప్రాయాలు తీవ్రమైతే వాని నుండి ఘర్షణలు ఏర్పడుతాయి. వాటిని నిష్పక్షపాతమైన దృష్టితో చట్టాల ఆధారంగా తొలగించవలసిన అవసరముంటుంది. దానికోసం న్యాయమండలి వంటి నిష్పక్షపాత యంత్రాంగం అవసరముంటుంది.

- వ్యక్తి మరియు ప్రభుత్వసంస్థల మధ్య కూడా ప్రయోజనాలకు సంబంధించిన విషయాలలో ఘర్షణలు ఏర్పడవచ్చు. ప్రభుత్వపు ఒక నిర్ణయం లేదా చట్టం ప్రజలకు అన్యాయంగా తోచవచ్చు దానికి వ్యతిరేకంగా కోర్టులో ఫిర్యాదు చేయవచ్చు.
- సంవిధానంలో సామాజిక న్యాయం, సమానత్వం వంటి ఉద్దేశాలను ప్రత్యక్ష వ్యవహారాలలో తీసుకురావటానికి ఏ విధంగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందో అదే విధంగా న్యాయమండలి కూడా కొన్ని దావాల తీర్పుల ద్వారా లేదా క్రియాశీలక పాత్రను పోషించి ప్రభుత్వానికి మద్ధతునివ్వవచ్చు. సమాజంలోని బలహీన వర్గాలు, మహిళలు, బాలలు, దివ్యాంగులు, తృతీయ వర్గీయులు (transgender) మొదలగు వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావటానికి కోర్టు సహాయ పడగలదు.
- స్వాతంత్ర్యం, సమానత్వం, న్యాయం, ప్రజాస్వామ్యం వీటి లాభాలు సామాన్య మానవులకు ఎప్పుడైతే అందుతాయో అప్పుడు ప్రజాస్వామ్య వ్యాప్తి, గాంభీర్యత పెరుగుతుంది. ప్రజాస్వామ్యం బలపడటానికి ఈ విషయం చాలా అవసరం.
- చట్టాల సార్వభౌమత్వం న్యాయ మండలి వల్ల సురక్షితంగా ఉంటుంది. పేదవారు, శ్రీమంతులు, అభివృద్ధి చెందిన - అభివృద్ధి చెందని, స్త్రీ - పురుషులు వీరందరికి చట్టాలు సమానరీతిలో అమలవుతాయని ఇది న్యాయనిర్ణయాలు నుండి స్పష్టంగా వ్యక్తమవుతుంది.
- న్యాయతీర్పుల ద్వారా పౌరుల హక్కులకు రక్షణ ఏర్పడుతుంది. చట్టానుసారంగా వివాదాల తొలగింపు జరుగుతుంది. ఏ వర్గమైనా, వ్యక్తైనా దౌర్జన్యపూరితం లేదా నిరంకుశత్వంగా తయారగుటను నిరోధిస్తుంది.

**న్యాయమండలి నిర్మాణం :** భారతదేశం సమాఖ్యదేశం. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు స్వతంత్ర శాసనమండళ్ళు, కార్యనిర్వాహక మండళ్ళు ఉన్నాయి. కాని న్యాయ మండలి మాత్రం సంపూర్ణ దేశానికి ఒకటే కలదు. అందులో కేంద్ర మరియు రాష్ట్రాలు అనే ప్రత్యేక విభాగాలు లేవు. అనగా భారతదేశంలో న్యాయవ్యవస్థ ఒకే స్వరూపంగా కలదని అర్థం. ఈ న్యాయవ్యవస్థ యొక్క సర్వోన్నత స్థాయిలో భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) మరియు దానికింద ఉన్నత న్యాయస్థానాలు (హై కోర్టులు) కలవు. హైకోర్టుల నియంత్రణలో జిల్లా కోర్టులు, వాటి తరువాత దిగువ కోర్టులు ఈ విధంగా నిర్మాణం కలదు.

**సుప్రీం కోర్టు :** భారతదేశ సర్వోన్నత న్యాయమూర్తి సుప్రీం కోర్టు ప్రముఖుడుగా ఉంటాడు. భారతదేశ సర్వోన్నత న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు రాష్ట్రపతి చేత నియమింపబడతారు. సుప్రీం కోర్టులో అందరికంటె జ్యేష్ఠ (సీనియర్) న్యాయమూర్తి 'సర్వోన్నత న్యాయమూర్తి' పదవికి ఎన్నుకోబడవలెనని పద్ధతి కలదు.

న్యాయతీర్పుల పని ఎటువంటి ఒత్తిడికి లోను కాకూడదు. న్యాయమూర్తి నిర్భయంగా తీర్పులు ఇవ్వడం కోసం న్యాయమండలిని స్వతంత్రంగా ఉంచే ప్రయత్నం చేయబడుతుంది. దానికోసం మన సంవిధానం



భారతదేశ సుప్రీం కోర్టు - కొత్త ఢిల్లీ

చేసిన ఏర్పాట్లు కింది విధంగా కలవు.

- న్యాయమూర్తి యొక్క అర్హత గురించిన నిబంధనలను సంవిధానం స్పష్టం చేసింది. చట్ట నిపుణత కలిగినవారు, హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేసిన లేదా న్యాయవాదిగా అనుభవం కలిగినవారు అర్హులుగా భావింపబడతారు.
- న్యాయమూర్తిని రాష్ట్రపతి నియమిస్తాడు. అందువల్ల రాజకీయ ఒత్తిడి దూరంగా ఉంచబడుతుంది.
- న్యాయమూర్తి ఉద్యోగం శాశ్వతమైనది. బలహీనమైన కారణాలచేత లేదా రాజకీయ కారణాలచేత అతనిని పదవి నుండి తొలగించలేము. సుప్రీంకోర్టు న్యాయమూర్తి 65 సంవత్సరాల వయస్సులో, హైకోర్టు న్యాయమూర్తి 62 సంవత్సరాల వయస్సులో పదవీ విరమణ పొందుతారు.
- న్యాయమూర్తి వేతనం భారతదేశ సంచిత నిధి నుండి ఇవ్వబడుతుంది, దానిపై పార్లమెంటులో చర్చ జరగదు.
- న్యాయమూర్తి కార్యకలాపాలు, తీర్పులపై వ్యక్తిగత విమర్శ చేయలేము. కోర్టును అవమాన పరచడం కూడా ఒక నేరం కావున దానికి కూడా శిక్ష పడుతుంది. ఈ ఏర్పాట్ల వల్ల అనవసరమైన విమర్శల నుండి న్యాయమూర్తికి రక్షణ కల్పించబడడమే కాకుండా న్యాయమండలి కూడా సురక్షితంగా ఉంటుంది.
- పార్లమెంటులో న్యాయమూర్తుల ప్రవర్తనపై చర్చించడం జరుగదు. కాని న్యాయమూర్తులను ఆ పదవి నుండి తొలగించుటకు మహాభియోగ తీర్మానం జరిపించు అధికారం కలదు.

**కోర్టుల క్రియాశీలత :** కోర్టుకు వివాదాలు వెళ్ళినచో కోర్టు వాటిని పరిష్కరిస్తుందనునది కోర్టుకు సంబంధించిన సాంప్రదాయ పద్ధతి. గత కొన్ని దశాబ్దాల నుండి కోర్టు యొక్క ఈ పద్ధతిలో మార్పు జరగడం వల్ల కోర్టు క్రియాశీలకమైంది. దీని అర్థం కోర్టు ఇప్పుడు సంవిధానంలోని న్యాయం, సమానత్వం వంటి ఉద్దేశాలను పూర్తిచేయుట కోసం చొరవ తీసుకొంటుంది. కోర్టు సమాజంలోని బలహీన వర్గాలకు, మహిళలకు, ఆదివాసులకు, కార్మికులకు, రైతులకు, బాలలకు చట్ట బద్ధమైన భద్రత కల్పించు ప్రయత్నం చేసింది. దానికోసం ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలు ముఖ్యమైనవిగా నిర్ణయింపబడినవి.

**సుప్రీం కోర్టు విధులు**

* సమాఖ్యదేశ కోర్టు అనే పాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్రాలు, రాష్ట్రాలు - రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం - రాష్ట్రాలు వ్యతిరేకంగా ఇతర రాష్ట్రాలలోని వివాదాలను పరిష్కరించుట.
* పౌరుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించుట, వాటి కోసం ఆదేశాలిచ్చుట.
* దిగువ కోర్టులు ఇచ్చిన తీర్పులను పునరాలోచించుట, తమ తీర్పులను కూడా పునరాలోచించుట.
* సార్వజనిక దృష్ట్యా ముఖ్యమైన సమస్యలపై చట్టబద్ధతను అర్థం చేసుకొనుటకు రాష్ట్రపతి అడిగినచో సలహా ఇచ్చుట.



**చెప్పుకోండి చూద్దాం?**

రాష్ట్రపతి ఒక ముఖ్యమైన సార్వజనిక సమస్యపై సుప్రీం కోర్టు సలహా ఎందుకు అర్థిస్తాడు?

**పరిచ్ఛేదాన్ని చదివి రాయండి.**

**కోర్టు పునర్విలోకనం :** సుప్రీం కోర్టుపైనున్న మరొక ముఖ్యమైన బాధ్యత అనగా సంవిధానమునకు రక్షణ కల్పించుట. సంవిధానం అనునది దేశ ప్రాథమిక చట్టం అవుతుంది అనేది మీకు తెలుసు. ఈ చట్టానికి భంగం కలిగించు లేదా దానికి విరుద్ధమైన చట్టాన్ని పార్లమెంటు రూపొందించలేదు. కార్యనిర్వాహక మండలి ప్రతి విధానం, కృత్యం కూడా సంవిధానంతో సుసంబంధాన్ని కలిగియుండవలసి వస్తుంది. పార్లమెంటు యొక్క ఏదేని చట్టం లేదా కార్యనిర్వాహక మండలి ఏదేని పని సంవిధానంలోని నియమాలకు భంగం కలిగించునదైతే ఆ చట్టం, ఆ పని చట్టవిరుద్ధమైనదని కోర్టు నిర్ణయిస్తుంది, రద్దు చేస్తుంది. కోర్టు యొక్క ఈ అధికారాలను కోర్టు పునర్విలోకన అధికారం అని అంటారు.

- న్యాయస్థానానికి ఇటువంటి అధికారం ఉండవలెనా?

**ఈ ఉదాహరణను చూడండి.**

ఎన్నికల్లో పాల్గొను అభ్యర్థులకు కోర్టు వారి ఆస్తులను, ఆదాయాన్ని అదేవిధంగా విద్యార్హతకు సంబంధించిన వివరాలను ప్రతిజ్ఞా పత్రం ద్వారా వివరించాలని చెప్పడం జరిగింది. అభ్యర్థులకు సంబంధించిన దోషరహితమైన వివరాల ఆధారంగా ఓటరుకు ఓటు వేయుటకు వీలవుతుంది అనేది దీని వెనుకనున్న ఉద్దేశం. మన ఎన్నికల ప్రక్రియ అధిక పారదర్శకంగా జరుపుటకు ఇది ప్రయత్నం కాదా?

ఈ సందర్భంలో కోర్టు యొక్క ఇంకా కొన్ని ఆదేశాలు ఉన్నాయా? దీనికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోండి.

ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం అనగా సార్వజనిక సమస్యలను పరిష్కరించుట కొరకు ప్రయత్నశీలురై యుండెడి పౌరులు, సామాజిక సంఘాలు లేదా ప్రభుత్వేతర సంఘాల వారు ప్రజలందరి తరపున కోర్టులో వేసిన వ్యాజ్యాలపై కోర్టు ఆలోచించి తీర్పునిస్తుంది.

**హైకోర్టు :** భారతదేశ సంవిధానంలో ప్రతి రాష్ట్రానికి ఒక హైకోర్టును స్థాపించు అధికారాన్ని పార్లమెంటుకు ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం మన దేశంలో 24 హైకోర్టులు కలవు.

హైకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు ఉంటారు.

హైకోర్టులోని న్యాయమూర్తులందరిని రాష్ట్రపతి నియమిస్తాడు.



**చేసి చూడండి.**

ముంబయి హైకోర్టు మహారాష్ట్ర, గోవా రెండు రాష్ట్రాలకు, దాద్రా నగర్ హవేలి, దీవ్-దమణ్ కేంద్రపాలిత ప్రాంతాల కొరకు కలదు. ఒకటి కంటె ఎక్కువ రాష్ట్రాల కొరకు ఉన్న ఉన్నత న్యాయస్థానాలకు మరో రెండు ఉదాహరణలను వెదకండి.

**హైకోర్టు విధులు**

* తన అధికార పరిధిలోని దిగువ కోర్టులపై నియంత్రణ కలిగియుండు, పర్యవేక్షించు అధికారం.
* ప్రాథమిక హక్కులను కాపాడుట కొరకు ఆదేశాలిచ్చు అధికారం.
* జిల్లా కోర్టులలో న్యాయమూర్తులను నియమించునపుడు గవర్నరు హైకోర్టు సలహా తీసుకుంటాడు.

**జిల్లా మరియు దిగువ కోర్టులు :** ఏ న్యాయ సంస్థలతో ప్రజలకు తరచుగా సంబంధం ఏర్పడుతుందో అవి జిల్లా మరియు తాలుకా స్థాయిలోని కోర్టులు. ప్రతి జిల్లా కోర్టులో ఒక జిల్లా న్యాయమూర్తి ఉంటాడు.

**భారతదేశంలోని చట్టబద్ధమైన శాఖలు :** చట్టబద్ధమైనటు వంటి ప్రముఖమైన రెండు శాఖలు కలవు.

(1) దివాణీ చట్టం (Civil) (2) ఫౌజుదారీ (Criminal) చట్టం

**దివాణీ చట్టం :** వ్యక్తి హక్కులకు విఘాతం కలిగించు వివాదాలు ఈ చట్టం క్రిందికి వస్తాయి.

ఉదా., భూ సంబంధమైన వివాదం, అద్దె నిర్ణయం, విడాకులు మొదలగునవి. సంబంధిత కోర్టు ముందు వ్యాజ్యం సమర్పించిన తరువాత కోర్టు దానిపై తీర్పునిస్తుంది.

**పౌజుదారీ చట్టం :** గంభీర స్వరూప నేరాలు పౌజుదారీ చట్టం ఆధారంగా పరిష్కరించబడతాయి. ఉదా., దొంగతనం, ఇంటికి కన్నం వేయుట, కట్నం కోసం వేధించుట, హత్య చేయుట మొదలగునవి. ఈ నేరాలకు సంబంధించి మొదట పోలీసుల వద్ద ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) సమర్పించబడుతుంది. పోలీసులు దానిని పరీక్షించిన తరువాత వివాదం (కేసు) కోర్టుకు సమర్పించబడుతుంది. నేరం ఋజువైతే శిక్ష స్వరూపం కూడా గంభీరమైనదిగా ఉంటుంది.

దేశాభివృద్ధిలో భారతదేశంలోని న్యాయవ్యవస్థ యొక్క తోడ్పాటు చాలా కలదు. సామాన్య మానవుని మనసులో కూడా న్యాయవ్యవస్థ విషయంలో గౌరవం మరియు విశ్వాసం కలదు. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, సమాఖ్య దేశాన్ని, సంవిధానాన్ని కాపాడుట భారతదేశంలోని న్యాయవ్యవస్థ చేసింది. భారతదేశంలోని ప్రజాస్వామ్యాన్ని శక్తివంతమైనదిగా చేయుటలో కోర్టు యొక్క పెద్ద వాటా కలదు.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాల నుండి సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని కింది ఖాళీలను పూరించుము.**

(1) చట్టాలను రూపొందించుటను ............. చేస్తుంది.

(అ) శాసన మండలి (బ) మంత్రి మండలి

(క) న్యాయ మండలి (డ) కార్యనిర్వాహక మండలి

(2) సుప్రీం కోర్టు న్యాయమూర్తి నియామకాన్ని ............. చేస్తాడు.

(అ) ప్రధాన మంత్రి (బ) రాష్ట్రపతి

(క) గృహ మంత్రి (డ) సర్వోన్నత న్యాయమూర్తి

**2. భావనలను స్పష్టం చేయండి.**

(1) కోర్టు పునర్విలోకనం

(2) ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం

**3. టిప్పణులు రాయండి.**

(1) దివాణీ మరియు పౌజుదారీ చట్టం

(2) కోర్టుల క్రియాశీలత

**4. కింది ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానాలు రాయండి.**

(1) సమాజానికి చట్టాల అవసరం ఎందుకు కలుగుతుంది?

(2) సుప్రీం కోర్టు విధులను స్పష్టం చేయండి.

(3) భారతదేశంలో న్యాయమండలిని స్వతంత్రంగా నుంచుటకు ఏ విధమైన ఏర్పాట్లు కలవు?

**5. కింది పట్టికను పూర్తి చేయండి.**




**ఉపక్రమం**

(1) మీ పాఠశాలలో 'సాదృశ్య కోర్టు'ను ఏర్పాటు చేసి వివిధ ప్రజాప్రయోజన వ్యాజ్యాల సమస్యలను తయారు చేయండి, సాదృశ్య కోర్టులో అడగండి.

(2) ఉపాధ్యాయుల సహాయంతో ప్రథమ సమాచార నివేదిక (FIR) ఎలా సమర్పించాలనే ప్రక్రియను దగ్గరలోని పోలీసు స్టేషనును సందర్శించి అర్థం చేసుకోండి.

BQAY4V

# 5. రాష్ట్ర ప్రభుత్వము

గత పాఠం వరకు మనం సమాఖ్య ప్రభుత్వ పార్లమెంటు, కార్యనిర్వాహక మండలి యొక్క స్వరూపాన్ని అర్థం చేసుకున్నాం. భారతదేశంలోని ఏకరూప న్యాయ వ్యవస్థను కూడా తెలుసుకున్నాం. ఈ పాఠంలో మనం రాష్ట్రాల లేదా రాష్ట్ర ప్రభుత్వం యొక్క సమాచారాన్ని పొందబోతున్నాం.

సమాఖ్యదేశ వ్యవస్థలో రెండు స్థాయిల్లో ప్రభుత్వ సంస్థలు పని చేస్తాయి. జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది. భారతదేశంలో 29 రాష్ట్రాలు ఉన్నాయి. వాటి పరిపాలనను అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తాయి.

**నేపథ్యం :** భారతదేశ భౌగోళిక విస్తరణ పెద్దగా కలదు. జనాభా స్వరూపం కూడా చాలా ఎక్కువగానే కలదు. భాష, మతం, ఆచారవ్యవహారాలు, ప్రాంతీయ స్వరూపంలో భిన్నత్వం కలదు. ఆ సమయంలో ఒకే కేంద్రం నుండి దేశ పరిపాలనను నిర్వహించుట సౌలభ్యంగా ఉండదని ఆలోచించి సంవిధానం భారతదేశం కొరకు సమాఖ్యదేశ వ్యవస్థను స్వీకరించింది. రాష్ట్రాల నిర్మాణం భాషా ప్రాతిపధికపై ఏర్పాటు చేయాలని నిర్ణయించబడింది. దానినసుసరించి భాషా ప్రాతిపదికపై ప్రాంతాల నిర్మాణం జరిగింది.

భారతదేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ యంత్రాంగ రాజకీయ స్వరూపం ఒకే విధంగా కలదు. జమ్మూ మరియు కాశ్మీరుకు మినహాయింపు కలదు. మహారాష్ట్రం సందర్భంలో మనం రాష్ట్రాలలోని ప్రభుత్వ సంస్థల స్వరూపాన్ని అర్థం చేసుకుందాం.

**మీకు తెలుసా?**

భారతదేశంలో 29 రాష్ట్రాలు ఉన్నప్పటికి 31 విధాన సభలు ఉన్నాయి కారణం ఢిల్లీ, పుదుచ్చేరి అను కేంద్ర పాలిత ప్రాంతాలలో విధానసభలు మనుగడలో ఉన్నాయి.

**రాష్ట్ర ప్రభుత్వ శాసన మండలి :** కేంద్ర స్థాయిలోని పార్లమెంటు మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో ప్రతి రాష్ట్రానికి శాసన మండలి కలదు. కేవలం ఏడు రాష్ట్రాలలోని శాసన మండలి రెండు సభలుగా కలదు. అందులో మహారాష్ట్ర ఉన్నది. శాసన మండలి సభ్యుని శాసనసభ్యుడు (ఆమ్‌దార్) అంటారు.

**మహారాష్ట్ర శాసన మండలి :** మహారాష్ట్రలో విధాన సభ మరియు విధాన పరిషత్తు అని రెండు సభలు ఉన్నాయి.



విధాన భవనం, ముంబయి

**విధాన సభ :** మహారాష్ట్ర శాసన మండలి యొక్క ఇది మొదటి సభగా ఉంటుంది. దీని సభ్యుల సంఖ్య 288. ఆంగ్లో ఇండియన్ సమాజానికి తగినంత ప్రాతినిధ్యం లేకపోయినట్లయితే గవర్నరు ఆ సమాజం యొక్క ఒక ప్రతినిధిని విధానసభకు నియామకం చేస్తాడు. షెడ్యూల్డ్ కులాల మరియు షెడ్యూల్డు తెగల కోసం కొన్ని స్థానాలు రిజర్వ్ చేయబడి ఉంటాయి. ఎన్నికల కోసం సంపూర్ణ మహారాష్ట్రను నియోజకవర్గాలుగా విభజిస్తారు. ప్రతి నియోజకవర్గం నుండి ఒక ప్రతినిధి ఎన్నుకోబడుతాడు.

విధానసభ కాలపరిమితి ఐదు సంవత్సరాలు ఉంటుంది. అసాధారణ పరిస్థితుల్లో విధానసభ కాలపరిమితికి ముందే ఎన్నికలు జరుపబడుతాయి.

25 సంవత్సరాల వయస్సు పూర్తయిన ఏ భారతీయ పౌరుడైనా మహారాష్ట్రలో నివసించుచున్నట్లయితే విధానసభ ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.

**విధానసభ అధ్యక్షుడు :** విధానసభ కార్యకలాపాలు అధ్యక్షుని నియంత్రణలో, మార్గదర్శకత్వంలో నిర్వహించ బడుతాయి. ఎన్నికల తర్వాత కొత్తగా మనుగడలోకి వచ్చిన విధానసభ సభ్యులు తమలో నుండి ఒకరిని అధ్యక్షుడుగా, మరొకరిని ఉపాధ్యక్షుడుగా ఎన్నుకుంటారు. సభ కార్యకలాపాలు

క్రమశిక్షణగా నిర్వహింపబడుట కొరకు కార్యక్రమ పత్రికను రూపొందించుట నుండి సభామర్యాదలను ఉల్లంఘించు ప్రవర్తనను ప్రదర్శించు సభ్యులను కొంత కాలం నిలిపివేయు వరకు అనేక విధులను అధ్యక్షుడు నిర్వహించవలసి ఉంటుంది. అధ్యక్షుడు లేని సమయంలో ఉపాధ్యక్షుడు ఈ బాధ్యతను నిర్వహిస్తాడు.

మహారాష్ట్ర శాసన మండలిలో సంవత్సరానికి కనిష్ఠంగా మూడు సమావేశాలు జరుగుతాయి. బడ్జెట్ విషయపు మరియు వానాకాలపు సమావేశాలు ముంబయిలో జరుగుతాయి. శీతాకాలపు సమావేశాలు నాగపూర్‌లో జరుగుతాయి.

**విధాన పరిషత్ :** ఇది మహారాష్ట్ర శాసన మండలి యొక్క రెండవ సభ. సభ్యులు పరోక్ష పద్ధతిలో సమాజంలోని వివిధ సమూహముల నుండి ఎన్నుకోబడుతారు. మహారాష్ట్ర విధాన పరిషత్ సభ్యుల సంఖ్య 75. దీనిలో కళలు, సాహిత్యం, విజ్ఞానం, సమాజసేవ వంటి రంగాలలోని నిష్ణాతులైన వ్యక్తులను గవర్నరు నియామకం చేస్తాడు. మిగిలిన ప్రతినిధులు విధానసభ, స్థానిక పరిపాలనా సంస్థలు, ఉపాధ్యాయ నియోజకవర్గాలు, పట్టభద్రుల నియోజకవర్గాల నుండి ఎన్నుకోబడుతారు.

విధాన పరిషత్ పూర్తిగా రద్దుచేయబడదు. దీనిలోని సభ్యులు నిర్ధిష్ట సంఖ్యలో ప్రతి రెండు సంవత్సరాలకు పదవీ విరమణ పొందుతారు. మళ్ళీ అవే స్థానాలకు ఎన్నికలు జరుపబడి ఆ పదవులు పూరింపబడతాయి. విధాన పరిషత్ కార్యకలాపాలు విధాన పరిషత్ అధ్యక్షుడి నియంత్రణలో, మార్గదర్శకత్వంలో నిర్వహించబడుతాయి. అధ్యక్షుడు లేని సమయంలో ఉపాధ్యక్షుడు ఆ బాధ్యతలను నిర్వహిస్తాడు.

**మహారాష్ట్ర యొక్క కార్యనిర్వాహక మండలి :** మహారాష్ట్ర కార్యనిర్వాహక మండలిలో గవర్నరు, ముఖ్యమంత్రి మరియు మంత్రి మండలిలోని మంత్రులు ఉంటారు.

**గవర్నరు :** కేంద్ర స్థాయిలో రాష్ట్రపతి ఏ విధంగా నామమాత్రపు ప్రముఖుడుగా ఉంటాడో అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో గవర్నరు నామమాత్రపు ప్రముఖుడుగా ఉంటాడు.

గవర్నరు రాష్ట్రపతి చేత నియమింపబడుతాడు, రాష్ట్రపతి అనుమతి ఉన్నంతకాలం గవర్నరు పదవిలో కొనసాగుతాడు. గవర్నరుకు కూడా చట్ట సంబంధమైన కొన్ని ముఖ్యమైన అధికారాలు కలవు. ఉదా., విధానసభ మరియు విధాన పరిషత్ సమ్మతించిన బిల్లు గవర్నరు సంతకం తర్వాతనే అది చట్టంగా రూపాంతరం చెందుతుంది. శాసనమండలి సమావేశాలను ఏర్పాటు చేయు అధికారం గవర్నరుకు ఉంటుంది. శాసనమండలి సమావేశాలు జరుగనప్పుడు ఒక చట్టాన్ని రూపొందించవలసిన అవసరం ఏర్పడినచో గవర్నరు ఆ విధంగా ఉత్తర్వులు జారీచేయవచ్చు.

**ముఖ్యమంత్రి - మంత్రి మండలి :** విధాన సభలో ఏ పార్టీకి స్పష్టమైన సంఖ్యాధిక్యత లభిస్తుందో ఆ పార్టీ నాయకుడు ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడుతాడు. ముఖ్యమంత్రి తమ విశ్వాస పాత్రులైన సహచరులను మంత్రి మండలిలో చేర్చుకుంటాడు. ముఖ్యమంత్రి కూడా ప్రధానమంత్రిలాగ కార్యనిర్వాహక ప్రముఖుడుగా ఉంటాడు, రాష్ట్ర సంపూర్ణ పరిపాలన గవర్నరు పేరున నిర్వహించబడుతుంది. అయినప్పటికి ప్రత్యక్షంగా మాత్రం పరిపాలనంతా ముఖ్యమంత్రి నిర్వహిస్తాడు.

## ముఖ్యమంత్రి విధులు

**మంత్రి మండలి నిర్మాణం :** సంఖ్యాధిక్యత నిరూపణ జరిగిన తరువాత మొదట ముఖ్యమంత్రి తమ మంత్రి మండలిని రూపొందించుకోవాల్సి ఉంటుంది. ఈ పని సవాళ్ళతో కూడుకొన్నది. కారణం మంత్రి మండలిలో గరిష్ఠంగా ప్రాతినిధ్యం ఉండటానికి అన్ని ప్రాంతాల, వివిధ సమాజ సమూహాలను (షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర వెనుకబడిన జాతులు, మహిళలు, అల్ప సంఖ్యాలు మొదలగువారు) చేర్చుకోవలసి ఉంటుంది. స్పష్టమైన సంఖ్యాధిక్యత లేకపోయినట్లయితే కొన్ని పార్టీలు ఒక్కటై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి. అలాంటి సమయంలో అన్ని భాగస్వామ్య పార్టీలకు మంత్రి మండలిలో స్థానం కల్పించు కఠినమైన పనిని ముఖ్యమంత్రి నిర్వహిస్తాడు.

**శాఖల కేటాయింపు :** మంత్రి మండలిని ఏర్పాటు చేసిన తర్వాత ముఖ్యమంత్రి తాను ఎన్నుకున్న మంత్రులకు శాఖలను కేటాయించవలసి ఉంటుంది. శాఖలను కేటాయిస్తున్నప్పుడు కూడా మంత్రుల యొక్క రాజకీయ అనుభవం, పరిపాలనా దక్షత, అతనికున్న ప్రజాభిప్రాయ పరిజ్ఞానం, నాయకత్వం మొదలగు విషయాలను ఆలోచించవలసి ఉంటుంది.

**శాఖల మధ్య సమన్వయం :** ముఖ్యమంత్రి అతని మంత్రి మండలి కలిసికట్టుగా విధానసభకు బాధ్యత వహించడం వల్ల సమర్థవంతమైన అంతిమ పరిపాలన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉంటుంది. శాఖల మధ్య సహకారం,

సమన్వయం లేకపోయినట్లయితే దాని పరిణామం ప్రభుత్వ కార్యకలాపాలపై పడుతుంది. అందుకని ముఖ్యమంత్రి శాఖల మధ్య గల వివాదాలను దూరం చేసి అన్ని శాఖలు ఒకే దిశగా పని చేయున్నవా లేదా అనునది చూడవలసి ఉంటుంది.

**రాష్ట్ర నాయకత్వం :** ప్రధానమంత్రి ఏ విధంగా దేశానికి నాయకత్వం వహిస్తాడో అదేవిధంగా ముఖ్యమంత్రి రాష్ట్రానికి నాయకత్వం వహిస్తాడు. తమ రాష్ట్రంలోని ప్రజల శ్రేయస్సు, వారి సమస్యలు, కష్టాలను దృష్టియందుంచుకొని వాటి కనుగుణంగా నూతన విధానాలను ముఖ్యమంత్రి రూపొందించవలసి ఉంటుంది. రాష్ట్రంలోని ప్రజలు 'తమ సమస్యలను పరిష్కరించు వ్యక్తిగా' ముఖ్యమంత్రిని చూస్తుంటారు. రాష్ట్ర సమస్యలను పట్టించుకొని వాటిని పరిష్కరించుటకు ప్రభుత్వం తరపున నివారణోపాయాల వాగ్దానం ముఖ్యమంత్రి ఇచ్చినట్లయితే ప్రజలకు ఊరట లభిస్తుంది.

మహారాష్ట్ర రాష్ట్రం భారతదేశంలోని ఒక అభివృద్ధి చెందిన రాష్ట్రం. విద్య, పరిశ్రమలు, సేవారంగాలు, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత మొదలగు విషయాలలో ఇది ముందుంది. ఉగ్రవాద చర్యలు, కొన్ని ప్రాంతాలలో నక్సలిజం ఉద్యమాలు మన రాష్ట్రం ముందున్న రెండు పెద్ద సవాళ్ళు.

## అభ్యాసం

**1. ఇవ్వబడిన ప్రత్యామ్నాయాల నుండి సరియైన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకొని ఖాళీలను పూరించండి.**

(1) మహారాష్ట్ర శాసన మండలి శీతాకాలపు సమావేశాలు ................ లో జరుగుతాయి.
(అ) ముంబయి (బ) నాగపూర్
(క) పుణే (డ) ఔరంగాబాద్

(2) గవర్నరు నియామకం ............ ద్వారా జరుగుతుంది.
(అ) ముఖ్యమంత్రి (బ) ప్రధానమంత్రి
(క) రాష్ట్రపతి (డ) సర్వోన్నత న్యాయమూర్తి

(3) రాష్ట్ర శాసన మండలి సమావేశాలను ఏర్పాటు చేయు అధికారం ............... కు ఉంటుంది.
(అ) ముఖ్యమంత్రి (బ) గవర్నరు
(క) రాష్ట్రపతి (డ) అధ్యక్షుడు

**2. పట్టికను పూరించండి.**

| క్ర. సం. | సభ | కాల పరిమితి | సభ్యుల సంఖ్య | ఎన్నికల యొక్క స్వరూపం | ప్రముఖుడు |
|---|---|---|---|---|---|
| 1. | విధాన సభ | | | | |
| 2. | విధాన పరిషత్ | | | | |

**3. టిప్పణులు రాయండి.**

(1) గవర్నరు (2) ముఖ్యమంత్రి విధులు

**4. కింది ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానములు రాయండి.**

(1) విధానసభ అధ్యక్షుని విధులను స్పష్టం చేయండి.
(2) సంవిధానం భారతదేశం కొరకు సమాఖ్య దేశ వ్యవస్థను ఎందుకు స్వీకరించింది?
(3) శాఖలను కేటాయించునప్పుడు ముఖ్యమంత్రికి ఏ విషయాలను గురించి ఆలోచించవలసి ఉంటుంది?

**ఉపక్రమం**

మహారాష్ట్ర ప్రభుత్వ అధికారిక సంకేత స్థలాన్ని (Website) సందర్శించి వివిధ మంత్రులు వారి శాఖల వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని పొందండి.

BQJU6I

# 6. ఉద్యోగి స్వామ్యం

**జిల్లాధికారి భూమిశిస్తు ఆదేశాలను జారీ చేశాడు.**

మహాపాలిక కమీషనర్ బడ్జెట్ పత్రాన్ని ప్రవేశపెట్టాడు.

ఆర్థిక కార్యదర్శి యొక్క రాజీనామా

విభాగీయ కమీషనర్ శిస్తు సంబంధిత పునర్విమర్శ చేస్తారు.

పై చదరంలో జిల్లా కలెక్టర్, మహానగర పాలిక కమీషనర్, ఆర్థిక కార్యదర్శి, విభాగీయ కమీషనర్ వంటి కొన్ని పదవులు పేర్కొనబడ్డాయి. ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగంలో ఈ ప్రభుత్వాధికారులు ఉంటారు. వారి విధులేమిటి అను ప్రశ్నలు మీకు కలిగియుండవచ్చు కదా?

కార్యనిర్వాహక మండలి పాత్రను స్పష్టం చేయు పాఠంలో మనం చూసిందేమంటే ప్రధానమంత్రి అతని మంత్రి మండలి నూతన చట్టాలకు సంబంధించిన ప్రస్తావన తయారు చేస్తారు, అదేవిధంగా విధానాలను నిర్ణయిస్తారు. ప్రభుత్వ విధానాలను ప్రత్యక్ష కార్యరూపంలోకి తీసుకువచ్చే, కార్యనిర్వాహక మండలి నియంత్రణలో ఉండు ఒక పరిపాలనా యంత్రాంగం 'ఉద్యోగిస్వామ్యం' (Bureaucracy) అని గుర్తించబడుతుంది. ప్రస్తుత పాఠంలో మనం ఉద్యోగిస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను గురించి అర్థం చేసుకోబోతున్నాం.

ఏదేశంలోని ప్రభుత్వ సంస్థకైనా ప్రాథమికంగా రెండు రకాలైన విధులను నిర్వహించవలసి ఉంటుంది.

(1) విదేశీ ఆక్రమణ నుండి, అంతర్గత భద్రతకు సంబంధించిన ముప్పు నుండి దేశాన్ని రక్షించి పౌరులకు భద్రత కల్పించుట.

(2) పౌరులకు వివిధ రకాలైన సేవలను అందించి వారి దైనందిన జీవనాన్ని అధిక సుఖమయం చేయడం ద్వారా వారికి తమ యొక్క మరియు సమాజం యొక్క అభివృద్ధి చేయుట సాధ్యమవుతుంది.

వీటిలో మొదటి పనికోసం దేశ రక్షణ యంత్రాంగం సిద్ధంగా ఉంటుంది. ఈ సేవలు అంతర్గత రక్షణకోసం పౌరసేవలకు సహాయం చేస్తాయి. వాటిలోని సేవలను మనం 'సైనిక సేవలు' అంటాం. రెండవ పనికోసం పరిపాలనా యంత్రాంగం ఏర్పాటు చేయబడుతుంది. దానిని మనం 'ప్రభుత్వ సేవలు' అంటాం. ప్రభుత్వ సేవకుల ఈ పెద్ద యంత్రాంగాన్ని ఉద్యోగిస్వామ్యం (Bureaucracy) అని అంటారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకొన్న ప్రతినిధులు, మంత్రులపై పరిపాలనా బాధ్యత ఉంటుంది. ప్రభుత్వ పనులు వివిధ శాఖల ద్వారా నిర్వహించబడుతాయి. ప్రతి శాఖకు ఒక మంత్రి ఉంటాడు. అతడు ఆ శాఖ రాజకీయ ప్రముఖుడుగా ఉంటాడు. ప్రజా ప్రతినిధులుగా మంత్రులు తమ శాఖల వ్యవహారాలను ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నిర్వహించవలసి ఉంటుంది. మంత్రి ఆ విషయంలో నిష్ణాతుడు కాకపోయినప్పటికి అతనికి ప్రజా సంక్షేమం ఏమిటి అనే దానిపై విస్తృతమైన పరిణతి ఉంటుంది. మంత్రిత్వ శాఖల కార్యదర్శులు అవసరమైన జ్ఞానాన్ని లేదా సరియైన సలహాలను ఇస్తారు. ఈ కార్యదర్శులు ప్రభుత్వ సేవల ద్వారా ఎన్నుకోబడుతారు. ప్రజల అభిలాష, పరిపాలనా నైపుణ్యాల సమన్వయం ఈ విధంగా పార్లమెంటరీ పద్ధతిలో నెరవేర్చబడుతుంది.

## ఉద్యోగిస్వామ్యం స్వరూపం

- **శాశ్వత యంత్రాంగం :** శిస్తు వసూలు చేయుట, పర్యావరణాన్ని కాపాడుట, చట్టాలను మరియు సుపరిపాలనను ఏర్పాటు చేయుట, మనకు సామాజిక భద్రతను కల్పించుట వంటి తమ పనులను ఉద్యోగిస్వామ్యం నిరంతరంగా చేస్తూ ఉంటుంది. దీనికి కారణం ఇది శాశ్వతంగా ఉంటుంది. ప్రతి ఎన్నికల తర్వాత నూతన ప్రధానమంత్రి, మంత్రి మండలి అధికారంలోకి రావచ్చును. కాని వారి నియంత్రణలో గల ఉద్యోగి స్వామ్యం మారదు. దాని మనుగడ శాశ్వతంగా ఉంటుంది.

- **రాజకీయ దృష్ట్యా తటస్థం :** ఉద్యోగిస్వామ్యం రాజకీయ దృష్ట్యా తటస్థమైనది. దీని అర్థం ఏమిటంటే ఏదేని పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ఆ ప్రభుత్వ విధానాలను ఉద్యోగిస్వామ్యం కార్యదక్షతతో, నిష్ఠతో అమలు జరుపవలసి

ఉంటుంది. ఈ సందర్భంలో ప్రభుత్వ సేవకులు రాజకీయ పాత్రను పోషించరాదు లేదా తమ రాజకీయ అభిప్రాయం ప్రకారం పని చేయరాదు. ఒక పార్టీ ఎన్నికల్లో ఓడిపోవడంతో అధికారానికి దూరమవుతుంది, వేరొక పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. మొదటి ప్రభుత్వం యొక్క కొన్ని విధానాలలో తరువాత వచ్చిన ప్రభుత్వం మార్పులు చేస్తుంది. అటువంటి పరిస్థితుల్లో ఉద్యోగిస్వామ్యం తటస్థంగా ఉంటూ తన బాధ్యతను నిర్వహించవలసి ఉంటుంది.

- **అనామికత :** అనామికత అనగా ఒక ధోరణి విజయము లేదా అపజయమునకు ఉద్యోగిస్వామ్యాన్ని ప్రత్యక్షం జవాబుదారిగా నిర్ణయించకుండా ఉండు స్వరూపమే అనామికత. తమ శాఖల వ్యవహారాలను కార్యదక్షతతో నిర్వహించుట మంత్రుల బాధ్యతగా ఉంటుంది. ఒక శాఖ అకార్యదక్షత వ్యవహారాలకు కూడా మంత్రులనే బాధ్యులుగా చేయడం జరుగుతుంది. ప్రభుత్వ సేవకులపై బహిరంగ వ్యాఖ్యలు చేయబడవు. పార్లమెంటు కూడా శాఖల అనుచిత వ్యవహారాలకు మంత్రులనే బాధ్యులను చేస్తుంది. ఈ సందర్భంలో మంత్రి స్వయంగా తనే బాధ్యత వహిస్తాడు. ఉద్యోగిస్వామ్యానికి భద్రత కల్పిస్తాడు.

## భారతదేశంలోని ఉద్యోగిస్వామ్య ప్రాముఖ్యత

భారతదేశంలోని ఉద్యోగిస్వామ్య నిర్మాణం చాలా విస్తృతమైనది, క్లిష్టమైనది. స్వాతంత్ర్యానంతర కాలం నుండి చెప్పుకోదగిన అనేక మార్పులు జరుగుతూ వచ్చాయి. వాటిని ఈ యంత్రాంగమే సమర్థవంతంగా నిర్వహించింది. నేడు మనకు ఏవైతే అనేక మంచి సామాజిక మార్పులు కనిపిస్తున్నాయో వాటికి కారణం భారతీయ ఉద్యోగిస్వామ్యం. ఆ విధానాల అమలును సామాన్య పౌరుల వరకు తీసుకు వచ్చింది. ఉద్యోగిస్వామ్యం వల్ల రాష్ట్ర వ్యవస్థకు స్థిరత్వం ఏర్పడుతుంది. నీటి సరఫరా, సార్వజనిక పరిశుభ్రత, రవాణా, ఆరోగ్యం, వ్యవసాయ సంస్కరణలు, కాలుష్యాన్ని అరికట్టుట వంటి అనేక సేవలు మనకు నిరంతరంగా నిరాటంకంగా లభిస్తుంటాయి. అందువల్ల సామూహిక దైనందిన జీవనానికి స్థిరత్వం లభిస్తుంది.

రెండవది ఏమనగా, ఉద్యోగిస్వామ్యం కూడా సామాజిక పరివర్తన యొక్క ఒక సాధనం. స్త్రీ సాధికారత, బాలల రక్షణ, బలహీన వర్గాల కొరకు ప్రణాళికలు మొదలగు విషయాలలో ప్రభుత్వం ఏ చట్టాలను రూపొందిస్తుందో వాటిని ప్రత్యక్షంగా అమలులోకి తీసుకువచ్చే పనిని ఉద్యోగిస్వామ్యం చేస్తుంది. విధానాల అమలు నుండి సామాజిక మార్పు సంభవిస్తుంది.

ఉద్యోగిస్వామ్యానికి సమాజ ప్రజాస్వామ్యీకరణ ప్రక్రియలో ముఖ్యమైన పాత్ర ఉంటుంది. రిజర్వేషన్ స్థానాల విధానాన్ని అమలుపరుచుటవల్ల అనేక వంచిత సమాజ వర్గాలు ప్రస్తుతం ప్రధాన జనజీవన స్రవంతిలోకి వచ్చాయి. నిర్ణయ ప్రక్రియలో వారి భాగస్వామ్యం కూడా పెరిగింది. అందువల్ల సమాజం యొక్క ప్రజాస్వామ్యీకరణ నొందుటకు ఏవిధంగా అభివృద్ధికరమైన చట్టాల, విధానాల ఆవ్యకత ఉంటుందో అదేవిధంగా ఉద్యోగిస్వామ్య కార్యదక్షత భాగస్వామ్యం కూడా ఉంటుంది.

**ప్రభుత్వ సేవల రకాలు :** భారతదేశంలో ప్రభుత్వ సేవల రకాలు ప్రధానంగా మూడు కలవు.

**(1) అఖిల భారతీయ సేవలు :** భారతీయ పరిపాలనా సేవ (IAS), భారతీయ పోలీసు సేవ (IPS), భారతీయ అటవీ సేవ (IFS) ఇందులో పొందుపరచబడినవి.

**(2) కేంద్రీయ సేవలు :** ఇవి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. భారతీయ విదేశ సేవ (IFS), భారతీయ రెవెన్యూ సేవ (IRS) మొదలగునవి ఇందులో పొందుపరుచబడి ఉంటాయి.

**(3) రాష్ట్ర సేవలు :** ఇవి రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. ఉప జిల్లాధికారి, విభాగాభివృద్ధి అధికారి, తహసీల్దారు మొదలగు ప్రభుత్వ అధికారులు పోటీ పరీక్షల ద్వారా నియమింపబడుతారు.

గుణాత్మకత, కార్యదక్షత వంటి లక్షణాల ఆధారంగా ప్రభుత్వ సేవకులు నియమింపబడాలని భారతీయ సంవిధానం ప్రజాసేవా కమీషన్ వంటి స్వతంత్ర యంత్రాంగాలను ఏర్పాటు చేసింది. కేంద్రీయ ప్రజాసేవా కమీషన్ (UPSC) అఖిల భారతీయ సేవలు, కేంద్రీయ సేవలకు పోటీ పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. వారిని ప్రభుత్వం నియమిస్తుంది. మహారాష్ట్ర ప్రజాసేవా కమీషన్ (MPSC) మహారాష్ట్రలోని ప్రభుత్వ సేవలకోసం పోటీ పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి

వారి నియామక సిఫారసును ప్రభుత్వానికి అందజేస్తుంది.

ఉద్యోగిస్వామ్యం మరియు ప్రభుత్వ సేవలలో కూడా సమాజంలోని అన్ని వర్గాలకు అవకాశం లభించాలని షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, మహిళలకు, ఇతర వెనుకబడిన వర్గాలకు, దివ్యాంగులకు రిజర్వేషన్ కేటాయించి సేవలలో చేరుటకు అవకాశాన్ని కల్పించింది. సామాజిక అసమానత్వం వల్ల బలహీన వర్గాలు ప్రభుత్వ సేవలలోని అవకాశాల నుండి వంచింపబడకుండా ఉండాలని ఈ ఏర్పాటు చేయడం జరిగింది.

**మంత్రులు మరియు ప్రభుత్వ సేవకులు :** మంత్రులు మరియు శాఖల యొక్క ప్రభుత్వ సేవకులు లేదా కార్యదర్శులు, ఉపకార్యదర్శుల పదవులలో గల వ్యక్తుల మధ్య సంబంధం ఏ విధంగా ఉంటుందనే విషయంపై కూడా ఆయా శాఖల కార్యదక్షత ఆధారపడి ఉంటుంది. శాఖకు సంబంధించిన నిర్ణయాలను మంత్రి తీసుకుంటాడు కాని అతనికి నిర్ణయం తీసుకోవటానికి అవసరమైన మొత్తం సమాచారాన్ని ప్రభుత్వ సేవకులు ఇస్తారు. ప్రభుత్వ సేవకులకు అనగా ఉద్యోగిస్వామ్యానికి సమాచారంపై పూర్తి నియంత్రణ ఉంటుంది. ఒక ప్రణాళికకు ఎంత ఆర్థిక నిధి లభించగలదు అనునది ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే చెప్పగలరు. విధానాల జయాపజయాల చరిత్ర కూడా వారికి తెలిసి ఉంటుంది. అందువల్ల మంత్రులు అధిక ప్రమాణంలో ప్రభుత్వ సేవకులపై ఆధారపడి ఉంటారు. మంత్రులు కూడా ప్రభుత్వ సేవకులతో చర్చలు జరిపినచో మరియు పరస్పర సంబంధాలలో విశ్వాసం, పారదర్శకత ఉన్నట్లయితే శాఖల వ్యవహారాలు కార్యదక్షతతో జరుపవచ్చును.

## అభ్యాసం

1. **కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి తప్పు వాక్యాన్ని సరిచేసి తిరిగి రాయండి.**
   (1) పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకొనిన ప్రతినిధులు మరియు మంత్రులపై పరిపాలనా బాధ్యత ఉంటుంది.
   (2) కేంద్రీయ ప్రజాసేవాకమీషన్ (UPSC) మహారాష్ట్రలోని ప్రభుత్వ సేవల కొరకు పోటీ పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎన్నుకుంటుంది.

2. **కింది విధానాలను సరియైన కారణాలతో స్పష్టం చేయండి.**
   (1) ప్రభుత్వ సేవకులలో కూడా రిజర్వేషన్ స్థానాల విధానం కలదు.
   (2) ప్రభుత్వ సేవకులు రాజకీయ దృష్ట్యా తటస్థంగా ఉండటం అవసరం.

3. **కింది ప్రశ్నలకు 25 నుండి 30 పదాలలో సమాధానం రాయండి.**
   (1) శాఖల వ్యవహారాలను కార్యదక్షతతో నిర్వహించుట వెనుక మంత్రుల, ప్రభుత్వ సేవకుల పాత్రను స్పష్టం చేయండి.
   (2) ఉద్యోగిస్వామ్యం వల్ల రాష్ట్ర వ్యవస్థకు స్థిరత్వం ఎలా లభిస్తుందో స్పష్టం చేయండి.

4. **కింది సంకల్పనా చిత్రాన్ని పూరించండి.**

ప్రభుత్వ సేవకుల రకాలు

| | | |
|---|---|---|
| ................................ | కేంద్రీయ సేవ | ................................ |
| ఉదా.,.......................... | ఉదా.,.......................... | ఉదా., విభాగాభివృద్ధి అధికారి, తహసిల్దారు |
| ................................ | ................................ | |

5. **ఉద్యోగిస్వామ్య స్వరూపమును స్పష్టం చేయండి.**

**ఉపక్రమం**

మీ పరిసరాలలోని ప్రభుత్వ సేవలలో విధులు నిర్వహిస్తున్న ఒక అధికారితో ముఖాముఖి జరుపటానికి ప్రశ్నావళి తయారుచేసి, ముఖాముఖి జరపండి.

BQTQ86

# छत्रपती शिवाजी महाराज स्मृतिग्रंथ

- सामान्य रयतेच्या कल्याणासाठी स्थापन केलेल्या स्वराज्य स्थापनेची कथा उलगडणारे पुस्तक.
- छत्रपती शिवाजी महाराजांच्या उत्तुंग कार्य व त्यामागची तेवढीच उत्तुंग व उदात्त भूमिका वाचकांसमोर आणणारे प्रेरणादायी वाचन साहित्य.
- इतिहास वाचनासाठी पूरक असे संदर्भ पुस्तक.













- इतिहास वाचनासाठी पूरक अशी संदर्भ पुस्तके.
- निवडक लेखक, इतिहासकारांचे प्रेरणादायी लेख.

**पुस्तक मागणीसाठी www.ebalbharati.in, www.balbharati.in संकेतस्थळावर भेट द्या.**

## साहित्य पाठ्यपुस्तक मंडळाच्या विभागीय भांडारांमध्ये विक्रीसाठी उपलब्ध आहे.

ebalbharati

विभागीय भांडारे संपर्क क्रमांक : पुणे – ☎ २५६५९४६५, कोल्हापूर– ☎ २४६८५७६, मुंबई (गोरेगाव) – ☎ २८७७१८४२, पनवेल – ☎ २७४६२६४६५, नाशिक – ☎ २३९१५११, औरंगाबाद – ☎ २३३२१७१, नागपूर – ☎ २५४७७१६/२५२३०७८, लातूर – ☎ २२०९३०, अमरावती – ☎ २५३०९६५









మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె.

इतिहास व नागरिकशास्त्र इ. ८ वी (तेलुगु माध्यम ) ₹ 42.00